www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 4-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 260 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి రా. 10.06 తదుపరి నవమి; నక్షత్రం: హస్త సా. 5.34 తదుపరి చిత్త; వర్జ్యం: రా. 2.19-4.04; దుర్ముహూర్తం: ఉ. 10.30-11.14, మ. 2.54-3.38; అమృతఘడియలు: ఉ. 10.52-12.39; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 5.50 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఇరాన్‌లో జంట పేలుళ్లు.. 103 మంది మృతి

సులేమానీ వర్ధంతి సందర్భంగా భారీ ర్యాలీ

కారు, బ్యాగు బాంబులు పేల్చిన దుండగులు

శ్మశానవాటిక వద్ద చెల్లాచెదురైన మృతదేహాలు.. 211 మందికి గాయాలు 2

మృతుల సంఖ్య మరింత పెరిగే చాన్స్

ఉగ్రదాడిగా ప్రకటించిన ఇరాన్ సర్కారు



అక్రమాలు కనవా.. ఓ సాయిదేవా!



ఆయన కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యే. ముచ్చటగా మూడోసారి గెలిచారు. మొదటిసారి... మద్యం సిండికేట్, అభివృద్ధి పనుల్లో వాటాలతో సరిపెట్టారు. రెండోసారి కాస్త అటూఇటుగా అదే తీరు! ఇప్పుడు మాత్రం ఆయన 'అంతకువి ంచి' అంటున్నారు. జనాన్ని కూడా నంజుకు తింటున్నారు. భూములను భోంచేస్తున్నారు. భూములపై ఆయన కన్ను పడుతుంది. రియల్ ఎస్టేట్ పేరుతో 'అన్న గ్యాంగ్' వాలిపోతుంది. చివరకు భూముల పంచాయితీ సదరు నేత వద్దకే వస్తుంది. అంతిమంగా ఆ ఆస్తి అన్నకో, ఆయన అనుచరులకో చేజిక్కుతుంది!

ఆ నియోజకవర్గంలో రూ.కోటి, ఆపైన విలువైన భూములు, స్థలాల రిజిస్ట్రేషన్లు సాఫీగా జరగవు. 'ఆ భూమి రెడ్ మార్క్‌లో ఉంది. అన్నను కలవండి..' అంటూ అధికారులు సూచిస్తారు. ప్రజాప్రతినిధి వద్దకు వెళ్తే పంచాయితీ పేరిట ఆ భూములను తన అనుచరులకే రిజిస్ట్రేషన్ చేయిస్తారు. లేదా... వాటాలు పిండుకుంటారు.

ఆ మధ్య... క్రికెట్ బెట్టింగ్ స్థావరంపై దాడులు చేసి ఆరుగురు నిర్వాహకులను అరెస్టు చేయడంతో పాటు రూ.80 లక్షల నగదు, స్కార్పియో, రెండు మోటర్‌బైకులను ఓ సీఐ సీజ్ చేశారు. విషయం తెలిసిన వెంటనే బెట్టింగ్ నిర్వాహకుడిని వదిలేయాలని సదరు ప్రజాప్రతినిధి నుంచి ఫోన్ వెళ్లింది. సదరు సీఐ ససేమిరా అనడం, రాత్రికి రాత్రే ఆయన బదిలీ కావడం చకచకా జరిగిపోయాయి.

కర్నూలు పశ్చిమ ప్రాంత ఎమ్మెల్యే అక్రమాల దందా

తగ్గేదేలేదంటున్న ఆయన అనుచరులు

తండ్రిని మించి కొడుకు అరాచకాలు

భూములను ప్రసాదంలా పంచుకు తినడమే

ముందుగా రంగంలోకి అనుచరులు.. ఆక్రమణ

నేత ఇంట్లోనే పంచాయితీ.. చివరకు ఆస్తి స్వాహా

విలువైన ఆస్తులపై 'రెడ్‌మార్క్'తో రిజిస్ట్రేషన్‌కు నో

'అన్న'ను కలవాలంటూ అధికారుల సలహాలు

మూడుసార్లు గెలిచిన ఆ నేతది '3 ముక్కలాట'

మట్కా, మద్యం, క్రికెట్ బెట్టింగ్‌లపై కోట్లు ఆర్జన



(అమరావతి/కర్నూలు-ఆంధ్రజ్యోతి)


అన్న కన్ను పడిందా ఇక ఆ స్థలం కబ్జా కావాల్సిందే..! నమ్మినబంటువి అయినా సరే భూములను ఆ కీలక ప్రజాప్రతినిధి వదిలి పెట్టరు. ముందుగా అనుచరులను రంగంలోకి దింపుతారు. ఆ తర్వాత సెటిల్‌మెంట్ పేరుతో ఆక్రమణకు సై అంటారు. అలాకాదని ఎదురు తిరిగితే మరో అనుచర ముఠా భయపెట్టేందుకు బరిలో దిగుతుంది. భూకబ్జాలే కాదు.. మద్యం, మట్కా, పేదల ఆకలి తీర్చే రాయితీ బియ్యం అక్రమ రవాణాల్లోనూ అన్న హస్తం కచ్చితంగా ఉంటుంది. దీపం ఉండగానే ఇల్లు సర్దుకోవాలి..! అన్న చందంగా అధికారంలో ఉండగానే రూ.కోట్లు సంపాదించడమే ధ్యేయంగా

మిగతా 12వ పేజీలో...

ఇది చినబాబు మేత!

ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేయదు కదా! ఇక్కడ అంతకు విఁంచి. ఆ ఎమ్మెల్యే కుమారుడు తండ్రిని మించిన తనయుడు. ఉచిత రేషన్ బియ్యాన్ని కిలో రూ.7 ప్రకారం అనుచరులు సేకరించి స్టాక్ పాయింట్లకు తరలిస్తారు. అక్కడి నుంచి లారీల్లో కాకినాడ, కర్ణాటకలోని సిరుగుప్ప ప్రాంతాలకు రవాణాచేసి అక్కడ కిలోరూ.14-20కు (క్వింటారూ.1,400-2,000) విక్రయిస్తున్నారు. నెలకు 45-50 లారీలకుపైనే తరలించేస్తున్నారు. లారీకి రూ.50-70 వేలు చొప్పున నెలకు రూ.25-30 లక్షలు ప్రజాప్రతినిధి కుమారుడి జేబులోకి పోతున్నదట!

చీలికలు చేరికలు


వైసీపీ ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్యకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

వైసీపీలో టికెట్ల కాక.. సీట్ల నిరాకరణపై భగ్గు

సజ్జలతో ఎంపీ మాధవ్ భేటీ

టికెట్ ఎందుకివ్వరంటూ నిలదీత?

విష్ణు కినుక.. అనుచరుల ఆగ్రహం

కాంగ్రెస్ వైపు వైసీపీ నేతల చూపు

షర్మిలతో బలం.. 'సొంత గూటి' బాట

ఇప్పటికే ఆళ్ల బహిరంగ ప్రకటన

మల్లాది విష్ణు నుంచీ సంకేతాలు

జగన్ సభకు 'ఇన్‌చార్జీల బదిలీ' వేడి

ముఖం చాటేసిన ఇద్దరు ఎమ్మెల్యేలు

మంత్రి వేణు, ఎంపీ బోస్ ఎడమొహం

వై...సీపీ?

'టికెట్ ఇవ్వడంలేదు. ఇచ్చినా సీటు మార్చేస్తామంటున్నారు. కనీస గౌరవంలేదు. మాటమాత్రం చెప్పకుండా టికెట్ నిరాకరిస్తున్నారు. మర్యాద లేని చోట ఉండటం ఎందుకు? 'వై'... వైసీపీ? ప్రత్యామ్నాయం చూసుకుంటే పోలా?'... ఇది అనేకమంది వైసీపీ నేతల ఆత్మఘోష! వివిధ కారణాల వల్ల వీరిలో అత్యధికులకు కాంగ్రెస్ పార్టీయే ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే ఆళ్ల రామకృష్ణా రెడ్డి 'షర్మిల వెంటే నా పయనం' అని ప్రకటించారు. తాజాగా... విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కూడా కాంగ్రెస్ వైపు చూస్తున్నట్లు సమాచారం.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఇన్నాళ్లు... జగన్ చెప్పిందే వేదం! ఆయన మాటే శాసనం! ఇప్పుడు మెల్లమెల్లగా సీన్ మారుతోంది. నాలుగున్నరేళ్లకుపైగా కిక్కురుమనకుండా తలలూపిన వాళ్లు, మనసులోనే మౌనంగా ఆక్రోశించిన వాళ్లు గట్టిగా నోరు విప్పుతున్నారు. టికెట్ దక్కదని తెలియగానే కస్సుమంటున్నారు. ఇప్పటికే మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణా రెడ్డి, పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథి, పూతలపట్టు శాసనసభ్యుడు ఎంఎస్ బాబు జగన్ వైఖరిపై బహిరంగంగా విమర్శలు గుప్పించారు. తాజాగా ఈ జాబితాలో హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ కూడా చేరినట్లు సమాచారం. 'బళ్లారి' నుంచి దిగుమతి చేసుకున్న జె.శాంతను హిందూపురం ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిపై సిట్టింగ్ ఎంపీ గోరంట్ల మాధవ్

మిగతా 2వ పేజీలో...

కుటుంబాలను చీల్చేస్తారు!

వైసీపీపై కుట్రలు చేస్తారు 3

కాకినాడ సభలో జగన్ ఆక్రోశం

పింఛను రూ.3 వేలకు పెంపు

బాబు 2 వేలు ఇచ్చారని అంగీకారం

నీ ఇంట్లో నీవే చిచ్చుపెట్టుకుని మాపై పడడమేంటి?

ఇతరులపై బురదజల్లి 2

బతకడమూ ఓ రాజకీయమా?

సీఎం జగన్‌పై చంద్రబాబు ఆగ్రహం



కడప విమానాశ్రయంలో బ్రదర్ అనిల్‌తో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

సీఎం అయిన నాటి నుంచి.. జగన్ మమ్మల్ని దూరం పెట్టారు!

విధి లేని పరిస్థితుల్లోనే ఏపీ రాజకీయాల్లోకి

ఆ పరిస్థితులు కల్పించింది జగనే

కాంగ్రెస్‌లో షర్మిలకు ఏ బాధ్యతలిచ్చినా ఓకే

అది రాహుల్ ఇష్టం.. భర్త అనిల్ వ్యాఖ్యలు!

కడప ఎయిర్‌పోర్టులో టీడీపీ నేత బీటెక్ రవితో మాటామంతీ 11

అన్నకు ఆహ్వానం

జగన్ నివాసానికి వెళ్లిన షర్మిల

కుమారుడి పెళ్లి కార్డు అందజేత

ప్యాలెస్‌లో ఉన్నది పావుగంటే

తర్వాత భర్త అనిల్‌తో కలిసి ఢిల్లీకి

నేడు కాంగ్రెస్‌లోకి ..... పీసీసీ పగ్గాలు ఖాయం!

కాంగ్రెస్ నుంచే వచ్చాం.. మళ్లీ వెళ్తున్నాం: ఆళ్ల

విసిరి కొట్టడానికి.. బడుగులే దొరికారా?

నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ మాటలు ఒట్టి డైలాగులేనా.. చంద్రబాబు ధ్వజం

పుల్లనైనా పెట్టి గెలిపిస్తామన్నారే!.. మరి వీరిని గెలిపించలేరా?

భ్రష్టు పట్టిపోయారంటూ సాకులా?.. దోచుకు తింటుంటే జగన్ ఎవరినైనా పిలిచి మందలించాడా?

పనికిరాడని సర్వేలు చెబుతున్నాయి.. మరి జగన్ తప్పుకొంటాడా?

సీఎం వద్దని జనం అంటుంటే ఎమ్మెల్యేలను మార్చి ఏం లాభం?

45 ఏళ్లలో ఇంత దారుణ సీఎంను చూడలేదు: చంద్రబాబు

అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అటూ ఇటూ విసిరి కొట్టడానికి బడుగు వర్గాల ఎమ్మెల్యేలే దొరికారా అని సీఎం జగన్‌పై టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. అసలు జగన్‌నే విసిరివేయాలని జనం అనుకుంటుంటే.. వైపీపీ ఎమ్మెల్యేలను అటూ ఇటూ మార్చితే ఏం ప్రయోజనమని వ్యాఖ్యానించారు. పలువురు రాజకీయ ప్రముఖులు బుధవారమిక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీలో చేరిన సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. 'జగన్ ఇప్పటికి 38 మంది ఎమ్మెల్యేలను మార్చారు. వీరిలో అధికులు ఎస్సీ, ఎస్టీ, బీసీలే. విసిరేయడానికి వీరే దొరికారా? నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ మాటలు ఒట్టి డైలాగులేనా? పుల్లనైనా పెట్టి గెలిపిస్తామని బీరాలు పలికిన వాళ్లు.. వీరిని పెట్టి ఎందుకు గెలిపించలేరు? వీరంతా తమ నియోజకవర్గాల్లో భ్రష్టు పట్టిపోయారని, గెలవరని.. అందుకే మారుస్తున్నామని

మిగతా 3వ పేజీలో...

వైసీపీకి భారీ షాక్

టీడీపీలో చేరిన అధికార పార్టీ ఎమ్మెల్సీ సి. రామచంద్రయ్య

సాయిరెడ్డి బావమరిది ద్వారకానాథ్‌రెడ్డి, మాజీ మంత్రి దాడి కూడా

బాబు సమక్షంలో భారీగా చేరికలు.. టీడీపీ గెలుపే లక్ష్యమని వెల్లడి

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల ముంగిట అధికార పార్టీ వైసీపీకి రాజకీయంగా భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన పలువురు సీనియర్ రాజకీయ నాయకులు టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకొన్నారు. వీరిలో ఎమ్మెల్సీ, మాజీ మంత్రి సి. రామచంద్రయ్య, వైసీపీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ విజయసాయిరెడ్డి సొంత బావమరిది, మాజీ ఎమ్మెల్యే ద్వారకానాథ్‌రెడ్డి, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, ఆయన ఇద్దరు కుమారులు, బాపట్ల నియోజకవర్గంలోని జడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాలరెడ్డి తదితరులు ఉన్నారు. టీడీపీ గెలుపు కోసం కృషి చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. టీడీపీలో చేరిన వారిలో రామచంద్రయ్య, ద్వారకానాథ్‌రెడ్డి ఇద్దరూ

మిగతా 3వ పేజీలో...

అధికార పార్టీ కీలక నేతలూ టీడీపీలోకి

స్థానిక సంస్థలకే సర్వాధికారాలు

విధులు, నిధులు, గౌరవమిస్తాం: చంద్రబాబు


బడ్జెట్‌లో పంచాయతీలకు ఏటా 5 శాతం నిధులు

అన్ని సెస్‌ల నిధులూ తిరిగి వాటికే.. ఉపాధి పనులన్నీ వాటి ద్వారానే

సర్పంచ్‌ల నేతృత్వంలోనే గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు

వారికి గౌరవ వేతనం పెంచుతాం.. సర్పంచ్‌ల శంఖారావంలో బాబు

సంపూర్ణ మెజారిటీతో గెలిపించాలని వినతి 2


10

అదానీపై ఇక ఏ దర్యాప్తూ అవసరం లేదు

సిట్ లేదా సీబీఐకి బదిలీ చేయాలన్న వినతికి సుప్రీం నో

దర్యాప్తు పూర్తి చేసేందుకు సెబీకి మరో 3 నెలల గడువు

ఆ ఫొటోలు చూశారా?

భారీ యంత్రాలతో ఇసుక తవ్వి తరలిస్తున్నట్లుంది

వాటిని సీజ్ చేయడం పోలీసులకు పెద్ద విషయమా!

ధవళేశ్వరం వద్ద ఇసుక అక్రమ తవ్వకాలను ఆపండి

ఆ నివేదికను కోర్టు ముందు ఉంచండి

తూర్పుగోదావరి ఎస్పీకి హైకోర్టు ఆదేశం


11

అంగన్‌వార్

కదం తొక్కిన అంగన్వాడీలు

ఉప్పెనలా తరలివచ్చి కలెక్టరేట్ల ముట్టడి

భారీ ర్యాలీలు... రోడ్లపైనే భోజనాలు

అడుగడుగునా పోలీసుల నిర్బంధాలు

బ్యారికేడ్లు, ముళ్ల కంచెలతో అడ్డంకులు

మహిళలను ఈడ్చిపారేసి.. అరెస్టులు

సమస్యలు పరిష్కరించకపోతే పోరు ఉధృతం

ప్రభుత్వానికి అంగన్వాడీ నేతల హెచ్చరికలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

అంగన్వాడీలు కన్నెర్ర జేశారు. ప్రభుత్వ మొండివైఖరిని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్లను ముట్టడించారు. 23వ రోజు సమ్మెలో భాగంగా బుధవారం వారు చేపట్టిన కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. పలుచోట్ల అంగన్వాడీ కార్యకర్తలను

మిగతా 11వ పేజీలో...


బుధవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద భారీ సంఖ్యలో బైఠాయించిన అంగన్వాడీలు

మున్సిపల్ సమ్మె ఉధృతం

నెల్లూరులో అత్యవసర సేవల సిబ్బంది విధులకు దూరం

తాగు నీరు, వీధిలైట్ల సిబ్బంది, వర్క్ ఇన్‌స్పెక్టర్లు కూడా 11

ఫిట్టర్ కూలీలు, వాల్ ఆపరేటర్లు సైతం ఆందోళన బాటలో


విజయనగరంలో కోరాడ అప్పారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న భువనేశ్వరి

టీడీపీ అండగా ఉంటుంది.. ధైర్యంగా ఉండండి

'నిజం గెలవాలి' యాత్ర రెండో దశలో భువనేశ్వరి భరోసా 2

చంద్రబాబు అరెస్టును జీర్ణించుకోలేక మరణించిన వారి కుటుంబాలకు పరామర్శ.. ఆర్థిక సాయం చెక్కులు అందజేత



ఈ ప్రభుత్వానికి నూకలు చెల్లాయ్!

వైసీపీ అన్ని వర్గాలనూ వంచించింది: పురందేశ్వరి

2

టార్గెట్ 50



మోదీ 'మిషన్ సౌత్'!

40-50 ఎంపీ సీట్లపై గురి.. 2019లో 29 స్థానాల్లోనే గెలుపు

న్యూఢిల్లీ, జనవరి 3: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో దక్షిణ భారతంలో 40-50 స్థానాలు సాధించాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. 'మిషన్ సౌత్'లో భాగంగానే ప్రధాని మోదీ ఇటీవల తమిళనాడు, కేరళల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. తమిళనాట మంగళవారం తిరుచిరాపల్లి విమానాశ్రయాన్ని ప్రారంభించిన ఆయన.. బుధవారం కేరళలోని త్రిసూర్‌లో, కేంద్ర పాలిత ప్రాంతం లక్షదీవుల్లో భారీ రోడ్‌షోలు నిర్వహించారు. ప్రధానంగా త్రిసూర్ రోడ్‌షోకు 2 లక్షల మంది బీజేపీ మహిళా కార్యకర్తలు హాజరవడం విశేషం. ఈ దఫా 350 లోక్‌సభ స్థానాలు గెలవాలని బీజేపీ గట్టి పట్టుదలతో ఉంది. ఇది సాధించాలంటే దక్షిణాదిన కూడా ఎక్కువ సీట్లు గెలవాల్సి ఉంటుంది. దక్షిణ భారతంలో 129 లోక్‌సభ స్థానాలు ఉండగా గత ఎన్నికల్లో బీజేపీ 29 చోట్ల మాత్రమే విజయం సాధించింది. ఇందులోనూ 25 సీట్లు కర్ణాటకలో వచ్చాయి. తెలంగాణలో 4 స్థానాలు గెలిచింది. కర్ణాటక, తెలంగాణల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఈ దఫా ఇక్కడ లోక్‌సభ సీట్లు పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. ఈ నష్టాన్ని ఆంధ్ర, తమిళనాడు, కేరళల్లో పూడ్చుకోవాలని బీజేపీ జాతీయ నాయకత్వం భావిస్తోంది.

మీకు నచ్చినట్లు ఉత్తర్వులిస్తారా?

- మా ఇష్టమంటే కుదరదు.. జగన్ సర్కారుకు కేంద్రం చీవాట్లు
- పీసీసీఎఫ్‌గా మధుసూదన్‌రెడ్డి సర్వీసు పొడిగించడానికి నో

అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జగన్ సర్కారుకు ఝలక్ ఇచ్చింది. 'అంతా మీ ఇష్టమేనా.. మీకు నచ్చినట్లు ఉత్తర్వులు జారీ చేస్తే కుదరదు.. ప్రభుత్వానికి కొన్ని నియమాలు, నిబంధనలు ఉంటాయి. వాటికి విరుద్ధంగా ఉత్తర్వులు ఇవ్వడం పద్ధతి కాదు.. మీరు అడిగినట్లు ఆ అధికారికి కొనసాగింపు కుదరదు' అని తేల్చిచెప్పింది. రాష్ట్ర అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్ (పీసీసీఎఫ్)గా ఉన్న ఐఎఫ్ఎస్ అధికారి మధుసూదన్‌రెడ్డి నిరుడు నవంబరు 30న రిటైరయ్యారు. దానికి ఐదు రోజుల ముందు.. అంటే నవంబరు 25న ఆయన సర్వీసును మూడు నెలలు పొడిగించాలని రాష్ట్రప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. అక్కడి నుంచి అనుమతి రాకముందే తనకు తానే జీవో ఇచ్చేసింది. దీనిని కేంద్రం తీవ్రంగా పరిగణించి చీవాట్లు పెట్టడంతో ఆయన్ను తప్పించి మరో సీనియర్ అధికారి చిరంజీవిచౌదరికి అదనపు బాధ్యతలు ఇచ్చింది. తన కొనసాగింపు తిరస్కరణకు గురైన విషయాన్ని తెలుసుకున్న మధుసూదన్‌రెడ్డి బుధవారం ముఖ్యమంత్రిని కలిశారు. ఏం పర్లేదు.. రేపే నీకు ఫారెస్ట్ డెవలప్‌మెంట్ ఎండీగా నియమిస్తానని జగన్ అభయం ఇచ్చారు. కాగా, సీనియర్ అధికారి చిరంజీవి చౌదరి బుధవారం సాయంత్రం పీసీసీఎఫ్‌గా అదనపు బాధ్యతలు చేపట్టారు.

చంద్రబాబు సభకు అడ్డంకులు

- లేఅవుట్ యజమానికి బెదిరింపులు

భీమవరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు పాల్గొనే సభను అడ్డుకునేందుకు అధికార పార్టీ వైసీపీ కుయుక్తులు పన్నుతోంది. సభకు స్థలాన్ని ఇచ్చిన యజమానిని బెదిరించడంతోపాటు భారీ జరిమానా విధిస్తామని ఏకంగా ఎమ్మెల్యేనే హెచ్చరించడం రాజకీయంగా వివాదానికి దారితీసింది. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటలో ఈ నెల 7న టీడీపీ భారీ బహిరంగ సభను నిర్వహించాలని నిర్ణయించింది. 'చలో ఆచంట' పేరుతో నిర్వహించనున్న ఈ సభలో చంద్రబాబుతోపాటు, జనసేనాని పవన్ కల్యాణ్ పాల్గొననున్నారు. చంద్రబాబు, పవన్‌లు ఒకే వేదికపైకి రానుండడంతో అధికార పార్టీలో వణుకు మొదలైంది. ఈ క్రమంలో సభకు సుమారు 8 ఎకరాల స్థలాన్ని ఇచ్చిన ఓ లేఅవుట్ యజమానిని అధికార పార్టీ నాయకులు బెదిరించారు. టీడీపీ సభకు స్థలాన్ని ఎవరు ఇవ్వమన్నారంటూ ఆయనను గద్దించారు. ఈ విషయంలో ఆచంట ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు రంగంలోకి దిగి స్థలం జయమానిని తీవ్రంగా హెచ్చరించినట్టు టీడీపీ నాయకులు చెబుతున్నారు. దీంతో యజమానికి కాస్త జంకారు. తెలుగుదేశం నాయకుల వద్దకు వెళ్లి పరిస్థితిని వివరించారు. దీంతో టీడీపీ ముఖ్య నేతలు రంగంలోకి దిగి విజిలెన్స్ అధికారులతో చర్చించారు. రాజకీయాల్లో అధికారులు జోక్యం చేసుకోవడం సరికాదని పేర్కొన్నారు. దీంతో అధికారులు వెనక్కితగ్గారు. ఫలితంగా సభకు అడ్డంకులు తొలిగాయని టీడీపీ నేతలు భావిస్తున్నారు.

జమధాని చీరకు బంగారు పతకం

- అరకు కాఫీకి కూడా.. 'ఒక జిల్లా.. ఒకే ఉత్పత్తి' లో ఏపీ సత్తా

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఒక జిల్లా.. ఒకే ఉత్పత్తి' పథకంలో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకత చాటుకుందని చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి సునీత తెలిపారు. మన రాష్ట్రం నుంచి కాకినాడ జమధాని చీర, అరకు కాఫీ బంగారు పతకాలు సాధించాయని, పొందూరు కాటన్, కర్నూలు జిల్లా కోడుమూరు చీర కాంస్య పతకాలు దక్కించుకున్నాయని చెప్పారు.

జగన్ సర్కారుకు నూకలు చెల్లాయి: పురందేశ్వరి

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని వర్గాలను వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి విమర్శించారు. 'నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు' అంటూ ఆయా వర్గాల సంక్షేమ పథకాలకు కోత పెట్టిన ఘనుడు సీఎం జగన్ అని మండిపడ్డారు. బుధవారం నిర్వహించిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని విధాలా నాశనమైందని, 12 లక్షల కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోయిందని తెలిపారు. 'రాష్ట్రంలో రైతుల కన్నీటికి ప్రభుత్వమే కారణం. ధాన్యానికి సంచులు ఇవ్వరు. కాల్వల్లో పూడిక తీయరు. పంట బీమా ప్రీమియం కూడా చెల్లించరు. కేంద్రం ఇస్తోన్న ఆరు వేలు తమ వాటాగా చెబుతూ మోసం చేస్తున్నారు' అని మండిపడ్డారు.

మధ్యవర్తిత్వానికి ఈజిప్టు గుడ్‌బై!

సలేహ్ అరౌరీ హత్యే కారణం

ఇజ్రాయెల్ హిట్ లిస్టులో మరికొందరు



వెస్ట్ బ్యాంక్‌లోని ఓ శరణార్థి శిబిరంలో పాలస్తీనీయులను అరెస్టు చేస్తున్న ఇజ్రాయెల్ సైన్యం

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధ విరమణకు ఇంత కాలం ఖతార్‌తోపాటు ప్రయత్నించిన ఈజిప్ట్.. మధ్యవర్తిత్వం నుంచి తప్పుకొంటోంది. ఈ మేరకు ఇజ్రాయెల్ ప్రభుత్వానికి లేఖ రాసినట్లు ఖతార్ ధ్రువీకరించింది. ఇజ్రాయెల్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్(ఐబీసీ) కూడా దీనిపై ప్రత్యేక కథనాలను ప్రసారం చేసింది. ఓ వైపు శాంతి కోసం తాము ప్రయత్నాలు చేస్తుంటే.. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) లెబనాన్‌లో ఉన్న హమాస్ నేత సలేహ్ అల్-అరౌరీని తుదముట్టించడమే ఈజిప్టు నిర్ణయానికి కారణమని ఆ కథనాలు స్పష్టం చేశాయి. దీంతో.. ఈజిప్టు వర్గాలతో కైరోలో ఇజ్రాయెల్ అధికారులు సోమవారం నుంచి జరుపుతున్న సమావేశాలు బుధవారం రద్దయ్యాయి. అయితే.. మధ్యవర్తిత్వం నుంచి తప్పుకోవడంపై ఈజిప్టు విదేశాంగ మంత్రిత్వ శాఖ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. నవంబరులో హమాస్-ఇజ్రాయెల్ మధ్య వారం రోజుల పాటు కాల్పుల విరమణ, బందీలు-ఖైదీల మార్పిడిలో ఈజిప్టు కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే.

ఇజ్రాయెల్ హిట్‌లిస్టులో ఉన్నది వీరే..!

హమాస్ కీలక నేతలు ఇజ్రాయెల్ హిట్‌లిస్టులో ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అక్టోబరు 7న హమాస్ ఇజ్రాయెల్‌పై దాడి చేశాక.. ఆ దృశ్యాలను లైవ్‌లో చూస్తూ.. 'థాంక్స్ గివింగ్' ప్రార్థనలు చేసిన ముఖ్య నాయకులను ఇజ్రాయెల్ టార్గెట్‌గా చేసుకుంది. హమాస్ పొలిటికల్ బ్యూరో సభ్యులు జకారియా అబూ ముమ్మార్, జావేద్ అబూ, హమాస్ వైమానిక విభాగం చీఫ్ మురాద్ అబూ-మురాద్, ఎలైట్ ఫోర్స్ కమాండర్ అలీ అల్ ఖాదీ తదితరులను ఐడీఎఫ్ ఇప్పటికే తుదముట్టించింది. మరో ఐదుగురు కీలక నేతలను టార్గెట్‌గా చేసుకున్నట్లు తెలుస్తోంది.

ఖలీద్ మెషాల్

దశాబ్దాలుగా ఇజ్రాయెల్‌కు పంటికింద రాయిలా ఉన్న వ్యక్తుల్లో ఖలీద్ మెషాల్ ఒకరు. 1997లోనే ఇజ్రాయెల్ ఏజెంట్లు జోర్డాన్‌లో ఇతణ్ని చంపేందుకు ప్రయత్నించారు.ఇతని చెవిలో విషాన్ని పిచికారీ చేయడంతో కోమాలోకి వెళ్లిపోయాడు. అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ చొరవతో ఆ విషానికి విరుగుడు ఇచ్చారు.

మూసా అబూ మర్జౌక్

మూసా అబూ మర్జౌక్ 1990-94 మధ్యకాలంలో అల్-ఖాసిం బ్రిగేడ్ హింసాకాండలో కీలకంగా వ్యవహరించారు. అప్పటి నుంచి ఈయన ప్రవాస జీవితంలో ఉన్నారు. 1997 మే వరకు అమెరికాలో తలదాచుకోగా.. అగ్రరాజ్యం అతణ్ని డీపోర్ట్ చేయడంతో జోర్డాన్‌లో ఉంటున్నారు. ప్రస్తుతం ఈయన హమాస్ పొలిటికల్ బ్యూరోలో సీనియర్ సభ్యుడిగా ఉన్నారు.

మహమ్మద్ అల్-డైఫ్

మహమ్మద్ అల్-డైఫ్ హమాస్ అల్-ఖాసం/అల్-మస్రీ బ్రిగేడ్‌లకు కమాండర్-ఇన్-చీఫ్. అక్టోబరు 7 నాటి దాడి వ్యూహాన్ని తూచ తప్పకుండా అమలు చేసింది ఈయనే. 1965లో ఖాన్‌యూనిస్‌లోని శరణార్థి శిబిరంలో జన్మించిన డైఫ్.. 2002లో హమాస్ సాయుధ విభాగానికి కమాండర్‌గా నియమితుడయ్యారు. 2015లో అమెరికా ఇతణ్ని అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది.

- సెంట్రల్ డెస్క్

ఇస్మాయిల్ హనియే

హనియే 2017 నుంచి హమాస్ పొలిటికల్ బ్యూరో అధిపతిగా ఉన్నారు. గతంలో గాజాస్ట్రిప్‌ను హమాస్ స్వాధీనం చేసుకోవడంలో కీలక వ్యక్తి ఇతనే. చాలా కాలం ఖతార్, తుర్కియేలో ప్రవాస జీవితాన్ని గడిపారు. అక్టోబరు 7 దాడిలో ఇతను కీలక వ్యక్తి. మంగళవారం ఈయన హమాస్ వెనక్కి తగ్గుతున్నట్లు ప్రకటించారు.

యాహ్యా సిన్వార్

యాహ్యా సిన్వార్ 2017 నుంచి గాజాలో హమాస్ పొలిటికల్ బ్యూరో చీఫ్‌గా పనిచేస్తున్నారు. అక్టోబరు 7 నాటి హమాస్ దాడికి వ్యూహకర్త ఇతనే. గతంలో ఈయనను ఇజ్రాయెల్ అరెస్టు చేయగా.. హమాస్ కిడ్నాప్ చేసిన ఐడీఎఫ్ సైనికుడు గిలాద్ షాలిత్‌తో మార్పిడి ఒప్పందం మేరకు 2011లో విడుదలయ్యారు. ఇజ్రాయెల్‌లో 23 ఏళ్లు జైల్లో ఉన్నారు.

ఇరాన్‌లో జంట పేలుళ్లు..

103 మంది దుర్మరణం

- సులేమానీ వర్ధంతి సందర్భంగా భారీ ర్యాలీ
- కారు, బ్యాగు బాంబులను పేల్చిన దుండగులు



టెహ్రాన్, జనవరి 3: ఇరాన్ దివంగత మేజర్ జనరల్ ఖాసీం సులేమానీ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ర్యాలీ నెత్తురోడింది. బుధవారం మధ్యాహ్నం దక్షిణ కెర్మాన్ ప్రావిన్స్‌లోని సాహెబ్ అల్-జమా మసీదు సమీపంలో.. సులేమానీ సమాధి వద్ద ప్రార్థనలు జరుగుతుండగా.. రెండు శక్తిమంతమైన ఐఈడీ పేలుళ్లు సంభవించాయి. ఈ ఘటనలో 103 మంది చనిపోయారని, 211 మంది పైగా గాయపడ్డారని ఇరాన్ అధికారిక మీడియా(ఐఆర్ఎన్ఏ) వెల్లడించింది. 2020లో ఇరాక్‌లోని బగ్దాద్ విమానాశ్రయం వెలుపల అమెరికా జరిపిన వైమానిక దాడుల్లో సులేమానీ మృతిచెందిన విషయం తెలిసిందే..! ఆయన వర్ధంతి సందర్భంగా బుధవారం ఇరానీయులు పెద్ద సంఖ్యలో ర్యాలీగా సమాధి వద్దకు చేరుకున్నారు. సరిగ్గా ప్రార్థనలు జరుగుతున్న సమయంలో సమాధికి అత్యంత సమీపంలో శక్తిమంతమైన పేలుడు సంభవించింది. "మధ్యాహ్నం 3 గంటల సమయంలో మొదటి పేలుడు సంభవించింది. సులేమానీ సమాధికి 700 మీటర్ల దూరంలో.. బ్యాగులో పెట్టిన బాంబులను దుండగులు రిమోట్ ద్వారా పేల్చారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలిస్తుండగా.. 20 నిమిషాల తర్వాత.. శ్మశానవాటిక అండర్‌పాస్‌కు సమీపంలో పార్క్ చేసిన కారు బాంబు పేలింది" అని ఇరాన్ అంతర్గత వ్యవహారాల మంత్రి అహ్మద్ వాహిది తెలిపారు. ఇరాన్ ప్రభుత్వం ఈ ఘటనను ఉగ్రదాడిగా ప్రకటించింది.

ఇజ్రాయెల్‌పై నెపం వేస్తున్న ఐఆర్‌జీసీ

ఈ దాడి వెనక ఇజ్రాయెల్ ఉన్నట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్(ఐఆర్‌జీసీ) ఆరోపిస్తోంది. వారం క్రితమే ఆ సంస్థ అధికార ప్రతినిధి రంజాన్ షరీఫ్ ఇజ్రాయెల్‌పై ఆరోపణలను గుప్పించారు. అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి కూడా సులేమానీ హత్యకు ప్రతీకారమని పేర్కొన్నారు. సులేమానీ సమాధిని పేల్చేందుకు కుట్రలు జరుగుతున్నట్లు తమకు సమాచారం అందిందని వివరించారు.

లోకం తీరు



రాజకీయ విరాళాల్లో

మేఘా టాప్

2022-23లో పార్టీలకు రూ.87 కోట్ల మేర విరాళంగా ఇచ్చిన మేఘా ఇంజనీరింగ్ సంస్థ

న్యూఢిల్లీ, జనవరి 3: రాజకీయ పార్టీలకు 2022-23 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా విరాళాలు ఇచ్చిన కార్పొరేట్ సంస్థల్లో మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ అగ్రస్థానంలో నిలిచింది. విరాళాలు ఇచ్చే వ్యక్తులు/సంస్థలకు.. రాజకీయ పార్టీలకు నడుమ అనుసంధానకర్తగా వ్యవహరించే ఎలక్టోరల్ ట్రస్టుల ద్వారా మేఘా సంస్థ రూ.87 కోట్లు పార్టీలకు విరాళాల రూపంలో ఇచ్చింది. ఈ విషయంలో మేఘా తర్వాతి స్థానాల్లో సీరమ్ ఇన్‌స్టిట్యూట్ (రూ.50.25 కోట్లు), ఆర్సెలర్ మిత్తల్ నిప్పోన్ స్టీల్ ఇండియా (రూ.50 కోట్లు) ఉన్నాయి. 'అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్)' తన తాజా నివేదికలో ఈ వివరాలను వెల్లడించింది. ఆ నివేదిక ప్రకారం..

- దేశంలో మొత్తం 18 రిజిస్టర్డ్ ఎలక్టోరల్ ట్రస్టులు ఉండగా.. వాటిలో 13 ట్రస్టుల వివరాలే ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. వాటిలో ఎనిమిదింటికి అసలు ఏ విరాళాలూ అందలేదు. మిగతా ఐదింటికీ కలిపి 39 కార్పొరేట్, వ్యాపార సంస్థలు రూ.363.71 కోట్లు ఇచ్చాయి.
- తనకు అందిన రూ.360.46 కోట్లలో రూ.256.25 కోట్లను ప్రుడెంట్ ట్రస్టు బీజేపీకి ఇచ్చేయడం గమనార్హం. అలాగే.. ఆ సంస్థ ఆప్, బీఆర్ఎస్, వైసీపీలకు కూడా విరాళాలు ఇచ్చింది.
- 2022-23 ఆర్థిక సంవత్సరంలో అన్ని ఎలక్టోరల్ ట్రస్టుల నుంచి అత్యధికంగా (రూ.259 కోట్లు) విరాళాలు అందుకున్న పార్టీ బీజేపీ. బీజేపీ తర్వాత బీఆర్ఎస్ అత్యధికంగా రూ.90 కోట్లు అందుకుంది. వైసీపీ, ఆప్, కాంగ్రెస్ పార్టీలు మూడూ కలిపి ఎలక్టోరల్ ట్రస్టుల నుంచి 2022-23లో అందుకున్న విరాళాలు.. రూ.17.40 కోట్లు.

స్థానిక సంస్థలకే సర్వాధికారాలు

విధులు, నిధులు, గౌరవమిస్తాం: బాబు



సర్పంచుల శంఖారావంలో మాట్లాడుతున్న చంద్రబాబు

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ-జనసేన ప్రభుత్వం రాగానే స్థానిక సంస్థలకు విధులు, నిధులు, గౌరవమిచ్చి సత్కరిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. 73, 74 రాజ్యాంగ సవరణల ప్రకారం స్థానిక సంస్థలకు సర్వాధికారాలు కల్పించే బాధ్యత తీసుకుంటామన్నారు. బుధవారం పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో అన్ని పార్టీల సర్పంచ్‌లు ఏర్పాటు చేసిన సమర శంఖారావం సభకు ఆయన హాజరయ్యారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు సంపూర్ణ మెజారిటీతో టీడీపీ-జనసేన కూటమిని గెలిపించాలని కోరారు. 'రాష్ట్ర ఆర్థిక సంఘం ఏర్పాటుచేసి నిధులు కేటాయిస్తాం. ఏటా రాష్ట్ర బడ్జెట్‌లో 5% నిధులు పంచాయతీలకు కేటాయిస్తాం. కేంద్రం ఇచ్చే నిధులను నేరుగా అందిస్తాం. పంచాయతీలకు రావలసిన మైనింగ్, ఇసుక సెస్, రిజిస్ట్రేషన్ చార్జీలు, వృత్తిపన్ను, వినోద పన్ను, నీటి తీరువా తదితర నిధులన్నీ తిరిగి అందిస్తాం. గ్రామాల్లో అభివృద్ధి పనులను సర్పంచ్‌ల ఆధ్వర్యంలో జరిగేలా చూస్తాం. సోషల్ ఆడిట్ పక్కాగా నిర్వహిస్తాం' అని వరాలిచ్చారు. జల్‌జీవన్ మిషన్ పనులకు కేంద్రమిచ్చిన నిధులను కూడా రాష్ట్రం వాడుకుంటోందని, టీడీపీ వచ్చిన తర్వాత పంచాయతీల ద్వారానే జల్‌జీవన్ మిషన్ పనులు చేపడతామని తెలిపారు. 'జగన్ సర్కారు సర్పంచ్‌ల చెక్‌పవర్ రద్దు చేసి దొంగల్లా చూస్తోంది. మీమీద నాకు నమ్మకం ఉంది.. ప్రజలు ఎన్నుకున్న మిమ్మల్ని సందేహించాల్సిన అవసరం లేదు. మేమొచ్చాక మీకు పూర్తి స్వేచ్ఛ ఇస్తాం. సర్పంచ్‌లకు, సభ్యులకు గౌరవ వేతనాన్ని రూ.3 వేల నుంచి రూ.10 వేలకు, ఎంపీటీసీలకు రూ.10 వేలు, జడ్పీటీసీలకు రూ.6 వేల నుంచి రూ.15 వేలకు, ఎంపీపీలకు రూ.10 వేల నుంచి రూ.15 వేలకు, జడ్పీటీసీలకు రూ.40 వేల నుంచి రూ.50 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. ఇంకా ఏమన్నారంటే..

జగన్ దయాదాక్షిణ్యాలతో గెలవలేదు..

రాష్ట్రంలో స్థానిక సంస్థల ప్రతినిధులు 1.70 లక్షల మంది ఉన్నారు. మీరెవరూ జగన్ దయాదాక్షిణ్యాలతో గెలవలేదు. మిమ్మల్ని ప్రజలు ఎన్నుకున్నారు. స్థానిక సంస్థలను, వ్యవస్థలను కాపాడుకోవలసిన బాధ్యత మీపై ఉంది. మేమొచ్చాక పెండింగ్ బిల్లులన్నీ సర్పంచ్‌లకు వడ్డీతో పాటు చెల్లిస్తాం. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు 8 శాతంతో ప్రారంభించింది ఎన్టీఆరే. బీసీలకు స్థానిక సంస్థల్లో మేం 34 శాతం రిజర్వేషన్ ఇస్తే.. ఈ సర్కారు వచ్చి 24 శాతానికి తగ్గించింది. వైవీబీ రాజేంద్రప్రసాద్ 30 ఏళ్లుగా స్థానిక సంస్థల నిధులు, విధుల కోసం పోరాడుతున్నారు. సర్పంచులను ఒకే వేదికపైకి తెచ్చిన ఘనత ఆయనదే.

వైసీపీ సర్పంచ్‌లపై వేటు

చంద్రబాబు పాల్గొన్న సమర శంఖారావం సభలో ప్రసంగించిన విశాఖ జిల్లా ముత్యాలపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత, ఆయన భర్త ముత్యాలును వైసీపీ సస్పెండ్ చేసింది. దీనిపై సభలో ముత్యాలు స్పందించారు. 'నన్ను జగన్‌రెడ్డి సస్పెండ్ చేసేదేంటి..? నేనే ఈ క్షణమే వైసీపీకి రాజీనామా చేస్తున్నా. శాశ్వతంగా మిమ్మల్ని సస్పెండ్ చేసేందుకు సర్పంచ్‌లందరం సిద్ధంగా ఉన్నాం' అన్నారు. అనంతరం చంద్రబాబు ఆయన్ను టీడీపీలోకి చేర్చుకుంటున్నట్లు ప్రకటించారు.

నీ ఇంట్లో నీవే చిచ్చుపెట్టుకుని

మాపై పడడమేంటి?

కుటుంబాల్లో చిచ్చుపెడతారంటూ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలపై చంద్రబాబు స్పందించారు. 'తన ఇంట్లో తాను చిచ్చుపెట్టుకున్న ఆయన.. ఇప్పుడు మాపై పడడమేంటి? జగనన్న వదిలిన బాణాన్ని అని అప్పుడు రాష్ట్రమంతటా తిరిగిన షర్మిల ఇప్పుడు రివర్స్‌లో తిరుగుతోంది. తల్లి-చెల్లి వ్యవహారాన్ని ఆయన సరిగా చూసుకోలేకపోతే మాకేంటి సంబంధం? ఏదో రకంగా ఇతరులపై బురదజల్లి బతకడమూ ఓ రాజకీయమా? పింఛన్ల పెంపు అంటూ ప్రభుత్వ కార్యక్రమం పెట్టి రాజకీయ పార్టీలను విమర్శిస్తాడా' అని మండిపడ్డారు.

'సెంట్రల్' విష్ణుకే ఇవ్వాలి!

- బ్రాహ్మణ సంఘాల డిమాండ్

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

సిట్టింగ్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు మళ్లీ విజయవాడ సెంట్రల్ టికెట్ ఇవ్వాల్సిందేనంటూ ఆయన అనుచరులు, బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్, ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య, విజయవాడ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలోని ఓ హోటల్‌లో సమావేశం నిర్వహించారు. విశాఖలో ద్రోణంరాజు శ్రీనివాస్ మృతి తర్వాత ఆ స్థానాన్ని వేరే వారికి కేటాయించారని, వైసీపీ ఉన్న 3 స్థానాల్లో రెండు స్థానాల నుంచి బ్రాహ్మణులను తొలగించారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. బ్రాహ్మణ సంఘం నాయకుడు ద్రోణంరాజు రవి మాట్లాడుతూ.. త్వరలో బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి ఓ నిర్ణయం తీసుకుంటామన్నారు. కాగా, సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వెలంపల్లి శ్రీనివాసరావును నియమించడంపై విష్ణు అనుచరులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మల్లాది విష్ణుకే సెంట్రల్‌లో సీటు ఇవ్వాలంటూ ఆందోళనకు దిగారు. నియోజకవర్గ కార్పొరేటర్లు 16 మంది, విష్ణు అనుచరులు 500 మంది సమావేశమయ్యారు. వైసీపీ సరైన నిర్ణయం తీసుకోకుంటే గురువారం తమ నిర్ణయం ప్రకటిస్తామన్నారు.

బాబును తిడితేనే టికెట్!

- మహీధర్‌రెడ్డికి జగన్ షరతు!!

ఒంగోలు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్‌లను విమర్శించడమే వైసీపీలో టికెట్ ఇవ్వడానికి ప్రాతిపదికగా మారినట్లు కనిపిస్తోంది. ఉమ్మడి ప్రకాశం జిల్లా కందుకూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డికి సీఎం జగన్ షరతులు విధించినట్లు తెలిసింది. వెంటనే విలేకరుల సమావేశం పెట్టి.. వారిద్దరినీ తిట్టిపోసి.. ఆ విషయాన్ని తన దృష్టికి తేవలసిందిగా మహీధర్‌రెడ్డికి చెప్పాలని వైసీపీ సమన్వయకర్త విజయసాయిరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని జగన్ ఆదేశించారు. గతంలో నెల్లూరు లోక్‌సభకు పోటీకి సిద్ధమైన వేమిరెడ్డి.. తర్వాత ఆ ఆలోచన మానుకుని జర్మనీ వెళ్లారు. సీఎం నుంచి పిలుపు రావడంతో మంగళవారం సాయంత్రం కలిశారు. తాను ఎంపీగా పోటీచేయాలంటే నెల్లూరు లోక్‌సభ పరిధిలో ముగ్గురు అసెంబ్లీ అభ్యర్థులను(నెల్లూరు రూరల్, కావలి, ఉదయగిరి) మార్చాలని కోరారు. ఇందుకు జగన్ ససేమిరా అన్నారు.

వైసీపీలో చీలికలు

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర ఆగ్రహం, ఆక్రోశం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఆయన బుధవారం తాడేపల్లిలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డితో భేటీ అయ్యారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం... తనకు సీటు ఎందుకు నిరాకరించారో చెప్పాలని మాధవ్ ప్రశ్నించినట్లు తెలిసింది. తనకు అన్యాయం జరిగిందంటూ ఆయన పెద్దగా కేకలు వేశారని, దీంతో సజ్జల కార్యాలయం సిబ్బంది హడావుడి పడ్డారని పార్టీనేతలు చెబుతున్నారు. ఇక.. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సైతం జగన్‌పై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. విష్ణుకు టికెట్ నిరాకరించి... విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్‌ను 'సెంట్రల్'కు పంపిన సంగతి తెలిసిందే. దీంతో మల్లాది విష్ణు కినుక వహించారు. వెలంపల్లి బుధవారం విష్ణు ఇంటికి వెళ్లారు. 'నాకు ఇష్టంలేకపోయినా సెంట్రల్ సీటు ఇచ్చారు. అధిష్ఠానం ఆదేశాలు పాటించడం తప్ప వేరే మార్గం లేదు. నాకు మద్దతు పలకండి' అని వెలంపల్లి కోరినట్లు తెలిసింది. దీనిపై విష్ణు ముక్తసరిగా స్పందించినట్లు సమాచారం.

కాంగ్రెస్ వైపు చూపు..

టికెట్లు నిరాకరించి జగన్ తమకు అన్యాయం చేశారని భావిస్తున్న వైసీపీ సిట్టింగ్‌లకు కాంగ్రెస్ ఒక ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. పలువురు టీడీపీలో చేరేందుకు ఆసక్తి ప్రదర్శిస్తున్నప్పటికీ... అక్కడ టికెట్లు సర్దుబాటు చేయలేని పరిస్థితి నెలకొంది. కొందరు నాయకులు జనసేన వైపు కూడా చూస్తున్నారు. కానీ.. అవకాశాలపై సందేహాలు ఉండటంతో అత్యధికులు కాంగ్రెస్ కండువా కప్పుకొనేందుకే సిద్ధమవుతున్నారు. ఎన్నికల్లో పోటీకి దూరమైతే రాజకీయంగా కనుమరుగు అవుతామనే ఆందోళన, ఆవేదన వారిలో కనిపిస్తోంది. జగన్ వెంట ఉన్నవారిలో 90% మంది మూలాలు కాంగ్రెస్‌లోనే ఉన్నాయి. ఆ పార్టీ నుంచే వీరు వైసీపీలోకి వచ్చారు. అయితే ఇప్పుడు ఏకంగా టికెట్లకే ఎసరు పెట్టడంతో ఒక్కసారిగా బద్దలవుతున్నారు.

షర్మిల ప్రభావమే కీలకం..

వైసీపీలో టికెట్లు రాకపోవడంతో... కాంగ్రెస్ కండువా కప్పుకోనేందుకు సిద్ధమవుతున్న నేతలు 'తగిన' కారణాలు వెతుక్కుంటున్నారు. అందులో ముఖ్యమైనది.. కాంగ్రెస్ తమ 'మాతృ సంస్థ' కావడమే! 'అప్పటి పరిస్థితుల రీత్యా.. జగన్‌కి అండగా నిలిచాం. అవమానాలు ఎదురైనా భరించాం. ఈ అన్యాయాన్ని సహించలేం. తిరిగి కాంగ్రెస్‌లోకి వెళ్తున్నాం' అని చెప్పుకునే అవకాశముంది. మరోవైపు.. షర్మిలకే ఏపీ పగ్గాలు అప్పగించే అవకాశాలుండటం కలిసి వస్తున్న మరో అంశం. ఈ ఎన్నికల్లో గెలిచే అవకాశాలు లేనప్పటికీ.. తమ ఉనికి చాటుకోవచ్చునని భావిస్తున్నారు.

రెండు విడతలుగా ప్రకటించిన ఇన్‌చార్జిల జాబితాలో 13 మంది సిట్టింగ్‌లకు స్థానం దక్కలేదు. తొలి విడతలో సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర బాబు, గుంటూరు వెస్ట్ మద్దాలి గిరిధర్, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఉన్నారు. రెండో విడతలో హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, అనకాపల్లి ఎమ్మెల్యే గుడివాడ అమర్నాథ్, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, పిఠాపురం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, పత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రరావు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, అరకు ఎమ్మెల్యే శెట్టి పాల్గుణ, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కదిరి శాసనసభ్యుడు సిద్ధారెడ్డి ఉన్నారు.

- జగ్గంపేట ఎమ్మెల్యే చంటిబాబు కాకినాడలో జనసేనాని పవన్ కల్యాణ్‌తో చర్చలు జరిపారు.
- వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరుతున్నందున మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి కూడా ఆమెతో కలసి నడుస్తానని ప్రకటించేశారు.
- టీజేఆర్ సుధాకరబాబు తన రాజకీయ జీవితాన్ని కాంగ్రెస్‌తోనే ప్రారంభించారు. షర్మిల రాకతో కాంగ్రెస్‌లో చేరే అవకాశముంది.
- విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి.



విశాఖ విమానాశ్రయంలో భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న గంటా, ప్రతిభాభారతి, బుద్దా వెంకన్న, అనూరాధ, అనిత తదితరులు

అండగా ఉంటాం.. ధైర్యంగా ఉండండి

- 'నిజం గెలవాలి' యాత్ర రెండో దశలో నారా భువనేశ్వరి భరోసా
- చంద్రబాబు అరెస్టును జీర్ణించుకోలేక మరణించిన వారి కుటుంబాలకు పరామర్శ.. ఆర్థిక సాయం చెక్కులు అందజేత

విజయనగరం, శ్రీకాకుళం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టును జీర్ణించుకోలేక మృతి చెందిన వారి కుటుంబాలను ఆయన సతీమణి నారా భువనేశ్వరి పరామర్శించారు. 'నిజం గెలవాలి' యాత్ర రెండో దశలో భాగంగా బుధవారం విజయనగరం జిల్లాలోని విజయనగరం, రామభద్రపురం, తెర్లాం, రాజాం మండలాల్లో పర్యటించారు. విజయనగరానికి చెందిన కోరాడ అప్పారావు.. టీవీలో చంద్రబాబు అరెస్టు, బెయిల్‌కు సంబంధించిన వార్తలను చూస్తూ గుండెపోటుతో మృతి చెందడంతో అప్పారావు కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించి ధైర్యం చెప్పారు. అప్పారావు భార్య పద్మావతిదేవి, కుమారుడు జయంత్‌తో 20 నిమిషాల పాటు ఆమె మాట్లాడారు. రూ.3 లక్షల చెక్కును పద్మావతిదేవికి అందించారు. తరువాత రామభద్రపురం, తెర్లాం మండలాల్లో పర్యటించారు. రామభద్రపురంలో ఆమెకు మాజీ మంత్రి సుజయ్ కృష్ణరంగారావు, ఇన్‌చార్జి బేబీనాయన, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. తెర్లాం మండలంలోని పెరుమాలి, మోదుగవలస గ్రామాల్లో బాధిత కుటుంబాలను కలసి భువనేశ్వరి ధైర్యం చెప్పారు. ఆయా కుటుంబాలకు రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని అందించారు. తరువాత రాజాంలోని జీఎంఆర్ గెస్ట్ గౌస్‌లో బస చేశారు. కాగా, నారా భువనేశ్వరి గురువారం శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల, ఆమదాలవలస నియోజకవర్గాల్లో పర్యటిస్తారు. జి.సిగడాం మండలం దవళపేట గ్రామంలో ఒక బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తారు. అనంతరం పాలకొండ నియోజకవర్గంలో పర్యటించి.. బూర్జ మండలంలో మరో కుటుంబాన్ని పరామర్శిస్తారు.


ఇంద్రకీలాద్రిపై భవానీల సందడి

ఎరుపెక్కిన ఇంద్రకీలాద్రి

» ప్రారంభమైన భవానీదీక్షల విరమణ

విజయవాడ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): భవానీ దీక్షాధారులతో ఇంద్రకీలాద్రి ఎరుపెక్కింది. భవానీదీక్షల విరమణ బుధవారం నుంచి ప్రారంభమవడంతో రాష్ట్రం నలుమూలల నుంచి భవానీలు విజయవాడకు తరలివస్తున్నారు. ఉదయం ఆరున్నర గంటలకు భవానీ దీక్షల విరమణను ప్రారంభించారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ, తెలంగాణ జిల్లాల నుంచి భవానీ దీక్ష తీసుకున్న భక్తులు భారీగా తరలివచ్చారు. భవానీలతోపాటు వారి కుటుంబ సభ్యులు కాలినడకన ఇంద్రకీలాద్రికి వస్తున్నారు. దీక్షల విరమణ చేసే వారి కోసం ఆలయ అధికారులు నాలుగు హోమగుండాలను ఏర్పాటు చేశారు. అగ్నిప్రతిష్ఠతో దీక్షల విరమణ ప్రారంభమైంది. భవానీలు ఇరుముడులతో గిరిప్రదక్షిణలు చేసి తర్వాత దుర్గమ్మను దర్శించుకున్నారు. భవానీ దీక్షల విరమణకు ఐదు లక్షల మంది వస్తారని అధికారులు అంచనా వేశారు. తొలిరోజు 50 వేల మంది వరకు వచ్చినట్లు సమాచారం.

బైజూస్ ట్యూషన్ సెంటర్లపై దాడి

» అద్దాలు, ఫర్నిచర్ ధ్వంసం చేసిన విద్యార్థి, యువజన సంఘాలు

» తిరుపతి, విశాఖపట్నంలో ఘటనలు


విశాఖలో ధ్వంసమైన బైజూస్ ట్యూషన్ సెంటర్ అద్దాలు, ఫర్నిచర్

విశాఖపట్నం/తిరుపతి జనవరి 3(ఆంధ్రజ్యోతి): బైజూస్ సంస్థకు చెందిన ట్యూషన్(స్టడీ) సెంటర్లపై విద్యార్థి, యువజన సంఘాలు దాడి చేశాయి. అద్దాలు, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశాయి. ఏఐవైఎఫ్(అఖిల భారత యువజన సంఘం), ఏఐఎస్ఎఫ్(అఖిల భారత విద్యార్థి సంఘం) నేతలు బుధవారం విశాఖపట్నం, తిరుపతి నగరాలలో ఈ దాడులకు పాల్పడ్డాయి. ఈ సందర్భంగా ఆ సంఘాల నేతలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు గత మూడేళ్లుగా ప్రభుత్వం బైజూస్ ట్యాబ్‌లు పంపిణీ చేస్తోందని, దీనికోసం రూ.3,500 కోట్లు బైజూస్ సంస్థకు చెల్లించడానికి ఒప్పందం చేసుకుందన్నారు. అయితే, పాఠాలు అర్థం కాని విద్యార్థుల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఆ సంస్థ ట్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేసి తల్లిదండ్రుల నుంచి రూ.15 వేల వరకూ వసూలు చేస్తోందని ఆరోపించారు. తల్లిదండ్రులు అంతమొత్తం కట్టలేమంటే ఓ ఫైనాన్స్ సంస్థ ద్వారా ఈఎంఐ రూపంలో చెల్లించాలని సూచిస్తున్నారని తెలిపారు. బైజూస్ సంస్థ దివాలా తీసిందని, ఇప్పటికే ఆ సంస్థపై మనీల్యాండరింగ్ కేసులు కూడా నమోదైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆ సంస్థకు మేలు చేసేలా ఒప్పందం చేసుకుందని ఆరోపించారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న బైజూస్ స్టడీ సెంటర్లను తక్షణం మూసేయాలని డిమాండ్ చేశారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం బైజూస్‌తో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరారు. దాడి విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలాలకు చేరుకుని ఆయా సంఘాల నేతలను అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్లకు తరలించారు. అయితే, ఘటనలపై బైజూస్ సంస్థ పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలిసింది. మరోవైపు తిరుపతిలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులను తొలుత అలిపిరి పోలీస్ స్టేషన్‌కు, అనంతరం అక్కడి నుంచి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో వారిని కొట్టేందుకే స్టేషన్లు మారుస్తున్నారంటూ సీపీఐ నాయకులు పెద్ద సంఖ్యలో పోలీసుస్టేషన్ల వద్దకు చేరుకొని ఆందోళన నిర్వహించారు. బైజూస్ సంస్థ ఫిర్యాదు చేయకుండా, వీరిపై ఏం కేసులు పెడతారని పోలీసులను సీపీఐ నాయకులు ప్రశ్నించారు. ముందు కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తమకు ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని సీఐ అబ్బన్న చెప్పారు. కేసు నమోదుచేసే వరకు తాము స్టేషన్ వద్ద నుంచి కదిలేది లేదని సీపీఐ నాయకులు స్పష్టం చేశారు.

మాజీ ఎమ్మెల్యే పరకాల కాళికాంబ మృతి



నరసాపురం, జనవరి 3: మాజీ మంత్రి దివంగత పరకాల శేషావతారం సతీమణి పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మాజీ ఎమ్మెల్యే పరకాల కాళికాంబ(93) బుధవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. గత ప్రభుత్వ హయంలో సలహాదారుగా పనిచేసిన పరకాల ప్రభాకర్ కాళికాంబ పెద్దకుమారుడు. ఆమె భర్త శేషావతారం నరసాపురం అసెంబ్లీ స్థానం నుంచి మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందారు. జలగం వెంగళరావు, మర్రి చెన్నారెడ్డి, అంజయ్య కేబినెట్‌లలో మంత్రిగా పనిచేశారు. 1981లో పంచాయతీరాజ్ శాఖ మంత్రి హోదాలోనే మృతి చెందారు. ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి కాళికాంబ విజయం సాధించారు. గత కొంతకాలం నుంచి ఆమె హైదరాబాద్‌లో కుమారుడి వద్దే ఉంటున్నారు. ఆమె అంత్యక్రియలు బుధవారం హైదరాబాద్‌లో ముగిశాయి.

ఆ ఉద్యోగులకు త్వరలో ఓపీఎస్: సీఎస్

అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో 2004కు ముందు ఉద్యోగంలో చేరినవారికి త్వరలో పాత పెన్షన్ స్కీం వర్తింపజేస్తామని చీఫ్ సెక్రటరీ కేఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన్ను కలిసిన ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవికి ఈ మేరకు హామీ ఇచ్చారు. ఏపీటీఎఫ్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను సీఎస్ ఆవిష్కరించారు.

కుటుంబాలను చీల్చేస్తారు!

» వైసీపీపై కుట్రలు చేస్తారు

» కాకినాడ సభలో జగన్ ఆక్రోశం

» పింఛను రూ.3వేలకు పెంపు

» బాబు 2వేలు ఇచ్చారని ఎట్టకేలకు అంగీకారం

» లెక్కలపై జగన్ అబద్ధాలు, అర్ధ సత్యాలు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

సామాజిక పింఛన్ల నుంచి ఇళ్ల పట్టాల దాకా.. అన్నీ అబద్ధాలు, అర్ధ సత్యాలే! కాకినాడలో బుధవారం జరిగిన వైఎస్సార్ పింఛన్ రూ3 వేలకు పెంపు సభలో ఒకవైపు విపక్షాలపై ఏడుపులు, మరోవైపు అసంబద్ధ ఆరోపణలతో ముఖ్యమంత్రి జగన్ జనాన్ని ఏమార్చే ప్రయత్నం చేశారు. "వైసీపీపై రాబోయే రోజుల్లో కుట్రలు, కుతంత్రాలు ఎక్కువ జరుగుతాయి, వీటిని ప్రజలు నమ్మొద్దు మున్ముందు పొత్తులు ఎక్కువగా కుదురుతాయి కుటుంబాలను అడ్డగోలుగా చీల్చుతారు" అని ఆక్రోశించారు రాష్ట్రంలో ఇచ్ఛాపురం నుంచి కుప్పం వరకు గ్రామాల్లో వైసీపీ పాలనతో అనేక మార్పులు కనిపిస్తున్నాయని జగన్ అన్నారు. ఇప్పటిదాకా చంద్రబాబు పెన్షన్ రూ.వెయ్యి ఇస్తున్నారని చెబుతూ వచ్చిన జగన్.. ఎట్టకేలకు రెండు వేలు ఇచ్చినట్లు అంగీకరించారు. "వైసీపీకి భయపడి పెన్షన్‌ను గత ఎన్నికలకు ముందు అప్పటి సీఎం చంద్రబాబు రూ.2వేలకు పెంచారు" అని తెలిపారు. అయితే.. పింఛన్ మొత్తాన్ని ఏటా రూ.250 చొప్పున పెంచుతూ వెళతామని తాను ఇచ్చిన హామీని సక్రమంగా అమలు చేయకుండా, ఎన్నికలకు రెండు మూడు నెలల ముందు రూ.3 వేలకు చేర్చిన విషయాన్ని విస్మరించారు. గత ప్రభుత్వంలో ఒక్కో పెన్షన్ లబ్ధిదారుకు సరాసరి రూ.58 వేలు అందితే, ఇప్పుడు రూ.1.47లక్షలకు పెంచామని ఏకరువు పెట్టారు. "టీడీపీ పాలనలో రాష్ట్రంలో 39లక్షల పింఛన్లు ఉంటే, వైసీపీ వచ్చాక 66.34లక్షలకు పెరిగాయి. రాష్ట్రంలో ఇళ్ల పట్టాలు టీడీపీ పాలనలో ఎవరికీ ఇవ్వలేదు. వైసీపీ వచ్చాక 31లక్షల మందికి ఇచ్చాం. 22లక్షలమందికి ఇళ్లు నిర్మిస్తున్నాం. 2014 ఎన్నికల మ్యానిఫెస్టోలో పేదలకు మూడు సెంట్ల ఇళ్ల స్థలం ఇస్తామని చంద్రబాబు మాట తప్పినా పవన్‌కల్యాణ్ ప్రశ్నించలేదు. కేంద్రానికి లేఖ కూడా రాయలేదు. కానీ వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో 31లక్షల మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి, ఇళ్లు నిర్మిస్తుంటే అందులో అవినీతి జరిగిందని పవన్‌కల్యాణ్ కేంద్రానికి లేఖ రాసి ఇళ్లను ఆపించాలని ప్రయత్నిస్తున్నారు. చంద్రబాబు అవినీతి చేశారని ఐటీ, ఈడీ సమన్లు జారీచేశాయి. న్యాయస్థానం ఆయనను జైలుకు పంపితే పవన్‌కల్యాణ్ జైలుకు వెళ్లి చంద్రబాబును పరామర్శించారు. చంద్రబాబు ప్రభుత్వంలో అవినీతిని ప్రశ్నించని పవన్ కల్యాణ్...వైసీపీ ప్రభుత్వంలో లేని అవినీతిని మాత్రం ప్రశ్నిస్తున్నారు. చంద్రబాబు అవినీతిలో భాగస్వామ్యం ఉండడం వల్లే పవన్ కల్యాణ్ నోరెత్తడం లేదు" అని విమర్శించారు.

జనం జంప్

» జగన్ ప్రసంగం మొదలవ్వగానే బయటకు..

» కాకినాడ సభకు 'ఇన్‌చార్జీల బదిలీ' వేడి

కాకినాడలో సీఎం సభ కోసం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా అధికారులు వేలాదిమందిని బలవంతంగా తరలించారు. ఐదు జిల్లాల నుంచి 318 బస్సులను తిప్పారు. సభకు రాకపోతే పెరిగిన పింఛను డబ్బులు రావని వలంటీర్ల ద్వారా లబ్ధిదారులను బెదిరించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు సెలవు ప్రకటించారు. ఉదయం ఆరుగంటలకే జనాలను సభ జరిగే రంగరాయ మెడికల్ కాలేజీ మైదానానికి తరలించారు. తీరా జగన్ మధ్యాహ్నం 12 గంటలకు సభ వద్దకు చేరుకుని ప్రసంగం ప్రారంభించే సరికి జనం సగం మంది జంప్ అయిపోయారు. సీఎం ప్రసంగిస్తుండగానే జనం ఒక్కసారిగా బయటకు వెళ్లిపోవడంతో అధికారులు, పోలీసులు వారిని నిలువరించే ప్రయత్నం చేశారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడికి చెందిన మనుషులు పెద్దఎత్తున బయటకు వెళ్లిపోయే వారిని బలవంతంగా ఆపేశారు. మరోపక్క జగన్‌ను పదేపదే పొగిడేందుకు ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రయత్నించారు.

దూరం.. దూరం...

జగన్ కాకినాడ జిల్లా పర్యటనకు వచ్చే ముందురోజు మంగళవారం రాత్రి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టిక్కెట్లు లేవని ప్రకటించారు. ఈ నేపథ్యంలో సీఎం పర్యటనకు జగ్గంపేట వైసీపీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖం చాటేశారు. ఇప్పటికే ఆయన పవన్‌కల్యాణ్‌ను కలిశారు. పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కూడా టికెట్ పోవడంతో జగన్‌కు దూరంగా ఉన్నారు. మరోపక్క రామచంద్రపురం సీటు రెండోసారి ఆశించి మంత్రి వేణు భంగపడ్డారు. ఈ సీటును ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ తనయుడికి కేటాయించారు. ఈ ప్రభావం సీఎం సభ వేదికపై స్పష్టంగా కనిపించింది. మంత్రి వేణు, ఎంపీ బోస్ ఎదురుపడ్డా ముఖాలు తిప్పేసుకున్నారు. మంత్రి దాడిశెట్టి రాజా, ఎమ్మెల్యే ద్వారంపూడి ఎడముఖం పెడముఖంగా ఉన్నారు. కాగా డ్రైవర్ హత్య కేసులో నిందితుడు, ఎమ్మెల్సీ అనంతబాబు యథావిధిగా సీఎం పర్యటనలో హల్‌చల్ చేశారు. వేదిక ఎక్కి నేతలతో పలకరింపులు సాగించారు.

చేసేది చేసి.. చిచ్చు పెట్టేసి..

» కుటుంబాలను చీల్చుతారంటూ జగన్ అమాయకత్వం

» తండ్రిపై వ్యతిరేకత ఉందని కొడుకుకు సీటు

» భర్తకు ఎదురుగాలి ఉందని భార్యకు టికెట్టు

» పినిపెను కాదని శ్రీకాంత్‌కు, బాలరాజు స్థానంలో రాజ్యలక్ష్మికి..

» జ్యోతుల సోదరుల మధ్య గతంలో ఇలాగే అగ్గి..

అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాజకీయ ప్రయోజనాలు, అధికార పీఠం కోసం కుటుంబసభ్యుల మధ్య చిచ్చు పెట్టేందుకు కూడా ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి వెనుకాడబోరని రాజకీయవర్గాలు విమర్శిస్తుంటాయి. అమలాపురం టికెట్ విషయంలో తండ్రీ కొడుకులు .. అన్నదమ్ముల మధ్య చిచ్చుపెట్టి ఆ మాట నిజమేనని జగన్ నిరూపించుకున్నారు. అయితే, రాజకీయాల కోసం కుటుంబ సభ్యుల మధ్య చిచ్చు పెడతారంటూ కాకినాడ సభలో చాలా అమాయకంగా ఆయన వ్యాఖ్యానించడం దిగ్గజ రాజకీయ విశ్లేషకులను సైతం విస్మయపరిచింది. అమలాపురం అసెంబ్లీ స్థానంలో మంత్రి పినిపె విశ్వరూప్ .. ఆయన కుమారుడు శ్రీకాంత్ మధ్య టికెట్ పంచాయతీని జగన్ పెట్టారు. అసెంబ్లీ బరిలో తానుంటానని విశ్వరూప్ మొత్తుకుంటున్నా జగన్ ఆలకించలేదు. అమలాపురం టికెట్ శ్రీకాంత్‌కు ఇస్తున్నానని విశ్వరూప్‌కు చెప్పారు. ప్రజల్లో తనకు ఆదరణ ఉందని .. తన కుమారుడినే వెంటేసుకు తిరుగుతున్న మునిసిపల్ కౌన్సిల్ సభ్యుడి పట్ల ప్రజల్లో ఆగ్రహం ఉందని విశ్వరూప్ చెప్పినా జగన్ ఆలకించలేదు. టికెట్‌ను శ్రీకాంత్‌కే ఇస్తానని విశ్వరూప్‌కు తేల్చి చెప్పారు. అందరికీ హామీ ఇచ్చినట్లుగానే .. అధికారంలోకి వచ్చాక రాజ్యసభకు పంపుతానని విశ్వరూప్‌కు జగన్ హామీ ఇచ్చారు. పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జమానా నుంచి కాంగ్రెస్‌లో ఉన్నారు. ఆ తర్వాత నుంచి జగన్‌తో నడుస్తున్నారు. అలాంటిది బాలరాజు కుటుంబ సభ్యుల మధ్య చిచ్చుకు జగన్ తెరతీశారు. బాలరాజుపై వ్యతిరేకత ఉందంటూ ఆయన భార్య రాజ్యలక్ష్మిని ఇన్‌చార్జిగా నియమించారు. బాలరాజుపై ప్రజల్లో వ్యతిరేకత ఉన్నప్పుడు ఆయన భార్య రాజ్యలక్ష్మిపైనా నియోజకవర్గంలో కోపం ఉంటుందని రాజకీయవర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. తండ్రి విశ్వరూప్‌పై వ్యతిరేకత ఉంటే కొడుకు శ్రీకాంత్‌పై ఎలా అభిమానం ఉంటుందని అమలాపురం ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా పోలవరంలో బాలరాజుపై ప్రజల్లో వ్యతిరేకత ఉంటే.. ఆయన భార్య రాజ్యలక్ష్మిపై అభిమానం ఎలా ఉంటుందని ప్రశ్నిస్తున్నారు. కుటుంబసభ్యుల మధ్య పదవుల చిచ్చుపెట్టేలా జగన్ వ్యవహరిస్తున్నారని వైసీపీ నేతలే బాహాటంగా మాట్లాడుకుంటున్నారు. అమలాపురం టికెట్ శ్రీకాంత్‌కు ఇచ్చినా .. తాను ఎన్నికల బరిలో ఉండి తీరుతానని విశ్వరూప్ చెబుతున్నా జగన్ పట్టించుకోవడంలేదు.

జోక్‌గా మారిన 'రాజ్యసభ' హామీ

చిలకలూరిపేటలో మర్రి రాజశేఖర్‌ను ఎమ్మెల్సీ చేసి మంత్రి పదవి ఇస్తానని జగన్ 2019 ఎన్నికల ప్రచారంలో చెప్పారు. కానీ ..ఎమ్మెల్సీ పదవి కోసం రెండున్నరేళ్లు రాజశేఖర్ వేచి చూడాల్సి వచ్చింది. మర్రి రాజశేఖర్‌కు మంత్రి పదవి దక్కలేదు. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్‌ను నిరాకరిస్తూనే .. రాజ్యసభకు పంపుతానంటూ జగన్ హామీ ఇచ్చేస్తున్నారు. జగన్ చెబుతున్న రాజ్యసభ సీటు వైసీపీలో పెద్ద జోక్‌గా మారిపోయింది.జగ్గంపేటలో జ్యోతుల నెహ్రూపై ఆయన సోదరుడు కుమారుడు చంటిబాబును 2019లో జగన్ పోటీకి దింపారని గుర్తు చేస్తున్నారు. ఒకవైపు కుటుంబ సభ్యుల మధ్య పదవుల చిచ్చు పెడతారు. మరోవైపు రాజకీయాల కోసం కుటుంబ సభ్యుల మధ్య కలహాలు పెడతారంటూ బుధవారం కాకినాడ సభలో జగన్ సెలవిచ్చారు. తాను చేసే తప్పులను ఎదుటివారిపై నెట్టేయడం జగన్‌కు బాగా అలవాటని రాజకీయవర్గాలు విమర్శిస్తున్నాయి.


ముత్యాల ఆభరణాలు చూపుతున్న ఆలయ చైర్మన్ శ్రీనివాసులు, అధికారులు

జ్ఞాన ప్రసూనాంబికకు ముత్యాల ఆభరణాల కానుక

శ్రీకాళహస్తి జనవరి 3: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో కొలువైన జ్ఞాన ప్రసూనాంబిక దేవికి హైదరాబాద్‌కు చెందిన రవి, గాయత్రి దంపతులు బుధవారం ముత్యాల ఆభరణాలను కానుకగా పంపారు. వారి కుమార్తె పేరిట అందిన ఆభరణాల విలువ సుమారు రూ.25 లక్షలుంటుందని ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు వెల్లడించారు. దాతలు అమెరికాలో ఉండడంతో స్వయంగా హాజరు కాలేదని తెలిపారు. ముత్యాలు పొదిగిన చీర, పాదుకలు హస్తాలు, నాగ పడగ సహిత వడ్డాణం, కిరీటం తదితరాలు ఈ ఆభరణాల్లో ఉన్నాయి.

క్రమబద్ధీకరణను వేగవంతం చేయండి

అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కాంట్రాక్టు లెక్చరర్ల జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. కాంట్రాక్టు లెక్చరర్ల జేఏసీ నేతలు కుమ్మరకుంట సురేష్, కల్లూరి శ్రీనివాస్, ఇతరులు బుధవారం సచివాలయంలో సీఎస్ జవహర్ రెడ్డిని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఇప్పటికే అధికారులకు తగిన సూచనలు చేశామని, వీలైనంత త్వరగా అర్హత కలిగిన కాంట్రాక్టు ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరిస్తామని సీఎస్ హామీ ఇచ్చారు.

విసిరి కొట్టడానికి.. బడుగులే దొరికారా?

(మొదటి పేజీ తరువాయి)

సాకులు చెబుతున్నారు. నియోజకవర్గాలను దోచుకుతింటుంటే ఆయన వీరిలో ఎవరినైనా, ఏనాడైనా పిలిచి మందలించాడా? తప్పని చెప్పాడా? సర్వేల్లో బాగోలేదని ఇప్పుడు చెబుతున్నాడు. జగనే పనికిరాడని సర్వేలు చెబుతున్నాయి. మరి ఆయన తప్పుకొంటాడా' అని నిలదీశారు. ఈ ఐదేళ్లలో ఒక్క ప్రాజెక్టూ పూర్తి చేయలేదని.. మెడ మీద కత్తి పెట్టి వాటాలు అడుగుతుంటే పరిశ్రమలు పారిపోతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో చేయడానికి పనులు లేక పొట్ట పనులకు కూడా పొరుగు రాష్ట్రాలకు వలస పోవలసి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. 'అయినకాడికి దోచుకోవడం ఒకటే బాగా చేశారు. శాశ్వతంగా అధికారంలో ఉంటామన్న భ్రమతో విశాఖలో రూ.500 కోట్లు పెట్టి పెద్ద ప్యాలెస్ కట్టారు. రాజధానిని విశాఖకు మారుస్తామని హడావుడి చేస్తుంటే సుప్రీంకోర్టు ఆ కేసుల విచారణ ఏప్రిల్‌కు వాయిదా వేసింది. ఏప్రిల్ తర్వాత నువ్వు ఉండవు. ఈలోపు లాయర్లకు కోట్ల రూపాయల ప్రజాధనం దోచిపెట్టడం ఒకటే కనిపిస్తోంది' అని విరుచుకుపడ్డారు.

సమస్యలు పరిష్కరించకుండా బెదిరింపులా?

రాష్ట్రంలో అనేక వర్గాలు తమ డిమాండ్ల సాధనకు రోడ్లపైకి వచ్చారని చంద్రబాబు చెప్పారు. అంగన్వాడీలు, పురపాలక పారిశుధ్య కార్మికులు, టీచర్లు.. ఇలా అనేక సంఘాలు ఉద్యమిస్తున్నాయని.. వారి సమస్యలు పరిష్కరించడానికి బదులు ప్రభుత్వం బెదిరిస్తోందని ధ్వజమెత్తారు. వారి న్యాయమైన డిమాండ్లకు తమ మద్దతు ఉంటుందన్నారు. తాను 45 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని.. ఇంత దారుణమైన ప్రభుత్వాన్ని, ఇంత దారుణమైన ముఖ్యమంత్రిని చూడలేదని వ్యాఖ్యానించారు. 'స్కూళ్లకు రంగులు వేస్తే అభివృద్ధి అవుతుందా.. అందులో మంచి చదువు చెప్పి మంచి ఉద్యోగాలు పొందే అవకాశాలు కల్పిస్తే అభివృద్ధి వస్తుందా? వీళ్లది రంగుల పిచ్చి అభివృద్ధి. మేం పీజీ మొదలుకొని విదేశీ విద్య వరకూ పేద విద్యార్థులకు సాయం చేశాం. 16 లక్షల మందికి ఫీజులు ఇచ్చాం. వీళ్లు రాగానే ఫీజులు తీసుకునే విద్యార్థుల సంఖ్య పది లక్షలకు పడిపోయింది. ఇదేనా అభివృద్ధి? ఒక రాష్ట్రాన్ని నిర్మించడానికి ఎంతో కాలం శ్రమించాలి. కూల్చడం అతి తేలికైన పని. ఆ పని చేసి కూర్చున్నారు. నాకు ముఖ్యమంత్రి పదవి కోసమో.. టీడీపీ-జనసేన కూటమికి అధికారం కోసమో గెలవాలనుకోవడం లేదు. ఈ రాష్ట్రాన్ని మళ్లీ నిర్మించడానికి.. ఐదు కోట్ల మంది ఆంధ్రులు అభివృద్ధిని అందుకోవడానికి గెలిపించాలని కోరుతున్నాం. రామచంద్రయ్య, దాడి వీరభద్రరావు, ద్వారకానాథరెడ్డి మాదిరిగా బాధ్యతాయుత నేతలంతా ఆలోచన చేసి రాబోయే ఎన్నికల్లో మాకు మద్దతివ్వాలి' అని కోరారు.

ఈ అప్పులు తీర్చాలంటే ప్రజల చర్మం వలవాలి: రామచంద్రయ్య

జగన్‌రెడ్డి హయాంలో రాష్ట్రం అప్పులు రూ.12 లక్షల కోట్లకు చేరాయని, ఇవి తీరాలంటే ప్రజల చర్మం వలిస్తే తప్ప సాధ్యం కాదని ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. 'అప్పులు తీర్చడానికి రాష్ట్రానికి ఆదాయం లేదు. అమ్మడానికి కోకాపేట భూములు లేవు. ప్రజలను బాదడం ఒకటే మిగిలింది. ఆ పరిస్థితి రాకుండా ఈ రాష్ట్రాన్ని బాగు చేయగలిగిన శక్తి ఒక్క చంద్రబాబుకే ఉంది. ఈ రాష్ట్రంలో ముఖ్యమంత్రి పదవి విలాసం కాదు. ఈసారి ఆ సీట్లో కూర్చున్న వారి పరిస్థితి భయంకరం. ఆదాయం పెంచాలి. అరాచకం తగ్గించాలి. అభివృద్ధి చూపించాలి. దానిని ఒక్క చంద్రబాబు మాత్రమే చేయగలరు. ఆయనకు ఇష్టం లేకపోయినా మనం బలవంతంగా కూర్చోబెట్టి పని చేయించుకోవలసిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈసారి ప్రజలు పొరపాటు చేస్తే అంధకారం తప్ప ఏమీ మిగలదు. రాష్ట్రం ఇంకా చెడిపోవడం చూడలేకే నేను తిరిగి టీడీపీలోకి వచ్చాను' అని అన్నారు. చంద్రబాబు వంటి నిజాయితీ కలిగిన నేతపై తప్పుడు కేసులు పెట్టి వేధించి జైలుకు పంపిస్తే భరించలేక వైసీపీని వదిలి పెట్టి టీడీపీలో చేరానని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు పేర్కొన్నారు. నాలుగు డబ్బులు వేస్తే ప్రజలు బిచ్చగాళ్ల మాదిరిగా పడి ఉంటారన్న అభిప్రాయంలో వైసీపీ ప్రభుత్వం ఉందని, అది కాదని నిరూపించాలని ఆయన పిలుపిచ్చారు. వైసీపీకి పాతిక సీట్లు కూడా రాకుండా చూడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అచ్చెన్నాయుడు, వర్ల రామయ్య, ద్వారకానాథరెడ్డి, పిట్ల వేణుగోపాల రెడ్డి తదితరులు కూడా మాట్లాడారు.

జగన్ గెలుపు కల్లే!

» ప్రజాదరణ కోల్పోయారు.. ప్రశ్నిస్తే అణిచేస్తున్నారు

» సాయిరెడ్డి టీడీపీలోకి వచ్చినా ఆశ్చర్యంలేదు

» సీఎం పేషీలోకీ రానివ్వలేదు : ద్వారకానాథ్‌రెడ్డి

» బాబు గెలుపు ఖాయమని వెల్లడి

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ కోసం నాలుగు ఎన్నికల్లో పనిచేసిన తాను ఆ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక అవమానాలు ఎదుర్కొన్నానని, తనను కనీసం సీఎం పేషీలోకి కూడా అడుగు పెట్టనీయలేదని తాజాగా టీడీపీలోకి చేరిన గడికోట ద్వారకానాథ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మంగళగిరిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాయచోటి వైసీపీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి చేసిన అవమానాలకు జగన్ నిరాదరణ తోడైందన్నారు. "మూడు విషయాల్లో జగన్ ప్రజాదరణ కోల్పోయారు. అవినీతి భయంకరంగా పెరిగిపోయింది. ఇదేమిటని ప్రశ్నిస్తే అణిచివేతను ఆయుధంగా ప్రయోగిస్తున్నారు. కేసులు పెట్టి వేధిస్తున్నారు. జగన్ ఎవరినీ కలవడు. ఎవరికీ దొరకడు. ఎన్నికల్లో వాడుకుని.. తర్వాత విసిరేయడం ఆయనకు అలవాటు. సజ్జల రామకృష్ణారెడ్డి, మిథున్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, విజయసాయి రెడ్డి ఆయనకు డబ్బులు వసూలు చేసి పెట్టే ఏజెంట్లు. ముఖ్యమంత్రి పేషీలో వీరు మాత్రమే ఉంటారు. వీరితోనే మళ్లీ గెలుస్తానని జగన్ అనుకుంటున్నారు. ఈసారి జగన్ గెలవడం కల్ల. ఘోరంగా పరాజయం పాలవుతారు. రాయచోటిలో కూడా ఈసారి వైసీపీ గెలవదు. మా కుటుంబంలో విజయసాయిరెడ్డి, ఆయన భార్య తప్ప అంతా నాతోనే ఉన్నారు. రాబోయే కాలంలో విజయసాయి రెడ్డి కూడా టీడీపీలోకి వచ్చినా ఆశ్చర్యం లేదు. ఈ రాష్ట్రం కోసం ఈసారి చంద్రబాబు గెలవడం తప్పనిసరి. ఆయన సునాయాసంగా గెలుస్తారు. ముఖ్యమంత్రి అవుతారు" అని ద్వారకానాథ్ రెడ్డి వ్యాఖ్యానించారు.

టీడీపీలో చేరికలు

(మొదటి పేజీ తరువాయి)


సీఎం జగన్ సొంత జిల్లా కడపకు చెందిన వారు కావడం విశేషం. అసలు ఎలాంటి సంకేతాలూ లేకుండానే రామచంద్రయ్య ఆకస్మికంగా టీడీపీ తీర్థం పుచ్చుకోవడం రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టించింది. హిందూ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు వెలగపూడి గోపాలకృష్ణతో కలిసి బుధవారం ఉదయం రామచంద్రయ్య ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వచ్చారు. సుమారు గంటసేపు చంద్రబాబు చర్చలు జరిపారు. తర్వాత మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి వచ్చి చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరిపోయారు.

రాయచోటిలో కుదుపు

కడప జిల్లా రాయచోటి నియోజకవర్గానికి చెందిన సాయిరెడ్డి బావమరిది గడికోట ద్వారకానాథ్‌రెడ్డి కూడా టీడీపీ కండువా కప్పుకొన్నారు. గతంలో టీడీపీ తరఫున లక్కిరెడ్డిపల్లి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం దక్కించుకున్నారు. గడికోట తండ్రి రామమునిరెడ్డి కూడా ఎమ్మెల్యేగా చేశారు. ద్వారకానాథ్ రెడ్డి వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డికి స్వయానా బావమరిది. సినీహీరో దివంగత తారకరత్న సతీమణి అలేఖ్యా రెడ్డికి ద్వారకానాథ్‌రెడ్డి మేనమామ. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కాంగ్రెస్‌లో చేరిన ద్వారకానాథ్‌రెడ్డి ఆ తర్వాత వైసీపీలో చేరి జగన్‌కు మద్దతుగా నిలిచారు. అయితే, జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత తనకు నిరాదరణ ఎదురైందన్న మనస్థాపానికి గురై.. కొంతకాలంగా తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన టీడీపీలో చేరినట్టు తెలిసింది. కాగా, ఈ పరిణామం.. రాయచోటి నియోజకవర్గంలో వైసీపీకి భారీ నష్టం చేకూర్చే అవకాశం ఉందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

అనకాపల్లిలో వైసీపీకి నష్టం

విశాఖపట్నం జిల్లా అనకాపల్లికి చెందిన మాజీ మంత్రి దాడి వీరభద్రరావు తన ఇద్దరు కుమారులు రత్నాకర్, జైవీర్‌లతో కలిసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.


టీడీపీలో చేరిన దాడి వీరభద్రరావుకు పార్టీ కండువా కప్పుతున్న చంద్రబాబు

ఒకప్పుడు టీడీపీలో సీనియర్ నేతగా ఎదిగిన దాడి.. తర్వాత పరిణామాల నేపథ్యంలో వైసీపీలోకి వెళ్లారు. అయితే, అక్కడి అంతర్గత రాజకీయాలతో ఇమడలేకపోయారు. ముఖ్యంగా జగన్ వ్యవహార శైలితో విభేదించి కొంతకాలంగా దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో ఎన్నికలకు ముందు ఆయన కుమారులతో కలిసి టీడీపీ కండువా కప్పుకొన్నారు. ఇక, బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన వైసీపీ నేత, జడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల రెడ్డి కూడా టీడీపీలో చేరారు. బాపట్ల వైసీపీ ఎమ్మెల్యే, మాజీ ఉప సభాపతి కోన రఘుపతి వ్యవహార శైలితో విభేదించిన ఆయన కొన్నాళ్లుగా వైసీపీకి దూరంగా ఉన్నారు. వీరితోపాటు చీరాల నియోజకవర్గ వైసీపీ నాయకుడు అర్జునరావు, అనంతపురం నగరానికి చెందిన ప్రముఖ వైద్యుడు రాజీవ్‌రెడ్డి, కొందరు ముస్లిం మైనారిటీలు కూడా చంద్రబాబు సమక్షం లో టీడీపీలో చేరారు. వీరి చేరికలతో టీడీపీ కేంద్ర కార్యాలయం బుధవారం కోలాహలంగా మారింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'ఉపాధి'ని హరిస్తున్న ఆధార్

ఆధార్ అనుసంధానం జరగనిదే ఇకపై పేదలకు మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు పుట్టవు, వేతనాలు అందవు. లోపభూయిష్టమైన ఈ ప్రక్రియతో పేదల జీవితాలను దెబ్బ-తీయవద్దని సంబంధిత రంగంలో పనిచేస్తున్న కార్యకర్తలు, నిపుణులు హెచ్చరికలు చేస్తున్నా, ప్రభుత్వం తాను ఎంతోకాలంగా అనుకుంటున్న విధానాన్ని జనవరి 1 నుంచి అమలులోకి తెచ్చింది. గ్రామీణ ఉపాధి హామీ పథకం మీద ఆదినుంచీ గుర్రుగా ఉన్న మోదీ ప్రభుత్వం ఇప్పుడు పేదలమీద సాంకేతికతను ఆయుధంగా వాడుతూ కోట్లాదిమందిని దూరం చేయడానికి సిద్ధపడిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉపాధి హామీ పథకంలో పనుల కల్పన, వేతనాల చెల్లింపులకు జాబ్‌కార్డు, బ్యాంకు ఖాతాలతో ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేసిన ఈ విధానం కూలీలకు శరాఘాతం. సాంకేతిక సమస్యలకు తోడు చాలా కారణాలతో ఇది ఎంత లోపభూయిష్టంగా అమలు జరుగుతున్నదో ఇప్పటికే కేంద్రానికి ఈ రంగంలో పనిచేస్తున్న ప్రభుత్వేతర సంస్థలు పలుమార్లు తెలియచేశాయి. గత సంవత్సరం ఫిబ్రవరి నుంచీ ఈ విషయంలో పట్టుదలగా ఉంటూ, మొదట్లో ఆగస్టు నెలాఖరు, ఆ తరువాత డిసెంబరు 31 గడువులు ఇచ్చిన కేంద్రప్రభుత్వం కొత్త సంవత్సరం తొలిరోజునుంచి దీనిని అమల్లోకి తేవడంతో, అనుసంధానం జరగని కూలీలు ఇప్పుడు నిరాశగా వెనుదిరుగుతున్నారు.

జాబ్‌కార్డు ఆధారంగా కూలి పనిచేసుకొని, బ్యాంకు ఖాతాలో కూలీ-పడితే మురిసిపోయే స్థితిపోయి, మధ్యలో ఆధార్‌తో లంకె ఏర్పడింది. ఈ మూడింటిలోని వివరాలు ఏకరీతిలో ఉండాల్సిరావడం వారి పాలిట శాపమైంది. ఉపాధిహామీ లబ్ధిదారు పేరు, వారి బ్యాంక్ ఎకౌంట్ వివరాల జోడీతో ఖాతా ఆధారంగా నగదుబదిలీ జరిగిపోయే సులువైన పద్ధతిపోయి, ఈ ఆధార్ బేస్డ్ పేమెంట్ సిస్టమ్ (ఏబీపీఎస్) వచ్చింది. దీనిద్వారా పథకంలో అక్రమాలను నిరోధించవచ్చునని, వేతనాలు సత్వరమే అందించవచ్చునని, పని కల్పన నుంచి వేతనం అందేవరకూ కూలీలకు అన్యాయం జరగకుండా చూడవచ్చునన్నది ప్రభుత్వం వాదన. బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానించడం నుంచి, సామాజిక భద్రతకు ఉద్దేశించిన పథకాలన్నింటినీ ఈ ఏబీపీఎస్ విధానంలోకి తేవడం మోదీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అన్ని ప్రభుత్వశాఖలు ఈ విధానాన్నే పాటించాలని గత ఏడాది ఆదేశాలు ఇవ్వడంతో ఆయా ప్రభుత్వశాఖలు తాము అమలుచేస్తున్న పథకాలకు దీనిని తప్పనిసరి చేశాయి. గ్రామీణమంత్రిత్వశాఖ ఆదిలో దీని అమలుకు నిర్ణయించినప్పుడు మొత్తం ఉపాధి హామీ కార్మికుల్లో 40శాతం మాత్రమే అర్హులు. లబ్ధిదారు ఆధార్ సంఖ్య వారి జాబ్‌కార్డుతో, బ్యాంకుఖాతాతో సంధానం కావడంతోపాటు, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డేటాబేస్‌తో మ్యాప్ కావాలి. అలాగే, సదరు బ్యాంకు గుర్తింపు సంఖ్య కూడా మ్యాప్ కావాలి. హక్కుదారుడికి ఎక్కువ ఖాతాలుంటే అది మరో చిక్కు. ఇక, ఆధార్, జాబ్‌కార్డ్, బ్యాంకుఖాతాల్లో లబ్ధిదారు పేరు, ఇంటిపేరు, వివరాల్లో ఏ మాత్రం తేడాలున్నా, స్పెల్లింగ్ పొరపాట్లున్నా వాటిని సరిచేయించుకోవడం కార్మికులకు బ్రహ్మప్రళయం అవుతున్నది. దీనితో స్థానిక అధికారులు కార్మికుల పేర్లు తొలగించడం మొదలుపెట్టారు. దేశవ్యాప్తంగా ఏడాదిన్నరకాలంలో ఆరుకోట్లమంది ఉపాధికి దూరమైనారని అంచనా. ఆగస్టు మాసాంతానికి గడువు పెంచినప్పటికి కూడా 40శాతం మంది ఏబీపీఎస్‌కు అనర్హులుగా ఉండిపోయారు. గ్రామీణ మంత్రిత్వశాఖ అధికారికంగా చెప్పిన ప్రకారమే మొన్న డిసెంబరు 27నాటికి జాబ్‌కార్డులున్నవారిలో 34.8శాతం ఈ పేమెంట్ విధానానికి దూరంగా మిగిలిపోయారు.

ఏబీపీఎస్‌లో నగదుబదిలీకి తక్కువ సమయం పడుతుందన్న ప్రభుత్వం వాదన సరైనది కాదని, ఎకౌంట్ పేమెంట్ కంటే ఆధార్ ఆధారిత వ్యవస్థలో ఎక్కువ జాప్యం జరుగుతూ, తిరస్కరణలు సైతం అధికంగా ఉన్నాయని ప్రభుత్వేతర సంస్థల వాదన. వేతనాల్లో జాప్యానికి ప్రధాన కారణం ప్రభుత్వం తగినన్ని నిధులు అందుబాటులో ఉంచకపోవడమేనని వాటి ఆరోపణ. సాంకేతిక సమస్యలు ఎదుర్కొంటున్న పంచాయితీలకు మాత్రం ఈ విధానంనుంచి తాత్కాలికంగా మినహాయింపు ఇస్తామని ప్రభుత్వం ఇప్పుడు దిగివచ్చింది కానీ, ఆధార్ సీడింగ్, బ్యాంక్ మ్యాపింగ్ ప్రక్రియలను పూర్తిగా ప్రక్షాళించకుండా ఏబీపీఎస్‌ను అమలులోకి తేవడం పెద్ద పొరపాటు. సోషల్ ఆడిటింగ్ ద్వారా, సంబంధిత రంగాల్లో పనిచేస్తున్న సంస్థల సహకారంతో లబ్ధిదారుకు న్యాయం చేకూర్చేవరకూ దీని అమలును నిలిపివేయడం ముఖ్యం. గ్రామీణస్థాయిలో వలసలను నిరోధించేందుకు, అభివృద్ధి జరిగేందుకు, ఉపాధికల్పించేందుకు పదిహేడు సంవత్సరాలుగా ఉపకరిస్తున్న ఈ బృహత్తర పథకం అస్తవ్యస్తమైన ఓ సాంకేతిక వ్యవస్థకు బలికాకూడదు.

ఉనికి చాటింపు కాదు, వాస్తవాల గ్రహింపు కావాలి



కిషన్ రెడ్డి, ఉత్తమ్ చేస్తున్న విమర్శల్లో ఆసక్తికరమైన అంశమొకటి ఉన్నది. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ ఓటర్లు బీఆర్ఎస్‌కు ఎందుకు ఓటు వేస్తారు? వేయాలి? అసెంబ్లీ ఎన్నికలలో పోలఅయిన ఓట్ల ప్రకారం, బీఆర్ఎస్‌కు 3, 4 స్థానాలు రావాలి. అంతకంటే ఎక్కువ సాధించడానికి ఆ పార్టీ ప్రయత్నించవచ్చును కానీ, అసలైన పరీక్ష ఆ మూడు నాలిగింటినైనా దక్కించుకోవడం! బీఆర్ఎస్ రాష్ట్రంలో అధికారంలో లేదు, కేంద్రంలోనూ లేదు! రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రంలో కాపాడే బాధ్యత అయితే కాంగ్రెస్‌ది లేదా ఢిల్లీలో అధికారంలో ఉన్న బీజేపీది? మధ్యలో ఈ బీఆర్ఎస్ వల్ల ఒరిగేదేమిటి? ఏ నినాదంతో బీఆర్ఎస్ పార్లమెంటు ఎన్నికలలో పోటీపడుతుంది? జాతీయస్థాయిలో ఉన్న ప్రధాన రాజకీయాంశం రామమందిరమో, మతతత్వవ్యతిరేకతో అనుకుంటే బీఆర్ఎస్ ఏ పక్షంలో ఉంటుంది?

నక్సలైట్లు పేలుళ్లో కాల్పులో చేస్తే, అది వారు ఉనికి చాటుకునే చర్య అని పోలీసులు వెంటనే అనేవారు. ఆ చర్య వెనుక సంచలనమే తప్ప నిజమైన బలమేమీ లేదని ఆ వ్యాఖ్య ఉద్దేశ్యం. ఉనికిని చాటింపు వేసుకోవలసిరావడం పాలక, ప్రతిపక్ష రాజకీయాలలోకి కూడా ప్రవేశించి చాలా రోజులయింది. సంస్థలనో, ఉద్యమాలనో నిర్మించలేక చతికిలపడినప్పుడో, ఎన్నికలలో ప్రజల తిరస్కారానికి గురయినప్పుడో ఉనికికే ముప్పు వచ్చే ప్రమాదం రాజకీయపార్టీలకు ఎదురవుతుంది. భస్మం నుంచి లేచి ఎగిరే ఫీనిక్స్ పక్షి ఉదాహరణ చెబుతారు కానీ, నేలమట్టమయిన అస్తిత్వాలన్నిటికి అంతటి శక్తి ఉండదు. బలమైన నాయకత్వం, పట్టుదల, అనువైన పరిస్థితులు, నిరీక్షించగలిగిన నిబ్బరం అన్నీ కలసినప్పుడు, ఎన్ని పాములు మింగినా, ఎగబాకే నిచ్చెనలు కూడా అందివస్తాయి. పతనానికీ పునర్నిర్మాణ ప్రయత్నానికి మధ్య కాలంలో, బతికిచెడిన స్థితిని నిభాయించుకోగల స్థితప్రజ్ఞత అందరికీ సమకూరదు.

భారత రాష్ట్ర సమితికి ఇది గడ్డుకాలం. నిన్నమొన్నటిదాకా, మూడోసారి విజయం ఖాయమని ఆశించిన పార్టీ, ఇప్పుడు ఉనికి సమస్యను ఎదుర్కొంటున్నది. ఇంత మౌనానికీ ధ్యానానికీ ప్రయత్నించకుండా, వెనువెంటనే ప్రభుత్వం మీద తీవ్రమైన విమర్శలకు, ప్రతిస్పందనలకు పాల్పడుతూ ఉనికిని చాటుకోవాలని చూస్తున్నది. అధికారప్రతిపక్షాలకు వచ్చిన ఓట్లలో పెద్దతేడా లేదు. రెండు శాతం కంటే తక్కువే. గెలుచుకున్న అసెంబ్లీ స్థానాలా, 39! ఎంతో గౌరవప్రదమైన ప్రతిపక్ష సంఖ్య! అధికారపక్షం బెదిరిపోయే సంఖ్య కూడా! అయినా, ఆ పార్టీకి ఉనికి సమస్య ఎందుకు వస్తోంది? రానున్న అయిదేళ్ల కాలం ఎడారిలాగా భయపెడుతున్నదా? లేక భవిష్యత్తే శూన్యంగా అనిపిస్తున్నదా?

మొత్తంగా ఉండడం, పూర్తిగా లేకపోవడం లాంటి ఉనికి సమస్య కాదిది. నిలబడడం, నిలబడలేకపోవడం వంటి సమస్య. ఓ అయిదేళ్లకు ప్రభుత్వ వ్యతిరేకత ఉధృతమైనప్పుడు ప్రజల గజమాలకు తన కంఠమొక్కటే ఏకైక ఎంపికవుతుందా అన్న సందేహం. ఓటర్లు కాక, బలీయమైన ఇతరేతర శక్తులేవో కూడా తన మనుగడను శాసిస్తాయేమోనని భయం! ప్రాంతీయ పార్టీలన్నిటికి నూకలు పుట్టకుండా చేయాలని భారతీయ జనతాపార్టీ పంతం పట్టకపోయి ఉంటే ఈ అస్తినాస్తి విచికిత్సకు ఆస్కారం ఉండేది కాదు. తెలంగాణలో ఇప్పుడు రంగంలో ఉన్నది తామూ కాంగ్రెస్ మాత్రమేనని, బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే అది మురుగుకాల్వలో వేసినట్టేనన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి మాటలు ఏదో యథాలాపంగా అన్నవి కాదు. అంతే కాదు, బీఆర్ఎస్‌కు అసలు ప్రాసంగికతే లేదని, లోక్‌సభ ఎన్నికల్లో పోరాడడానికి ఆ పార్టీ దగ్గర విషయమే లేదని కూడా ఆయన అన్నారు. లోక్‌సభ ఎన్నికల తరువాత బీఆర్ఎస్ ఉనికే ఉండదని కాంగ్రెస్ నాయకులు, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తాజాగా వ్యాఖ్యానించారు.

వాస్తవంలో కాంగ్రెస్ బొటాబొటి మెజారిటీ మీద, దాని మనుగడకు ఉండే ప్రమాదం మీద ఎక్కువ చర్చ జరగాలి. కానీ, ప్రభుత్వం కుదురుకున్నదన్న అభిప్రాయం ఏర్పడిపోయింది. కాంగ్రెస్ బలం క్రమంగా పెరుగుతూ పోతుందని, బీఆర్ఎస్‌ది క్షీణించిపోతుందని స్పష్టంగా తెలిసిపోతోంది! ముప్పు ఉన్నది బీఆర్ఎస్ మనుగడకే అని సూచనలు కనిపిస్తున్నాయి. హామీలు అమలు-చేయకపోతే ఖబడ్దార్ అంటూ ఆ పార్టీ నేతలు చేస్తున్న ప్రకటనలు కేవలం ఉనికిని చాటుకునే గర్జనలు మాత్రమే. సాధారణ ఎన్నికలలో తమ ప్రాసంగికతను వెదుక్కునే బలహీనమైన ప్రయత్నాలు మాత్రమే!

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇబ్బందిలో పెట్టే ఉద్దేశ్యమేదీ బీజేపీకి లేదు. ఇప్పట్లో ఉండదు కూడా. రాష్ట్రంలో కాంగ్రెస్ బీజేపీ మిలాఖత్ అయ్యాయని ఆరోపణలు వచ్చినా రావచ్చు. కాంగ్రెస్ బీఆర్ఎస్ అవగాహనతో వ్యవహరిస్తున్నాయని బీజేపీ ఎట్లాగూ అంటూనే ఉంది. లాలూచీ ఉన్నా లేకపోయినా, రంగంలో తనూ కాంగ్రెస్ మాత్రమే మిగలడం బీజేపీ ప్రాధాన్యం. ముగ్గురి నడుమ తాను లాభపడాలని కాంగ్రెస్ ఆలోచన. అధికారపక్షంతోనే కాక, సాటి ప్రతిపక్షంతో కూడా ఎట్లా పోరాడాలని బీఆర్ఎస్ సంకటం!



▪ కె. శ్రీనివాస్

సందర్భం

కిషన్ రెడ్డి, ఉత్తమ్ చేస్తున్న విమర్శల్లో ఆసక్తికరమైన అంశమొకటి ఉన్నది. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ ఓటర్లు బీఆర్ఎస్‌కు ఎందుకు ఓటు వేస్తారు? వేయాలి? అసెంబ్లీ ఎన్నికలలో పోలఅయిన ఓట్ల ప్రకారం, బీఆర్ఎస్‌కు 3, 4 స్థానాలు రావాలి. అంతకంటే ఎక్కువ సాధించడానికి ఆ పార్టీ ప్రయత్నించవచ్చును కానీ, అసలైన పరీక్ష ఆ మూడు నాలిగింటినైనా దక్కించుకోవడం! బీఆర్ఎస్ రాష్ట్రంలో అధికారంలో లేదు, కేంద్రంలోనూ లేదు! రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రంలో కాపాడే బాధ్యత అయితే కాంగ్రెస్‌ది లేదా ఢిల్లీలో అధికారంలో ఉన్న బీజేపీది? మధ్యలో ఈ బీఆర్ఎస్ వల్ల ఒరిగేదేమిటి? ఏ నినాదంతో బీఆర్ఎస్ పార్లమెంటు ఎన్నికలలో పోటీపడుతుంది? జాతీయస్థాయిలో ఉన్న ప్రధాన రాజకీయాంశం రామమందిరమో, మతతత్వవ్యతిరేకతో అనుకుంటే బీఆర్ఎస్ ఏ పక్షంలో ఉంటుంది? సెక్యులరిజం విషయంలో కాంగ్రెస్‌తో పోటీపడలేదు, మతవాదంలో బీజేపీతో పోటీపడలేదు. గత నెలరోజులుగా బీఆర్ఎస్ శిబిరం నుంచి వస్తున్న ప్రకటనలు కొన్ని హిందూత్వ వాదానికి సానుకూలతను ప్రకటించడం మాత్రం ఆసక్తి కలిగిస్తోంది. బీజేపీతో ఏదో అవగాహనకోసం బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని, అందుకు బీజేపీ విముఖత చూపిందని అనధికార వార్తలు చెలామణీలో ఉన్నాయి. నిజానికి ఆ వైపు వెళ్లడంలో ఉపయోగమేమీ ఉండదని బీఆర్ఎస్ గ్రహించే ఉంటుంది. బీఆర్ఎస్ బలహీనపడడమే బీజేపీ దీర్ఘకాలిక అజెండాకు అనుగుణమైనది. ఈ జటిలమైన వాతావరణంలో బీఆర్ఎస్ తన వ్యూహాన్ని ఎట్లా రూపొందించుకుంటుందన్నది ఆసక్తి-కలిగించే అంశం.

హైదరాబాద్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో ఓటర్ల నుంచి జనాదేశాన్ని విజయవంతంగా సాధించిన బీఆర్ఎస్, లోక్‌సభ ఎన్నికలలోనూ దాన్ని పొందగలదా? ఏ ఓటర్లు బీఆర్ఎస్ చేసిన 'పట్టణాభివృద్ధి'ని, నిర్వహించిన శాంతిభద్రతలను, నిర్మించిన ఆధునికమైన సాంకేతిక పౌరవ్యవస్థలను మెచ్చి ఓట్లు వేశారో, ఆ ఓటర్లు జాతీయస్థాయిలో అవే కారణాల వల్ల, వాటికి తోడు ఉద్వేగపూరిత కారణాల వల్ల లోక్‌సభ ఎన్నికలలో బీజేపీకి వేసే అవకాశం ఉన్నది. ఒకవేళ అట్లా జరిగితే, బీఆర్ఎస్ ఉనికి సమస్య ఉధృతమవుతుంది. అడ్రస్ గల్లంతు కాకపోయినా, ప్రమాదంలో పడుతుంది. మరి ఏమి చేయాలి?

అడ్డదారులు ఏవీ లేవు. అధికార కాలం మధ్యలోనే 'రీకాల్' చేసే వెసులుబాటు లేదు. కాబట్టి, ఐదేళ్ల ప్రతిపక్షవాసానికి మానసికంగా సిద్ధపడాలి. 'కౌంట్ డౌన్'లు లెక్కించడం మానేయాలి. ఆత్రుత పడి, అత్యుత్సాహం చూపి ఉనికిని ప్రదర్శించడం కాకుండా, మొదటి గడి నుంచి మళ్లీ ప్రయాణం మొదలుపెట్టాలి.

ఎక్కడ కోల్పోయారో అక్కడే వెదుక్కోవాలి. నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తూ, ప్రజలలో అభిమానాన్ని తిరిగి పునఃస్థాపితం చేసుకోవాలి. ప్రజలు పెద్ద తప్పు చేశారనీ, తాము మాత్రం చిన్న-చిన్న తప్పులు చేశామని, యూట్యూబ్ చానెళ్ల వల్ల మాత్రమే ఓడామని వ్యాఖ్యానించడం విరమించి, ఓటమిని దాని కారణాలతో సహా అంగీకరించాలి.

బీఆర్ఎస్ గుర్తించవలసిన అతి ముఖ్యమైన విషయం, తన ఉనికి కేవలం తనకు మాత్రమే సంబంధించినది కాదు. తెలంగాణ సమాజం కోసం కూడా బీఆర్ఎస్ ఉనికి కొనసాగాలి. ఏ రాజకీయపక్షాన్నీ తుడిచిపెట్టడం ప్రజాస్వామికం కాదు. తెలంగాణ ప్రాంతీయ ఆకాంక్షల సాధనలో భాగంగా రంగం మీదికి వచ్చిన పార్టీ నాటి టీఆర్ఎస్. తన నేరాలను వైఫల్యాలను సమీక్షించుకుంటే ఆ పార్టీకి కొత్త జీవితం సమకూరుతుంది. తన పేరు నుంచి కత్తిరించుకున్న

> **లాలూచీ ఉన్నా లేకపోయినా, రంగంలో తనూ కాంగ్రెస్ మాత్రమే మిగలడం బీజేపీ ప్రాధాన్యం. ముగ్గురి నడుమ తాను లాభపడాలని కాంగ్రెస్ ఆలోచన. అధికారపక్షంతోనే కాక, సాటి ప్రతిపక్షంతో కూడా ఎట్లా పోరాడాలని బీఆర్ఎస్ సంకటం!**

తెలంగాణను తిరిగి తొడుగుకొని, కేవల భ్రమాత్మక ఊహలతో కల్పించుకున్న జాతీయ ఉనికిని కడిగేసుకుని, ప్రజలు తిరస్కరించిన అహంకార పూరిత దుష్పరిపాలనను సమీక్షించుకుని బీఆర్ఎస్ నిలబడాలి. నేటి అధికారపక్షాన్ని ప్రశ్నించడానికి మాత్రమే కాదు, రేపటి ప్రత్యామ్నాయం కావడానికి కూడా ఆ పార్టీ కొనసాగాలి.

తెలంగాణ రాజకీయాలలో ప్రజాప్రతినిధుల వ్యక్తిగత నైతికత అట్టడుగుకి జారిపోవడం బీఆర్ఎస్ హయాంలోనే మొదలైంది. ఆ పతనపు ప్రభావం రేపు బీఆర్ఎస్ మీద పడవచ్చు. ముప్పె[illegible]మ్మండుగురులో కొందరు జారిపోవచ్చు, కొనుగోలు కావచ్చు. మారుమనసు పొందవచ్చు. సాధారణ ఎన్నికలలో ప్రతికూల ఫలితాలకు తోడు, ఈ నిష్క్రమణలు కూడా పార్టీని తీవ్రంగా బాధించవచ్చు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనడానికి బీఆర్ఎస్‌కు పరిపక్వత అవసరం.

ప్రధాన పక్షాలుగా రెండూ ప్రాంతీయపార్టీలుండే స్థితి తెలంగాణకు ఆరోగ్యకరం. పక్షు రాజకీయపార్టీగా మారిన ఉద్యమపార్టీ నుంచే ఒక పాయ మరో పార్టీగా మారి ఉంటే బాగుండేది. ఒకటి రెండుసార్లు అటువంటి అవకాశం వచ్చినా, సారథ్యం వహించవలసినవారు చొరవచూపలేకపోయారు. రెండు ప్రాంతీయపార్టీలు లేని పక్షంలో, ఒక జాతీయపార్టీ, ఒక ప్రాంతీయపార్టీ ఉండడం, ఆ జాతీయ పార్టీ కూడా తెలంగాణ సామరస్య జీవనశైలిని పెంపొందించే సెక్యులర్ పార్టీ అయి ఉండడం శ్రేయస్కరం. ఉత్తరభారతదేశపు ఉద్రిక్తతలను, ఉన్మాదాన్ని దిగుమతి చేసే రాజకీయాలు తెలంగాణ భవిష్యత్తుకు క్షేమం కావు. అందుకోసం కూడా బీఆర్ఎస్ తనను తాను కాపాడుకోవాలి.

త్రిగళ త్రిమూర్తులు

నారదుడు తన గంధర్వ గాత్రంతో ముల్లోకాలవారికి సమాచారాన్ని శ్రావ్యంగా వినిపిస్తున్నాడు.

ఒకనాడు— నూతనంగా అక్కడకు విచ్చేసిన త్రిమూర్తులు కనిపించారు. ఒకరు సినీ సంగీతాన్ని తన అమృత స్వరంతో శ్రోతలకు ఆశ్వాసన కలిగిస్తున్నాడు. సాక్షాత్తు ఆ శ్రీకృష్ణుడు పలికిన భగవద్గీతను అజరామరం చేస్తున్నాడు. ఒకడు విరించిలా శ్రీరామ, శ్రీకృష్ణుల గాథను జలద గంభీర గళంతో వినిపిస్తున్నాడు. మరొకడు గంధర్వ, తుంబురులను మించిన స్వరజ్ఞానంతో, కర్ణాటక సంగీతాన్ని కర్ణపేయంగా వినిపిస్తున్నాడు. వారిని చూసి అవాక్కయ్యాడు నారదుడు.

'నాకు మా త్రిమూర్తులు బాగా తెలుసు. తరవాతి కాలంలో కవిత్రయం అయిన నన్నయ, తిక్కన, ఎర్రన, సంగీత త్రిమూర్తులైన ముత్తుస్వామి, త్యాగయ్య, శ్యామశాస్త్రి తెలుసు. ఈ ముప్పురు ఎవరో' అనుకుంటున్నాడు. అప్పటికే త్రిమూర్తులు, కవిత్రయం, సంగీత త్రిమూర్తులు, గంధర్వులు, వ్యాసవాల్మీకులు తదితరులు... సంభాషించుకోవటాన్ని నారదుడు ఓ పక్కగా నిలబడి వింటున్నాడు.

"ఓ వాణీ! నీ వీణానాదం కంటె మధురమైన గళం ఈ ఘంటసాల మనకు వినిపిస్తున్నాడు. గంధర్వా! నీ పేరును ఆయనకు చేర్చి, అపర గంధర్వగానం అంటున్నారు. ఆయన పాడే విలాప గీతాలు వింటుంటే నా గుండె ద్రవిస్తోంది. సంగీత సాధన చేసిన కంఠస్వరం అది. అందుకే చలనచిత్ర గీతాలకు సంగీతస్థాయిని తీసుకువచ్చాడు" అంటూ, ఆ పక్కనే నిలబడిన శ్రీ వెంకటేశ్వరుని చూస్తూ, 'శేషశైలావాసా! శ్రీ వెంకటేశా!' అంటూ నీ మీద ఎన్ని పాటలు పాడాడో.. అని విరించి పలుకుతుంటే... సరస్వతీదేవి పరవశంతో, "మహానుభావా, భూలోకంలో రాళ్లను కరిగించిన నీ గాత్రానికి నా వీణానాదం అందించాలనుంది" అంటూ లాలనగా ఘంటసాలను ముద్దాడుతుంటే:

బొమ్మను చేసి ప్రాణం పోసి, రానిక నీ కోసం చెలీ, కనుపాప కరవైన... అంటూ ఆ గొంతు పలికిన విషాదానికి అందరి చక్షువులు చెమర్చాయి.

'మనలను ఆనందింపచేయడానికా అన్నట్టుగా, అల్పాయుష్కుడై మన దగ్గరకు వచ్చేశాడు' అని విధాత పలికాడు.

ఆ సుందర దృశ్యం చూస్తున్న సినీ సంగీత దర్శకులంతా ముక్త కంఠంతో, "ఈ మహానుభావుడి కారణంగానే మా సంగీతానికి ప్రాణప్రతిష్ఠ జరిగింది" అన్నారు. గేయ రచయితలు.. "మా అక్షరాలకు ప్రాణప్రతిష్ఠ చేసి, మాకు శాశ్వతత్వం తీసుకువచ్చాడు.." అంటుంటే, మురిపెంగా ముడుచుకుపోయిన ఘంటసాలను తన దక్షిణాంకం మీద కూర్చోపెట్టుకున్నాడు విరించి.

* * *

ఆ పక్కన ఉన్న ఉషశ్రీ మీదకు దృష్టి సారించాడు విధాత...

'వాల్మీకీ! నీ రామకథను వాడి గళం పలుకుతుంటే.. చెరకు పానకంలా ఎంత తియ్యగా ఉంటుందో. ఆ కంఠంతోనే నీ రామాయణాన్ని లక్షల మంది ప్రజల ఇళ్లలోకి తీసుకువెళ్లాడు. ఆ కంఠంలో నిజాయితీ తిష్ఠ వేసుకుంది. ఆ పలుకులో సూటిదనం గూడు కట్టుకుంది. వాడిని 'ఆంధ్ర వాల్మీకి', 'రేడియో వ్యాసుడు' అని ప్రజలు ప్రస్తుతించారు. వీడికి ఎవరు ఏ బిరుదు ఇచ్చినా తిరస్కరించాడు. మీకు లేని బిరుదులు వాడికి వద్దన్నాడు ఈ ఉషశ్రీ. మీరంటే వాడికి ఎంత ప్రాణమో. నీ రాముడికి, నీ సీతకి, నీ హనుమకి... ఒకరనేమిటి నీ కలం నుండి జాలువారిన ప్రతి పాత్రను సజీవం చేశాడు.. అని చతుర్ముఖుడు అంటుంటే.. వ్యాసుడు.. "లక్ష శ్లోకాల భారతం రాసిన నాకు వాడిని పొగడటానికి పదాలు రావట్లేదు' అన్నాడు. సమయపాలన వాడి ఆత్మ. ఆకాశవాణి నుండి వాయురూపంలో వెలువడుతున్న వాడి వాణి మనలను చేరుతున్న సమయంలో నేను కూడా ఆ వాణిని ఆస్వాదించాను' అంటూ తన పలుకులుతో ఉషశ్రీని ముద్దులాడాడు.

అంతలోనే చతుర్ముఖుడు...

'భారత భాగవతాలను పాతికేళ్ల నిండకుండానే కరతలామలకం చేసుకుని, తండ్రి సహకారంతో ఆంధ్రీకరించాడు ఈ బుడతడు. నీ కృష్ణుడు, నీ భీష్ముడు, నీ ధర్మరాజు, నీ ద్రౌపది, నీ కుంతి, నీ కర్ణుడు, నీ ద్రోణుడు... ప్రతి పాత్ర ఔచిత్యాన్ని సామాన్యులకు చేరవేశాడు.

ఇంకా —

"మహర్షులారా! మీ ఇద్దరినీ తన చెరో భుజం మీద కూర్చోపెట్టుకుని ఒంటరిగా మోసాడు. ఆ బాధ్యతను ఒక తపస్సులా భావించి, ఆకాశవాణిని నైమిశ తపోవనంగా మార్చాడు. మీ కావ్యాలను ఆకాశవాణి ద్వారా సజీవంగా ఉంచాడు" అన్నాడు.

అంతా గమనిస్తున్న శ్రీరామచంద్రుడు.. 'జానకీ! ప్రతి సంవత్సరం భద్రాచలంలో జరిగే నా కల్యాణాన్ని లక్షలమందికి ప్రత్యక్షంగా చూస్తున్న అనుభూతిని కలిగించాడు. నా పెళ్లికి పౌరోహిత్యం వహించి, నా చేత నీకు మూడుముళ్లు వేయించాడు. నా చేతిలోని ముత్యాల తలంబ్రాలను నీలి రంగులోకి మార్చాడు. నిన్ను సిగ్గుపడమన్నాడు. ఆ మాటలను తలచుకుంటున్నప్పుడల్లా, నువ్వు సిగ్గులమొగ్గ అయిపోతుంటావు. నిన్ను అలా చూస్తూ నేను పరవశంతో మురిసిపోతుంటాను..." అంటుంటే ఉషశ్రీ పసిబాలుడైపోయాడు. ఆ పసిబాలుడిని తన మరో అంకం మీద కూర్చోపెట్టుకున్నాడు విరించి.

* * *

బాలమురళిని చూస్తూ...

సంగీత త్రిమూర్తులు భక్తిపారవశ్యంతో ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. అప్పుడు ఆ బ్రహ్మయ్య, 'త్యాగయ్యా! ఈ బాలుడు... నువ్వు రాసిన కీర్తనలకు శాశ్వతత్వం తీసుకువచ్చాడు. నీ జన్మ ధన్యమైంది. బాలగంధర్వుడు వీడు. ఆరేళ్ల నిండకుండానే నీ ఆరాధనోత్సవాలలో అద్భుతంగా పాడి అందరిచేత శభాష్ అనిపించుకున్నాడు. వాడు కారణజన్ముడు.



నారదుడు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. ఏవో సమాచారాలు సేకరించటంలో తలమునకలైపోయి ఉండటం వల్ల వెంటనే వీరి గురించి గమనించలేకపోయాను. ఇప్పుడు గుర్తుకు వస్తోంది... ఆ ఘంటసాల అందరికంటె ముందుగా మన దగ్గరకు వచ్చేశాడు, ఆ తరువాత మనలను చేరినవాడు ఉషశ్రీ. ఇక చివరగా వచ్చినవాడు ఆ బాలమురళి. ఇక రోజూ మనకు ఘంటసాల సుప్రభాతం, ఉషశ్రీ ప్రవచనాలు, బాలమురళి కీర్తనలతో విందుభోజనమే.

ఏనాడూ పాఠశాలకు వెళ్లలేదు. అయితేనేం, కొత్త రాగాలు కనిపెట్టాడు. తిల్లానాలు రచించాడు. మీరంతా ఈ భూమి మీద యశఃకాయులమయ్యారంటే అందుకు వాడి గళమే కారణం. వాడు నిత్య బాలుడు. నీ రాముడిని పాంచజన్యం పూరించినట్లుగా పాడుతుంటే, శిశువులు, పశువులు కూడా పరవశించిపోయాయి. నీ రాముడిని వందల కీర్తనలలో కీర్తించాడు. అటువంటి వీడిని కీర్తించడానికి పదాలు వెతుక్కోవలసి వస్తోంది. కర్ణాటక సంగీతమంటే తమిళులదే అన్నట్లుగా ఉండేవారి దగ్గరకు వెళ్లి, నెగ్గుకొచ్చాడు. తన బాణీలో పాడుతుంటే, ప్రపంచమంతా రాగాలసాగరంలో తేలియాడుతూ, తాళాల పల్లకిలో ఊరేగుతూ, పల్లవుల శాఖల మీద ఊగిసలాడారు. ఉత్తరాదివారిని జుగల్‌బందీలో ఓడించాడు. అదీ వాడి ఘనత. ఏమి గాత్రం, ఏమి స్థాయి. ఇటువంటి వాడు ఒక్కడే పుడతాడు.

చలన చిత్రాలలో నారద పాత్రను పోషించటమే కాదు, పాటలు కూడా పాడాడు.. అంటుంటే సరస్వతీదేవి బాలమురళిని తన ఒడిలోకి తీసుకుని గోరుముద్దలు తినిపించింది.

* * *

నారదుడు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. ఏవో సమాచారాలు సేకరించటంలో తలమునకలైపోయి ఉండటం వల్ల వెంటనే వీరి గురించి గమనించలేకపోయాను. ఇప్పుడు గుర్తుకు వస్తోంది... ఆ ఘంటసాల అందరికంటె ముందుగా మన దగ్గరకు వచ్చేశాడు, ఆ తరువాత మనలను చేరినవాడు ఉషశ్రీ. ఇక చివరగా వచ్చినవాడు ఆ బాలమురళి. ఇక రోజూ మనకు ఘంటసాల సుప్రభాతం, ఉషశ్రీ ప్రవచనాలు, బాలమురళి కీర్తనలతో విందుభోజనమే.

వీరు ముప్పురి గురించి నా వ్యాఖ్యానం ఒకటి చెప్పాలి కదా మరి...

ఘంటసాల గానం ఘంటసాల గానమే
ఉషశ్రీ గళం ఉషశ్రీ గళమే
బాలమురళి గాత్రం బాలమురళి గాత్రమే.

వీరికి సాటివచ్చు వారలు గతమునందు కానరాకుండిరి, వర్తమానంబున కానరాలేదు, భవిష్యత్తునందు కానరాబోరు. వారి వారి గళంబులతో వారు చిరంజీవులు అగుగాక... అంటూ నారదుడు ఆ వాణిత్రయాన్ని ఆశీర్వదించాడు.

▪ డా. పురాణపండ వైజయంతి
(రేపటి నుంచి రాజమహేంద్రవరంలో అంతర్జాతీయ తెలుగు మహాసభలు)

ఉద్యమ స్త్రీలను మరిచారు

డిసెంబర్ 29న ఆంధ్రజ్యోతిలో 'పౌరహక్కుల సంఘం ప్రకటనలో అర్ధసత్యాలు' శీర్షికన ప్రచురితమైన మేఘనాథ రెడ్డి గారి వ్యాసంలో చివరి వాక్యం చాలా అభ్యంతరకరం. ఉద్యమాలలో ఉన్న స్త్రీలను తేలికగా మరచిపోయే ధోరణికి నిదర్శనం. గుంటూరులో జరిగిన ఆ సభకు హైదరాబాద్ నవోదయ సాంస్కృతిక సంఘం (తరిమెల నాగిరెడ్డి గ్రూపు) నుంచి పదిమంది వరకు యువతులు వచ్చారు. వారంతా మా ఇంట్లోనే బస చేశారు. నాటక ప్రదర్శన ఇచ్చారు. సభలలో మేమంతా చురుగ్గానే పాల్గొన్నాం. వారిలో నాతో సహా కొందరు సజీవంగానే ఉన్నారు. పురుషులూ చాలామంది సజీవంగానే ఉన్నారు. ఇక, డిసెంబర్ 23న పౌరహక్కుల సంఘం ఏర్పడలేదన్నది నిజం.

— ఓల్గా

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా

ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

వేతల మైదానాల్లో ఆటలెలా ఆడతారు?



బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ బాధితులు ఎటువైపు చూపుడు వేలు ఎక్కుపెట్టారో కేంద్రం దృష్టి సారించి వుంటే, తన మనిషి సంజయ్ సింగ్‌ను ఎన్నికల్లో నిలబెట్టే సాహసం బ్రిజ్ భూషణ్ చేయగలిగేవాడే కాదు. ఖేలో ఇండియా నినాదాన్ని యువతను ఆకట్టుకునే కనికట్టుగా మోదీ ప్రభుత్వం కొనసాగిస్తున్నంత కాలం ఆటల రంగంలో కనీస అభివృద్ధిని ఆశించలేం.

ఏడున్నర దశాబ్దాల స్వతంత్ర భారతదేశంలో అన్ని రంగాల్లో లానే క్రీడా రంగంలోనూ కలలను పండించుకోవడానికి నవతరం ఆరాటపడుతూనే ఉన్నది. కేంద్ర ప్రభుత్వాలు యువతరం ఆకాంక్షలకు న్యాయమైన చోటు ఇవ్వడంలో ప్రతి ఏటా నిరాశనే వడ్డిస్తున్నాయి. నినాదాల్లో యువతే వెన్నముక అంటుంటారు కానీ వారికి దారి చూపడంలో మాత్రం దయ చూపడం లేదు. ఉపాధి రంగంతో పాటు కీలకమైన క్రీడా రంగంపైనా శాస్త్రీయ దృక్పథం కొరవడటం వల్ల దేశ మైదానాల్లో సమస్యల వనాలు వర్ధిల్లుతున్నాయి.

ఆరోగ్యమే కాదు జాతికి ఉత్సాహాన్నీ, మేధస్సుకు శక్తికి నూతన సామర్థ్యాన్ని కల్పించి, కొత్త ఆవిష్కరణలకు ఊతమిచ్చే కాంతి పుంజం క్రీడా రంగం కదా. ఇంతటి ప్రాధాన్య రంగాన్ని దేశ పాలకులు ఎటువైపు అడుగులు వేయించారో బుద్ధి జీవులందరికీ తెలిసిందే. ఇటీవల జాతీయ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికల రగడ ఆటల్లోని అనేక అంశాలను మళ్ళీ చర్చకు పెట్టింది. కొద్ది నెలల కిందట జంతర్ మంతర్ వేదికగా జరిగిన మల్లయోధుల పోరాటాన్ని కేంద్ర సర్కార్ మనసు పెట్టి అర్థం చేసుకొని ఉండి ఉంటే, మళ్ళీ కుస్తీ వీరులు కన్నీరు పెట్టే పరిస్థితి ఏర్పడేది కాదు. రాజకీయాల్లో క్రీడా స్ఫూర్తి ఉండాలే కానీ క్రీడల్లో రాజకీయాలు ఉంటే ఎన్ని కలలు ఉరితీయబడతాయో ప్రగతి ప్రేమికులు అవగాహన చేసుకోవాలి. పాత అధ్యక్షుడు బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ బాధితులు ఎటువైపు చూపుడు వేలు ఎక్కుపెట్టారో కేంద్రం కన్నులు సారించి వుంటే సంజయ్ సింగ్‌ను ఎన్నికల్లో నిలబెట్టే సాహసం బ్రిజ్ భూషణ్ చేయగలిగేవాడే కాదు. ఖేలో ఇండియా నినాదాన్ని యువతను ఆకట్టుకునే కనికట్టు ఆటగా మాత్రమే మోదీ ప్రభుత్వం కొనసాగిస్తున్నంత కాలం ఆటల రంగంలో అద్భుతాలను కాదు కదా కనీస అభివృద్ధినీ ఆశించలేం.

మైదానాల్లో యువతరం కలలు పండే దిశగా సర్కార్ కార్యాచరణ ఉండాలి. కానీ పార్టీకి వోట్ల స్కోర్‌ను రాబట్టేందుకు క్రీడలనూ ఎన్నికల ఆటలో పావుగా చూసే పాలకులు ఉండటం వల్లనే పరిస్థితి దిగజారుతున్నది. ఒలింపిక్స్‌లో పతకాలను కొల్లగొడుతున్న దేశాల పురోగతిలో క్రీడలు ఎంతటి కీలకమైన పాత్ర పోషిస్తున్నాయో జాతికి నాయకత్వం వహిస్తున్నవారు గమనంలోకి తీసుకోకపోవడం విడ్డూరం. క్రీడలు ప్రజల ఆరోగ్యాన్నే కాదు ఆలోచన తీరును ఆరోగ్యకరంగా మార్చివేసే ఔషధాలు. పనితో పాటే పాట పుట్టినట్లే, మానవ పరిణామక్రమంలో సామాజిక అవసరంగా క్రీడలు పుట్టాయి. వాటి చారిత్రక నేపథ్యం, అవసరాన్ని విశాల దృష్టి కోణంతో చూసే ప్రభుత్వాలు ఉంటే సమాజాభివృద్ధి దిశగా ఎన్నో కీలక మార్పులు జరుగుతాయి.

ఒలంపిక్ అసోసియేషన్, క్రీడా ఫెడరేషన్లలో సమర్థత, పారదర్శకత, ప్రభుత్వాల బడ్జెట్ కేటాయింపులల్లో సానుకూలత, కార్యాచరణలో స్పష్టత ఉంటే ఇండియా కూడా ఒలంపిక్స్‌లో పతకాల పంటను అందుకోవడం కష్టసాధ్యమేం కాదు. మైదానాల్లో ముండ్లను ఏరివేయగలిగితే మన జాతి ఆణిముత్యాల పరుగును ఆపే శక్తి ఏ దేశానికి లేనేలేదు. ఆనాటి పారిశ్రామిక దిగ్గజం దొరాబ్జీ టాటా, డాక్టర్ ఎ.జి.నో హెన్రీతో కలిసి 1927లోనే ఇండియన్ ఒలంపిక్ అసోసియేషన్‌ను ఎన్నో కలలతో ఏర్పాటు చేశాడు. ఏ లాభాపేక్ష లేకుండా, జాతి గెలుపే ఆశయంగా, గ్రామ పునాదుల్లోంచి ప్రపంచ చాంపియన్‌లు పుట్టాలనే ముందు చూపుతో భారత ఒలంపిక్ అసోసియేషన్‌ను వారిరువురు నెలకొల్పారు. తర్వాత ఎన్నో మార్పులు, నిబంధనలు ఏర్పాటు చేసుకున్నా, అంతర్జాతీయ ఒలంపిక్ అసోసియేషన్ స్ఫూర్తిని, మార్గాన్ని గీటురాయిగా మలుచుకోవడంలో మాత్రం మన దేశ క్రీడా అసోసియేషన్‌లు వెనకబడే ఉన్నాయి. గడిచిన ఏడున్నర దశాబ్దాలుగా దేశాన్ని ఏలినవారి వైఫల్యం, మైదానాల్లో జాతీయ జెండాను కాకుండా పార్టీ జెండాలను రెపరెపలాడించుకోవాలనే సంకుచితత్వం క్రీడా రంగంలో అవలక్షణాలకు పునాదులేసింది. అంతర్జాతీయ ఒలంపిక్ అసోసియేషన్‌లో ప్రతి నాలుగేండ్లకు ఒకసారి ఎన్నికల్లో క్రీడా ఫెడరేషన్‌ల అధ్యక్షులను, ఫెడరేషన్‌లు అన్నీ కలిసి అంతర్జాతీయ ఒలంపిక్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకుంటాయి. అలా ఎన్నికకాబడిన ఎవరైనా రెండుసార్లు మాత్రమే ఎన్నికల్లో పోటీకి, ఎనిమిదేండ్లే పదవుల్లో కొనసాగేలా పారదర్శక విధానాలు పాటిస్తున్నారు. కానీ మన జాతీయ క్రీడా ఫెడరేషన్‌లు మాత్రం అలాంటి నిబంధనలను అనుసరించడానికి ఇష్టపడక, కొన్ని ఫెడరేషన్లలో ఏండ్లకేండ్లు పాత మొహాలే తిష్టవేసి కూర్చున్నాయి. క్రీడా ఫెడరేషన్‌ల ఎన్నిక, జాతీయ ఒలంపిక్ అసోసియేషన్ ఎన్నికల ప్రచారం, పోలింగ్ కూడా ఈనాటి సాధారణ ఎలక్షన్లనే తలపిస్తాయి. ధన, మద్య ప్రవాహం, బెదిరింపులు, బుజ్జగింపులు, పాలక పార్టీల అండదండలతో ఎన్నికల క్రీడలో క్రీడా సంఘాలు నెగ్గుతూ, అంతర్జాతీయ ఆటల్లో మాత్రం దేశాన్ని ఓడిస్తున్నాయి. సరైన చర్యలు తీసుకుని క్రీడా రంగానికి వెలుగుల బాటను వెయ్యాల్సిన కేంద్ర ప్రభుత్వాలు మాత్రం గ్యాలరీలో ప్రేక్షకుల్లా మిగిలిపోయాయి.

వాస్తవానికి మనది వస్తాదుల దేశం. 1950 నాటికే మన హైదరాబాద్‌లోనే 150కి పైగా దంగల్స్ (తాలీమ్ ఖానా) ఉండేవని చరిత్ర చెబుతున్నది. రెజ్లింగ్‌లోనే కాదు ప్రతి క్రీడలో అద్భుత విజయాలను దేశానికి అందించిన క్రీడాకారుల నిలయం మన దేశం. ఇప్పటి నిఖత్ జరీన్ నుంచి సైనా నెహ్వాల్, పీవీ సింధూ, గోపీచంద్, ముఖేష్, నారంగ్, సానియా మీర్జా ఇంకా ఎందరో క్రీడాకారులు అంతర్జాతీయ విజేతలుగా నిలిచారు. 1952 హెల్సెన్‌కిలో, 1956 మెల్‌బోర్న్‌లో జరిగిన ఒలంపిక్స్‌లోనే ఇండియన్ ఫుట్‌బాల్ జట్టు సెమీఫైనల్స్ ఆడింది. క్రీడలపై కేంద్ర సర్కార్లు మనసుపెట్టి ఉంటే మన యువత ఒలంపిక్స్‌లో వరుస పతకాలను దేశానికి అందించి ఉండేవారు. ప్రభుత్వాల జాతీయ యువజన విధానం, క్రీడా విధానంలో పాత లక్ష్యాలే తప్ప చిత్తశుద్ధితో కూడిన కార్యాచరణకు చోటు లేకుండా పోయింది. ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటున్న 'ఖేలో ఇండియా'కు కూడా 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలకు గానూ కేవలం వెయ్యి కోట్లు కేటాయించి అందులో 600 కోట్లు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఖర్చు చేయడం ఏం క్రీడా నమూనానో నరేంద్ర మోదీకే తెలియాలి. గతంలో కాంగ్రెస్ పాలనలో క్రీడల్లోనూ కుంభకోణాలే, ప్రస్తుత కాషాయ పార్టీ ప్రభుత్వంలో ప్రచారం తప్ప ఆటకు ఆదరణ లేదు. అందుకే క్రీడా రంగం కుప్పకూలుతున్నది. అనేక అవలక్షణాల మైదానంలో 'ఇండియా ఖేలో' అంటే ఎలా సాధ్యం? ఇవన్నీ చూడలేకే మల్లయోధులు బజరంగ్ పునియా, వీరేందర్ సింగ్‌లు పద్మశ్రీలను వెనక్కి ఇచ్చేస్తున్నారు. వినేష్ పోగట్ అర్జున, ఖేల్‌రత్నలను కేంద్ర సర్కారుకే తిరిగి ఇచ్చేసింది. అవస్థల ఆటలో కొనసాగలేక సాక్షి మాలిక్ ఏకంగా రిటైర్మెంట్ ప్రకటించేసింది. మైదానాలు ఖాళీ అయితే ఆసుపత్రులు కిక్కిరిసిపోతాయనే విషాదాన్ని ప్రభుత్వాలు అర్థం చేసుకోవాలి. ఆటలు సమాధి అయితే స్మశానాలు విస్తరిస్తాయనే నిజాన్ని కూడా పరిగణించాలి. కుస్తీ వీరుల కన్నీరు కూడా సర్కారులో కదలిక తేలేకపోతే ఎన్నో ఇంచుల చాతిలో ఇసుమంత తడి కూడా లేనట్లే కదా? పౌర సమాజం కూడా క్రీడా జ్యోతి వెలుగు కోసం నోరు విప్పాలి. మన భావి తరాలకు ఆరోగ్యకర సమాజం అందివ్వాలా, లేక అస్తవ్యస్త అవస్థల బతుకులను వాగ్దానం చెయ్యాలా అనేది సమాజం సామూహికంగా నిర్ణయించుకోవాలి.

• డాక్టర్ ఆంజనేయ గౌడ్





అరుణశోభితం

భవానీ దీక్షల విరమణ మహోత్సవాలు ప్రారంభం

క్యూలైన్లలో బారులు తీరిన భవానీ భక్తులు, ఇన్‌సెట్‌లో హోమగుండంలో అగ్ని ప్రతిష్ఠాపన చేస్తున్న దుర్గగుడి అధికారులు

వన్‌టౌన్, జనవరి 3 : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం భవానీ దీక్షల విరమణ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 6.30 గంటలకు అమ్మవారి సన్నిధి నుంచి అగ్నిని ఊరేగింపుగా తీసుకొచ్చి హోమగుండాల్లో వేసి ప్రతిష్ఠాపన చేశారు. ఇదే సమయంలో ఆలయంలో శతచండీ యాగానికి శ్రీకారం చుట్టారు. ఈ అగ్ని ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఈవో రామరావు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రాంబాబు, స్థానాచార్యుడు శివప్రసాదశర్మ, ముఖ్య అర్చకులు తదితరులు పాల్గొన్నారు. వేకువజాము నుంచే భవానీ దీక్షాధారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తొలుత గిరిప్రదక్షిణ చేసిన భక్తులు ఇరుముడులు ధరించి కొండపైకి చేరుకుని దుర్గమ్మను దర్శించుకున్నారు. ఇరుముడులు, కాను కలను సమర్పించి మాలలను తొలగించుకుని దీక్షలను విరమించారు. అనంతరం ఉచిత అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. లడ్డూ విక్రయ కౌంటర్ల వద్ద బారులు తీరారు. తొలిరోజే భక్తులు భారీగా రావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యాయి



కలెక్టరేట్ వద్ద అంగన్వాడీ కార్యకర్తను జుట్టు పట్టి లాక్కెళ్తున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో) మంత్రి బొత్స ఇంటి వద్ద ఆందోళన చేపట్టిన డీవైఎఫ్ఐ నాయకులను ఈడ్చి పడేస్తూ..

సెంట్రల్ స్కెచ్..!

తెరవెనుక రాజకీయం వల్లే మల్లాదికి దక్కని సీటు



పశ్చిమ సిటింగ్ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు వైసీపీ అధిష్ఠానమే సీటు ఖరారు చేసిందా..? లేక తెరవెనుక పరిణామాలే ఆయనకు ఆ సీటు దక్కేలా చేశాయా..? ఇన్నాళ్లూ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పక్కనే ఉండి, వెనుక గోతులు తీశారా..? అనే సందేహాలు రాజకీయ వర్గాల్లో కలుగుతున్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో బుధవారం తనను కలవడానికి వచ్చిన వెలంపల్లి పట్ల మల్లాది ముభావంగానే ఉండటం.. తనకు సీటు దక్కకపోవడానికి వెలంపల్లే కారణమని విష్ణు తన అంతర్గత భేటీల్లో పేర్కొనడం.. పైన తెలిపిన ప్రశ్నలకు ఊతమిస్తున్నాయి.

- ఏడాదిగా సెంట్రల్ నాయకులతో వెలంపల్లి పలుమార్లు భేటీ
- పశ్చిమలో సీటు దక్కదని ముందే సంకేతాలు
- దృష్టి మరల్చి ముందుగానే సెంట్రల్ వైపు..
- ఇప్పటికి తెలుసుకున్న సిటింగ్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- వైసీపీని వీడి కాంగ్రెస్ గూటికి చేరాలని నిర్ణయం



ధర్నాచౌక్‌లో మల్లాది విష్ణు అనుచరుల ఆందోళన

(విజయవాడ- ఆంధ్రజ్యోతి) : బెజవాడ బ్రదర్స్‌గా పేరొందిన వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు నడుమ సెంట్రల్ సీటు అగ్గి రాజేసింది. 2009 నుంచి విజయవాడ పశ్చిమలో పోటీచేస్తూ వచ్చిన వెలంపల్లి ఏడాదిగా సెంట్రల్ సీటుపై దృష్టిపెట్టారు. అక్కడి ముఖ్యనేతలతో తరచూ భేటీలు నిర్వహించేవారు. వెలంపల్లి సెంట్రల్ నుంచి పోటీకి సిద్ధమవుతున్నారంటూ 'ఆంధ్రజ్యోతి' కూడా పలుమార్లు తెలిపింది. ఈ పరిణామాలను సెంట్రల్ ఎమ్మెల్యేగా ఉన్న మల్లాది విష్ణు లైట్ తీసుకున్నారు. ఇప్పుడు అదే ఆయన సీటుకు ముప్పు తెచ్చింది. వాస్తవానికి ఉమ్మడి కృష్ణా జిల్లాలో మిగిలిన వైసీపీ ఎమ్మెల్యేలతో పోలిస్తే మల్లాది విష్ణుపై అవినీతి ఆరోపణలు పెద్దగా లేవు. కానీ, మల్లాదికి వ్యతిరేకంగా అధిష్ఠానం వద్ద పావులు కదపడంలో, సానుకూల వాతావరణం లేదని పీకే టీం ద్వారా సంకేతాలు పంపడంలో వెలంపల్లి విజయం సాధించారు. చాపకింద నీరులా సాగిన ఈ వ్యవహారం చివరికి మల్లాది సీటుకు ఎసరు పెట్టింది.

ఏడాది నుంచే కన్ను

పశ్చిమ నుంచి 2009లో ప్రజారాజ్యం పార్టీ ఎమ్మెల్యేగా గెలుపొందిన వెలంపల్లి 2014లో బీజేపీ తరఫున పోటీచేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత 2016, డిసెంబరులో వైసీపీ తీర్థం పుచ్చుకున్న ఆయన 2019లో ఆ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. పశ్చిమలో వైశ్య సామాజికవర్గం ఓట్లు నిర్ణయాత్మకంగా ఉంటాయి. అదే సామాజికవర్గానికి చెందిన వెలంపల్లికి పశ్చిమ నుంచి పోటీ చేయడమే సరైనది. కానీ మంత్రిగా ఉన్న సమయంలో తీవ్రమైన అవినీతి ఆరోపణలు రావడం, స్థానికంగానూ ఆయనపై వ్యతిరేకత ఉండటంతో పశ్చిమలో గెలుపు అసాధ్యమన్న నిర్ణయానికి వెలంపల్లి వచ్చారు. మరోవైపు అధిష్ఠానం సర్వేలోనూ అదే తేలడంతో వెలంపల్లి ప్రత్యామ్నాయ

- మిగతా 6లో

రణరంగం

ఉద్యమాలతో వేడెక్కిన విజయవాడ

- కలెక్టరేట్ ముట్టడికి యత్నించిన అంగన్వాడీలు
- ఈడ్చేసి వాహనాల్లో ఎక్కించిన పోలీసులు
- డీఎస్సీ కోసం డీవైఎఫ్ఐ ఆందోళన
- మంత్రి బొత్స ఇల్లు ముట్టడికి యత్నం
- పోలీసులు, నిరసనకారులకు మధ్య తోపులాట



అంగన్వాడీ కార్యకర్తపై పోలీసుల ప్రతాపం

విజయవాడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ వేడెక్కింది. ఎంజీ రోడ్డుతో పాటు గోపాలరెడ్డి రోడ్డు రణరంగాన్ని తలపించాయి. అటు కలెక్టరేట్, ఇటు మంత్రి బొత్స సత్యనారాయణ క్యాంపు కార్యాలయం ముట్టడికి బుధవారం అంగన్వాడీ కార్యకర్తలు, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో యువకులు ప్రయత్నించడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పోలీసులు దొరికిన వారిని దొరికినట్టుగా ఈడ్చి ఎత్తి వాహనాల్లో పడేశారు. అంగన్వాడీ కార్యకర్తలను జుట్టు పట్టుకుని లాగేశారు. వేతనాలు పెంచాలని కొన్ని రోజులుగా అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బుధవారం జిల్లా కలెక్టరేట్లను ముట్టడించాలని నిర్ణయించారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుతో ధర్నాచౌక్‌లో ధర్నా చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు కలెక్టరేట్‌కు బయల్దేరారు. ముందే కలెక్టరేట్ సమీపాన ప్రాంతాలకు చేరుకున్నారు. కొంతమంది బాలోత్సవ్ భవనంలో, మరికొంతమంది ఎంబీవీకే భవనంలో తలదాచుకున్నారు. ఇంకొంతమంది కలెక్టరేట్, మ్యూజియానికి మధ్య ఉన్న రహదారిలోకి చేరుకున్నారు. అంగన్వాడీలను అడ్డుకునేందుకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌కు ఉన్న అన్ని మార్గాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అయినా అంగన్వాడీలు చొచ్చుకొచ్చారు. వారిని మార్గంమధ్యలోనే పోలీసులు అడ్డుకున్నారు. బారికేడ్లను తోసుకుని రావడంతో పోలీసులకు, నిరసనకారులకు మధ్య తోపులాట జరిగింది. నిరసనకారులు ఎదురుతిరగడంతో పోలీసులు వారిని జుట్టు పట్టుకుని లాగేశారు. ప్రత్యేక వాహనాల్లోకి ఎక్కించి వేర్వేరు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అరెస్టు చేసే క్రమంలో పోలీసులు ఇష్టానుసారంగా వ్యవహరించారని అంగన్వాడీ కార్యకర్తలు ఆరోపించారు. అంగన్వాడీలతో పాటు కలెక్టరేట్‌కు వస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావును కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

డీఎస్సీ కోసం...

పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయడానికి డీఎస్సీకి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో యువకులు గోపాలరెడ్డి రోడ్డులో ఉన్న మంత్రి బొత్స సత్యనారాయణ ఇంటిని ముట్టడించారు. వివిధ ప్రాంతాల నుంచి యువకులు నినాదాలు చేసుకుంటూ బొత్స ఇంటి వద్దకు చేరుకున్నారు. ఇలా వచ్చిన వారిని రైతు శిక్షణ కేంద్రం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. మంత్రి ఇంటి వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. లోపలకు వెళ్లడానికి ప్రయత్నించిన యువకులను పోలీసులు అరెస్టు చేశారు. నిరసనకారులు రోడ్డుపై బైఠాయించారు. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. యువకులను పోలీసులు ఎత్తి వాహనాల్లో పడేశారు. అనంతరం వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

మరోసారి నోరుజారిన నాని!

సొంత పార్టీ దళిత నేతపై తిట్లు

దేవదత్... పూజకు పనికిరాని పువ్వు అని వ్యాఖ్య

ఆయనకు ఎస్సీ నాయకులంటే చులకన : దేవదత్



పార్టీ కార్యాలయంలో కింద కూర్చుని చిన్ని నిరసన

- 6లో..

• విజ్ఞాన యాత్ర

పుస్తక మహోత్సవంలో విద్యార్థుల సందడి

విజయవాడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : 34వ విజయవాడ పుస్తక మహోత్సవానికి విద్యార్థుల తాకిడి పెరిగింది. విద్యాసంస్థలు తమ విద్యార్థులతో కలిసి విజ్ఞానయాత్ర చేపడుతున్నాయి. ఒకటో నెంబర్ స్టాల్ నుంచి చివరి స్టాల్ వరకూ ఉన్న అన్నింటిలో పుస్తకాలను చూపిస్తున్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థులు పుస్తక మహోత్సవంలో సందడి చేస్తున్నారు. విద్యార్థులు మూఢనమ్మకాలవైపు వెళ్లకుండా జనవిజ్ఞాన వేదిక చిన్నచిన్న ప్రయోగాల ద్వారా వారిలో చైతన్యం నింపుతోంది. ఆలోచనాశక్తిని పెంచుతోంది. ప్రముఖ కవులు, రచయిత్రుల గురించి స్టాళ్ల యజమానులే సంక్షిప్తంగా పరిచయం చేస్తున్నారు.





ఆధ్యాత్మిక విధానం ఫాలూన్ దఫా

» ఇన్‌స్ట్రక్టర్ సుబ్రహ్మణ్యం

(ఆంధ్రజ్యోతి - విజయవాడ సిటీలైఫ్)

సత్యం, దయ, సహనం... ఈ మూడు మానవుడిలో కొలువై ఉండాలని ఆధ్యాత్మికవేత్తలు చెబుతారు. అన్ని మతాల గురువులు, పీఠాధిపతులు ఇదే విషయాన్ని ప్రవచనాల్లో స్పష్టం చేస్తారు. ఈ మూడింటికి ఒక్కో మతంలో ఒక్కో నామకరణం ఉంటుంది. మతంతో సంబంధం లేకుండా మరో ఆధ్యాత్మిక విధానాన్ని పరిచయం చేస్తున్నారు హైదరాబాద్‌కు చెందిన సుబ్రహ్మణ్యం. ఫాలూన్ దఫా అనే చైనా ఆధ్యాత్మిక విధానంలో ఒక మనిషి తనను తాను ఎలా సంస్కరించుకోవచ్చో వివరిస్తున్నారు. పుస్తక మహోత్సవంలో స్టాల్ నంబర్ 47లో ఫాలూన్ దఫా ప్రదర్శనను ఏర్పాటు చేశారు. "1992లో చైనాకు చెందిన లీ హోంగ్ జీ ఈ ఫాలూన్ దఫాను పరిచయం చేశారు. సత్యం, దయ, సహనం ఈ మూడు దీని ప్రధాన సూత్రాలు. ఇదొక ఆధ్యాత్మిక సాధన. నేను 2007లో న్యూజిల్యాండ్‌కు వెళ్లాను. ఒక రోజున వాకింగ్ చేస్తుండగా పార్కులో రమణీయమైన సంగీతం మధ్య కొంతమంది ఫాలూన్ దఫా ధ్యానం చేయడం కనిపించింది. అప్పుడే దానికి ఆకర్షితుడనయ్యా. నేను ఆ ధ్యాన విధానాలను నేర్చుకుని కార్పొరేట్ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాను" అని సుబ్రహ్మణ్యం చెప్పారు. లీ హోంగ్ జీ చేసిన తొమ్మిది ప్రసంగాలు జువన్ ఫాలూన్ పుస్తకాన్ని తెలుగులోకి అనువదించి, అందుబాటులోకి తీసుకొచ్చారు.



భాగవత కథామృతం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కృష్ణకుమారి తదితరులు

భక్తికి అక్షరరూపం.. పోతన భాగవతం

విజయవాడ కల్చరల్, జనవరి 3 : భక్తికి అక్షరరూపం పోతన భాగవతమని, తెలుగు వారి నిత్యజీవితంలో పోతన భాగవతం విడదీయరాని భాగంగా ఉండేదని ఆకాశవాణి పూర్వ సంచాలకురాలు ముంజులూరి కృష్ణకుమారి అన్నారు. 34వ విజయవాడ పుస్తక మహోత్సవం ఏడోరోజు బుధవారం కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై నిర్వహించిన సభలో డాక్టర్ జంధ్యాల పరదేశి బాబు రచించిన 'భాగవత కథామృతం' పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. నేటితరం భాగవతంలోని ముఖ్య ఘట్టాలను అర్థం చేసుకొనేందుకు ఈ పుస్తకం ఉపయోగపడుతుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన పోలవరం కోటేశ్వరరావు సాహితీ సమితి సంస్థ అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ, బమ్మెర పోతన రచించిన భాగవతంలోని కొన్ని కథల్ని తీసుకొని వాటి సారాన్ని పాఠకులకు రచయిత పరదేశిబాబు సమర్థవంతంగా అందించారన్నారు. డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ, వ్యాస సంపుటిని పునాదిగా చేసుకొని ప్రహ్లాద చరిత్ర, గజేంద్ర మోక్షం, మొదలైన శీర్షికలతో వ్యాసాల్ని రచించి రుక్మిణీ కళ్యాణంతో ముగించారు. నవవిధ భక్తిభావాలతో నిండిన మహాభాగవతలను నవ ఘట్టాలను సేకరించి వ్యాస రూపంలో భాగవతామృతాన్ని పంచిన సాహిత్య విశ్లేషకుడు డాక్టర్ పరదేశి అన్నారు. రచయిత్రి డాక్టర్ కావూరి సత్యవతి మాట్లాడుతూ, మట్టినీ బంగారాన్ని సమదృష్టితో చూసిన రాజర్షి అంబరీషుని కథను ఒక వ్యాసంలో రసరమ్యంగా వివరించి భక్తి సర్వాధిక్యమని రాజభోగాల కంటే అత్యుత్తమమైనదని నిరూపించారన్నారు. భాగవత విశిష్టతను, రచయిత రచనాశైలిని ప్రశంసించారు. కార్యక్రమంలో బాలాంత్రపు ప్రసూన పాల్గొన్నారు.

పిల్లలకు చదివే సమయమివ్వాలి

» రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు కావూరి సత్యవతి



పుస్తక పఠనం, తెలుగు భాషపై బాల్యం నుంచి పిల్లలకు ఆసక్తిని పెంపొందించాలి. పిల్లలను హోంవర్కులు, ప్రాజెక్టు వర్కులతో బిజీ చేయడం కాదు, వారికి పుస్తకాలను చదివే సమయాన్ని ఇవ్వాలి. తల్లిదండ్రులు ఈ విషయంలో శ్రద్ధ తీసుకోవాలి అంటున్నారు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు కావూరి సత్యవతి. ఉద్యోగంలో ఉన్నప్పుడు ఉపాధ్యాయురాలిగా, ఉద్యోగ విరమణతో సాహిత్యకారిణిగా ఉన్న సత్యవతి పుస్తక మహోత్సవంలో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

"విహారి రచించిన శ్రీపద చిత్ర రామాయణంలోని బాలకాండపై డాక్టర్ గుమ్మా సాంబశివరావు పర్యవేక్షణలో పీహెచ్‌డీ చేశాను. ప్రస్తుతం పిల్లలను హోంవర్కులు, ప్రాజెక్టు వర్కులు అని చెప్పిక్షణం తీరిక లేకుండా చేస్తున్నారు. పిల్లలతో పుస్తకాలు చదివించాలన్న ఆసక్తి తల్లిదండ్రుల్లోనూ కనిపించడం లేదు. ఎవరైనా



మాతృభాషలో చదవాలనుకుంటారు. ఆ పరిస్థితి ఇప్పుడు ఉందా? ఇంగ్లీష్‌లో నాలుగు మాటలు మాట్లాడితే అదేదో గొప్ప అనుకునే పరిస్థితి తల్లిదండ్రుల్లో కనిపిస్తోంది. మా చిన్నతనంలో గొబ్బిపాటలు పాడేవాళ్లం. అన్నమాచార్య, త్యాగరాయ కీర్తనలు విన్నాం. వాటి గురించి పెద్దయ్యాక అవగాహన చేసుకున్నాం. చిన్నతనంలో వింటే పెద్దాయ్యాక వాటి గురించి ఆలోచిస్తాం. పుస్తకాల ద్వారా జ్ఞానం, విజ్ఞానం పెరుగుతాయి. ఇప్పుడు ఈ రెండింటికి అర్థం మారిపోయింది. పిల్లలు సినిమా బాగా చూస్తే విజ్ఞానం అనుకుంటున్నారు. డ్యాన్స్‌లు వేసి, వీడియో గేమ్‌లు ఆడితే పరిజ్ఞానం అనుకునే పరిస్థితి ఉంది. ఈ సంప్రదాయం మారాలి. అందుకే బాల్యం నుంచి సాహిత్యం, సంప్రదాయాలు, ప్రకృతిపై అవగాహన కల్పించడానికి సాహితీ రూపకాలు ప్రదర్శిస్తున్నాం. నేను, నా స్నేహితులు కలిసి వివిధ విద్యాసంస్థల్లో ఈ రూపకాలు ప్రదర్శిస్తున్నాం. కాలాలు, రుతువులు, ఆయా రుతువుల్లో పూచే పూల గురించి విశదీకరణంగా చెబుతాం.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ సిటీలైఫ్)

సావిత్రీబాయి స్ఫూర్తి అజరామరం



కత్తి పద్మారావు రచనలను ఆవిష్కరిస్తున్న వక్తలు

విజయవాడ కల్చరల్, జనవరి 3 : భారత జాతీయ స్త్రీవాద ఉద్యమంపై సావిత్రీబాయి పూలే స్ఫూర్తి అజరామరమని స్త్రీవాద కార్యకర్త బీఎం లీలాకుమారి అన్నారు. సావిత్రిబాయి పూలే 193వ జయంతి సందర్భంగా లోకాయుక్త పబ్లికేషన్స్ బుధవారం కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై నిర్వహించిన సభలో కత్తి పద్మారావు రచించిన 'పితృస్వామ్య భారతంలో స్త్రీ', 'ఈ దేశం మాది', 'వ్యక్తిత్వ నిర్మాణం-6' పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్త్రీ అభ్యున్నతికి విద్య యొక్క అవసరాన్ని గుర్తించి, స్త్రీ విద్య కోసం ఎన్నో అవమానాలు, ప్రమాదాలు ఎదుర్కొని కూడా తమ ఆశయసాధన కోసం కృషి చేశారని వివరించారు. స్త్రీల అభ్యున్నతి కేవలం స్త్రీల చేతుల్లోనే లేదని, దీనికి మహిళా శక్తిని గుర్తించి ప్రోత్సహించిన పూలే, అంబేడ్కర్ లాంటి పురుషుల అవసరం కూడా వుందని ఆమె చెప్పారు. ప్రసంగ ప్రజ్ఞానిధి డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ, కత్తి పద్మారావు తన కవిత్వానికి ఊపిరి దళిత స్త్రీ అని, మధ్యలో తన కవిత్వానికి తత్వభూమిక అంబేడ్కర్ వాదం, తన కవిత్వ సిద్ధాంతం కుల నిర్మూలనని పేర్కొన్నారు. ఇంటిపేరులో కత్తి, ఒంటి పేరులో పద్మం కలిగి ఈ రెండింటికి వైరుధ్యం కలిగిన ఆయన పద్మావలాంటి మనస్సుతో ఆలోచన చేసి కత్తిలాంటి కవిత్వాన్ని సృజన చేసి అసమానతలు కులవాదాన్ని ఖండిస్తూ వస్తున్నారన్నారు. చింతపల్లి గురుప్రసాద్ మాట్లాడుతూ, ఆధునిక ప్రపంచంలో కూడా స్త్రీకి అవమానాలు తప్పకపోవడం దురదృష్టకరమన్నారు. స్త్రీలను గౌరవించడం ద్వారా మనం నాగరికులమని నిరూపించుకోవాలని సూచించారు. అదే సావిత్రబాయి పూలేకి నిజమైన నివాళి అని అభిప్రాయపడ్డారు. గడ్డం విజయారావు సభకు అధ్యక్షత వహించారు. గోళ్ల నారాయణరావు, శిఖా ఆకాష్, గార్ల రమేష్ సభలో పాల్గొన్నారు. రంగం రాజేష్ బృందం ఉద్యమ గీతాలను ఆలపించారు.



పిల్లల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కె.లక్ష్మయ్య తదితరులు

పుస్తకాలకు దగ్గర చేయాలి

విజయవాడ కల్చరల్, జనవరి 3 : పిల్లల్ని పుస్తకాలకు మరింత దగ్గర చేసే విధంగా బాలసాహిత్య రంగంలో నేషనల్ బుక్ ట్రస్ట్ చేస్తున్న కృషి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు, ప్రశంసలు పొందాయని పుస్తక మహోత్సవ సంఘం కార్యదర్శి కె.లక్ష్మయ్య అన్నారు. దేశవ్యాప్తంగా సంచార గ్రంథాలయాలు, పుస్తక మహోత్సవాలు, ప్రదర్శనలు నేషనల్ బుక్ ట్రస్ట్ ప్రారంభించిందని వివరించారు. పిల్లలతో పుస్తకాలు చదివించడం, రాయించడం, అవసరమైన పుస్తకాలు ప్రచురించడంలో సంస్థ పాత్ర చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా అధ్వర్యంలో పిల్లల పుస్తకాల ఆవిష్కరణ సభ నిర్వహించారు. 'చికా చిక్ చిక్', 'నా ఫుట్‌బాల్', 'ఛుట్కీ', 'భీం సేన్‌జోషి', 'గోవా', 'నీలు-పీలు' పిల్లల పుస్తకాలను ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు ముంజులూరి కృష్ణకుమారి, పుస్తక మహోత్సవ సంఘం కార్యదర్శి కె.లక్ష్మయ్య, ఇంద్రాణి, డాక్టర్ మురహరి రావు, ఉమాగాంధి, రావెళ్ల శ్రీనివాసరావులు ఆవిష్కరించారు. ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు ముంజులూరి కృష్ణకుమారి మాట్లాడుతూ పిల్లలకు పుస్తకాలపై ఆసక్తి కలిగించాల్సిన బాధ్యత పెద్దలదేనన్నారు. ఆ దిశగా నేషనల్ బుక్ ట్రస్ట్ చేస్తున్న కృషిని అభినందించారు. పాఠశాల విద్యార్థినులు చైతన్య, రాజ్యలక్ష్మి, జ్ఞానప్రసూన పుస్తకాలను సభకు పరిచయం చేశారు. నేషనల్ బుక్ ట్రస్ట్ బాధ్యులు పత్తిపాక మోహన్ సభను నిర్వహించారు. పిల్లలకు పుస్తకాలతో, సాహిత్యంతో అనుబంధం పెంచితే అది విద్యారంగ అభివృద్ధికి, సామాజిక అభివృద్ధికి దోహదం చేస్తుందని విద్యావేత్త ఇంద్రాణి అన్నారు. పిల్లలకు పుస్తకాలను చదవడం అలవాటు చేస్తే వారు అనేక విజయాలను సాధించగలరని రావెళ్ల శ్రీనివాసరావు అన్నారు. ఉమాగాంధీ మాట్లాడుతూ మంచి కథల ద్వారా పిల్లల్లోని అద్భుతమైన భావ వ్యక్తీకరణాశక్తిని వెలికి తీయవచ్చన్నారు.



విశాలాంధ్ర ప్రచురణలను ఆవిష్కరిస్తున్న ఎంవీఎస్ శర్మ తదితరులు

నేడు సా.4 గంటలకు అనగనగా ఒక కథ

భగవద్గీత-ఒక అవలోకన పుస్తకావిష్కరణ

విజయవాడ కల్చరల్, జనవరి 3 : భగవద్గీత భారతీయ సంస్కృతిలోని వివిధ మత భావనలను క్రోడీకరించిన గ్రంథమని శాసనమండలి మాజీ సభ్యుడు, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎంవీఎస్ శర్మ అన్నారు. బుధవారం కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై విశాలాంధ్ర వారి పుస్తకావిష్కరణ సభను నిర్వహించారు. 'భగవద్గీత-ఒక అవలోకన' గ్రంథాన్ని ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భగవద్గీతను భగవంతుని వాక్కుగా కాకుండా ఒక చారిత్రక ఆధారంగా పరిశీలించాలని సూచించారు. సనాతనధర్మం భగవద్గీత ఒకటే బోధించాయనే విషయం పూర్తిగా నిజం కాదన్నారు. భూస్వామ్య వ్యవస్థ మొదలైన తొలినాళ్లలో అప్పటికి అమలులో వున్న గణతంత్ర, సమిష్టి భావనలకు వ్యతిరేకంగా, భూస్వామ్య వ్యవస్థలను బలపరిచేందుకు భగవద్గీత అవసరమైందన్నారు. మారుతున్న కాలంతో పాటు, ధర్మాలు కూడా మారుతుంటాయి కనుక భగవద్గీతను అదే దృష్టితో చూడాలన్నారు. ప్రస్తుతం ఒక మతం ప్రయోజనం కోసం, రాజకీయ ప్రయోజనాల కోసం భగవద్గీతను ప్రజల వద్దకు తీసుకువెళ్లేందుకు విపరీతమైన ప్రయత్నం జరుగుతోందని చెప్పారు. భగవద్గీత పేరుతో సమాజంలోని అసమానతలను దేవుడే సృష్టించాడని చెప్పడం అన్యాయమన్నారు. అలాగే పనిమీదే కానీ ఫలితం మీద ఆశలు వదులుకోవాలని చెప్పడం కూడా తగదన్నారు. 'అరుణ తారలు' పుస్తకాన్ని ప్రజానాట్య మండలి గౌరవ సలహాదారు నల్లూరు వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, ప్రజలను చైతన్యవంతం చేసే సాహిత్యాన్ని సుదీర్ఘకాలంగా తెలుగువాళ్లకు అందిస్తున్న విశాలాంధ్ర సంస్థను అభినందించారు. సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజల కోసం తమ సర్వస్వం అర్పించిన కమ్యూనిస్టు నాయకుల చరిత్రలను అరుణతారలు పుస్తకరూపంలో ప్రజలకు అందించడం ముదావహమన్నారు. 'పెరియార్ ఈవీ రామస్వామి నాయకర్ రాజకీయ జీవితం' పుస్తకాన్ని విశాలాంధ్ర విజ్ఞాన సమితి కోశాధికారి జి.ఓబులేశు ఆవిష్కరించారు. అభ్యుదయవాదాన్ని జీవితంలో ఆచరించిన పెరియార్ రామస్వామి గొప్ప సాంఘిక సంస్కర్తగా చరిత్రలో నిలిచిపోతారని ఆయన చెప్పారు. ఇదేసభలో డాక్టర్ రెంటాల శ్రీనివాసరావు అనువదించిన 'భారతీయ నాస్తికవాదం' పుస్తకాన్ని విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ పి.హరినాథరెడ్డి ఆవిష్కరించారు. సమితి సంపాదకులు గడ్డం కోటేశ్వరరావు సభకు అధ్యక్షత వహించారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ మనోహరనాయుడు పాల్గొన్నారు.

వేదిక వద్ద వాగ్వాదం..

ఎంవీఎస్ శర్మ భగవద్గీతపై మాట్లాడుతున్నప్పుడు కేతు విశ్వనాథరెడ్డి వేదిక ఆవరణలో వున్న ఇద్దరు హిందూ వాదులు వాగ్వాదానికి దిగారు. భగవద్గీతను విమర్శించడానికి లేదని భగవద్గీతలో అసహనం ఉందని వ్యాఖ్యానించడం సరికాదన్నారు.



జీలగలగండి కాలనీ వద్ద అంగన్వాడీ కార్యకర్తను అంబులెన్స్‌లో తరలిస్తున్న పోలీసులు
చిల్లకల్లు టోల్‌ప్లాజా వద్ద సొమ్మసిల్లిన అంగన్వాడీ కార్యకర్త
విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న సుజాత

అంగన్వాడీల ఉద్యమం ఉధృతం

» ఎక్కడికక్కడ అడ్డుకున్న పోలీసులు » సొమ్మసిల్లిన కార్యకర్తలు

» ప్రభుత్వ కక్షసాధింపు చర్యలపై ఆగ్రహం

ఎ.కొండూరు, జనవరి 3 : వేతనాలు పెంచాలని సమ్మె చేస్తున్న అంగన్వాడీల సమ్మె బుధవారం తీవ్రరూపం దాల్చింది. తమ డిమాండ్‌ల సాధన కోసం పోలీసుల అంక్షలను దాటుకుని కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి సిద్ధమయ్యారు. కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళుతుండగా అంగన్వాడీ సిబ్బందికి, పోలీసులకు తోపులాట జరగ్గా ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన కార్యకర్త కాకర్ల సుజాత స్పృహ కోల్పోయింది. తోటి సిబ్బంది ఆమెను విజయవాడ జీజీహెచ్‌కు తరలించారు.

ఘంటసాల : మచిలీపట్నంలో నిరసన కార్యక్రమానికి బయలుదేరిన అంగన్వాడీలను ఘంటసాల మండల పరిధిలోని జీలగలగండి కాలనీ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తరలిస్తుండగా, అవనిగడ్డ 9వ వార్డుకు చెందిన కార్యకర్త జి.భవాని సొమ్మసిల్లి పడిపోయింది. పోలీసులు హుటాహుటిన చల్లపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. న్యాయమైన కోర్కెల కోసం శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళుతున్న తమపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు దారుణమన్నారు.

జగ్గయ్యపేట రూరల్ : కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో భాగంగా విజయవాడ బయల్దేరిన అంగన్వాడీలను చిల్లకల్లు టోల్‌ప్లాజా వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆందోళనకారులను చిల్లకల్లు పాలశీతలీకరణ కేంద్రం కళ్యాణ మండపానికి తరలిస్తుండగా జగ్గయ్యపేటకు చెందిన హసీనా సొమ్మసిల్లి పడిపోవడంతో ఎస్ఐ కృష్ణబాబు జీపులో ఆమెను ఆస్పత్రికి తరలించారు.

బాబూ.. తప్పు చేశాం

» ఆశకుపోయి మూల్యం చెల్లించుకున్నాం

» ఓ అంగన్వాడీ ఆవేదన



చేతులు జోడించి ఆవేదన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ నేత

నందిగామ, జనవరి 3: వేతనాలు పెంచావు.. ఉద్యోగులుగా గౌరవించావు...... అయినా నీకు అన్యాయం చేసి అనుభవిస్తున్నాం.. అంటూ ఓ అంగన్‌వాడీ నేత చంద్రబాబుకు క్షమాపణ చెప్పారు. వేతనాలు పెంచకపోగా, కనీస గౌవరం కూడా ఇవ్వని నియంత పాలనలో నలిగిపోతున్నామంటూ ఆమె జగన్‌పై నిప్పులు చెరిగారు. న్యాయమైన హక్కుల సాధన కోసం శాంతియుత ఆందోళనలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టారు. దాంతో పోలీసులు ఎక్కడికక్కడ అంగన్‌వాడీలను అడ్డుకొని బలవంతంగా నందిగామ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సంఘం నాయకురాలు కాకాని సువర్చల ఆసక్తికరంగా స్పందించారు. రెండు చేతూలూ జోడించి చంద్రబాబుకు నమస్కరిస్తూ... తమకు చంద్రబాబు రెండు పర్యాయాలు వేతనాలు పెంచాడని, హక్కుల కోసం పోరాటాలు చేస్తే ఎప్పుడూ ఇలా నిర్బంధించలేదని అన్నారు. ఎన్నికల ముందు జగన్ హామీలు నమ్మి మోసపోయామని, చంద్రబాబుకు అన్యాయం చేసి మూల్యం చెల్లించుకుంటున్నామన్నారు. దేశంలో ఏ ప్రభుత్వమూ ప్రభుత్వ కార్యాలయాల తాళాలు పగులగొట్టిన చరిత్ర లేదని, నేడు అంగన్‌వాడీ కార్యాలయాల తాళాలు పగులగొట్టి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్న జగన్ అధికారం ఊడగొట్టి తీరుతామన్నారు.

పెంచిన సామాజిక పింఛన్ల పంపిణీ

» కృష్ణాజిల్లాలో 245783 మందికి 72.52 కోట్లు

» ఈ ఏడాది 3913 కొత్తవి మంజూరు : కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 245783 మందికి నెలకు రూ.3వేల చొప్పున సామాజిక పింఛన్లు అందిస్తున్నట్టు కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కాకినాడలో వైఎస్సార్ పింఛను కానుక రూ.3వేల పెంపుదల కార్యక్రమంలో బుధవారం పాల్గొన్నారు. కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్‌హాలు నుంచి కలెక్టర్, అధికారులు కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సామాజిక పింఛన్ల రూపంలో జిల్లాలో 2.45లక్షల మందికి నెలకు రూ.72.52కోట్లను అందిస్తున్నట్టు తెలిపారు. 2019 నుంచి ఇప్పటివరకు జిల్లాలో 89867మందికి నూతనంగా పింఛన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది 3,913మందికి నూతనంగా పింఛన్లు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పేర్ని కిట్టు, మచిలీపట్నం మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ జిల్లాలో 202720 మందికి లబ్ధి

» 3173 కొత్తవి మంజూరు : కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వైఎస్సార్ పెన్షన్ కానుకగా పింఛన్ రూ.3 వేలకు పెంచి ఇచ్చే కార్యక్రమానికి వర్చువల్‌గా కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి ఎన్టీఆర్ కలెక్టర్ ఢిల్లీరావు, అధికారులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరక్టర్లు తదితరులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు, అధికారులతో కలిసి లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వైఎస్సార్ పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచి, లబ్ధిదారులకు అందించే కార్యక్రమం జనవరి 1 నుంచి 8వ తేదీ వరకు జరుగుతోందన్నారు. 2023, డిసెంబరులో ఎన్టీఆర్ జిల్లాలో 236041 మందికి రూ.65.54 కోట్లు అందించడం జరిగిందని, జనవరి 1 నుంచి వృద్ధాప్య, వితంతు, నేత, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు తదితర ఏడు కేటగిరీలకు చెందిన 2,02,720 మందికి రూ.3 వేలకు పెంపు వర్తిస్తుందని వివరించారు.



మరోసారి నోరుజారిన నాని!

» 7న చంద్రబాబు సభ విజయవంతానికి సన్నాహక సమావేశం

» బ్యానర్‌పై నాని ఫొటో లేదంటూ మొదలైన వివాదం

» నాని, దేవదత్ వర్గాల నడుమ తోపులాట

» కుర్చీలతో పరస్పరం దాడి.. ఎస్సైకి గాయాలు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి/తిరువూరు): విజయవాడ ఎంపీ కేశినేని నాని మరోసారి నోరుజారారు. సొంత పార్టీ దళిత నేతపైనే తిట్లతో విరుచుకుపడ్డారు. 7న చంద్రబాబు బహిరంగ సభను పురస్కరించుకుని బుధవారం తిరువూరులో జిల్లా పార్టీ నేతలు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొనేందుకు ఎంపీ కేశినేని నాని, టీడీపీ నేత, నాని సోదరుడు కేశినేని చిన్ని వచ్చారు. వేదికపై ఏర్పాటు చేసిన బ్యానర్‌లో నాని ఫొటో లేదంటూ ఆయన వర్గం తొలుత ఆందోళనకు దిగింది. చంద్రబాబు, లోకేశ్ ఫొటోలు ఉన్న ఫ్లెక్సీలను చించివేశారు. చిన్నిని కార్యాలయంలోకి రాకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా నాని వర్గానికి, నియోజకవర్గ ఇన్‌చార్జి శావల దేవదత్ వర్గానికి జరిగిన తోపులాటను అడ్డుకునేందుకు అక్కడే ఉన్న పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. దీంతో రెచ్చిపోయిన నాని వర్గం వారిపైకి కుర్చీలను విసిరింది. దీంతో ఎస్సై తలకు గాయమైంది. పార్టీ నేతల జోక్యంతో ఎట్టకేలకు గొడవ సద్దుమణిగింది. అనంతరం ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తిరువూరులో పార్టీ వీక్‌గా ఉండటంతో దేవదత్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారని, కానీ ఇన్‌చార్జి పూజకు పనికిరాని పూవులాంటి వాడన్నారు. ఇలాంటి పువ్వుతో పూజ చేస్తే ఫలితం ఉండదన్నారు. 'అతను రాజకీయాలకు పనిరాడు, ఏదో వ్యాపారం చేసుకునేందుకు ఇక్కడకు వచ్చాడు. బలహీన క్షణంలో ఎవరినో పట్టుకొని ఇన్‌చార్జి తెచ్చుకున్నాడు.' అంటూ దేవదత్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. దేవదత్ ఇన్‌చార్జిగా పనికిరాడన్నారు. ఇదే విషయాన్ని చంద్రబాబుకు కూడా తెలిపానన్నారు. విజయవాడ కార్పొరేషన్‌లో టీడీపీ గెలిచేదని, కొందరు పార్టీ నాయకులు అమ్ముడుబోవటం వల్ల కార్పొరేషన్‌లో ఓడిపోయామన్నారు. ఒక పొలిట్‌బ్యూరో సభ్యుడు తన పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసినా తాను పట్టించుకోలేదన్నారు. జరిగిన ఘటనపై తిరువూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి శావల దేవదత్ స్పందిస్తూ.. తన పట్ల కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని, ఎస్సీ నాయకుడిననే చిన్నచూపుతో వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ ఆదేశాల మేరకు ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి రాజకీయాలకు కొత్త అయినా పట్టణంలో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసి పార్టీలో అందరినీ కలుపుకొని పని చేస్తున్నానన్నారు. దళిత నాయకుడిననే చిన్నచూపుతో కొందరు దురుసుగా ప్రవర్తించడం శోచనీయమన్నారు. నియోజకవర్గంలో పార్టీకి అనుకూల వాతావరణం ఉన్నా కొందరు నాయకుల ప్రవర్తనతో పార్టీకి నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. టీడీపీ నాయకుడు కేశినేని శివనాథ్(చిన్ని) మాట్లాడుతూ.. నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్న తరుణంలో పార్టీలో ఇటువంటి సంఘటన జరగడం దురదృష్టకరం అన్నారు. జరిగిన ఘటనకు నియోజకవర్గం ప్రజలకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు క్షమాపణ చెబుతున్నానన్నారు. పట్టణంలో చంద్రబాబు బహిరంగ సభ విజయవంతం చేయడమే లక్ష్యంగా పని చేద్దామన్నారు. కార్యాలయంలో జరిగిన సంఘటనను అధిష్ఠానం దృష్టికి తీసుకెళతానని తెలిపారు. చంద్రబాబు సభను విజయవంతం చేయాలని పార్టీ, లోకేశ్ ఆదేశిస్తేనే తాను తిరువూరు వచ్చాను తప్ప గొడవలు చేయాలని ఇక్కడికి రాలేదని స్పష్టం చేశారు.



నిరసన తెలుపుతున్న నాని వర్గం



కారులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు, పట్టుబడిన నగదు

పత్రాలు లేని రూ.47.41లక్షలు స్వాధీనం

గుడివాడ : జిల్లా ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్ సారధ్యంలో టూటౌన్ పోలీసులు బుధవారం స్థానిక పెదఎరుకపాడు దిబ్బ వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో భారీగా నగదును పట్టుకున్నారు. కారులో ఎటువంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.47.41లక్షల నగదును గుర్తించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్‌కు అప్పగించినట్టు టూటౌన్ సీఐ బి.తులసీధర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎవరైనా నగదు లావాదేవీలు భారీ మొత్తంలో తరలించే సమయంలో నగదుకు సంబంధించి సరైన పత్రాలను దగ్గర పెట్టుకోవాలని సూచించారు.

సెంట్రల్ స్కెచ్..!

(5వ పేజీ తరువాయి)

మార్గాలపై దృష్టి సారించారు. అందులో భాగంగా ఏడాదిగా సెంట్రల్ వైసీపీ నేతలతో ఆయన టచ్‌లో ఉంటూ వచ్చారు. తరచూ వారితో భేటీలు నిర్వహించడం ద్వారా సెంట్రల్‌లో మార్గం సుగమం చేసుకుంటూ వచ్చారు. చివరికి వెలంపల్లి ప్లాన్ బి విజయవంతంగా అమలై ఆయనకు సెంట్రల్ టికెట్ ఇస్తున్నట్లు అధిష్ఠానం ప్రకటించింది.

వెలంపల్లి తీరుపై మల్లాది నజర్

వెలంపల్లి రాజకీయం కారణంగానే తనకు సెంట్రల్ సీటు దక్కకుండా పోయిందని మల్లాది విష్ణు భావిస్తున్నారు. ఇదే అభిప్రాయాన్ని ఆయన తన అంతర్గత భేటీల్లో వ్యక్తం చేసినట్లు సమాచారం. బుధవారం వెలంపల్లి తనను కలవడానికి వచ్చిన సమయంలో మల్లాది ముక్తసరిగా స్పందించడానికి కూడా అదే కారణంగా చెబుతున్నారు. జరిగిన పరిణామాలను విశ్లేషించుకున్న మల్లాది తిరిగి కాంగ్రెస్ గూటికి చేరాలని నిర్ణయించుకున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. 2009లో సెంట్రల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందిన విష్ణు 2014లో కూడా కాంగ్రెస్ టికెట్‌పైనే పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2017 జూలైలో ఆయన వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. 2019లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ఈసారి కూడా టికెట్ వస్తుందని ఆశించిన ఆయనకు వెలంపల్లి రాజకీయంతో ఎదురుదెబ్బ తగిలింది. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుని తిరిగి సెంట్రల్ నుంచే పోటీ చేయాలని ఆయన భావిస్తున్నారు. ఈ మేరకు షర్మిలతో ఆయన టచ్‌లోకి వెళ్లినట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

పైకి అయిష్టంగా.. లోలోపల ఇష్టంగా..

సెంట్రల్ టికెట్ విషయంలో పైకి అసంతృప్తితో ఉన్నట్టు వెలంపల్లి ప్రవర్తిస్తున్నా అంతర్గతంగా మాత్రం తన పాచిక పారిందన్న సంతోషంలో ఉన్నారు. ఇప్పటికే ఆయన పలువురు సెంట్రల్ కార్పొరేటర్లకు వాట్సాప్ కాల్స్ చేసి తనకు ఇష్టం లేకపోయినా సీటు ఇచ్చారని, అధిష్ఠానం ఆదేశాలు కాదనలేక పోటీ చేస్తున్నానని, తనకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ఒకటి రెండు రోజుల్లో కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులతో ఆయన సమావేశాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(కూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	97, 105, 116
చికెన్ విత్ స్కిన్	186
చికెన్ స్కిన్‌లెస్	196

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.85

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పాయకాపురం : పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ టీవీ సుధాకర్ బుధవారం తెలిపారు. విద్యుత్ లైన్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతుల కారణంగా ఏపీఎస్‌రెడ్డి రోడ్డు, న్యూ రాజీవ్‌నగర్, కొత్త రాజీవ్‌నగర్, డాక్టర్స్ కాలనీ,పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

నగర అభివృద్ధిపై వైసీపీకి చిత్తశుద్ధి లేదు

ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్: విజయవాడ నగరాభివృద్ధిపై సీఎం జగన్మోహనరెడ్డికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. నాలుగున్నర సంవత్సరాలుగా నోవాటెల్ హోటల్ దగ్గర సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులు చేయకపోవడమే అందుకు నిదర్శనమన్నారు. తూర్పునియోజక వర్గ పరిధిలోని 4వ డివిజన్ రమేష్ ఆసుపత్రి జంక్షన్ నుంచి భారతీనగర్‌లోని నోవాటెల్ వరకు జరుగుతున్న సర్వీస్ రోడ్డు విస్తరణ పనులను బుధవారం వారు పరిశీలించారు. మరో మూడు నెలలల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమన్నారు. ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ కేవలం రూ.60 కోట్లు ఖర్చు చేస్తే ఈసర్వీస్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి అవుతాయన్నారు. కాని మొద్దు ప్రభుత్వం దృష్టి పెట్టదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, దేవినేని అపర్ణ, యలమంచిలి గౌరంగబాబు, లింగంనేని శివరామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


భారతీనగర్ సర్వీస్ రోడ్డును పరిశీలిస్తున్న ఎంపి కేశినేని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలి


కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎరుబోతు శ్రావణి

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 3 : అజిత్‌సింగ్‌నగర్ 58వ డివిజన్‌లో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని తెలుగుదేశం పార్టీ మాజీ కార్పొరేటర్ ఎరుబోతు శ్రావణి కోరారు. మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్‌కు బుధవారం ఆయన కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. డివిజన్‌లోని ఇందిరానాయక్ నగర్, తమ్మిన దుర్గారావునగర్, గుండపు చలపతిరావు కాలని, నందమూరినగర్, రామరాజు వీధి, తోట వారి వీధి తదితర ప్రాంతాల్లో వేలాది మంది ఇటీవల స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారన్నారు. టీడీపీ నేత ఎరుబోతు రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ స్నాతకోత్సవం



కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ రమేష్

భారతీనగర్: ఐటీఐ కళాశాల రోడ్డులోని భారత ప్రభుత్వ విద్యా శాఖ ఏర్పాటు చేసిన నేషనల్ ఇంపార్టెన్స్ ఇన్‌స్టిట్యూట్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాల ప్రాంగణంలో 7వ స్నాతకోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. జాతీయ యాంటీ ర్యాకింగ్ మానిటరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ అజిత్ శంకర్‌రావ్ భోంస్లే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 243 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. 2022-23 విద్యా సంవత్సరానికి చెందిన 10 మంది గ్రాడ్యుయేట్‌లకు గోల్డ్ మెడల్స్ అందజేశారు. డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ రమేష్ శ్రీకొండ, శ్యాప్ విజయవాడ గవర్నర్ల బోర్డు చైర్ పర్సన్ ఆర్ డాక్టర్ ఆమోఘ్ కుమార్ గుప్త, 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

వించిపేటలో అభివృద్ధి శూన్యం

బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీలో టీడీపీ నేత ఎం.ఎస్.బేగ్


54వ డివిజన్‌లో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

వన్‌టౌన్, జనవరి 3 : వైసీపీ పాలనలో వించిపేటలో అభివృద్ధి శూన్యమని, సీనియర్ టీడీపీ నాయకుడు ఎం.ఎస్.బేగ్ అన్నారు. 54వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను అందజేశారు. కొండప్రాంతంలో అత్యధికంగా కార్మికులు ఉంటారని, ఆరోగ్యం, భద్రత తదితర అన్ని అంశాల్లో వారికి అన్యాయమే జరుగుతోందన్నారు. టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన రైతు బజారును అభివృద్ధి చేయలేక సచివాలయంగా మార్చి ఎవరికీ ఉపయోగపడని విధంగా మార్చేశారన్నారు. వర్షాకాలం వస్తే ఇక్కడి పరిస్థితి ఎంత అధ్వానంగా ఉంటుందో వేరే చెప్పక్కర్లేదన్నారు. 54 వడివిజన్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ సలీమ్, క్లస్టర్ ఇన్‌చార్జి సయ్యద్ హుసేన్, మౌనిక ఆధ్వర్యంలో 200, 203, 205 బూత్‌ల పరిధిలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎస్పీ శేషగిరిరావు

భవానీపురం, జనవరి 3 : ఏపీ పీటీడీ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్పీ శేషగిరిరావు ఆధ్వర్యంలో భవానీపురంలో సావిత్రిబాయి పూలే జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు పి.అమృత, పి.ఝాన్సీలక్ష్మిలకు పురస్కారాలను అందించి సత్కరించారు. కార్యక్రమంలో చాత్తాద శ్రీ వైష్ణవ రాష్ట్ర మహిళా నాయకురాలు ఎస్పీ యశోధ, నాయకులు టి.పూర్ణయ్య, బీసీ సంఘ నాయకులు కె.నాగమల్లేశ్వరరావు, యు. ఈశ్వర్ రాజు, విజే.రత్నం, ఎం.మోజెస్, ప్రమీల, ఎం.దుర్గాలు పాల్గొన్నారు.

పుట్టింటికి వెంకమ్మ పేరంటాలమ్మ

గుణదల, జనవరి 3: సంక్రాంతి జాతర మహోత్సవంలో భాగంగా వెంకమ్మ పేరంటాలమ్మను జాతరకు ముందు పుట్టింటి వారు ఆలయానికి వచ్చి తీసుకెళ్లే కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది. రామవరప్పాడులోని గ్రామ దేవత వెంకమ్మ పేరంటాలమ్మ దేవస్థానంలో ఏటా నిర్వహించే సంక్రాంతి జాతరకు ముందు పుట్టింటివారు వచ్చి అమ్మవారిని తీసుకెళ్లడం ఆనవాయితీ. రామవరప్పాడులోని రాజుల బజార్లోని అమ్మవారి పుట్టింటికి తీసుకెళ్లడానికి మేళతాళాలతో వచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవారిని పుట్టింటికి తీసుకెళ్లారు. ఆలయ పాలకమండలి అధ్యక్షుడు బోయిన బాను, ఈవో పాతూరి లోకేశ్వరి, పటమట సీఐ కాశీవిశ్వనాథ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


వెంకమ్మ పేరంటాలమ్మను పుట్టింటికి ఊరేగింపుగా తీసుకెళ్తున్న ఆలయ పాలక మండలి సభ్యులు

క్రమశిక్షణతో నాయకత్వ లక్షణాలు



మాట్లాడుతున్న డీసీపీ విశాల్ గున్నీ

మొగల్రాజపురం, జనవరి 3 : ఎన్‌సీసీ క్యాడెట్స్ విద్యమీద శ్రద్ధ, సెల్ఫోన్ వాడకం విషయంలో పరిమితులు పాటించాలని డీసీపీ విశాల్ గున్నీ అన్నారు. పీబీ సిద్ధార్థ కళాశాల ఫోర్ ఆంధ్రా గర్ల్స్ బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ ఫెస్ట్ మంగళవారం కళాశాల ఆడిటోరియంలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న విశాల్ గున్నీ మాట్లాడుతూ, ఎన్‌సీసీ చేరడం వల్ల క్రమశిక్షణ, శారీరక, మానసిక దృఢత్వం, నాయకత్వ లక్షణాలు పెంపొం దుతాయన్నారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ అధ్యక్షత వహిం చారు. డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ జంపాల, ఇంద్రగర్ల్స్ బెటాలియన్ ఏఎన్‌వో లెఫ్టినెంట్ కుసుమ తదితరులు పాల్గొన్నారు.

జగన్ హయాంలో యువత భవిష్యత్ నిర్వీర్యం

పటమట, జనవరి 3 : కాపు, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా పేద విద్యార్థులకు చదువుకోవడానికి సహాయం చేయడానికి నిధులు ఇవ్వకుండా ప్రభుత్వం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 13వ డివిజన్‌లో బుధవారం జమ్ము, కాశ్మీర్ యూనివర్సిటీలో ఐఐటీలో సీటు పొందిన బర్మా లక్ష్మీ లోహితా కళాశాల ఫీజు, హాస్టల్ ఫీజు చెల్లించడానికి రూ. లక్ష ఎమ్మెల్యే గద్దె అందజేశారు. ఒక్కొక్క సెమిస్టర్‌కు లక్ష ఖర్చు అవుతాయని, నాలుగు సంవత్సరాలు పాటు అమెకు అయ్యే ఖర్చు అంతా తాను భరిస్తానని గద్దె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, జనసేన డివిజన్ అధ్యక్షుడు రామాయణపు కోటేశ్వరరావు, గద్దె ప్రసాద్, నూతి శ్రీనివాసరావు, శొంఠి సాయిలక్ష్మి, వేములపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎస్వీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం 7న

వన్‌టౌన్, జనవరి 3 : ఎస్ఆర్ఎస్వీ కాలేజీ పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఈనెల 7 వతేదీన జరుగుతుందని కాలేజీ కార్యదర్శి జి.గంగాధర్ తెలిపారు. కాలేజీని గతేడాది గాంధీనగర్ నుంచి కేబీఎన్ కాలేజీలోని నూతన భవనంలోకి మార్చినట్లు తెలిపారు. పూర్వవిద్యార్థుల సమ్మేళనం కేబీఎన్ కాలేజీ రీడింగ్ రూమ్‌లో జరుగు తుందన్నారు. బుధవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కాలేజీ కార్యదర్శి గుండా గంగాధర్, సంయుక్త కార్యదర్శి హరగోపాల్, ఈవో శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యకనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షింతల పంపిణీ

పాతరాజరాజేశ్వరి పేట, జనవరి 3 : నగరంలో అయోధ్య రాముని పవిత్ర అక్షింతలను ప్రతి ఇంటికి అందించే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. 56వ డివిజన్ పాతరాజరాజేశ్వరి పేటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి అయోధ్య రాముని అక్షింతలు బుధవారం చేరుకున్నాయి. దీంతో ఆలయ ధర్మకర్త మేరకపూడి మోహనరావు పాతరాజరాజేశ్వరిపేట, కంసాలిపేటలోని వీధులలో తిరుగుతూ అయోధ్య రాముని అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధనేకుల వెంకట సుబ్బారావు, హరికృష్ణ, శివసాయి భక్త బృందం పాల్గొన్నారు.

డైమండ్ లోటస్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పల్లేటి


పల్లేటి శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న రామలింగరాజు, ప్రసాద్

పాతరాజరాజేశ్వరి పేట, జనవరి 3 : వ్యాయమతోనే ఆరోగ్యమని డైమండ్ లోటస్ వాకర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు పల్లేటి శ్రీనివాసరెడ్డి (కడపరెడ్డి) అన్నారు. పూర్ణానందంపేటలోని విక్రమ్ హోటల్‌లో కార్యవర్గ ప్రమాణస్వీకారం చేసింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన అసోసియేషన్ మాజీ గవర్నర్ డి.వి.ఎస్. రామలింగరాజు నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు పల్లేటి శ్రీనివాసరెడ్డి (కడపరెడ్డి), కార్యదర్శి మాటూరి బసవయ్య, కోశాధికారి గుంటూరి దుర్గాప్రసాద్‌లతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, భవిష్యత్‌లో అసోసి యేషన్ తరుపున మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. మాజీ అధ్యక్షుడు కె.సాయిబాబా, టి.శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, జనార్ధనసింగ్, మన్సూర్ పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన జగన్

● మాజీ ఎమ్మెల్యే బొండా ఉమా

పాయకాపురం, జనవరి 3: జాబ్ క్యాలెండర్ పేరుతో ఏటా ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన సీఎం జగన్ యువతను వంచించాడని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. మొగల్రాజపురంలోని ఆయన నివాసంలో బుధవారం విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచి గద్దె నెక్కిన జగన్ జాబ్ క్యాలెండర్‌ను పక్కన పెట్టడంతో యువత నిరుద్యోగులుగా మిగిలిపోయారన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న 2,40,000 పోస్టులను భర్తీ చేయలేని దద్దమ్మగా జగన్ నిలిచిపోయాడని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఖాళీ పోస్టుల భర్తీతో పాటు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తారని హామీ ఇచ్చారు. రాష్ట్రాన్ని పారిశ్రామిక రంగంగా దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తీసుకువస్తామన్నారు. నవనీతం సాంబశివరావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సొంత ఎమ్మెల్యేలే నమ్మడం లేదు

అజిత్‌సింగ్‌నగర్ : సీఎం జగన్‌ను తన సొంత ఎమ్మెల్యేలే నమ్మడం లేదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. అజిత్‌సింగ్‌నగర్ 59వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ బుధవారం జరిగింది. ఇందులో పాల్గొన్న ఆయన ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి రాగానే ప్రవేశపెట్టనున్న వివిధ పథకాలతో కూడిన కరపత్రాలను స్థానికులకు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ సీపీఎస్ రద్దు, అంగన్‌వాడీల బలోపేతంతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను జగన్ విస్మరించారన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీలు చేస్తున్న ఉద్యమాలను అణగదొక్కాలనుకోవడం దారుణమన్నారు.

రౌడీషీటర్ నుంచి గంజాయి స్వాధీనం

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 3: నగర బహిష్కరణలో ఉండి నగరంలో సంచరిస్తూ గంజాయి విక్రయిస్తున్న ఓ రౌడీ షీటర్‌ను అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. అతడి నుంచి 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన షేక్ కరీముల్లాపై స్థానిక పోలీసు స్టేషన్‌లో రౌడీ షీట్ ఉంది. షీట్ తెరచి కౌన్సెలింగ్ ఇస్తున్నా కరీముల్లా ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో గత ఏడాది నగర బహిష్కరణ వేటు వేశారు. కొంతకాలంగా అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో తిరుగుతూ గంజాయి విక్రయిస్తున్నాడని పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు రామానగర్ ప్రాంతంలో అదుపులోకి తీసుకుని అతడి నుంచి 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
గురువారం • 4 జనవరి 2024
cinema@andhrajyothy.com



నా కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్ సైంధవ్

వెంకటేశ్

"నా సినీ కెరీర్‌లో 75వ చిత్రంగా 'సైంధవ్' లాంటి సినిమా చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. ఇది నా కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్. న్యూ ఏజ్ యాక్షన్ థ్రిల్లర్ చేయాలని ఎప్పటి నుంచో ఉన్న కోరిక ఈ చిత్రంతో నెరవేరింది' అని వెంకటేశ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా శైలేష్ కొలను దర్శకత్వం వహించిన చిత్రమిది. వెంకట్ బోయనపల్లి నిర్మాత. నవాజుద్దీన్ సిద్దిఖీ, ఆర్య, శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెరెమియా ప్రధాన తారాగణం. సంక్రాంతి సందర్భంగా జనవరి 13న 'సైంధవ్' విడుదలవుతోంది. బుధవారం చిత్ర బృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ 'ఆకట్టుకునే భావోద్వేగాలతో పాటు అబ్బురపరిచే పోరాట ఘట్టాలు మా సినిమాకు ప్రత్యేక ఆకర్షణ. తప్పకుండా ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని ఇస్తుంది. ట్రైలర్ అద్భుతంగా వచ్చింది. సినిమా కూడా తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుంది. సంక్రాంతికి రిలీజ్ చేస్తున్నాం. ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. శైలేష్ కొలను మాట్లాడుతూ 'వెంకటేశ్ గారి కెరీర్‌లో మైలురాయి లాంటి సినిమా చేసే అవకాశం నాకు వచ్చింది. ట్రైలర్‌లోనే కథ మొత్తం క్లుప్తంగా చెప్పానంటేనే సినిమాలో ఎంత విషయం ఉందో మీరే ఊహించుకోవచ్చు. ఇది నా బెస్ట్ ఫిల్మ్. వెంకీ 75వ చిత్రాన్ని గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకోండి' అని చెప్పారు. వెంకట్ బోయనపల్లి మాట్లాడుతూ 'వెంకటేశ్ గారి లాంటి పెద్ద స్టార్‌తో సినిమా చేసే అవకాశం రావడం నా అదృష్టం. సినిమా విందు భోజనంలా ఉంటుంది' అని తెలిపారు.




ప్రముఖ సినీనటి ప్రభ కుమారుని పెళ్లి రిసెప్షన్ మంగళవారం సాయంత్రం హైదరాబాద్ గండిపేటలోని గోల్కొండ రిసార్ట్స్‌లో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఏబీఎన్ -ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలందించారు. ఆయనతోపాటు సీనియర్ నటులు మురళీమోహన్‌ను కూడా ఈ చిత్రంలో చూడొచ్చు. మరుసటిరోజు బుధవారం ఉదయం గోల్కొండ రిసార్ట్స్‌లో రంగరంగవైభవంగా వివాహం జరిగింది. పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై కొత్తదంపతులకు శుభాశీస్సులు అందించారు.



ప్రేక్షకుల ప్రేమ కోసమే

ఈ మధ్య టాలీవుడ్‌లో యువ హీరోలు మొదలుకొని స్టార్ హీరోల దాకా హీరోయిన్‌గా అందరి ఛాయిస్ శ్రీలీలే. హిట్టు ఫ్లాపులతో సంబంధం లేకుండా ఆమె నటించిన చిత్రాలు వరుసగా థియేటర్లలో సందడి చేస్తున్నాయి. అందులో కొన్ని సినిమాలు డిజాస్టర్‌లుగా మిగిలాయి. మరికొన్ని యావరేజీ మార్క్ దగ్గరే నిలిచిపోయాయి. సూపర్‌హిట్ చిత్రాలు పడితేనే హీరోయిన్‌కు టాలీవుడ్‌లో మార్కెట్ అనే లెక్కలను తిరగరాసిన ఘనత కచ్చితంగా శ్రీలీలదే అని చెప్పవచ్చు. అయితే శ్రీలీల మాత్రం ఇలాంటి విశ్లేషణలను పెద్దగా పట్టించుకోనంటుంది. 'మనం ఎంత ప్రతిభావంతులమైనా అభిమానుల ఆదరణ దక్కడమే గొప్ప విషయం. మన టాలెంట్‌ను వారు ఇష్టపడినంత కాలం ఇక్కడ మన పనికి ఢోకా ఉండదు. అందుకే నా వంతుగా అభిమానులను అలరించడానికి కొత్తగా ఏం చేద్దాం అని ఆలోచిస్తాను. దర్శకుల సలహాలు తీసుకుంటాను. హీరోయిన్‌గా నాకున్న పరిమితుల్లోనే నాదైన ముద్ర వేసేందుకు తపిస్తుంటాను. డాన్స్‌లు, నటన కోసం ముందుగా సిద్ధమవుతాను' అని చెప్పారు ఈ ముద్దుగుమ్మ.

కింగ్‌ఖాన్‌కి కోపమొచ్చింది



షారుక్‌ఖాన్ ఇరిటేటయ్యారు. ఓ అభిమాని అడిగిన ప్రశ్న బాలీవుడ్ బాద్‌షాకి కోపం తెప్పించింది. దాంతో సదరు అభిమానిని ఆయన సున్నితంగా మందలించారు. షారుక్ రీసెంట్ హిట్ 'డంకీ' ప్రమోషన్‌లో భాగంగా అభిమానులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో వారు అడిగిన ప్రశ్నలకు సరదసరదాగా సమాధానాలిచ్చేశారు షారుక్. అయితే.. ఓ అభిమాని అత్యుత్సాహంతో అడిగిన ప్రశ్న షారుక్‌ని ఇరిటేట్ చేసింది. 'సార్.. అసలు 'డంకీ' బడ్జెట్ ఎంత? కొందరు 85 కోట్లు అంటున్నారు. కొందరు 120కోట్లు అంటున్నారు. ఇంకొందరేమో మీ రెమ్యునరేషన్ కలుపుకొని 350కోట్లు అంటున్నారు. ఇందులో నిజం ఏది? అసలు నిజం మీ నోటివెంట వినాలనుంది' అంటూ ఆ అభిమాని ప్రశ్నించగా షారుక్ ముఖ కవళికలు మారిపోయాయి. 'బ్రో.. ఆ విషయాలు నీకవసరమా? బిజినెస్ చేసేవాళ్లకు వదిలెయ్యాలి. ఆ గొడవలు వాళ్లు చూసుకుంటారు. ఉపయోగం లేని విషయాల గురించి ఆలోచించి ఎందుకు టైమ్ వేస్ట్ చేసుకుంటున్నావ్?' అంటూ సున్నితంగా ఆ అభిమానిని మందలించారు షారుక్. దాంతో ఒక్కసారిగా అక్కడి వాతావరణమంతా నిశ్శబ్దంగా మారిందట.

నేను ఆ రెండో కేటగిరికి చెందిన దాన్ని



కెరీర్‌పై చక్కని క్లారిటీ ఉన్న నటి శ్రద్ధా శ్రీనాథ్. నాని 'జెర్సీ'తో మంచి నటిగా గుర్తింపు తెచ్చుకున్న శ్రద్ధ త్వరలో వెంకటేశ్ 'సైంధవ్'తో ప్రేక్షకులను పలకరించనుంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో హీరోయిన్స్ కెరీర్ గురించి ఆసక్తికరంగా మాట్లాడింది శ్రద్ధ. 'కెరీర్ విషయంలో సెలక్టివ్‌గా ఉండటం కరెక్ట్ కాదనేది చాలామంది హీరోయిన్ల అభిప్రాయం. అందుకే వచ్చిన ఏ అవకాశాన్నీ వదులకుండా వరుసపెట్టి సినిమాలు చేస్తుంటారు. కానీ కొందరు హీరోయిన్లు మాత్రం సెలక్టివ్‌గా నచ్చిన పాత్రలనే ఎంచుకొని చేస్తుంటారు. నేను ఆ రెండో కేటగిరికి చెందిన దాన్ని. మనసుకు నచ్చకపోతే చేయను. అలా ఎంచుకొని చేసిన సినిమానే 'జెర్సీ'. అందులో సరా పాత్ర నా కెరీర్‌కి పెద్ద బ్రేక్. రాబోతున్న 'సైంధవ్' కూడా మంచి పేరు తెస్తుందని నమ్మకంతో ఉన్నాను' అంటూ చెప్పుకొచ్చారు శ్రద్ధ శ్రీనాథ్

ఊహించని మలుపుల మిస్ పర్‌ఫెక్ట్



ఏ పని అయినా పర్‌ఫెక్ట్‌గా చేసేవాడ్ని మిస్టర్ పర్‌ఫెక్ట్ అనడం విన్నాం. త్వరలో 'మిస్ ఫర్‌ఫెక్ట్' గురించి వినబోతున్నాం. ఏ పనినయినా పర్‌ఫెక్ట్‌గా చేయడమే కాక చేయించడం ఈ మిస్ పర్‌ఫెక్ట్ స్పెషాలిటీ. ఈ కేరక్టరైజేషన్ చుట్టూ తిరిగే కథాంశంతో రూపొందిన వెబ్ సిరీస్ 'మిస్ పర్‌ఫెక్ట్'. లావణ్య త్రిపాఠి టైటిల్‌రోల్ పోషిస్తున్న ఈ సిరీస్‌లో అభిజిత్ దుద్దాల, అభిజ్ఞ ఉతలూరు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. డైరెక్టర్ విశ్వక్ ఖండేరావ్. అతిత్వరలో ప్రసారం కానున్న ఈ సిరీస్‌కు సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ' కొత్త ఏడాదిని పర్‌ఫెక్ట్‌గా మొదలుపెట్టబోతున్నాం. అంటూ తన వ్యక్తిగత సాంఘిక మాధ్యమం ద్వారా స్పందించారు లావణ్య త్రిపాఠి. ఒక యూనిక్ స్టోరీతో వస్తున్నందుకు ఆనందంగా ఉందని, అనుకోకుండా ఏర్పడిన బంధాలవల్ల జీవితాలు ఎలాంటి మలుపులు తీసుకుంటాయి అనే ఇతివృత్తంతో వినోదభరిత ప్రేమకథగా 'మిస్ పర్‌ఫెక్ట్' సిరీస్ ఉంటుందని సుప్రియ యార్లగడ్డ చెప్పారు. ఝాన్సీ, హర్షవర్ధన్, మహేశ్ విట్టా, హర్ష్ రోషన్ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ సిరీస్‌కి కెమెరా: ఆదిత్య జువ్వాది, సంగీతం: ప్రశాంత్ ఆర్.విహారి.



టైసన్ నాయుడు బరిలో దిగాడు

తొలి చిత్రం 'భీమ్లానాయక్'తోనే దర్శకుడిగా ఘన విజయం అందుకున్నారు సాగర్ కె. చంద్ర. ఇప్పుడు ఆయన బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. యాక్షన్ ఎంటర్టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. సాయి శ్రీనివాస్ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం చిత్రబృందం టైటిల్‌ను ప్రకటించి, గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ చిత్రానికి 'టైసన్ నాయుడు' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను యూనిట్ ఖరారుచేసింది. బాక్సింగ్ దిగ్గజం మైక్ టైసన్ అభిమానిగా శ్రీనివాస్‌ను పరిచయం చేసిన గ్లింప్స్ ఆకట్టుకుంది. ఈ చిత్రంలో ఆయన డీఎస్పీ పాత్రలో అలరించనున్నారు. భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.


చైనా గోడైనా దూకొచ్చు



నాగార్జున అక్కినేని కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'నా సామిరంగా'. ప్రముఖ కొరియోగ్రాఫర్ విజయ్ బిన్ని దర్శకత్వం వహిస్తున్నారు. రాజ్‌తరుణ్ కీలకపాత్రపోషిస్తున్నారు. బుధవారం చిత్రబృందం రాజ్‌తరుణ్ పాత్రను పరిచయం చేస్తూ గ్లింప్స్ వదిలింది. ఈ చిత్రంలో ఆయన భాస్కర్ అనే కాలేజ్ స్టూడెంట్ పాత్రలో కనిపించనున్నారు. రుక్సార్ ధిల్లాన్‌తో రాజ్‌తరుణ్ ప్రేమకథను గ్లింప్స్‌లో ఆవిష్కరించారు. 'తన చిరునవ్వు కోసం చైనా గోడైనా దూకొచ్చు' అంటూ ఆయన పలికిన సంభాషణలు ఆకట్టుకున్నాయి. జనవరి 14న విడుదలవుతున్న ఈ చిత్రంలో నాగార్జునకు జోడీగా ఆశికా రంగనాథ్ నటిస్తున్నారు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. అల్లరి నరేశ్ కీలకపాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఎంఎం కీరవాణి. ప్రసన్న కుమార్ బెజవాడ కథ, మాటలు అందించారు. సినిమాటోగ్రఫీ: శివేంద్ర దాశరథి.

భక్తిభావం ఉప్పొంగేలా రామనామం





తేజ సజ్జ కథానాయకుడిగా ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'హను-మాన్'. సంక్రాంతి సందర్భంగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు సినిమాపై అంచనాలను పెంచాయి. బుధవారం చిత్రబృందం 'శ్రీరామధూత స్తోత్రం' విడుదల చేసింది. భక్తిభావం ఉప్పొంగేలా గౌరహరి స్వరాలందించగా, సాయిచరణ్ భాస్కరుణి, లోకేశ్వర్ ఎదర, హర్షవర్ధన్ చావలి శ్రవణానందంగా ఆలపించారు. ఈ చిత్రంలో అమృత అయ్యర్ కథానాయిక. వరలక్ష్మీ శరత్‌కుమార్, వినయ్ రాయ్, గెటప్ శ్రీను, సత్య కీలకపాత్రలు పోషించారు. ప్రైమ్‌షో ఎంటర్టైన్‌మెంట్‌పై శ్రీమతి చైతన్య సమర్పణలో కె. నిరంజన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: శివేంద్ర.



గ్రామీణ ప్రేమకథ ప్రారంభం

సీనియర్ నటుడు దేవరాజ్ తనయుడు ప్రణం దేవరాజ్ హీరోగా శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఫ్యామిలీ ఎంటర్టైనర్ బుధవారం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ఆకాష్ పూరి క్లాప్ ఇచ్చారు. దేవరాజ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. తనికెళ్ల భరణి చిత్రబృందానికి స్క్రిప్ట్ అందించి, గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'నాకు ఇది తొలి చిత్రం. తెలుగు, కన్నడ భాషల్లో తెరకెక్కిస్తున్నాం. ఈనెలలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం' అన్నారు. దేవరాజ్ పాన్ ఇండియా హీరో, వాళ్లబ్బాయి ప్రణం దేవరాజ్ కూడా ఈ రంగంలోకి వచ్చినందుకు ఆనందంగా ఉంది అని తనికెళ్ల భరణి చెప్పారు. ప్రణం దేవరాజ్ మాట్లాడుతూ 'ఇది తెలుగులో నాకు మూడో చిత్రం. మంచి లవ్ స్టోరీ, యాక్షన్ అంశాలతో రూపొందుతోంది' అని చెప్పారు. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న కుటుంబ కథా చిత్రమిదని నిర్మాత పి. హరికృష్ణ గౌడ్ తెలిపారు.

ఆహ్లాదకరంగా శశివదనే..

గోదావరి నేపథ్యంలో సాగే లవ్ అండ్ యాక్షన్ డ్రామా 'శశివదనే'. 'పలాస'ఫేం రక్షిత్ అట్లూరి, కోమలి జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి సాయిమోహన్ ఉబ్బర దర్శకుడు. అహితేజ బెల్లంకొండ, అభిలాష్‌రెడ్డి గోడల నిర్మాతలు. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రం టీజర్‌ని మేకర్స్ బుధవారం విడుదల చేశారు. పల్లెటూరి నేపథ్యంలో ఆహ్లాదకరమైన ప్రేమకథగా ఈ చిత్రం రూపొందినట్లు టీజర్ చెబుతోంది. ఇప్పటివరకూ విడుదలైన పాటలకు మంచి స్పందన వచ్చిందని, ఈ రోజు విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలు పెంచేలా ఉందని పలువురు అభినందించారని, త్వరలోనే సినిమాను విడుదల చేస్తామని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి కెమెరా: శ్రీసాయికుమార్ దారా, సంగీతం: శరవణన్ వాసుదేవన్, నేపథ్య సంగీతం: అనుదీప్.



కౌన్సెలింగ్



ఈ సమస్యతో గర్భం దాల్చేదెలా?

నాకు పి.సి.ఓ.డి (పాలీసిస్టిక్ ఓవేరియన్ సిండ్రోమ్) సమస్య ఉంది. గర్భం దాల్చడానికి చేస్తున్న ప్రయత్నాలేవీ ఫలించడం లేదు. నా సమస్య తీరేదెలా?

(ఓ సోదరి, విశాఖపట్నం)

పి.సి.ఓ.డి మహిళలను శారీరకంగా, మానసికంగా కుంగదీసే సమస్య! ఈ సమస్యతో వచ్చే ఇన్‌ఫర్టిలిటీని సమర్థంగా అధిగమించాలంటే అందుకు అన్ని విధాలుగా సంసిద్ధులు కావాలి. శరీరంలో అవకతవకలకు గురయ్యే హార్మోన్ల ప్రభావం మూలంగా నెలసరి క్రమం తప్పి గర్భధారణకు తగిన సమయాన్ని కనిపెట్టనివ్వని పరిస్థితి తలెత్తుతుంది. ఇలాంటప్పుడు ధైర్యం కోల్పోకుండా వైద్యులను కలవడంతోపాటు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. అవేంటంటే...

- వ్యాధి నిర్థారణ సక్రమంగా జరిగే పరీక్షలను వైద్యులు సూచిస్తున్నారో లేదో తెలుసుకోవాలి.
- ఇన్సులిన్ రెసిస్టెన్స్‌తోపాటు శరీర బరువు పెరగకుండా చూసుకోవాలి. ఈస్ట్రోజెన్ మెటాబాలిజంను పెంచే ఆహారం తీసుకోవాలి.
- సమర్థమైన మందులతో హార్మోన్లు సక్రమంగా, సమంగా స్రవించేలా, క్రమం తప్పక అండం విడుదలయ్యేలా చూసుకోవాలి.

డాక్టర్ షర్మిలా మజుందార్
సెక్సాలజిస్ట్ అండ్ సైకో అనలిస్ట్, email: mili77@gmail.com

కొవ్వు తగ్గుతుంది!

సీజనల్ ఫ్రూట్స్‌లో ద్రాక్ష కథే వేరు. ఈ తీపి ద్రాక్ష కేలరీల గని. అధికంగా న్యూట్రిన్లు ఉంటాయి. కప్పు ద్రాక్షలో 151 గ్రాముల న్యూట్రిన్లు ఉంటాయి. శక్తితో పాటు ఆరోగ్యాన్నిచ్చే ద్రాక్ష ఉపయోగాలంటే తెలుసుకుందాం..

- ద్రాక్ష తినటం వల్ల ఇందులోని పొటాషియం రక్తపోటును అదుపు చేస్తుంది. తద్వారా గుండె సమస్యలు వచ్చే అవకాశాలు తక్కువ ఉందని ఎన్నో అధ్యయనాల్లో తేలింది.
- కొవ్వుశాతాన్ని తగ్గించటంలో ద్రాక్ష పాత్ర అధికం. ఒక అధ్యయనం కోసం 69 మందిని ఎనిమిది వారాల పాటు ప్రతిరోజూ ఆహారంతో పాటు అరకేజీ ద్రాక్షను తినిపించారు. దీనివల్ల చెడు కొలెస్ట్రాల్ కరిగిపోయాయి. అందుకే ద్రాక్ష డైట్‌లో ఉంటే బరువు తగ్గవచ్చు.
- ఈ పండ్లు తినటం వల్ల మూడ్ స్వింగ్స్ ఉండవు. చురుగ్గా ఉంటారు. ముఖ్యంగా మెదడు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది ద్రాక్ష.
- పొటాషియం, మాంగనీసు, విటమిన్-కె ఉండటం వల్ల ఎముకల ధృడత్వానికి కూడా మంచిది.



- ఈ తియ్యని ద్రాక్ష తినటం వల్ల శరీరానికే కాదు జుట్టుకు మంచి చేకూరుతుంది. చర్మం మీద ఉండే మంటలు, వాతలు లాంటివి తగ్గిపోతాయి. గాయాలు త్వరగా మానిపోతాయి. దీంతో పాటు జుట్టు పెరుగుదల ఉంటుంది.
- ద్రాక్ష తినకపోతే పిల్లలకు జ్యూస్ చేసి ఇవ్వొచ్చు. లేదా సలాడ్స్ చేసి తినిపించవచ్చు.

చలికాలంలో హాయిగా..!

చలికాలం పెంపుడు జంతువులనూ బాగా ఇబ్బంది పెడుతుంది. ఈ కాలంలో పెట్ డాగ్స్‌కు వచ్చే అలర్జీలను అరికట్టాలంటే యజమానులు ఈ టిప్స్ పాటిస్తే సరి..

- ఇంట్లోని పెంపుడు జంతువు ఆటోమేటిక్‌గా తనంతకు తానే చలికాలంలో రక్షించుకోగలదు. వాటిపై చర్మం, జుట్టు తగినట్లు మారుతుంది. అయినప్పటికీ చలికాలంలో ఉష్ణోగ్రత అమాంతం పడిపోతే.. వాటి షెడ్స్‌లో కాస్త వెచ్చగా ఉంచాలి. దీనికోసం హీటర్స్ ఉండాలి. షెడ్స్‌లో నీళ్లు, కింద పడిన ఆహారం, చెత్త ఉండకుండా చేయాలి.
- ముఖ్యంగా వీటి జుట్టుపై చుండ్రు పేరుకుపోకుండా ఎప్పుడూ శుభ్రంగా ఉండేట్లు జాగ్రత్తపడాలి.
- పెట్స్‌పై జుట్టు ఎక్కువగా ఉంటే చలికాలంలో వెచ్చగా ఉంటుందిలే అని మాత్రం వదిలేయకూడదు. ఎందుకంటే జుట్టులో బాక్టీరియా వచ్చి అలర్జీలు వచ్చే అవకాశాలెక్కువ. అందుకే రెగ్యులర్ గ్రూమింగ్ అవసరం. దీని వల్ల ఇరిటేషన్ అయ్యే అవకాశాలు తక్కువగా ఉంటాయి.
- పెట్స్ సెన్సిటివ్‌గా ఉంటాయి. ఇంట్లో తిరిగే ప్రాంతమే కాకుండా నిద్రపోయే బెడ్స్, అవి తిరిగే ప్రాంతాలైన కుర్చీలు, సోఫాలను శుభ్రంగా ఉంచుకోవాలి. దగ్గడం, కంటినుంచి నీళ్లు కారటం లాంటి సమస్యలు చలికాలంలో డస్ట్ వల్ల ఎక్కువగా వస్తుంటాయి. అందుకే పెట్ డాగ్ షెడ్ లేదా నిద్రపోయే ప్రాంతంలో దుమ్ముపడకుండా చూసుకోవాలి.
- పిల్లలతో పెట్స్ ఆడుకోవటం, ఎగిరి దుమకడం.. లాంటివి చేస్తుంటాయి. ఆడుకున్న తర్వాత పెట్స్‌ను వెచ్చని నీటితో శుభ్రం చేయాలి. వాటి చెవులు, కాళ్ల దగ్గర పొడి బట్టతో శుభ్రం చేయాలి.



విభిన్నం



ఆర్టిస్టులు ఎంతో మంది ఉంటారు. కానీ ఆ అభిరుచిని ఒక లక్ష్యంతో ముడిపెట్టేవాళ్లు ఎంతో అరుదు. 21 ఏళ్ల ఆర్టిస్ట్ శ్రీజ కనుమూరి సింగపూర్‌లోని భారత హైకమిషన్‌కు అద్భుతమైన మ్యూరల్‌ను అందించి గుర్తింపు పొందింది. అంతరించిపోతున్న భారతీయ సంప్రదాయాలకూ, మరుగున పడిపోతున్న కళాకారులకూ తగిన గుర్తింపు తీసుకురావడమే తన లక్ష్యం అంటున్న శ్రీజ 'నవ్య'తో పంచుకున్న కబుర్లివి.

బొమ్మల్లో భారతీయం

ఏ రంగంలో స్థిరపడతామో ఎవరం ఊహించలేం. నా విషయంలో కూడా అదే జరిగింది. చిన్నప్పుడు రకరకాల అభిరుచులు అలవడతాయి. నేను కూడా బొమ్మలు గీసేదాన్ని, క్రాఫ్ట్ వర్క్స్ తయారు చేసేదాన్ని. పదేళ్ల పాటు కూచిపూడి నేర్చుకున్నాను. 2019లో కూచిపూడి రంగ ప్రవేశం చేశాను. ఇలా అన్ని అభిరుచుల్లో అంతిమంగా నాకు ఆనందాన్నిచ్చేది ఆర్ట్ అనే విషయాన్ని గ్రహించాను. అలా అభిరుచి కాస్తా ఆసక్తిగా మారి,
ఫైన్‌ఆర్ట్స్ చదవాలని నిర్ణయించుకున్నాను. ఆర్ట్ పట్ల ఆసక్తి ఉన్నవాళ్లకు ఫైన్ ఆర్ట్స్ అనేది సరైన పునాది లాంటిది. దీన్లో అన్ని రకాల మీడియమ్స్ ఉంటాయి కాబట్టి, భిన్నమైన ప్రయోగాలకూ, ఎవరికి తగిన మీడియంను వాళ్లు ఎంచుకోడానికి విస్తృత అవకాశాలుంటాయి. ప్రత్యేకించి నేను పెన్సిల్, గ్రాఫైట్, చార్కోల్ వర్క్స్ ఎక్కువగా చేస్తాను. ఇటీవలే వీడియోగ్రఫీ, ఇన్‌స్టలేషన్స్‌ను కూడా ఎక్స్‌ప్లోర్ చేశాను.



సింగపూర్‌లో ఫైన్‌ఆర్ట్స్

2018-19... సమయంలో మన దేశంలో ఉన్న ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీలకు ప్రపంచవ్యాప్త గుర్తింపు లేదు. పైగా ఆర్ట్ ఇండస్ట్రీ కూడా ఇంకా అభివృద్ధి దశలోనే ఉండిపోయింది. దాంతో నేను యుఎస్, సింగపూర్‌లో ఫైన్ ఆర్ట్స్ అకాడమీలకు అప్లై చేశాను. యుఎస్‌లో కూడా నాకు సీటొచ్చింది. కానీ కొవిడ్ కారణంగా అక్కడకు వెళ్లలేక, సింగపూర్‌ను ఎంచుకోవలసి వచ్చింది. అలా 2020లో సింగపూర్ చేరుకుని, అక్కడి నాన్యన్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో మూడేళ్ల ఫైన్ ఆర్ట్స్ చేశాను. చివరి ఏడాదిలో నా థీసిస్ టాపిక్ కోసం ముగ్గును ఎంచుకున్నాను. ఇంటి ముందు వేసే ముగ్గుతో మనం మన కుటుంబానికి ఎంత దగ్గరవుతున్నామో చెప్పడం నా థీసీస్ ఉద్దేశం.



సింగపూర్ హైకమిషన్ కోసం...

ఆర్టిస్టుగా ఎదగడానికి ఫైన్ ఆర్ట్స్ ఒక్కటే సరిపోదు. పని చేసిన అనుభవం కూడా సంపాదించాలి. అందుకోసం సింగపూర్‌లోని ఒక ఆర్ట్ గ్యాలరీ మ్యానేజర్ ఉద్యోగానికి అప్లై చేసి, ఎంపికయ్యాను. అలా 2020లో సింగపూర్‌లో గ్యాలరీ మ్యానేజర్‌గా పని చేస్తున్న సమయంలో భారత హైకమిషన్ నన్ను సంప్రతించింది. హైకమిషన్‌లో శాశ్వత కలెక్షన్‌లో భాగంగా ఒక పెద్ద మ్యూరల్‌ను రూపొందించి ఇవ్వమని వాళ్లు నన్ను అడిగారు. భారత దేశం స్వాతంత్ర్యం సాధించి 75 ఏళ్లు పూర్తి చేసుకుని, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌ను జరుపుకుంటున్న సందర్భంగా, వాళ్లు ఒక పెద్ద మ్యూరల్‌ను ఏర్పాటు చేయాలనుకున్నారు. కాబట్టి, గ్యాలరీకి వచ్చి నన్ను సంప్రతించడం, నాతో పాటు మరొక 75మంది ఆరిస్టులతో కలిసి ఆ మ్యూరల్‌ను రూపొందించాలని నిర్ణయించుకోవడం జరిగిపోయింది. ఆ ప్రాజెక్టుకు నేను ప్రాజెక్ట్ మ్యానేజర్‌గా కూడా పని చేశాను. అయితే మ్యూరల్‌ను పూర్తి చేయడం కంటే, అందు కోసం 75 మంది భిన్న ఆర్టిస్టులతో కలిసి పని చేయడం ఎంతో ఛాలెంజింగ్‌గా అనిపించింది. వాళ్లందరూ ఇచ్చిన భిన్నమైన పెయింటింగ్స్ అన్నిటినీ ఒక దగ్గరకు చేర్చి, ఆకట్టుకునే ఒక భారీ మ్యూరల్‌ను డిజైన్ చేయడానికే ఎక్కువ శ్రమపడవలసి వచ్చింది. ఈ మ్యూరల్ కోసం భారతీయత ఉట్టిపడే పెయింటింగ్స్‌ను గీయాలని నిర్ణయించుకున్నాం. స్వాతంత్ర్య సమరయోధులు, పండగలు, సంప్రదాయాలు... ఇలా ఎన్నో అంశాలను ఆర్టిస్టులు ఎంచుకున్నారు. నేను నా వంతుగా, భారతీయ జానపద కళలు అనే అంశాన్ని నా పెయింటింగ్ కోసం ఎంచుకున్నాను. ఆ భారీ మ్యూరల్ ఇనాగరేషన్ సమయంలో మన దేశంతో పాటు వివిధ దేశాల్లో స్థిరపడిన 75 మంది కళాకారులందరూ కలుసుకోవడం



జీవితంలో మర్చిపోలేని అనుభవం. ఆ సందర్భంగా హైకమిషన్ కళాకారులందరికీ సర్టిఫికెట్లను అందించారు.

భారతీయతే సర్వస్వం

సంస్కృతిలోని చిన్న చిన్న అంశాలు నిర్లక్ష్యానికి గురవుతూ ఉంటాయి. ఫైన్ ఆర్ట్స్ చివరి ఏడాది థీసిస్‌కు నేను ముగ్గును ఎంచుకోడానికి కారణమిదే! ముగ్గులు వేసే సంప్రదాయం క్రమేపీ కనుమరుగైపోతోంది. అలా మరుగున పడిపోతున్న అంశాలను స్పృశించడాన్ని నేనెంతో ఎంజాయ్ చేస్తాను. అలాగే మన దేశంలో ఎంతోమంది జానపద కళాకారులు, ట్రైబల్ ఆర్టిస్టులు ఉన్నారు. వాళ్లందరి పెయింటింగ్స్‌తో ఒక ఎగ్జిబిషన్ చేయాలనే ఆలోచన ఉంది. అలాగే తగిన సదుపాయాలు లేక, వనరులు లేక ఎంతోమంది గ్రామీణ కళాకారులు తగిన గుర్తింపునకు నోచుకోలేకపోతున్నారు. ఒక క్యురేటర్‌గా వాళ్లను గుర్తించి, ప్రోత్సహించి, వాళ్ల పెయింటింగ్స్‌కు ఒక వేదికను ఏర్పాటు చేయాలని కూడా ఉంది.

> మాది హైదరాబాదే! ఇక్కడే పుట్టి పెరిగాను. నాన్న పేరు సోమరాజు, ఎలక్ట్రికల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ అండ్ రూరల్ ఎలక్ట్రిఫికేషన్ వ్యాపారి. అమ్మ పేరు సౌజన్య. నాకు క్యురేషన్, ఆర్ట్ మేనేజ్‌మెంట్ అంటే ఇష్టం. కాబట్టి మాస్టర్స్ పూర్తి చేసి ఆర్ట్ క్యురేటర్‌గా స్థిరపడాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. ప్రస్తుతం అందుకు సంబంధించిన ప్రాజెక్టులు చేస్తున్నాను.

మర్చిపోలేని అనుభవం

సింగపూర్‌లో ఆర్ట్ టీచర్‌గా పని చేసిన సమయంలో మానసిక పరిణతి లేని పిల్లలకు బొమ్మలు గీయడం నేర్పించాను. ఆ సమయంలో తీవ్రమైన మానసిక వైకల్యం కలిగి ఉన్న ఒక బాబు నన్నెంతో ఆకట్టుకున్నాడు. పెన్సిల్ పట్టుకోవడం కూడా చేతకాని ఆ బాబు చేత కొంతమేరకు బొమ్మలు గీయించగలిగాను. ఆ బాబుకు టీచర్‌గా వ్యవహరించిన ఆరు నెలల కాలంలోనే ఆ బాబు పాటలకు స్పందిస్తున్న విషయాన్ని గ్రహించాను. ఆర్ట్ అనేది ఒక థెరపీగా ఉపయోగపడి, బాబులో కొంత మార్పును తీసుకొచ్చింది. ఆ మార్పును గ్రహించిన బాబు తల్లితండ్రులు ఎంతో సంతృప్తినీ, సంతోషాన్నీ వ్యక్తం చేశారు. ఆ అనుభవాన్ని నేనెప్పటికీ మర్చిపోలేను.

• గోగుమళ్ల కవిత

సెలబ్ ఫిట్



నయా నేషనల్ క్రష్

'జోయా'... బాగా తెలిసిన పేరులా ఉంది కదూ. ఇటీవల విడుదలైన 'యానిమల్' చిత్రంలోని పాత్ర పేరు అది. అందులో అంతగా ఒదిగిపోయి... ఒక్కసారిగా దేశంలోని సినీ ప్రేమికులందరికీ దగ్గరైంది తృప్తి డిమ్రీ. రణబీర్‌తో నటించిన రసరమ్యమైన సన్నివేశాలు... తృప్తిని నయా 'నేషనల్ క్రష్'గా మార్చేశాయి. ఇప్పుడు ఆమె సొగ'సిరుల' రహస్యాన్ని ఛేదించేందుకు సెర్చ్‌ఇంజన్స్‌లో తెగ శోధిస్తోంది నవతరం.

ఏడెనిమిదేళ్ల కిందట 'పోస్టర్ బాయ్స్'తో ప్రారంభమైంది తృప్తి కెరీర్. ఆమె చిత్రాల్లో థియేటర్‌లో కంటే ఓటీటీలో విడుదలైనవే ఎక్కువ. కానీ 'యానిమల్' తృప్తికి మంచి బ్రేక్ ఇచ్చింది. అప్పటి వరకు ఏ కొద్దిమందికో తెలిసిన ఆమె పేరు... ఆ తరువాత నుంచి దేశవ్యాప్తంగా వినిపించడం మొదలైంది. సామాజిక మాధ్యమాల్లో అభిమానులు అమాంతం పెరిగిపోయారు. ఇన్‌స్టాలో దాదాపు అర కోటి మంది తృప్తిని ఫాలో అవుతున్నారు. ట్విటర్ తదితర వేదికల్లో ఫాలోయింగ్ దీనికి అదనం. రణబీర్‌తో పండించిన సన్నివేశాలకు అదే స్థాయిలో విమర్శలు కూడా ఎదుర్కోవాల్సి వచ్చింది. 'ఆ విమర్శలు తొలుత నన్ను బాగా కలవర పెట్టాయి. ఎందుకంటే గతంలో ఎప్పుడూ నాకు ఇలాంటి అనుభవం ఎదురవలేదు. శృంగార సన్నివేశాలు తీస్తున్నప్పుడు నేను, రణబీర్, దర్శకుడు, కెమెరామన్ మాత్రమే సెట్‌లో ఉన్నాం. నాకు ఏ ఇబ్బందీ కలగకుండా వారు చూసుకున్నారు. నాకు అసౌకర్యంగా లేనప్పుడు, నేను చేస్తున్నది తప్పు కాదని నమ్మినప్పుడు... ఎవరో ఏదో అన్నారని పట్టించుకోవాల్సిన అవసరం లేదనేది నా అభిప్రాయం' అంటున్న తృప్తి పుట్టి పెరిగిన ప్రాంతం ఉత్తరాఖండ్‌లోని గఢవాల్.

కొన్నేళ్ల తరువాత ఆమె కుటుంబం ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్‌కు మారింది. అక్కడి 'ఢిల్లీ పబ్లిక్ స్కూల్'లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసింది. ఆ తరువాత ఢిల్లీలోని 'శ్రీ అరబిందో కాలేజీ' నుంచి సైకాలజీలో డిగ్రీ పట్టా పొందింది. మరి నటి కావాలన్న కోరిక తనకు ఎప్పుడు కలిగింది? 'చదువులో ఎప్పుడూ నేను వెనకే. కనుక జీవితంలో స్థిరపడాలంటే చదువుతో సంబంధం లేకుండా వేరే ఏదన్నా చేయాలనే స్పష్టత చిన్నప్పుడే వచ్చింది. కానీ అది ఏంటనేది తెలియదు. అయితే నేను ప్రయాణించాల్సిన మార్గం నిదానంగా నిర్మితమైంది... అదీ నా ప్రమేయం లేకుండానే. ఎలాగంటే... మా సోదరుడి స్నేహితుడు ఒకరు ఫొటోగ్రాఫర్. నన్ను చూసి ఒక రోజు తనే అన్నాడు... 'టెస్ట్ ఫొటో షూట్ చేద్దాం' అని. షూట్ అయిపోయింది. అతనే నా ఫొటోలను ఎవరికో పంపించాడు. ఇక అక్కడి నుంచి అవకాశాలు మొదలయ్యాయి. తొలుత ప్రింట్ షూట్స్ చేశాను. ఆ షూట్స్ చూసి ఆడిషన్స్‌కు రమ్మని కాల్స్ వెల్లువెత్తాయి. క్రమంగా నటనతో ప్రేమలో పడ్డాను. అప్పుడు అనుకున్నాను... నటనే నా కెరీర్ అని' అంటున్న తృప్తి పుణేలోని 'ఫిలిమ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా'లో శిక్షణ తీసుకుంది. రెండు మూడు సినిమాల్లో నటించాక కూడా తనపై తనకు నమ్మకం ఉండేది కాదట. ఎప్పుడైతే భిన్న వర్గాల నుంచి ప్రశంసలు అందాయో అప్పటి నుంచి ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తున్నట్టు ఓ సందర్భంలో చెప్పింది. రెండు చిత్రాలు... తరువాత రెండేళ్ల పాటు ఎలాంటి అవకాశాలూ ఆమెకు రాలేదు. ఆ సమయంలో పరిశ్రమలో కొనసాగాలా... వద్దా? ఒకవేళ వద్దనుకొంటే ఏంచేయాలి? ఎటూ పాలుపోక తనలో తాను ఎంతో సంఘర్షణకు గురైనట్టు ఓ సందర్భంలో తృప్తి చెప్పుకొచ్చింది. ఇలాంటి కఠిన పరిస్థితుల్లో తనను మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంచింది క్రమశిక్షణ గల జీవనశైలి మాత్రమేనంటోంది. దాని కోసం వ్యాయామాన్ని దినచర్యగా మార్చుకుంది.

వర్కవుట్ ఇలా...

తృప్తి వర్కవుట్ ప్రణాళికలో వ్యాయామాలు, ధ్యానం మిళితమై ఉంటాయి. వ్యాయామాలు శారీరక దృఢత్వాన్ని ఇస్తే... ధ్యానం మానసిక ప్రశాంతతను, ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. ఎంత పని ఒత్తిడి ఉన్నా వారంలో కనీసం ఐదు రోజులు జిమ్‌కు వెళుతుంది. అదనపు కేలరీలు కరిగించడానికి ఎక్కువ సమయం కేటాయిస్తుంది.

- ఆమె ఫిట్‌నెస్ మంత్రాలో యోగా కూడా భాగం. ఎంతో క్లిష్టమైన ఆసనాలను సునాయాసంగా వేసేయగలదు.
- హృదయసంబంధిత వ్యవస్థ బాగా పని చేయడానికి తృప్తి ప్రధానంగా ఎంచుకున్న మార్గం డ్యాన్స్. తను మంచి డ్యాన్సర్ కూడా. ఆమె 'లైలా మజ్నూ' చూసినవారు తృప్తి డ్యాన్స్‌కు ఫిదా అయిపోయారు.
- డ్యాన్స్‌తో పాటు ట్రెడ్‌మిల్ తదితర కార్డియోకు అరగంట కేటాయిస్తుంది.
- వీటన్నిటితోపాటు శారీరక సామర్థ్యం, శక్తిని పెంచుకోవడానికి తృప్తి తరచూ ట్రెక్కింగ్‌కు వెళుతుంది. అది తనకు ఆహ్లాదంతో పాటు ఆస్వాదనం కూడా ఇస్తుందంటుంది.



ఇదీ మెనూ...

- శరీరం డీహైడ్రేషన్‌కు గురి కాకుండా ఉండేందుకు... ఉదయం లేవగానే రెండు పెద్ద గ్లాసుల గోరువెచ్చటి నీళ్లు, గ్రీన్ టీ తీసుకొంటుంది. ఫిట్‌నెస్‌కు, ఆరోగ్యవంతమైన చర్మానికి హైడ్రేషన్ చాలా ముఖ్యం.
- రోజులో మనం తీసుకొనే ఆహారంలో బ్రేక్‌ఫాస్ట్ ముఖ్యమైనదంటారు న్యూట్రిషనిస్టులు. దాన్ని దృష్టిలో ఉంచుకున్న తృప్తి... ఉదయం తన మెనూలో బలవర్థకమైన అల్పాహారం ఉండేలా చూసుకొంటుంది. వీట్ బ్రెడ్, పండ్లు, ఓట్స్, కిస్మిస్, నట్స్‌తో ఒక గ్లాస్ బాదంపాలు. ఇవి శరీరానికి అవసరమైన శక్తినిస్తాయి.
- మధ్యాహ్నం లంచ్‌లో అన్నం, పప్పు, వెజిటబుల్ కర్రీ, పెరుగు, సలాడ్‌తో పాటు తప్పనిసరిగా తాజా ఆకుకూరలతో చేసిన వంటకం ఉండాలి.
- రాత్రిపూట తేలికపాటి ఆహారం తీసుకొంటుంది. దానివల్ల తిన్నది త్వరగా అరిగి, సుఖమైన నిద్ర పడుతుంది. బాయిల్డ్ ఎగ్స్ గ్రీన్ సలాడ్, పప్పు లేదా సూప్ రాత్రి మెనూలో ఉంటాయి.
- ఏదిఏమైనా... 'సరైన వ్యక్తులను సరైన సమయంలో కలవడంవల్లే నా కెరీర్ ఎలాంటి ఒడుదొడుకులు లేకుండా సాగిపోతోంది. నా చుట్టూ ఉన్నవారంతా నా అభివృద్ధికి నిచ్చెనలు వేసేవారే' అని తృప్తి చెప్పుకొచ్చింది.

లైఫ్ స్టైల్

స్వల్ప ఆనందాలు అందుకోండిలా...

ఉరుకులు పరుగులతో కూడిన దైనందిన జీవితంలో స్వల్ప ఆనందాలను నింపే కొన్ని చిన్న చిన్న ఆనందాలను ఆస్వాదించడం అలవాటు చేసుకోవడం అవసరం. చప్పుడు చేయకుండా చెంతకొచ్చి ఆరోగ్యాన్ని కుదేలు చేసే ఒత్తిడిలు, ఆందోళనల నుంచి స్వాంతన పొందడం కోసం కొన్ని అసాధారణమైన ఆనందాలను అనుభూతిస్తూ ఉండాలి.



తొలి సిప్‌తో మేల్కొలుపు

కమ్మని కాఫీని ఇష్టపడని వారుండరు. కానీ కాఫీ తాగే క్రమంలో మనసు ఆ రోజు చేయవలసిన పనుల మీదకు పరుగులు తీస్తోందా? అయితే దానికి అడ్డుకట్ట వేసి, కాఫీ కమ్మని వాసననూ, రుచినీ ఆస్వాదించడం మీదే మనసు పెట్టాలి. ప్రేరేపించే కాఫీ ఇంద్రియాలను మేల్కొలిపే అనుభవాన్ని అనుభూతించాలి.

స్నానంతో మైమరుపు

శరీరంలోని ఒత్తిడిని తొలగించి రోజంతా చురుగ్గా కదలడం కోసం శరీరాన్ని సిద్ధం చేసే సాధనమిది. కాబట్టి ఆదరాబాదరాగా స్నానం ముగించేయకుండా శ్రద్ధగా శరీరాన్ని సబ్బుతో రుద్దుకుని, మురికిని వదిలించాలి.
గోరువెచ్చని నీళ్లతో స్నానం చేయడం వల్ల చర్మం అడుగున రక్తప్రసరణ మెరుగై చర్మం కాంతివంతంగా తయారవుతుంది. శరీరం బద్ధకం వదలి, కొత్త హుషారు సంతరించుకుంటుంది.

గడ్డి మీద నడక

గార్డెన్‌లో చెప్పులు లేకుండా పచ్చిక మీద నడవడం అలవాటు చేసుకోవాలి. పిల్లలతో, పెంపుడు జంతువులతో పరుగులు పెట్టి ఆడుకోవాలి. ప్రకృతిలో మమేకమవడం కోసం పూల చెట్ల మధ్య, పచ్చిక మీద నడవడం అవసరం. పచ్చని పచ్చిక, పాదాలతో పాటు మనసును కూడా సుతిమెత్తగా స్పృశించి మైమరుపుకు లోను చేస్తుంది.

సేలం స్టీలు ప్రైవేటీకరణ వెనక్కి

న్యూఢిల్లీ: తమిళనాడులోని సేలం స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖ (దీపం) బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. 2019 జూలైలో సేలం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కోసం దీపం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందుకు అనేక కంపెనీలు ఆసక్తి చూపించాయి. అయితే షార్ట్‌లిస్ట్ చేసిన సంస్థలు పెద్దగా ఆసక్తి చూపక పోవడంతో, ప్రైవేటీకరణ ప్రక్రియనే నిలిపి వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

బజాజ్ ఫైనాన్స్ నుంచి డిజిటల్ ఎఫ్‌డీ

న్యూఢిల్లీ: ప్రముఖ ఎన్‌బీఎఫ్‌సీ బజాజ్ ఫైనాన్స్ 42 నెలల కాల వ్యవధి ఉండే డిజిటల్ ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద సీనియర్ సిటిజన్ల డిపాజిట్లపై 8.85 శాతం, 60 ఏళ్ల కంటే తక్కువ వయసున్న వారి డిపాజిట్లపై 8.60 శాతం వార్షిక వడ్డీ చెల్లిస్తారు. కొత్త డిపాజిట్లతో పాటు, కాల పరిమితి ముగిసిన రూ.5 కోట్ల వరకు ఉండే డిపాజిట్లకు కూడా ఈ వడ్డీ రేట్లు వర్తిస్తాయి.

సరకు రవాణాలో విశాఖ పోర్టుకు మూడో స్థానం

- చైర్మన్ ఎం.అంగముత్తు

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): సరకు రవాణాలో విశాఖపట్నం పోర్టు మూడో స్థానంలో ఉన్నదని చైర్మన్ ఎం.అంగముత్తు వెల్లడించారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల కాలానికి (2023-24) 6 కోట్ల టన్నుల సరకు రవాణా చేశామంటూ మార్చి 31 నాటికి ఇది 8 కోట్ల టన్నులకు చేరుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రస్తుతం పోర్టు సరకు హ్యాండ్లింగ్ వార్షిక సామర్థ్యం 13.7 కోట్ల టన్నులన్నారు. సరకు రవాణా ద్వారా పోర్టుకు ఏడాదికి రూ.2,300 కోట్ల వరకు ఆదాయం వస్తోందన్నారు. కంటెయినర్ల రవాణాలో కూడా 42 శాతం వృద్ధి నమోదు చేశామన్నారు. సముద్ర ఉత్పత్తుల ఎగుమతిలో విశాఖ పోర్టు దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. రూ.150 కోట్లతో ఫిషింగ్ హార్బర్‌ను ఆధునికీకరిస్తున్నామని చెప్పారు.

అదానీపై ఇక ఏ దర్యాప్తు అవసరం లేదు



సిట్ లేదా సీబీఐకి బదిలీకి 'సుప్రీం' నిరాకరణ

విచారణ పూర్తి చేసేందుకు సెబీకి మరో 3 నెలల గడువు

న్యూఢిల్లీ: హిండెన్‌బర్గ్ ఆరోపణల కేసులో అదానీ గ్రూప్‌నకు భారీ ఊరట లభించింది. అదానీ గ్రూప్ అక్రమ పద్ధతుల్లో తన కంపెనీల షేర్ల ధరలను కృత్రిమంగా పెంచుకుంటూ వచ్చిందన్న హిండెన్‌బర్గ్ ఆరోపణలపై దర్యాప్తును సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) లేదా సీబీఐకి బదిలీ చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అదానీ-హిండెన్‌బర్గ్ వివాదానికి సంబంధించి పలు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై (పిల్) విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం బుధవారం 46 పేజీల తీర్పును వెల్లడించింది. వార్తా పత్రికల్లో వచ్చిన కథనాలు, ఓసీసీఆర్‌పీ (ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్) వంటి థర్డ్‌పార్టీ సంస్థల నివేదికల ఆధారంగా మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ దర్యాప్తును పిటిషనర్లు ప్రశ్నించడం విశ్వాసం కలిగించేలా లేదని ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం పేర్కొంది. ఈ ఆరోపణలపై సెబీ సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తోందని, నియంత్రణ సంస్థపై పూర్తి నమ్మకం ఉందన్నది. అంతేకాదు, సెబీ చట్టం పరిధిలోని నిబంధనల్లో జోక్యం చేసుకునేందుకు కోర్టుకున్న అధికారాలు పరిమితమేనని ఈ సందర్భంగా ప్రస్తావించింది. అదానీ గ్రూప్‌పై దర్యాప్తును 3 నెలల్లోగా పూర్తి చేయాలని సెబీని బెంచ్ ఆదేశించింది. అంతేకాదు, ఈ వ్యవహారంలో హిండెన్‌బర్గ్ పెట్టుబడి మార్కెట్ నిబంధనలేమైనా అతిక్రమించిందా అన్న కోణంలో పరిశీలించి తదనుగుణంగా చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని, సెబీని ఆదేశించింది. అదానీ గ్రూప్‌పై వచ్చిన 22 ఆరోపణల్లో ఇప్పటికే 20 ఆరోపణలపై దర్యాప్తును పూర్తి చేసిన సెబీ.. మరో రెండింటిపై మరింత సమాచారం కోసం వేచి చూస్తోంది. ఈ రెండు అంశాల్లో విదేశీ నియంత్రణ సంస్థలతోపాటు ఇతరుల నుంచి సమాచారం రావాల్సి ఉందని.. వారితో సంప్రదింపులు కొనసాగుతున్నాయని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా గతంలోనే కోర్టుకు వెల్లడించారు. అదానీ గ్రూప్ చాలాకాలంగా అకౌంటింగ్ మోసాలకు పాల్పడటంతోపాటు విదేశీ సంస్థల పెట్టుబడుల ద్వారా గ్రూప్ కంపెనీల షేర్ల ధరలను కృత్రిమంగా పెంచుకుంటూ వచ్చిందని అమెరికన్ మార్కెట్ రీసెర్చ్, షార్ట్ సెల్లింగ్ కంపెనీ హిండెన్‌బర్గ్ గత ఏడాది జనవరి 24న ఆరోపించిన విషయం తెలిసిందే. దాంతో అదానీ షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతో ఎల్‌ఐసీతోపాటు చిన్న మదుపరులు భారీగా నష్టపోయారు. ఈ విషయంపై దర్యాప్తు చేయాలని సెబీని ఆదేశించడంతోపాటు గత ఏడాది మార్చి 2న సుప్రీంకోర్టు ఓ నిపుణుల కమిటీని కూడా ఏర్పాటు చేసింది. కాగా, అదానీ గ్రూప్ తన కంపెనీల షేర్ల ధరను కృత్రిమంగా పెంచుకుంటూ వచ్చిందనడానికి, నియంత్రణ వైఫల్యానికి ఆధారాల్లేవన్న నిపుణుల కమిటీ.. అదానీ గ్రూప్‌లో భారీగా పెట్టుబడులు కలిగిన విదేశీ ఫండ్ల అసలు లబ్ధిదారులు ఎవరనేది గుర్తించడానికి 2014-19 మధ్యకాలంలో సెబీ సడలించిన నిబంధనలే అవరోధంగా మారాయని మే నెలలో సుప్రీంకోర్టుకు సమర్పించిన తాత్కాలిక నివేదికలో పేర్కొంది.

అదానీ షేర్లు జూమ్

సుప్రీంకోర్టు తీర్పుతో గ్రూప్ కంపెనీల షేర్లు భారీగా పుంజుకున్నాయి. బీఎస్ఈలో అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ షేరు ధర 11.60 శాతం లాభపడింది. అదానీ టోటల్ గ్యాస్ 9.84 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ 6 శాతం, అదానీ పవర్ 4.99 శాతం, అదానీ విల్మర్ 3.97 శాతం, ఎన్‌డీటీవీ 3.66 శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 2.45 శాతం, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ 1.39 శాతం, అంబుజా సిమెంట్స్ 0.94 శాతం, ఏసీసీ 0.10 శాతం బలపడ్డాయి. దాంతో గ్రూప్‌లోని 10 కంపెనీల మొత్తం మార్కెట్ విలువ ఒక్కరోజే రూ.64 వేల కోట్లకు పైగా పెరిగి రూ.15.11 లక్షల కోట్లకు చేరుకుంది.

సత్యమే గెలిచింది: అదానీ

సుప్రీంకోర్టు తీర్పుపై అదానీ గ్రూప్ అధిపతి గౌతమ్ అదానీ హర్షం వ్యక్తం చేశారు. చివరికి సత్యమే గెలిచిందని, భారత ఆర్థిక వృద్ధికి తమ గ్రూప్ తన వంతు కృషిని కొనసాగిస్తుందన్నారు.

క్రోనీ క్యాపిటలిజంపై పోరాటం కొనసాగిస్తాం: కాంగ్రెస్

సుప్రీంకోర్టు తీర్పు సెబీ పట్ల అమిత ఉదారంగా ఉందని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. క్రోనీ క్యాపిటలిజం (ప్రభుత్వ ప్రతినిధులు, పెట్టుబడిదారుల మధ్య పరస్పర ప్రయోజనకరమైన సాన్నిహిత్యం), ధరలు, ఉపాధి, ఆర్థిక అసమానతలు, ప్రభావంపై తమ పోరాటం కొనసాగుతుందని పార్టీ పేర్కొంది. కాగా, అదానీ కేసులో సర్వోన్నత న్యాయస్థానం తీర్పుపై సీపీఎం కూడా నిరాశ వ్యక్తం చేసింది. ఈ తీర్పు ద్వారా కోర్టు తన విశ్వసనీయతను మరింత పెంచుకోలేకపోయిందని అభిప్రాయపడింది.

అదానీ పోర్ట్స్ ఎండీగా కరణ్ అదానీ



అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకానమీ జోన్ (ఏపీసెజ్) సీఈఓ కరణ్ అదానీకి మేనేజింగ్ డైరెక్టర్‌గా (ఎండీ) పదోన్నతి లభించింది. ఇప్పటివరకు ఈ పదవిలో ఉన్న కంపెనీ చైర్మన్ గౌతమ్ అదానీ హోదాను ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా మార్చడం జరిగిందని ఏపీసెజ్ బుధవారం వెల్లడించింది. అంతేకాదు, ఇంతక్రితం నిస్సాన్ మోటార్స్ గ్లోబల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా పనిచేసిన అశ్వనీ గుప్తాను ఏపీసెజ్ కొత్త సీఈఓగా నియమించేందుకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది.

రెండో రోజూ నష్టాలే

ముంబై : దేశీయ స్టాక్ మార్కెట్ వరుసగా రెండో రోజూ నష్టాలతో ముగిసింది. ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన ప్రతికూల సంకేతాల ప్రభావంతో సెన్సెక్స్ 535.88 పాయింట్లు నష్టపోయి 71356.60 వద్ద ముగియగా, నిఫ్టీ 148.45 పాయింట్ల నష్టంతో 21517.35 వద్ద ముగిసింది. సెన్సెక్స్ ఒక దశలో 588.51 పాయింట్లు నష్టపోయి 71303.92 పాయింట్ల ఇంట్రా డే కనిష్ఠ స్థాయిని తాకింది. బ్రెంట్ రకం ముడి చమురు ధర బ్యారెల్ 75 డాలర్లకు తగ్గినా చైనా, ఈయు దేశాల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉందన్న వార్తలు మార్కెట్‌ను భయపెట్టాయి.

తయారీ రంగం నీరసం

న్యూఢిల్లీ: తయారీ రంగం డిసెంబరు నెలలో 18 నెలల కనిష్ఠ వృద్ధిని నమోదు చేసింది. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టినా కొత్త ఆర్డర్లు లేకపోవడం, ఉత్పత్తి తగ్గుదల ఈ క్షీణతకు కారణమని హెచ్‌ఎస్‌బీసీ ఇండియా తయారీ పీఎంఐ సర్వే నివేదిక తెలిపింది. ఈ సూచీ నవంబరు నెలతో పోల్చితే 56 పాయింట్ల నుంచి 54.9 పాయింట్లకు తగ్గింది.

గృహ రుణాలపై బీఓఎం వడ్డీ తగ్గింపు

న్యూఢిల్లీ: గృహ రుణాల కోసం చూస్తున్న వారికి బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం) తీపి కబురు చెప్పింది. నూతన సంవత్సరం ఆఫర్‌గా గృహ రుణాలపై వడ్డీరేటును 8.5 శాతం నుంచి 8.35 శాతానికి తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. కొత్తగా తమ బ్యాంకు నుంచి గృహ రుణాలు తీసుకునే వారికి ప్రాసెసింగ్ ఫీజు నుంచి కూడా మినహాయింపు ఇస్తున్నట్టు తెలిపింది. ఈ తగ్గింపుతో బ్యాంకింగ్ పరిశ్రమలో అతి తక్కువ వడ్డీరేట్లతో గృహ రుణాలు అందిస్తున్న బ్యాంకుల్లో తమ బ్యాంకు ఒకటయిందని తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,820 ▼	58,600 ▼	80,000 ▼
ముంబై	63,010 ▼	57,720 ▼	72,690 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



3వ తేదీ			
హైదరాబాద్	582	విజయవాడ	585
4 జనవరి		విశాఖపట్నం	625
చిత్తూరు	608	వరంగల్	584
గోదావరి	585	డజను గుడ్లు రూ.72	


ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	గోదావరి	94
వరంగల్	90	విజయవాడ	94
కరీంనగర్	90	గుంటూరు	90
మహబూబ్‌నగర్	90	ఒంగోలు	90
కర్నూలు	90	చిత్తూరు	105
విశాఖపట్నం	89		

ఇళ్ల విక్రయాల్లో రికార్డు

హైదరాబాద్‌లో 6 శాతం వృద్ధి



హైదరాబాద్: నివాస గృహాల విక్రయాలు 2023 సంవత్సరంలో జోరుగా సాగాయి. హైదరాబాద్‌లో అమ్మకాలు 6 శాతం పెరిగి రికార్డు స్థాయిలో 32,880 యూనిట్లకు చేరాయి. మొత్తం విక్రయించిన గృహాల్లో సగం కోటి రూపాయల పైబడిన ధరలోని ప్రీమియం గృహాలే ఉన్నాయి. మొత్తం అందుబాటులోకి వచ్చిన 46,985 గృహాల్లో 43 శాతం ప్రీమియం గృహాలేనని నైట్‌ఫ్రాంక్ తాజా నివేదికలో వెల్లడించింది. సగటు చదరపు అడుగు ధర 11 శాతం పెరిగి రూ.5,550కి చేరింది. ప్రీమియం గృహాల విక్రయాలు 2018లో 21 శాతం ఉండగా 2023 నాటికి ఇది 49 శాతానికి చేరినట్టు వెల్లడించింది. అఫర్డబుల్ గృహాల (రూ.50 లక్షల కంటే తక్కువ ధర) విక్రయాలు 2018లో 26 శాతం ఉండగా.. 2023 నాటికి 11 శాతానికి తగ్గింది.

జీసీసీలతో కార్యాలయ స్థలానికి గిరాకీ..: హైదరాబాద్‌లో అద్దెకు తీసుకున్న కార్యాలయ స్థలం 2023 సంవత్సరంలో 32% పెరిగింది. అద్దెకు తీసుకున్న కార్యాలయ స్థలాలు 2022లో 67 లక్షల చదరపు అడుగులుండగా 2023 సంవత్సరంలో 88 లక్షల చదరపు అడుగులకు పెరిగిందని ఆ నివేదికలో తెలిపారు. హైదరాబాద్ నుంచి ఐటీ అవుట్ సోర్సింగ్ సేవలందిస్తున్న గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) నుంచి ఏర్పడిన డిమాండు కార్యాలయ స్థలానికి గిరాకీ పెరగడానికి కారణం. ఏడాది క్రితంతో పోలిస్తే హైదరాబాద్‌లో జీసీసీలు తీసుకున్న కార్యాలయ స్థలం 52 శాతం పెరిగి 41 లక్షల చదరపు అడుగులకు చేరింది. కొత్తగా అందుబాటులోకి వచ్చిన కార్యాలయ స్థలం 42 శాతం తగ్గి 65 లక్షల చదరపు అడుగులకు పరిమితమైంది. సగటున చదరపు అడుగు నెల అద్దె స్వల్పంగా ఒక శాతం పెరిగి రూ.65.5గా ఉంది.

రూ.50 లక్షల లోపు ఇళ్లకు తగ్గిన డిమాండ్: దేశంలో రూ.50 లక్షల లోపు ధరలో ఇళ్లకు డిమాండు తగ్గింది. దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో గత ఏడాది ఈ శ్రేణిలోని ఇళ్ల అమ్మకాలు 16 శాతం తగ్గాయి. 2022 సంవత్సరంలో ఈ శ్రేణిలో 1,17,131 ఇళ్లు అమ్ముడుపోగా 2023లో 98,000 ఇళ్ల అమ్మకాలు మాత్రమే నమోదయ్యాయి. ప్రాపర్టీ ధరలు, మార్టిగేజ్ వ్యయాలు పెరగడం ఇందుకు కారణమని నైట్‌ఫ్రాంక్ తాజా నివేదికలో తెలిపింది. అయితే మొత్తం ఇళ్ల అమ్మకాలు మాత్రం 5 శాతం పెరిగి 3,29,907 యూనిట్లుగా నమోదైనట్టు పేర్కొంది.

డాక్టర్ రెడ్డీస్ చేతికి 'మెనోల్యాబ్స్' బ్రాండ్‌లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మెనోల్యాబ్స్ బ్రాండ్‌తో అమెరికాలో విక్రయిస్తున్న ఉమెన్ హెల్త్ అండ్ డైటరీ సప్లిమెంట్ ఉత్పత్తుల పోర్టుఫోలియోను ఎమిరిస్ ఐఎన్‌సీ నుంచి డాక్టర్ రెడ్డీస్ కొనుగోలు చేసింది. ఎమిరిస్ దివాలా ప్రక్రియలో భాగంగా మెనోల్యాబ్స్ బ్రాండ్లను సొంతం చేసుకున్నట్టు డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. మెనోఫిట్, మెనోగ్లో, హ్యాపీ ఫైబర్ తదితర 11 బ్రాండ్‌లతో సహా మెనోల్యాబ్స్ చెందిన మొత్తం సప్లిమెంట్స్ పోర్టుఫోలియో డాక్టర్ రెడ్డీస్ చేతికి వస్తాయి. మెనోల్యాబ్స్ బ్రాండ్ల కొనుగోలు విలువను కంపెనీ వెల్లడించలేదు. ఈ ఒప్పందంలో భాగంగా మెనోలైఫ్ హెల్త్ ట్రాకర్ యాప్‌కు కూడా డాక్టర్ రెడ్డీస్‌కు లభిస్తుంది. మెనోల్యాబ్స్ బ్రాండ్ల కొనుగోలు ద్వారా ఈ విభాగంలో కంపెనీ మరింత బలపడుతుందని డాక్టర్ రెడ్డీస్ నార్త్ అమెరికా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మార్క్ కికుచి అన్నారు.

తొలి రోజే 23 వికెట్లు

సఫారీలు 55కే ఢమాల్



బుమ్రా (2/25)

- భారత్ తొలి ఇన్నింగ్స్ 153
- ఒక్క పరుగు చేయకుండానే 6 వికెట్లు ఫట్
- సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 62/3

ఆరేసిన సిరాజ్



సిరాజ్ (9-3-15-6)

2 తొలి రోజు లంచ్‌కు ముందే ఐదు వికెట్లు పడగొట్టిన రెండో భారత బౌలర్‌గా సిరాజ్. 1987లో బెంగళూరులో పాకిస్థాన్‌పై మణిందర్ సింగ్ ఈ ఘనతను సాధించాడు.

3 సౌతాఫ్రికా గడ్డపై అత్యుత్తమ ప్రదర్శన చేసిన మూడో భారత బౌలర్‌గా సిరాజ్ (6/15). శార్దూల్ (7/61), హర్భజన్ (7/120) టాప్‌లో ఉన్నారు.

స్కోరుబోర్డు

సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (సి) జైస్వాల్ (బి) సిరాజ్ 2, ఎల్గర్ (బి) సిరాజ్ 4, జోర్జి (సి) రాహుల్ (బి) సిరాజ్ 2, స్టబ్స్ (సి) రోహిత్ (బి) బుమ్రా 3, బెడింగమ్ (సి) జైస్వాల్ (బి) సిరాజ్ 12, వెరీనె (సి) గిల్ (బి) సిరాజ్ 15, జాన్సెన్ (సి) రాహుల్ (బి) సిరాజ్ 0, కేశవ్ (సి) బుమ్రా (బి) ముకేష్ 3, రబాడ (సి) అయ్యర్ (బి) ముకేష్ 5, బర్గర్ (సి) జైస్వాల్ (బి) బుమ్రా 4, ఎన్‌గిడి (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 23.2 ఓవర్లలో 55 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-5, 2-8, 3-11, 4-15, 5-34, 6-34, 7-45, 8-46, 9-55; **బౌలింగ్:** బుమ్రా 8-1-25-2, సిరాజ్ 9-3-15-6, ప్రసిద్ధ్ 4-1-10-0, ముకేష్ 2.2-2-0-2.

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) రబాడ 0, రోహిత్ (సి) జాన్సెన్ (బి) బర్గర్ 39, గిల్ (సి) జాన్సెన్ (బి) బర్గర్ 36, కోహ్లీ (సి) మార్‌క్రమ్ (బి) రబాడ 46, అయ్యర్ (సి) వెరీనె (బి) బర్గర్ 0, రాహుల్ (సి) వెరీనె (బి) ఎన్‌గిడి 8, జడేజా (సి) జాన్సెన్ (బి) ఎన్‌గిడి 0, బుమ్రా (సి) జాన్సెన్ (బి) ఎన్‌గిడి 0, సిరాజ్ (రనౌట్/బర్గర్) 0, ప్రసిద్ధ్ (సి) మార్‌క్రమ్ (బి) రబాడ 0, ముకేష్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 24; మొత్తం: 34.5 ఓవర్లలో 153 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-17, 2-72, 3-105, 4-110, 5-153, 6-153, 7-153, 8-153, 9-153; **బౌలింగ్:** రబాడ 11.5-2-38-3, ఎన్‌గిడి 6-1-30-3, బర్గర్ 8-2-42-3, జాన్సెన్ 9-2-29-0.

సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (బ్యాటింగ్) 36, ఎల్గర్ (సి) కోహ్లీ (బి) ముకేష్ 12, జోర్జి (సి) రాహుల్ (బి) ముకేష్ 1, స్టబ్స్ (సి) రాహుల్ (బి) బుమ్రా 1, బెడింగమ్ (బ్యాటింగ్) 7; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 17 ఓవర్లలో 62/3; వికెట్ల పతనం:** 1-37, 2-41, 3-45; **బౌలింగ్:** బుమ్రా 6-0-25-1, సిరాజ్ 5-2-11-0, ముకేష్ 6-2-25-2.

1 టెస్ట్ చరిత్రలో ఒక్క పరుగు కూడా జత చేయకుండా 6 వికెట్లు కోల్పోయిన తొలి జట్టుగా టీమిండియా చెత్త రికార్డును మూటగట్టుకొంది. | భారత్‌తో ఆడిన టెస్టులో ఓ ఇన్నింగ్స్‌లో అత్యల్ప స్కోరు (55 పరుగులు) చేసిన జట్టుగా సౌతాఫ్రికా. 2021లో ముంబైలో న్యూజిలాండ్ 62 రన్స్ చేసింది.

2 మొదటిరోజే 23 వికెట్లు కూలడం టెస్ట్ చరిత్రలో రెండోసారి. 1902లో మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మధ్య మ్యాచ్‌లో తొలిరోజు 25 వికెట్లు పడ్డాయి.

సిరాజ్ చిరస్మరణీయ ప్రదర్శన కనబరచినా.. భారత బ్యాటింగ్ వైఫల్యం నిరాశపరిచింది. అనూహ్యమైన బౌన్స్‌తో బ్యాటర్లు ఇబ్బందులు పడుతున్న వేళ.. స్వల్ప ఆధిక్యం రోహిత్ సేనకు కలసి రానుంది. తొలి ఇన్నింగ్స్‌లో సఫారీలు 55 పరుగులకే ఆలౌట్ కాగా.. భారత్ ఒక్క పరుగు కూడా చేర్చకుండా 6 వికెట్లు చేజార్చుకొన్న చెత్త రికార్డును మూటగట్టుకుంది. వికెట్ల జాతర చూస్తుంటే.. మరో రెండు సెషన్లలో మ్యాచ్ ఫలితం వచ్చినా ఆశ్చర్యపోనవసరంలేదు.

కేప్‌టౌన్: పేసర్ల జోరు.. బ్యాటర్ల బేజారు..! ఇదీ భారత్, దక్షిణాఫ్రికా మధ్య బుధవారం మొదలైన రెండో టెస్ట్ తొలి రోజు పరిస్థితి. పిచ్ బౌలర్లకు సహకరిస్తుండడంతో ఒక్క రోజే 23 వికెట్లు కూలాయంటే మ్యాచ్ ఎలా సాగుతోందో అర్థం చేసుకోవచ్చు. అసమానమైన బౌన్స్‌తోపాటు స్వింగ్ అవుతున్న బంతులు బ్యాటర్లకు సవాల్ విసురుతున్న నేపథ్యంలో రెండో రోజే మ్యాచ్ ముగిసే అవకాశం ఉంది. సిరాజ్ (9-3-15-6) కెరీర్ బెస్ట్ గణాంకాలు నమోదు చేయడంతో.. తొలి ఇన్నింగ్స్‌లో సౌతాఫ్రికా 23.2 ఓవర్లలో 55 పరుగులకే కుప్పకూలింది. వెరీనె (15), బెడింగమ్ (12) మినహా మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే వెనుదిరిగారు. బుమ్రా, ముకేష్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ 34.5 ఓవర్లలో 153 పరుగులకు ఆలౌటైంది. కోహ్లీ (46), రోహిత్ (39), గిల్ (36) ఫర్వాలేదనిపించారు. అయితే, 153 పరుగుల వద్ద ఒక్క రన్ కూడా జోడించకుండానే 6 వికెట్లను చేజార్చుకొన్న టీమిండియా.. 98 పరుగుల ఆధిక్యం సాధించింది. రబాడ, ఎన్‌గిడి, బర్గర్ తలో మూడు వికెట్లు పడగొట్టారు. తొలి రోజు ఆటముగిసే సమయానికి దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 17 ఓవర్లలో 62/3తో ఆడుతోంది. మార్‌క్రమ్ (36), బెడింగమ్ (7) క్రీజులో ఉన్నారు. చివరి టెస్ట్ ఆడుతున్న ఎల్గర్ (4, 12) విఫలమయ్యాడు. ముకేష్ 2 వికెట్లు పడగొట్టాడు. ప్రస్తుతానికి 36 పరుగుల ఆధిక్యంతో టీమిండియాదే పైచేయిగా కనిపిస్తోంది.

పెవిలియన్‌కు క్యూ: పేసర్ సిరాజ్ నిప్పులు చెరగడంతో.. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న సౌతాఫ్రికా బెంబేలెత్తింది. మరోవైపు బుమ్రా కూడా కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో.. వికెట్లు టపటపా నేలరాలాయి. స్వయంగా షార్ట్‌లెగ్‌లో ఫీల్డింగ్ చేసిన రోహిత్.. అటాకింగ్ ఫీల్డింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లపై ఒత్తిడి పెంచాడు. ఓపెనర్ మార్‌క్రమ్ (2) బలహీనతను గమనించిన సిరాజ్.. ఆఫ్‌స్టంప్‌నకు ఆవలగా బంతులేసి ఫలితం సాధించాడు. బయటకు వెళ్తున్న బాల్‌ను ఆడే ప్రయత్నంలో స్లిప్స్‌లో ఉన్న జైస్వాల్ అద్భుత క్యాచ్ అందుకోవడంతో సఫారీల పతనం ఆరంభమైంది. ఓపెనర్ ఎల్గర్.. సిరాజ్ బౌలింగ్‌లో వికెట్ల మీదకు ఆడుకొన్నాడు. స్టబ్స్ (3)ను బుమ్రా క్యాచవుట్ చేయగా.. ఫామ్‌లో ఉన్న జోర్జి (2)ని సిరాజ్ లెగ్‌సైడ్ బాల్‌తో బోల్తా కొట్టించాడు. దీంతో సౌతాఫ్రికా 15 పరుగులకు 4 టాపార్డర్ వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. అయితే, కొంతసేపు క్రీజులో నిలిచిన బెడింగమ్, వెరీనె ఐదో వికెట్‌కు 19 పరుగులు జోడించారు. కానీ, బెడింగమ్, జాన్సెన్ (0)ను ఒకే ఓవర్‌లో అవుట్ చేసిన సిరాజ్.. తన ఆరో వికెట్‌గా వెరీనెను పెవిలియన్ చేర్చాడు. బర్గర్ (4)ను బుమ్రా క్యాచవుట్ చేయగా.. కేశవ్ (3), రబాడ (5)ను ముకేష్ వెనక్కిపంపాడు.



ఎన్‌గిడి (3/30)

భారత్ 153/4 నుంచి 153/10 దాకా..

34వ ఓవర్‌లో	ఎన్‌గిడి	W 0 W 0 W 0
35వ ఓవర్‌లో	రబాడ	0 W 0 W W

11 బంతుల్లో 6 వికెట్లు: అనంతరం తొలి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన భారత్.. ఒక దశలో మెరుగ్గా కనిపించింది. కానీ, 153 పరుగుల స్కోరు వద్ద నాటకీయ రీతిలో 11 బంతుల్లో 6 వికెట్లను కోల్పోయింది. ఏకంగా ఆరుగురు డకౌటయ్యారు. ఓపెనర్ జైస్వాల్ (0)ను రబాడ డకౌట్ చేసినా.. రోహిత్, గిల్ రెండో వికెట్‌కు 55 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్నారు. అయితే, రోహిత్‌తోపాటు గిల్, శ్రేయాస్ (0)ను బర్గర్ అవుట్ చేయడంతో టీ సమయానికి భారత్ 111/4తో నిలిచింది. కానీ, మూడో సెషన్‌లో కోహ్లీ అడపాదడపా షాట్లతో స్కోరుబోర్డును నడిపించగా.. రాహుల్ (8) ఎక్కువగా డిఫెన్స్‌కే పరిమితమయ్యాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు 43 పరుగులు జోడించారు. అయితే, 153/4 స్కోరు వద్ద రాహుల్‌ను ఎన్‌గిడి అవుట్ చేయడంతో.. పతనం మొదలైంది. 34వ ఓవర్‌లో రాహుల్‌తోపాటు జడేజా (0), బుమ్రా (0)ను ఎన్‌గిడి వెనక్కి పంపాడు. తర్వాతి ఓవర్‌లో సిరాజ్ (0) రనౌట్ కాగా.. కోహ్లీ, ప్రసిద్ధ్ (0)ను అవుట్ చేసి రబాడ భారత ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

మార్‌క్రమ్ నిలకడగా..: చివరి సెషన్‌లో రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా 17 ఓవర్లు ఆడింది. తొలి ఇన్నింగ్స్‌లో స్వల్ప స్కోరుకే వెనుదిరిగిన ఓపెనర్ మార్‌క్రమ్ నిలకడగా ఆడుతుండడం సఫారీలకు ఊరటనిచ్చే విషయం. మార్‌క్రమ్, ఎల్గర్ తొలి వికెట్‌కు 37 పరుగుల భాగస్వామ్యం నమోదు చేశారు. అయితే, ఎల్గర్, జోర్జి (1)ను ముకేష్ అవుట్ చేయగా.. స్టబ్స్‌ను బుమ్రా వెనక్కిపంపాడు. కానీ, బెడింగమ్ మరో వికెట్ ఇవ్వకుండా రోజును ముగించాడు.



కోహ్లీ @ 9

దుబాయ్: విరాట్ కోహ్లీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో మళ్లీ టాప్-10లోకి దూసుకొచ్చాడు. బుధవారం విడుదల చేసిన ఐసీసీ టెస్ట్ బ్యాటర్ల జాబితాలో కోహ్లీ 4 స్థానాలు ఎగబాకి 9వ ర్యాంక్‌లో నిలిచాడు. కేన్ విలియమ్సన్, జో రూట్ టాప్-2లో ఉన్నారు. రోహిత్ 4 స్థానాలు కోల్పోయి 14వ ర్యాంక్ దక్కించుకొన్నాడు. బౌలర్ల విభాగంలో అశ్విన్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. జడేజా, బుమ్రా నాలుగు, ఐదు ర్యాంకుల్లో నిలిచారు. ఆల్‌రౌండర్ల జాబితాలో జడేజా నెం:1 ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు.



మలుపు తిరిగిన రెజ్లింగ్ రగడ

- సీనియర్లపై జూనియర్ల తిరుగుబాటు
- కార్యవర్గాన్ని పునరుద్ధరించాలని అల్టిమేటం
- లేదంటే అవార్డులు వెనక్కి ఇస్తామని హెచ్చరిక

డబ్ల్యూఎఫ్ఐ మాజీ చీఫ్ బ్రిజ్‌భూషణ్ అనుచరుల నుంచి తన తల్లికి బెదిరింపులు వస్తున్నాయని సాక్షీ మాలిక్ వెల్లడించింది. తమకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని చెప్పింది. కాగా..సంజయ్ సింగ్ మినహా సమాఖ్య కొత్త కార్యవర్గం అంతా తమకు ఆమోదయోగ్యమేనని చెప్పింది. రెజ్లింగ్‌కు

మా అమ్మకు బెదిరింపులు సాక్షీ మాలిక్



నేను 18 నుంచి 20 సంవత్సరాలు సేవ చేశా. ఈ క్రమంలో ఎన్ని ఇబ్బందులకు గురయ్యానో నాకే తెలుసు. సోషల్ మీడియాలో బాగా తప్పుడు ప్రచారం జరుగుతోంది. జూనియర్ రెజ్లర్ల నిరసన గురించి మీడియా ద్వారానే నాకు తెలిసింది. జంతర్ మంతర్‌లో ఆందోళన చేసిన వారు అతడి మద్దతుదారులే' అని సాక్షి చెప్పింది.

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) వివాదం బుధవారం అనూహ్య మలుపు తిరిగింది. ఇప్పటివరకు దేశ అగ్రశ్రేణి రెజ్లర్లంతా సమాఖ్య మాజీ చీఫ్ బ్రిజ్‌భూషణ్, సస్పెండైన కొత్త కార్యవర్గం అధ్యక్షుడు సంజయ్ సింగ్‌కు వ్యతిరేకంగా ఆందోళనకు దిగగా..తాజాగా వినేశ్, సాక్షి, బజ్‌రంగ్ పూనియాపై జూనియర్ రెజ్లర్లు వ్యతిరేక గళమెత్తారు. రెజ్లింగ్ సమాఖ్య గొడవలతో ఏడాదంతా నష్టపోయామని, అందుకు బజ్‌రంగ్, సాక్షి, వినేశ్ కారణమని ఆరోపిస్తూ జంతర్ మంతర్ వద్ద మూడు గంటలపాటు నిరసనకు దిగారు. ఉత్తరప్రదేశ్, హరియాణా, ఢిల్లీ నుంచి దాదాపు 300మంది జూనియర్ రెజ్లర్లు బస్సుల్లో ధర్నాకు తరలివచ్చారు. స్టార్ రెజ్లర్లకు వ్యతిరేకంగా నినదిస్తూ వచ్చిన వారిని అడ్డుకోవడం పోలీసులకు కష్టతరమైంది. ఢిల్లీలో చలి తీవ్రంగా ఉన్నా లెక్క చేయని రెజ్లర్లు ఉదయం 11 నుంచి 3 గంటలపాటు ధర్నాలో పాల్గొన్నారు. డబ్ల్యూఎఫ్ఐపై కేంద్ర ప్రభుత్వం విధించిన సస్పెన్షన్‌ను 10 రోజుల్లోగా ఎత్తివేయకపోతే తమ అవార్డులను వెనక్కిస్తామని వారు హెచ్చరించారు. అలాగే సాక్షి, వినేశ్, బజ్‌రంగ్ చిత్రాలతో కూడిన ప్లకార్డులను కాళ్లతో తొక్కి ఆగ్రహం ప్రకటించారు. గతనెల 21న ఎన్నికైన డబ్ల్యూఎఫ్ఐ కొత్త కార్యవర్గం అండర్-15, అండర్-20 జాతీయ చాంపియన్‌షి‌ప్‌ను మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ స్వస్థలం గోండాలో నిర్వహించనున్నట్టు ప్రకటించింది. దాంతో సమాఖ్య రాజ్యాంగాన్ని ఉల్లంఘించిందంటూ గతనెల 24న నూతన కార్యవర్గాన్ని కేంద్ర క్రీడాశాఖ సస్పెండ్ చేసిన విషయం విదితమే. ఫలితంగా కొత్త కార్యవర్గం నిర్వహించ తలపెట్టిన రెండు టోర్నీలూ రద్దయ్యాయి. ఈనేపథ్యంలో జూనియర్ రెజ్లర్లు నిరాశకు లోనయ్యారు. మహిళా రెజ్లర్లను బ్రిజ్‌భూషణ్ లైంగికంగా వేధిస్తున్నాడంటూ సరిగ్గా ఏడాది కిందట ఇదే జంతర్ మంతర్‌లో టాప్ రెజ్లర్లు ఆందోళనకు దిగారు. అప్పట్లో వారికి దేశ వ్యాప్తంగా వివిధ వర్గాలనుంచి భారీ మద్దతు లభించడం విశేషం.

గ్వాలియర్‌లో జూనియర్ చాంపియన్‌షిప్: అండర్-15, అండర్-20 జాతీయ చాంపియన్‌షిప్‌ను ఆరు వారాలలోపు గ్వాలియర్‌లో నిర్వహిస్తామని, నిరసన వ్యక్తంజేస్తున్న రెజ్లర్లు..ఆ పోటీలకోసం సాధన చేయాలని అడ్‌హాక్ కమిటీ సూచించింది.

పాకిస్థాన్ 313 ఆలౌట్

ఆసీస్‌తో మూడో టెస్టు

సిడ్నీ: కెప్టెన్ కమిన్స్ (5/61) వరుసగా మూడో ఇన్నింగ్స్‌లోనూ ఐదు వికెట్లు తీయడంతో.. ఆస్ట్రేలియాతో బుధవారం ప్రారంభమైన మూడో టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో పాకిస్థాన్ 313 పరుగులకు ఆలౌటైంది. 96/5తో కష్టాల్లో పడ్డ పర్యాటక జట్టును రిజ్వాన్ (88), ఆమెర్ జమాల్ (82), ఆఘా సల్మాన్ (53) అర్ధ శతకాలతో ఆదుకున్నారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన ఆసీస్ తొలిరోజు ఆఖరికి వికెట్ నష్టపోకుండా 6 పరుగులు చేసింది.



అనంతపురం కలెక్టరేట్ వద్ద బైఠాయించిన అంగన్వాడీలు



చెరబట్టి...

విజయవాడలో ఆందోళన చేస్తున్న అంగన్వాడీలపై పోలీసులు జులుం ప్రదర్శించారు. చీరలు చించేశారు. శరీరంపై గిచ్చేశారు. పిడిగుద్దులు కురిపించారు



చీరలు చించేసి...



బలవంతంగా బస్సులోకి



విజయనగరం కలెక్టరేట్ వద్ద బైఠాయించిన అంగన్వాడీలు

అంగన్ వార్

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు అడ్డుకొన్నారు. అంగన్వాడీలను, వారికి మద్దతు తెలిపిన నేతలను అరెస్టు చేశారు. అయినా కూడా అన్ని నిర్బంధాలను దాటుకుని వెళ్లి కలెక్టరేట్లను ముట్టడించారు. సమస్యలన్నీ పరిష్కరించాలంటూ నినాదాలతో హోరెత్తించారు. పలుచోట్ల భారీ ర్యాలీలు నిర్వహించారు. రహదారులపై కూర్చుని భోజనాలు చేశారు. ఈ నెల 4వ తేదీ లోపు తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించాలని, లేకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చిన అంగన్వాడీ కార్యకర్తలకు విజయవాడలో అధికారులు మంగళవారమే నోటీసులు జారీచేశారు. తక్షణమే విధుల్లో చేరాలని, లేకుంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. అయినా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి సిద్ధమయ్యారు. తొలుత మ్యూజియం రోడ్డుకు చేరుకున్నవారిని పోలీసులు అరెస్టు చేశారు. తర్వాత బాలోత్సవ భవన్, ఎంబీవీకే భవన్ నుంచి బయటకు వస్తున్న వారిని అరెస్టు చేసి వాహనాల్లోకి ఎక్కించారు. మహిళలను జుట్టు పట్టుకుని లాగేశారు. దీంతో పోలీసులపై అంగన్వాడీ కార్యకర్తలు తిరగబడ్డారు. నెల్లూరు జిల్లాలో కలెక్టరేట్ ప్రధాన ముఖద్వారం నుంచి 100 అడుగుల వరకు ముళ్లకంచె, బారికేడ్లు ఏర్పాటు చేసి ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో సాయంత్రం 4గంటల వరకు అక్కడే బైఠాయించి, ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని ప్రకాశం భవనం వద్దకు వేలసంఖ్యలో కార్యకర్తలు, ఆయాలు తరలివచ్చారు. ఆ భవనాన్ని అష్టదిగ్బంధం చేసి, కలెక్టర్ బయటకు రావాలంటూ నినాదాలు చేశారు. పోలీసులు రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేసి ఆందోళనకారులను నియంత్రించేందుకు ప్రయత్నించారు. కలెక్టరేట్ లోనికి చొచ్చుకుపోయేందుకు కార్యకర్తలు పలుమార్లు యత్నించారు. ఈ సందర్భంగా పోలీసులకు, అంగన్వాడీలకు మధ్య తోపులాట జరిగి, పలువురు మహిళలకు గాయాలయ్యాయి. బాపట్ల కలెక్టరేట్‌కు వెళ్లే దారులన్నింటినీ పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. వందల సంఖ్యలో పోలీసులతో కలెక్టరేట్ దగ్గర పహారా పెట్టారు. ఖాకీల ఆంక్షలను దాటుకుని మరీ పెద్ద ఎత్తున అంగన్వాడీలు కలెక్టరేట్ గేటు వద్దకు చేరుకుని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. ఈ నెల 5లోపు విధుల్లో చేరాలన్న జీవో ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు.

సీమలో మరింత ఉధృతంగా...

కర్నూలు జిల్లాలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన అంగన్వాడీలు జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కడప కలెక్టరేట్ ముట్టడికి వస్తున్న అంగన్వాడీలను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. అయినా కార్యకర్తలు పెద్దసంఖ్యలో కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అక్కడే రోడ్డుపై బైఠాయించి సుమారు 4గంటల పాటు ధర్నా చేశారు. అన్నమయ్య జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు రాకుండా పోలీసులు నిలువరించారు. అయినా రాయచోటి, లక్కిరెడ్డిపల్లె ప్రాజెక్టుల నుంచి సుమారు 1,200మంది తరలివచ్చారు. కలెక్టరేట్ వద్ద జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. సాయంత్రం కలెక్టరేట్ ముట్టడికి యత్నించారు. తిరుపతి కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీలు భారీ సంఖ్యలో బైఠాయించారు. సమస్యలు పరిష్కరించకుంటే సీఎం ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. జిల్లా నలుమూలల నుంచీ 3,500మందికి పైగా కార్యకర్తలు తరలివచ్చారు. అనంతపురం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద రోడ్డుపైనే బైఠాయించి నిరసన తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో అంగన్వాడీలను కలెక్టరేట్‌కు వెళ్లనివ్వకుండా పోలీసులు అడ్డగించారు. దీంతో గణేష్ కూడలిలో బైఠాయించి నినాదాలు చేశారు. అనంతరం పోలీసుల వలయాన్ని ఛేదించుకుని కలెక్టరేట్ వద్దకు చేరుకుని ధర్నా చేశారు. నంద్యాలలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా ఉన్న దీక్షా శిబిరం నుంచి వేలసంఖ్యలో భారీ ర్యాలీ చేపట్టి కలెక్టరేట్‌ను ముట్టడించారు. కలెక్టరేట్ ఎదురుగా కర్నూలు-కడప జాతీయ రహదారిపై బైఠాయించారు. చిత్తూరు జిల్లాలో అంగన్వాడీలు కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరిని అడ్డుకోవడంతో పోలీసులకు, అంగన్వాడీ కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. పలువురు సొమ్మసిల్లిపడిపోగా మరికొందరికి స్వల్పగాయాలయ్యాయి. పలువురు సీఐటీయూ నేతలను పోలీసులు ఈడ్చుకెళ్లి అరెస్టు చేశారు.

పోలీసుల దాష్టీకాన్ని ఖండిస్తున్నాం

ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్

'వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలు తదితర కోర్కెల సాధన కోసం వేలాది మంది అంగన్వాడీలు కలెక్టరేట్లను ముట్టడించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ వద్ద అంగన్వాడీ మహిళలపై పోలీసులు దాష్టీకానికి పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం' అని ఏపీ అంగన్వాడీ, వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బేబిరాణి బుధవారం తెలిపారు. తమ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మను టార్గెట్ చేసి మరీ పదుల సంఖ్యలో పోలీసులు కుళ్లబొడిచారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది వర్కర్లు గాయాలపాలై ఆసుపత్రుల్లో ఉన్నారన్నారు. అన్ని జిల్లాల్లో పోలీసులు అక్రమంగా అరెస్టు చేసిన వారందరినీ విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. సమ్మె యథావిధిగా కొనసాగుతుందని స్పష్టం చేశారు.

మహిళలపై పోలీసుల జులుం

విశాఖపట్నంలో జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా గల గాంధీ విగ్రహం వద్ద నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా బయలుదేరిన సిబ్బందిని పోలీసులు అడుగడుగునా అడ్డుకునేందుకు యత్నించారు. రోప్ పార్టీలను వినియోగించారు. ఈ క్రమంలో పోలీసులకు, అంగన్వాడీ సిబ్బందికి మధ్య తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. వేర్వేరు మార్గాల్లో సుమారు 100మంది కలెక్టరేట్ వద్దకు చేరుకుని పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళన నిర్వహించారు. విశాఖలో సుమారు 700 మందిని అరెస్టు చేశారు. తోపులాటలో పది మందికిపైగా అంగన్‌వాడీ సిబ్బంది, ఒక కానిస్టేబుల్ గాయపడ్డారు. శ్రీకాకుళంలో వేలాది మంది అంగన్వాడీలు కలెక్టరేట్ వద్ద రోడ్డుపై బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పార్వతీపురంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం కలెక్టర్ కార్యాలయం ముందు ప్రధాన రహదారిపై బైఠాయించారు. ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొనేందుకు పార్వతీపురం వచ్చిన డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు అంగన్వాడీలు ప్రయత్నించారు. పోలీసులు వారిని పక్కకు తప్పించి డిప్యూటీ సీఎం కాన్వాయ్‌ను పంపించారు. విజయనగరంలో కలెక్టరేట్ ముట్టడికి వేలాదిగా తరలివచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కలెక్టరేట్‌కు వచ్చిన సీడీపీవో జి.ప్రసన్నను అంగన్వాడీలు చుట్టుముట్టి అరగంటపాటు నిర్బంధించారు. పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి అంగన్వాడీ కార్మికులు భారీగా భీమవరానికి తరలి వచ్చారు. పోలీసులు భారీ బందోస్తు ఏర్పాటు చేసినప్పటికీ అంగన్వాడీలు భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్‌కు చేరుకోవడంతో ఉద్రిక్త వాతావారణం నెలకొంది. కొంతమంది నాయకులను పోలీసులు ఈడ్చుకుంటూ తీసుకెళ్లి అరెస్టు చేశారు. వారిని వెంటనే విడుదల చేయాలని అంగన్వాడీలు రోడ్డుపై బైఠాయించారు. చివరికి నాయకుల్ని విడుదల చేయడంతో మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి సభ నిర్వహించారు. ఏలూరు జిల్లాలో అంగన్వాడీలు కలెక్టరేట్ వద్ద మహా ధర్నా చేపట్టారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది అంగన్వాడీలు కలెక్టరేట్ వద్దకు చేరుకుని ప్రధాన రహదారికి ఇరువైపులా బైఠాయించారు.

మున్సిపల్' సమ్మె ఉధృతం

- నెల్లూరులో అత్యవసర సేవల సిబ్బంది విధులకు దూరం
- అనంతలో నడిరోడ్డుపై సహపంక్తి భోజనాలు
- నగరపాలిక ఆవరణలో చెత్త పడేసి నిరసన
- 9వ రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె

నెల్లూరు(సిటీ), అనంతపురం క్రైం, జనవరి 3: మున్సిపల్ కార్మికుల సమ్మె మరింత ఉధృతమైంది. డిమాండ్ల సాధన కోసం వీరు చేపట్టిన నిరసనలు 9వ రోజు బుధవారం కొనసాగాయి. విధులు బహిష్కరించిన పారిశుధ్య కార్మికులకు సంఘీభావంగా బుధవారం నెల్లూరులో అత్యవసర సేవల విభాగాలకు చెందిన సిబ్బంది సైతం ఆందోళనబాట పట్టారు. ఇంజనీరింగ్ విభాగంలోని వర్క్ఇన్‌స్పెక్టర్లు, ఎలక్ట్రికల్ సిబ్బంది, పంపు ఆపరేటర్లు, పీడబ్ల్యూఎస్ కార్మికులు, వాల్ ఆపరేటర్లు, ఫిట్టర్ కూలీలు విధులు బహిష్కరించారు. వీరంతా పారిశుధ్య కార్మికులతో కలసి నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దీంతో నెల్లూరు నగరవాసులకు అత్యవసర సేవలు ఆందోళనకరంగా మారాయి. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మెలోనే కొనసాగుతామంటూ స్పష్టం చేస్తూ మున్సిపల్ కార్మికులు ముత్తుకూరు కూడలి నుంచి మినీబైపాస్ మీదుగా జ్యోతిరావు పూలే విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి ఆధ్వర్యంలో అనంతపురం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట కార్మికులు నడిరోడ్డుపై సహపంక్తి భోజనం చేశారు. నగరంలోని చెత్తను తీసుకువెళ్లి నగరపాలిక కార్యాలయ ఆవరణలో పడేసి నిరసన తెలిపారు.

విధుల్లో చేరకుంటే వేటు!

- కేజీబీవీ, సమగ్రశిక్ష ఉద్యోగులకు బెదిరింపులు

అనంతపురం విద్య, జనవరి 3: సమ్మె వీడి విధుల్లో చేరాలని, లేకుంటే వేటు వేస్తామని అనంతపురం జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు ఉన్నతాధికారులు ఉద్యోగులను బెదిరిస్తున్నట్లు సమాచారం. కేజీబీవీ ఉద్యోగులు, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయ ఉద్యోగులకు ఫోన్లు చేసి, కొందరిని ఆఫీసుకు పిలిపించి గురువారం నుంచి విధుల్లో చేరాలని బెదిరించారని తెలిసింది. బుధవారం సాయంత్రం వరకూ ఈ బెదిరింపుల పర్వం కొనసాగిందని అంటున్నారు. కాగా, సమ్మెను అణచివేయడంలో భాగంగా అధికారులు గత నెలలో 52మంది ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు పంపారు. తాజాగా మరో 150మందికి నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, సమగ్రశిక్ష ఉద్యోగులకు సీఎం జగన్ అన్యాయం చేశారని, తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీకి అనంతపురం సమగ్రశిక్ష ఉద్యోగులు పోస్టు కార్డులు రాశారు.

ఈ ఫొటోలు చూస్తుంటే భారీ యంత్రాలతో ఇసుక తవ్వి తరలిస్తున్నట్లుంది

- ధవళేశ్వరం వద్ద ఇసుక అక్రమ తవ్వకాలను నిలువరించండి: తూర్పు ఎస్పీకి హైకోర్టు ఆదేశం

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద ఇసుక అక్రమ తవ్వకాలను నిలువరించాలని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీని హైకోర్టు ఆదేశించింది. ఆ నివేదికను కోర్టు ముందుంచాలని స్పష్టం చేసింది. పిటిషనర్లు కోర్టు ముందు ఉంచిన ఫొటోలను పరిశీలిస్తే నది ఒడ్డున ఆనుకొని భారీ యంత్రాలతో ఇసుక తవ్వి తరలిస్తున్నట్లు కనపడుతోందని వ్యాఖ్యానించింది. యంత్రాలు, వాహనాలను గుర్తించి సీజ్ చేయడం పోలీసులకు పెద్ద విషయం కాదని అభిప్రాయపడింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. దవళేశ్వరం బ్యారేజ్ వద్ద జయప్రకాశ్ పవర్ వెంచర్స్ లిమిటెడ్, ట్రంకీ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ భారీ యంత్రాలతో ఇసుక తవ్వుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదంటూ జి.వంశీ దినేశ్ రెడ్డి ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున న్యాయవాది నర్రా శ్రీనివాస్ వాదనలు వినిపించారు.





మెగా డీఎస్సీ వేయాలంటూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలో మంత్రి బొత్స కార్యాలయాన్ని ముట్టడించేందుకు వెళ్తున్న నిరుద్యోగులను పోలీసులు అడ్డుకున్నారు. యువతను ఇలా ఈడ్చేసి తరలించేశారు

అధికారంలోకి రాకముందు!

"చంద్రబాబు పాలనలో అక్షరాలా ఉపాధ్యాయ ఉద్యోగాలు 23 వేలు ఖాళీగా ఉన్నాయి. ఓవైపు ప్రభుత్వ పాఠశాలలను పటిష్ఠం చేయాలి. అందుకోసం టీచర్ ఖాళీలు భర్తీ చేయాలి. ప్రతి నిరుద్యోగికీ ఇప్పుడు చెబుతున్నా. దేవుడి దయవల్ల మనందరి ప్రభుత్వం వస్తే వెంటనే మెగా డీఎస్సీ వేసి మొత్తం ఖాళీలు భర్తీచేస్తాం"
- ఇదీ.. 2019 ఎన్నికల ప్రచారంలో జగన్ మెగా హామీ!

అధికార పీఠం ఎక్కాక!

ఉపాధ్యాయ ఖాళీలపై జగన్ ప్రభుత్వం అనేకసార్లు మాట మార్చింది. ఒకసారి ఖాళీలు లేవని, మరోసారి ఉన్నాయని ఏమార్చింది. ఇంకోసారి రాష్ట్ర వ్యాప్తంగా 12 వేల మంది టీచర్లు అదనంగా ఉన్నట్టు లెక్కగట్టింది. ఇన్నాళ్లు అదిగో డీఎస్సీ, ఇదిగో డీఎస్సీ అని మాయ మాటలు చెప్పి ఇప్పుడు మౌనం వహించింది. లక్షలమందిని వంచనకు గురిచేసింది.

డీఎస్సీ.. నయవంచన

- విపక్షంలో ఉన్నప్పుడు హామీలు
- అధికారంలోకి వచ్చాక వంచనలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మాటతప్పడు, మడమ తిప్పడు అంటూ వైసీపీ మంత్రులు, నాయకులు గొప్పగా చెప్పుకొనే సీఎం జగన్.. మెగా డీఎస్సీ విషయంలో మాట, మడమ రెండూ తిప్పేయడమే కాకుండా ఆశావహ అభ్యర్థులకు నయవంచన చేశారు. ఉపాధ్యాయ ఖాళీల భర్తీని పూర్తిగా అటకెక్కించారు. డీఎస్సీ నోటిఫికేషన్లు ఇచ్చే ఉద్దేశం ప్రభుత్వానికి అసలు లేనేలేదని స్పష్టమైపోయింది. దాదాపు నెలన్నర కిందటే పాఠశాల విద్యాశాఖ ఉపాధ్యాయ ఖాళీలపై ప్రభుత్వానికి సవివర నివేదిక పంపింది. అయితే, ప్రభుత్వ స్థాయిలో దానిని పక్కన పెట్టినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఇంత కాలం అదిగో డీఎస్సీ, ఇదిగో డీఎస్సీ అని మాటలు చెప్పిన ప్రభుత్వ పెద్దలు, విద్యాశాఖ మంత్రి గత కొంతకాలంగా డీఎస్సీపై పూర్తిగా మౌనం వహించారు. ఒకవైపు డీఎస్సీ నోటిఫికేషన్లు ఇవ్వాలని నిరుద్యోగులు పెద్దఎత్తున ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం కనీసం స్పందించడం లేదు. దీంతో ఇక, ఈ ప్రభుత్వంలో డీఎస్సీ ఉండదని పాఠశాల విద్యాశాఖ వర్గాలు కూడా ఒక అభిప్రాయానికి వచ్చాయి.

అదనంగా ఉన్నట్లు లెక్క

ఉపాధ్యాయ ఖాళీలపై ప్రభుత్వం అనేకసార్లు మాట మార్చింది. ఒకసారి ఖాళీలు లేవని, మరో సందర్భంలో ఉన్నాయని ఏమార్చింది. ఏడాది కిందట 717 ఖాళీలే ఉన్నట్లు అసెంబ్లీ సాక్షిగా సర్కారు వెల్లడించింది. ఆరు నెలల కిందట 18,520 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అయితే 8,366 మంది టీచర్లు మాత్రమే అవసరం ఉందని ప్రకటించింది. ఆ లెక్కలు చెప్పిన తర్వాత గత అక్టోబరులో ఖాళీల వివరాలు పంపాలని పాఠశాల విద్యాశాఖ జిల్లాల అధికారులను ఆదేశించింది. ఆ లెక్కల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా 12 వేల మంది టీచర్లు అదనంగా ఉన్నట్లు లెక్కగట్టింది. ఒక్క విజయనగరం జిల్లాలోనే 1200 మంది అదనంగా ఉన్నారని తేల్చింది. అదేసమయంలో కర్నూలు జిల్లాలో 3 వేల మంది, నెల్లూరులో 150 మంది ఎస్టీటీలు, ప్రకాశంలో వంద మంది ఎస్టీటీలు, నెల్లూరు, కడప, చిత్తూరు జిల్లాల్లో వంద మంది చొప్పున అవసరం ఉన్నట్లు పేర్కొంది.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోవడంతోనే టీచర్ల అవసరం లేకుండా పోయింది. గత రెండేళ్లలో దాదాపు 6లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడులకు దూరమయ్యారు. అదే సమయంలో ప్రభుత్వం పాఠశాలల విలీనం చేపట్టింది. అటు విద్యార్థులు తగ్గిపోవడం, మరోవైపు విలీనంతో అనేక చోట్ల ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. 20 మంది విద్యార్థులు దాటితేనే రెండో టీచర్ నిబంధనను అమలు చేశారు. జీవో 117, 128 తీసుకొచ్చి టీచర్ల అవసరాన్ని భారీగా కుదించి ఇక డీఎస్సీ అవసరమేముందనే ఆలోచనకు ప్రభుత్వం వచ్చింది.

రుణంతో మెలిక

పలు విద్యారంగ ప్రాజెక్టుల పేరుతో జగన్ ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు నుంచి రూ.వేల కోట్ల రుణం సమీకరించింది. అయితే, రుణం ఇచ్చేముందు బోధనా సిబ్బందిని తగ్గించుకోవాలని ప్రపంచ బ్యాంకు షరతు విధించింది. ఇప్పటికే 30వేల మంది టీచర్లు అదనంగా ఉన్నారని, ఆ భారం తగ్గించుకుంటే రుణం ఇస్తామని మెలిక పెట్టింది. దీంతో 117, 128 జీవోలు తెచ్చి టీచర్ల అవసరాన్ని ప్రభుత్వం తగ్గించేసింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 23వేల మంది టీచరు పోస్టులు ఖాళీగా ఉన్నాయని జగన్ చెప్పగా.. ఒక్క డీఎస్సీ వేయకుండానే 12వేల మంది అదనంగా మిగిలిపోయారని ఇప్పుడు పేర్కొంటోంది.

టెట్ రాయించి.. అభ్యర్థులను ఊరించి..

ఏడాదిన్నర కిందట ప్రభుత్వం టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) నిర్వహించింది. దీనికి ముందు టెట్ అర్హతకు కాలపరిమితి ఉండేది. దాన్ని ఎత్తివేసి ఒకసారి రాస్తే జీవితకాలం అర్హత ఉంటుందనే నిబంధన పెట్టింది. దీంతో ఒకేసారి 6లక్షల మందికి పైగా టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. చివరికి 5 లక్షల మంది టెట్ రాసి అర్హత సాధించారు. టెట్ నిర్వహించారంటే ఇక డీఎస్సీ ఖాయమని నిరుద్యోగులు భావించారు. కానీ, ఏళ్లు గడిచినా డీఎస్సీ నోటిఫికేషన్లు మాత్రం రావడం లేదు. ఎన్నికలకు ముందు 5వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి తెలంగాణ డీఎస్సీ నోటిఫికేషన్లు ఇచ్చింది. అప్పుడైనా మనకు కూడా ఇస్తారేమోనని ఇక్కడివారు ఎదురుచూశారు. కానీ, ప్రభుత్వం మాత్రం స్పందించలేదు.

నోటిఫికేషన్ విడుదల చేయాలి

- బొత్స ఇంటిని ముట్టడించిన నిరుద్యోగులు

విజయవాడ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ప్రకటించి ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో యువకులు జలవనరుల శాఖ ప్రాంగణంలో ఉన్న మంత్రి బొత్స సత్యనారాయణ (క్యాంపు) ఇంటిని ముట్టించారు. భారీ సంఖ్యలో యువకులు, నిరుద్యోగులు అక్కడికి చేరుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బొత్స ఇంటివైపు వెళ్తున్న నిరసనకారులను వీధి మొదట్లోనే పోలీసులు అరెస్టు చేశారు. యువకులను ఎత్తి బస్సుల్లోకి విసిరేశారు. నిరసనకారులు ప్రతిఘటించడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

సీఎం అయినప్పటి నుంచి.. జగన్ మమ్మల్ని దూరం పెట్టారు

- విధి లేని పరిస్థితుల్లోనే ఏపీలోకి: బ్రదర్ అనిల్

కడప, జనవరి 3(ఆంధ్రజ్యోతి): 'జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన రోజునుంచే షర్మిలను, నన్ను దూరం పెడుతూ వచ్చారు. ఏపీ రాజకీయాల్లోకి అడుగు పెట్టాలని షర్మిలకు ఆసక్తే లేదు. ఆయనే విధిలేని పరిస్థితులు కల్పించడంతో రావలసి వచ్చింది' అని వైఎస్ షర్మిల భర్త, సీఎం జగన్ బావ బ్రదర్ అనిల్ వ్యాఖ్యానించారు. బుధవారం కడప విమానాశ్రయంలో విజయవాడ వెళ్లేందుకు ఆయన ఎదురుచూస్తుండగా.. టీడీపీ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు బీటెక్ రవి, దేవగుడి నారాయణరెడ్డి (మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి సోదరుడు) కూడా విజయవాడ వెళ్లేందుకు వచ్చారు. వీరంతా లాంజ్‌లో అనుకోకుండా కలిశారు. రవి, నారాయణరెడ్డి.. అనిల్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. షర్మిల కాంగ్రెస్‌లో చేరుతున్న సందర్భంగా ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ సందర్భంగా వారి మధ్య ఆసక్తికర చర్చ జరిగినట్లు తెలిసింది. మీ డిబేట్లు చూస్తుంటానని.. ముక్కుసూటిగా మాట్లాడతారని బీటెక్ రవితో అనిల్ అన్నారు. షర్మిలతో కలిసి ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్‌లో చేరతామని చెప్పారు. ఆమెకు పీసీసీ అధ్యక్ష పదవి ఇస్తున్నారా అని అడుగగా... 'అది రాహుల్‌గాంధీ ఇష్టం. పీసీసీ ఇస్తారా.. సీడబ్ల్యూసీలో సభ్యత్వం ఇస్తారా అనేది మా మధ్య చర్చకు రాలేదు. కాంగ్రెస్ ఏ బాధ్యతలు ఇచ్చినా ఓకే' అని అనిల్ బదులిచ్చారు. షర్మిలకు పీసీసీ ఇస్తే కడప జిల్లాలో వైసీపీపై ప్రభావం, కాంగ్రెస్‌లో చేరికల గురించి చర్చ జరిగినట్లు తెలిసింది. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఎక్కడ ఉన్నా.. జిల్లా రాజకీయాలను దివంగత వివేకానందరెడ్డే చూసేవారని, ఆయన్ను అంత దారుణంగా హత్య చేయడం బాధాకరమని అనిల్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించినట్లు సమాచారం. ఆ హత్య కేసులో తమను ఇరికించే ప్రయత్నం చేశారని, ఇబ్బందులకు గురిచేశారని బీటెక్ రవి, నారాయణరెడ్డి తెలిపారు. అనిల్‌తో చర్చపై బీటెక్ రవి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. బ్రదర్ అనిల్ తమ ఊరి అల్లుడు కావడంతో నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పానని అన్నారు.

జనసేనలోకి కాంగ్రెస్, వైసీపీ నేతలు

- వంశీకృష్ణ శ్రీనివాస్‌కు విశాఖ అర్బన్ బాధ్యతలు
- రామ విగ్రహ ప్రతిష్ఠకు పవన్‌కు ఆహ్వానం

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన కాంగ్రెస్, వైసీపీ నాయకులు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో పార్టీలో చేశారు. బుధవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో అధ్యక్షులు పవన్ కల్యాణ్ పార్టీ కండువా కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ విజయవాడ నగర మాజీ అధ్యక్షులు బాడిత శంకర్, మాజీ కార్పొరేటర్లు చిలక సలోమి భగవాన్, సముద్రాల ప్రసాద్, అవనిగడ్డకు చెందిన వైసీపీ నాయకులు ఎంవీకే రామాంజనేయులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ఇతర నాయకులు పాల్గొన్నారు. కాగా, జనసేన పార్టీ విశాఖపట్నం అర్బన్ జిల్లా అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ చెన్నుబోయిన వంశీకృష్ణ యాదవ్‌ను నియమించారు. ఈ మేరకు పవన్ నియామకపత్రాన్ని అందించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ జయకేతనం ఎగురవేసేలా ప్రణాళికాబద్ధంగా పని చేయాలన్నారు.

అయోధ్యకు ఆహ్వానం..

జనసేనాని పవన్‌కు అయోధ్య రామ మందిరం ప్రారంభ వేడుకకు ఆహ్వానం అందింది. ఆర్ఎస్ఎస్, విశ్వ హిందూ పరిషత్ ప్రముఖులు బుధవారం మధ్యాహ్నం మంగళగిరి జనసేన కేంద్ర కార్యాలయంలో పవన్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. అయోధ్య రామ మందిరం నిర్మాణానికి పవన్ రూ.30 లక్షలు విరాళమిచ్చిన తెలిసిందే.

అన్నకు ఆహ్వానం!

- జగన్ నివాసానికి వెళ్లిన షర్మిల.. కుమారుడి పెళ్లి కార్డు అందజేత



అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె షర్మిల.. బుధవారం తాడేపల్లిలో తన అన్న, సీఎం జగన్మోహన్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. తన కుమారుడు రాజారెడ్డి వివాహ ఆహ్వానపత్రికను అందజేశారు. మంగళవారం ఇడుపులపాయలోని తన తండ్రి సమాధి వద్ద కుమారుడి పెళ్లి పత్రికను మొదటిగా పెట్టి ఆశీర్వాదం తీసుకున్న ఆమె.. బుధవారం కుటుంబ సభ్యులతో ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి వచ్చారు. అక్కడ ఆమెకు మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి స్వాగతం పలికారు. గన్నవరం నుంచి తాడేపల్లి చేరుకున్న షర్మిల సాయంత్రం 5.38 గంటలకు జగన్ నివాసంలో అడుగుపెట్టారు. అన్నావదినలకు కుమారుడి పెళ్లి పత్రిక అందజేసి.. పెళ్లికి రావాలని ఆహ్వానించారు. కేవలం 15 నిమిషాలు మాత్రమే జగన్ నివాసంలో ఉన్నారు. అక్కడి నుంచి నేరుగా గన్నవరం సమీపంలోని కేసరపల్లిలోని విల్లాలో బ్రదర్ అనిల్‌తో ఆమె సమాలోచనలు సాగించారు. అనంతరం షర్మిల.. భర్తతో కలిసి ఢిల్లీ బయల్దేరారు. గురువారం ఆమె కాంగ్రెస్‌లో చేరతారు.

రాష్ట్ర సారథ్యం అప్పగించేందుకే రాహుల్ మొగ్గు!

కాంగ్రెస్‌లో చేరుతున్న షర్మిలకు ఆంధ్ర పీసీసీ పగ్గాలు అప్పగించేందుకే రాహుల్ మొగ్గు చూపుతున్నారు. ఇటీవల ఢిల్లీలో రాష్ట్ర నేతలతో జరిగిన సమావేశంలో.. ఆయన, ఖర్గే ప్రత్యేకంగా షర్మిల ప్రస్తావన తీసుకొచ్చారు. రాష్ట్రానికి చెందిన ఇద్దరు మాజీ ఎంపీలు తప్ప ఆమె రాకను అందరూ స్వాగతించారు. పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తన అభిప్రాయాన్ని వెల్లడిస్తుండగా.. రాహుల్ జోక్యం చేసుకుని.. రాష్ట్ర కాంగ్రెస్‌లో షర్మిలకు ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ నుంచే వచ్చాం.. మళ్లీ అందులోకే: ఆళ్ల

మంగళగిరి, జనవరి 3: మళ్లీ తాను వైసీపీలోకి వెళ్లే ప్రసక్తే లేదని, షర్మిలతోపాటు కాంగ్రెస్‌లో చేరబోతున్నానని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. ఒకప్పుడు తామంతా కాంగ్రెస్ నుంచే వచ్చామని, ఇప్పుడు మళ్లీ అదే పార్టీలో చేరుతున్నామని తెలిపారు. షర్మిల కాంగ్రెస్‌లో చేరుతున్న నేపథ్యంలో.. తాను కూడా త్వరలోనే చేరతానని ప్రకటించారు. ఏపీ నుంచి చేరబోయే మొదటి ఎమ్మెల్యేను తానేనన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయాలా వద్దా అనేది అధిష్ఠానం నిర్ణయిస్తుందన్నారు. రాజధాని అమరావతిలో బలవంతపు భూసేకరణను మాత్రమే వ్యతిరేకించానని చెప్పారు. ఈ నోటిఫికేషన్‌ను రద్దుచేయాలని అనేక మార్లు జగన్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు.

మాపై పోలీసు కేసును కొట్టేయండి

- హైకోర్టును ఆశ్రయించిన వివేకా కుమార్తె

పులివెందుల పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ దివంగత వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్ దాఖలుచేసిన వ్యాజ్యాలు బుధవారం హైకోర్టులో విచారణకు వచ్చా యి. సాంకేతిక కారణాలతో న్యాయమూర్తి విచారణను శుక్రవారానికి వాయి దా వేశారు. వ్యాజ్యాలలో అభ్యర్థనను సవరించుకోవాలని పిటిషనర్లకు సూచించారు. కేసు నమోదుచేసి విచారణ జరపాలంటూ పోలీసులను ఆదేశిస్తూ పులివెందుల ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ గతేడాది డిసెంబరు 8న జారీచేసిన ఉత్తర్వులు, తదనంతర ఎఫ్ఐఆర్, చార్జిషీట్లను రద్దుచేసేలా కోరాలని పేర్కొన్నారు. దీనికి సునీత తరఫు న్యాయవాదులు అంగీకరించారు. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ భానుమతి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు అధికారి ఎస్పీ రామ్‌సింగ్ కోరిన విధంగా సాక్ష్యం చెప్పాలని, లేకుంటే హత్యకేసులో ఇరికిస్తామని వివేకా కుమార్తె సునీత, అల్లుడు ఒత్తిడికి గురి చేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయడం లేదని ఆరోపిస్తూ కృష్ణారెడ్డి పులివెందుల కోర్టును ఆశ్రయించారు. పరిశీలించిన కోర్టు కేసు నమోదు చేసి జనవరి 4లోగా తుది నివేదిక ఇవ్వాలని ఆదేశించగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో వారు హైకోర్టును ఆశ్రయించారు.

ఇదేమి 'యోగ్యత'?

- సొంత నియోజకవర్గంలో పనికిరారు..
- వారే పక్క నియోజకవర్గానికి అభ్యర్థులు
- ఓటమి, వ్యతిరేకత ముద్ర వేసి మార్పులు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'నీపై వ్యతిరేకత ఉంది. నువ్వు పనికిరావు. నువ్వు ఓడిపోతావు' అని స్పష్టంగా తేల్చి చెప్పాక అదే ఎమ్మెల్యేను పక్క నియోజకవర్గ ప్రజల మీద రుద్దడంలో అర్థమేమిటి?

...సీట్ల కేటాయింపుపై సీఎం జగన్ నిర్ణయాలు చూసిన తర్వాత తలెత్తుతున్న ప్రశ్న ఇది!

రాజకీయ సమీకరణాలు, ఇతరత్రా కారణాల వల్ల ఎమ్మెల్యేల సీట్లను అటూ ఇటూ మార్చడం సహజమే. కానీ... ఇది చాలా తక్కువగా జరుగుతుంది. కానీ... ఇప్పుడు జగన్ చేస్తున్నది వేరు. 'సొంత నియోజకవర్గంలో మీపై వ్యతిరేకత ఉంది. ఇక్కడ మీరు ఓడిపోతారు' అనే ముద్ర వేసి, అదే నేతలను పక్కన నియోజకవర్గాలకు అభ్యర్థులుగా ప్రకటిస్తున్నారు. దీనిపై వైసీపీలో తీవ్ర చర్చ జరుగుతోంది. అభ్యర్థుల ఎంపికపై జగన్‌లోనే స్పష్టత లేదని నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. 'గడపగడపకూ'లో పాల్గొనడమే ప్రాతిపదికగా టికెట్లు ఇస్తామని జగన్ పలుమార్లు ప్రకటించారు. కానీ.. ఆ జాబితాలో ఉన్న అనేకమంది 'పెద్దల' సీట్లు భద్రంగానే ఉన్నాయి. కానీ... అనేకమంది ఇతరుల సీట్లు గల్లంతు కావడమో, మారిపోవడమో జరిగింది. ఉషశ్రీ చరణ్, విడదల రజిని, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఆదిమూలపు సురేశ్, మేరుగ నాగార్జున, కంబాల జోగులు, వెలంపల్లి శ్రీనివాస్ తదితరుల స్థానాలను మార్చేశారు. ఇంకా ఎందరిని మార్చేస్తారో తెలియదు! "అయోగ్యుడు అనే ముద్రవేసి పంపితే పక్క నియోజకవర్గం ప్రజలు నమ్ముతారా? మేం ఓట్లు అడిగేదెలా?" అని వైసీపీ నేతలే వాపోతున్నారు. ఈ మార్పుడాలు, ఏమార్చుడాలు అసలుకే మోసం తెస్తాయని... యుద్ధరంగంలోకి దిగక ముందే ఆత్మరక్షణలో పడినట్లవుతోందని అంటున్నారు.

'అమరావతి'పై సుదీర్ఘ వాదనలు వింటాం!

తర్వాతే దీనిపై నిర్ణయం: సుప్రీం

న్యూఢిల్లీ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి కేసు విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. దీనిపై సుదీర్ఘ వాదనలు విన్నాకే నిర్ణయం తీసుకుంటామని స్పష్టంచేసింది. 'రాష్ట్రానికి అమరావతే రాజధాని' అని హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ వైసీపీ ప్రభుత్వం వేసిన పిటిషన్‌పై బుధవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ పిటిషన్‌పై ఏప్రిల్‌లో సుదీర్ఘంగా వాదనలు విన్న తర్వాతే నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది. రాష్ట్రప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి, రైతుల తరఫున న్యాయవాది దేవదత్ కామత్ వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం నాలుగు వారాల్లోగా అఫిడవిట్లు, కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది.

అన్యాయం కనవా.. ఓ 'సాయి' దేవా!

అమ్మో ఎమ్మెల్యే

(మొదటి పేజీ తరువాయి)

భూ కబ్జాలు, సెటిల్‌మెంట్‌లను ఎంచుకున్నారు. ఇక తానేమీ తక్కువంటూ సదరు నేత వారసుడు 'నేనుసైతం' అంటూ అక్రమార్జనకు పాల్పడుతున్నాడు. చిన్నవయసులోనే తండ్రిని మించిపోయాడని చర్చ సాగుతోంది. వాణిజ్య, వ్యాపార రంగంలో రెండో ముంబాయిగా ఖ్యాతి పొందిన ఆ పట్టణం, నేడు వైసీపీలోని ఓ ముఖ్య ప్రజాప్రతినిధి నిర్వాకంతో దందాలు, సెటిల్‌మెంట్లు, భూకబ్జాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. తన కోసం పనిచేసేందుకు ఓ సెటిల్‌మెంట్ సైన్యాన్నే ఏర్పాటు చేసుకున్నారు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతానికి చెందిన కీలక నియోజకవర్గంలో ఓ ప్రజాప్రతినిధి అవినీతి అక్రమాల బాగోతమిది!

ఆ 'అట్రాసిటీ' మామూలుగా ఉండదు..

ఆ నియోజకవర్గంలో సదరు నేత మూడు పర్యాయాలు ప్రజాప్రతినిధిగా ఎంపికయ్యారు. తొలిసారి ఎన్నికల బరిలో దిగినప్పుడు ఆయన కుటుంబ ఆర్థిక పరిస్థితి ఏమిటి? ప్రస్తుత స్థితి ఏమిటి? అని నిత్యం ప్రజలు చర్చించుకుంటుంటారు. అంతగా అక్రమాస్తులు పోగేశారు. అనతికాలంలోనే బహిరంగ మార్కెట్‌లో రూ.వందల కోట్లు విలువ చేసే ఆస్తులు కూడబెట్టారు. అన్న వెనుక ఉండే సెటిల్‌మెంట్ గ్యాంగ్‌కు భయపడి ఎవరూ నోరు మెదపరు. సెటిల్‌మెంట్‌కు ససేమిరా అనేవారిపై గ్యాంగ్‌లోని కొందరితో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టిస్తారు. ఇక్కడ పోలీస్ వ్యవస్థ ఆయనకు దాసోహం అనాల్సిందే. దీంతో బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదు. ఎవరైనా వెళ్లినా పెద్దల పంచాయతీ ఇది.. అక్కడికే వెళ్లి తేల్చుకోండి.. కోర్టు గీర్టు అంటే మీరే నష్టపోతారు అంటూ ఆ ప్రజాప్రతినిధి వద్దకే పోలీసులు పంపుతుండటం గమనార్హం.

'మూడు'ముక్కలాట!

మూడు ముక్కలాట అంటే పేకాట ఒక్కటే కాదు. మట్కా, మద్యం, బెట్టింగ్. ఈ మూడూ అన్న అండదండలతో మూడు పువ్వులు.. ఆరు కాయలుగా విరాజిల్లుతున్నాయి. సదరు నేత భూ కబ్జాలు, సెటిల్‌మెంట్లు, దందాలతో పాటు మట్కా, మద్యం, సబ్సిడీ బియ్యం అక్రమ రవాణాలోనూ తన మార్క్ చూపుతున్నాడు. మొత్తం దందాలో ఆయనతో పాటు తనయుడు, అనుచరుల హస్తం ఉందని జగమెరిగిన సత్యం. పట్టణంలో మట్కా బీటర్లకు అండదండలు ఉండటంతో నెలనెలా రూ.లక్షల మామ్ముళ్లు ఆయన కుటుంబానికి చేరుతున్నాయి. పోలీసులు కళ్లుమూసుకుని ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. నామమాత్రపు దాడులతో మమ అనిపిస్తున్నారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులకు ఆయన అండ ఉందని, వారినుంచీ భారీగా ముడుపులు అందుతున్నాయని చెబుతారు. ఆయన అనుచరులు కొందరు కర్ణాటక మద్యం అక్రమవ్యాపారంలో ఆరితేరిపోయారు. పోలీసులు దాడులు చేస్తే క్షణాల్లో ఆ నాయకుడి నుంచి ఫోన్ వెళ్తుంది. దీంతో పోలీసులు సైతం చేతకాని స్థితిలో ఉండిపోయారు.

కొండను కొల్లగొట్టారు...

ఎర్రమట్టి మాఫియాకూ ఆ ప్రజాప్రతినిధి మద్దతు ఉందని చెబుతున్నారు. రియల్ వెంచర్లు, భవన నిర్మాణాల్లో ఎర్ర గరుసుకు డిమాండ్ ఉంది. కీలక ప్రజాప్రతినిధి అండదండలతో ఎర్రమట్టి అక్రమార్కులు ఇష్టానుసారంగా తవ్వకాలు చేస్తున్నారు. బైపాస్ రోడ్డు పక్కనే ఉన్న కొండను ధ్వంసం చేశారు. అక్కడి నుంచి పలు రెవెన్యూ గ్రామాల పరిధిలో కొండలపై పడ్డారు. రోజుకు వంద టిప్పర్లు (1,200 టన్నులు) ఎర్రమట్టి తరలిస్తున్నట్లు సమచారం. టన్ను రూ.300 ప్రకారం 12 టన్నుల మేర టిప్పరు రూ.3,600 నుంచి రూ.4వేల వరకు విక్రయిస్తున్నారు. ఎర్రమట్టి మాఫియాను అన్న వారసుడు పెంచిపోస్తున్నాడు. టన్నుకు రూ.100 కప్పం కట్టాల్సిందే. అంటే ఎర్రమట్టి మాఫియా ద్వారా రూ.లక్షకు పైగా అక్రమార్జన రూపంలో వస్తుందని అంటున్నారు. ఎర్రమట్టి తవ్వాకాలపై ఏ ఒక్కరూ కన్నెత్తి చూడకుండా ఓ గ్యాంగ్ కాపలా కాస్తోంది.

పేదల బియ్యం కుంభకోణం..

పేదల కోసం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం కూడా సదరు నేత మేతకు సరిపోవడం లేదు. ఉచితంగా సరఫరా చేస్తున్న రాయితీ బియ్యం కిలో రూ.7 ప్రకారం అనుచరులు సేకరించి స్టాక్ పాయింట్లకు తరలిస్తారు. అక్కడి నుంచి లారీల్లో గుట్టుచప్పుడు కాకుండా కాకినాడ, కర్ణాటకలోని సిరుగుప్ప ప్రాంతాలకు రవాణా చేసి అక్కడ కిలో రూ.14-20 (క్వింటా రూ.1,400-2,000)లకు విక్రయిస్తున్నారు. నెలకు సరాసరి 45-50 లారీలకు పైగా పేదల బియ్యం అక్రమ రవాణా చేస్తూ ఒక్కో లారీకి రూ.50-70 వేలు ప్రకారం నెలకు రూ.25-30 లక్షల ఆర్జిస్తున్నారు. అధికారం మాటున బియ్యం మాఫియా సాగిస్తున్న ఈ దందా వెనుకు ఆ ప్రజా ప్రతినిధి వారసుడు కీలక పాత్ర పోషిస్తున్నాడు. బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన నిఘా యంత్రాంగం సదరు నేతకు భయపడి ఏమీ చేయలేని పరిస్థితిలో ఉండిపోయారు.

పంచాయతీ భూములూ వదల్లేదు!

పట్టణంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులుగా చెలామణి అవుతున్న ఆయన అనుచరులు కమ్యూనిటీ అవసరాలైన పార్కు, పాఠశాల వంటి వాటికోసం వదిలిన 72 సెంట్ల పంచాయతీ ఓపెన్‌సైట్ స్థలాన్ని ఆక్రమించి ప్లాట్లుగా వేసి అమ్మకానికి పెట్టారు. అక్కడ సెంటు రూ.15లక్షల వరకు పలుకుతోంది. అంటే ఆ స్థలం విలువ రూ.10కోట్లు పైమాటే. 'ఇది పంచాయతీ పార్కు స్థలం' అని ఉన్న బోర్డును తొలగించి ప్లాట్లు వేశారు. తెర ముందు అనుచరులు ఉంటే.. తెర వెనుక ఆ ప్రజాప్రతినిధి ఉన్నాడని స్థానికులు అంటున్నారు. దీనిపై ఫిర్యాదు చేసినవారిని తన ఇంటికి పిలిపించి, బెదిరించినట్లు సమాచారం. అలాగే, ఓ మహిళకు చెందిన దాదాపు 70సెంట్ల భూమిని ఆక్రమించి వెంచర్ వేశారు. ఆమె ప్రశ్నించడంతో నామమాత్రపు ధర చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు ఆరోపణలున్నాయి.

రూ.10 లక్షల ఆస్తికి రూ.లక్ష సెటిల్‌మెంట్!

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనకాలే ఉన్న సర్వే నంబరు 352 పరిధిలోని 4.54 ఎకరాల భూమిపై ఆ కీలక ప్రజాప్రతినిధి కన్ను పడింది. అంతే గెలిచిన నెల రోజులకే ఆయన అనుచరులు ఆ భూమి చుట్టూ బండలు పాతేశారు. 1992లో ఆ భూమిలో ఇద్దరు వ్యక్తులు వెంచర్లు వేస్తే ఎప్పటికైనా పట్టణం అభివృద్ధి చెందుతుందనే ఆశతో పలువురు నిరుపేదలు, సామాన్యులు, చిరువ్యాపారులు రెక్కలు ముక్కలు చేసుకొని పైసాపైసా కూడబెట్టిన డబ్బుతో ఆ ప్లాట్లు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారు. దాదాపు 20 ఏళ్ల గడిచింది. రియల్ భూమ్ పెరగడంతో ప్రస్తుతం అక్కడ సెంటు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు పలుకుతోందని బాధితులు అంటున్నారు. అంటే ఎకరం రూ.10 కోట్లు చొప్పున 4.54 ఎకరాలు రూ.45-50 కోట్లకు పైగా పలుకుతోంది. సదరు నేత అనుచరులు బండలు పాతగానే లబోదిబోమంటూ దాదాపుగా 400 మందికి పైగా బాధితులు 'ఆ ప్లాట్లు మేము కొనుగోలు చేశాం.. న్యాయం చేయ'మని వెళితే.. పంచాయతీ పేరుతో సెంటు రూ.10 లక్షలకు పైగా విలువ చేసే స్థలానికి రూ.లక్ష చొప్పున రేటుకట్టి బలవంతంగా లాక్కున్నారంటూ బాధితులు ఏకరువు పెడుతున్నారు. సదరు నేత అధికారాన్ని చూసి భయంతో బయటకు చెప్పలేకపోతున్నారు. బాధితుల్లో అధికార పార్టీ వైసీపీ కార్యకర్తలు కూడా ఉండటం కొసమెరుపు!



ఎమ్మెల్సీ అనంతబాబుకు శుభాకాంక్షలు చెబుతున్న పోలీసు అధికారులు

అనంతబాబుకు సెల్యూట్!

- హత్యకేసు నిందితుడికి పోలీసుల మర్యాద
- ఎమ్మెల్సీ ఇంటికెళ్లి న్యూఇయర్ శుభాకాంక్షలు

రాజమహేంద్రవరం, జనవరి 3: దళిత డ్రైవరు సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితుడిగా ఉన్న ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్‌కు పోలీసులు సెల్యూట్ కొట్టి శుభాకాంక్షలు చెప్పడం చర్చనీయాంశమైంది. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా అల్లూరి జిల్లా అడ్డతీగల మండలం ఎల్లవరం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో రంపచోడవరం పోలీస్ డివిజన్ పరిధిలోని అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అనంతబాబు ఇంటికెళ్లి వారంతా శుభాకాంక్షలు చెప్పారు. ఆయనతో కలిసి అడ్డతీగల సీఐతో పాటు పలు మండలాల ఎస్ఐలు ఫొటోలు దిగారు. ఈ ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఈసారి ఆలోచించి ఓటేయండి

- ఆర్థిక పరిస్థితి బాగోలేదు.. అందుకే అభివృద్ధి చేయలేకపోయా
- రాజంపేట వైసీపీ ఎమ్మెల్యే మేడా వ్యాఖ్యలు



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

ఒంటిమిట్ట, జనవరి 3: రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగోలేదని, ఈ కారణంగానే అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గంలో ఆశించిన మేర అభివృద్ధి పనులు చేయలేకపోయానని వైసీపీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. బుధవారం ఒంటిమిట్టలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "రాజంపేటను అనుకున్నంత స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయా. రాబోయే ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయండి. మంచి అభ్యర్థిని ఎన్నుకోండి" అని అన్నారు. మంచి ముఖ్యమంత్రిని ఎన్నుకోవడం ద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. రాజంపేటలో ఏ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గెలిస్తే ఆ పార్టీకి చెందినవారు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రెడ్డెయ్య, తహసీల్దారు మాధవీలత, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Veduruppavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



నిరసనలో పాల్గొని సంఘీభావం తెలుపుతున్న ఎన్జీవో నేత విద్యాసాగర్

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం తీవ్రతరం: యూటీఎఫ్

ధర్నాచౌక్, జనవరి 3: ఉద్యోగ, ఉపాధ్యాయ పెండింగ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని లేందటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని యూటీఎఫ్ నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రతినెల 1న జీతాలు, పీఆర్సీ, డీఏలు, పీఎఫ్, ఏపీజీఎల్ఐ తదితర ఆర్థిక బకాయిల సాధనకై యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో యూటీఎఫ్ పోరుబాట పేరుతో స్థానిక ధర్నాచౌక్‌లో బుధవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.పీ.మనోహర్‌కుమార్ మాట్లాడుతూ సీఎం జగన్ తాను అధికారంలోకి వస్తే పెండింగ్ డీఏలు లేకుండా చూసి సకాలంలో అన్ని అన్ని డీఏలను చెల్లిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ఐదు డీఏలు పెండింగ్ పెట్టడం శోచనీయమన్నారు. ఏపీఎన్జీవో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏ విద్యాసాగర్, ఎండి ఇక్బాల్ ఈ దీక్షలో పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. పలువురు యూటీఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

సమస్య పరిష్కరించే వరకు పోరాటం

● మున్సిపల్ కార్మికులు

ధర్నాచౌక్, జనవరి 3: తమకు రూ.26వేల కనీస వేతనం, ఉద్యోగాలు పర్మినెంట్ చేసేదాకా తమ పోరాటం ఆగదని మున్సిపల్ కార్మికులు స్పష్టం చేశారు. తమ సమస్యల పరిష్కారానికి స్థానిక ధర్నాచౌక్‌లో చేపట్టిన ధర్నా 10వ రోజు బుధవారమూ కొనసాగింది. నగరమంతా నీళ్లు మాకు కన్నీళ్లు.... ఆప్కాస్ వద్దు పర్మినెంట్ ముద్దు అంటూ పెద్దఎత్తున కార్మికులు నినదించారు. చర్చల పేరుతో కాలయాపన చేయకుండా తక్షణమే తమ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపాల్టీలో అన్ని విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ప్రతీ కార్మికుడికి న్యాయం జరిగేంత వరకు ఉద్యమాన్ని విరమించేది లేదన్నారు. కొన్ని విభాగాల వారికి మాత్రమే న్యాయం చేస్తామని మిగిలిన వారికి మొండిచేయ్యి చూపడం తగదన్నారు. కార్మికులు మధ్య విభేదాలు తీసుకువచ్చే చర్యలు మానుకోవాలన్నారు. మున్సిపల్ కార్మికుల పట్ల ప్రభుత్వ నిరంకుశ వైఖరి తగదన్నారు.

పశువైద్య అంతర్ కళాశాలల క్రీడా, సాంస్కృతిక పోటీలు ప్రారంభం



గన్నవరం, జనవరి 3: స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో బుధవారం శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వ విద్యాలయం 12వ అంతర్ కళాశాలల క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. 4 పశువైద్య కళాశాలలు, ఒక డెయిరీ టెక్నాలజీ కళాశాల నుంచి 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలను జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. క్రీడాకారులు మార్చ్‌పాస్ట్ నిర్వహించారు. జేసీ సంపత్‌కుమార్ మాట్లాడుతూ క్రీడాకారులు స్పోర్టీవ్‌నెస్ కలిగి ఉండాలన్నారు. విశ్వ విద్యాలయ డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ జేవి రమణ మాట్లాడుతూ ఐదు రోజుల పాటు పోటీలు జరుగుతాయన్నారు. కళాశాల అసోసియేషన్ డీన్ డాక్టర్ పీవీఎస్ కిషోర్, ఎన్‌సీసీ ఆఫీసర్ అజిత్‌సింగ్ రాథోడ్ పాల్గొన్నారు.

ప్రధాని ఫొటో ఎక్కడ..?

» అధికారులకు కేంద్ర మంత్రి పర్షోత్తం రూపాల ప్రశ్న

పాలకొల్లు రూరల్, జనవరి 3: సాగర్ పరిక్రమలో భాగంగా ఫిష్ రెస్టారెంట్లు, స్టాల్స్‌ను ఏర్పాటు చేసుకుని యువత ఉపాధి పొందాలని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి పర్షోత్తం రూపాల సూచించారు. పశ్చిమ గోదావరిజిల్లా పాలకొల్లు మండలం దిగమర్రు-కొత్తపేట బైపాస్ వద్ద రూ.20లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్రా రెస్టారెంట్‌ను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర రెస్టారెంట్ బోర్డుపై ప్రధాని ఫొటో లేకపోవడాన్ని గమనించిన ఆయన మోదీ ఫొటో ఏదని అధికారులను ప్రశ్నించారు. కేంద్రం అమలు చేస్తున్న పథకాలపై మోదీ ఫొటో లేకపోవడంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

ఎన్నికల్లో లబ్ధి కోసం దేవుడినీ వదలడం లేదు

» సామాన్యులను దేవుడిని దూరం చేస్తున్నారు: రాంగోపాల్‌రెడ్డి

తిరుమల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం అధికార పార్టీ నాయకులు భగవంతుడిని కూడా వదిలిపెట్టడం లేదని టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ ఎమ్మెల్యే బాలవీరాంజనేయ స్వామి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో కలిసి తిరుమల శ్రీవారిని బుధవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. భక్తులకు దర్శనాల విషయంలో టీటీడీ అధికారులు వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరకరంగా ఉందన్నారు. కేవలం అధికార పార్టీ వారికే దర్శన సౌకర్యాలను కల్పిస్తూ సామాన్య భక్తులను భగవంతుడికి దూరం చేస్తున్నారన్నారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు, ఎంపీలకు రోజుకు 20 మందికి దర్శనం కల్పిస్తూ టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల విషయంలో వివక్ష చూపుతూ ఆరుగురికి మాత్రమే దర్శనం కల్పిస్తున్నారన్నారు.

నలుగురు వ్యాపారులు అరెస్టు

విశాఖపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తప్పుడు ఇన్వాయిస్‌లు సృష్టించి, వాటి ద్వారా వివిధ ప్రాంతాల్లో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందడానికి యత్నించిన నలుగురు వ్యాపారులను విశాఖపట్నం జీఎస్టీ ఇంటెలిజెన్స్ అధికారులు అరెస్టు చేశారు. వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరులో 30 ఏళ్లుగా ఉంటున్న ఓ వ్యాపారి మరో ముగ్గురు వ్యాపారులతో కలిసి 19 నకిలీ కంపెనీలు, సంస్థలను సృష్టించి వాటి ద్వారా రూ.293 కోట్ల నకిలీ ఇన్వాయిస్‌లను జారీచేశారు. కడప, కర్నూలు, బెంగళూరు, హైదరాబాద్‌లలో వ్యవహారాలు నడిపారు. ఈ నకిలీ ఇన్వాయిస్‌ల ద్వారా సుమారు రూ.30 కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను క్లెయిమ్ చేశారు. విశాఖపట్నం జోన్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ జనరల్ అధికారులు ఈ మోసాన్ని గుర్తించారు.

నేడు ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ ఆవిర్భావ సభ

తిరుపతి రూరల్, జనవరి 3: ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ ఆవిర్భావ సభను తిరుపతిలో గురువారం నిర్వహించనున్నారు. అన్నమయ్య సర్కిల్ సమీపంలోని రాస్ భవన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కృష్ణమనాయుడు, ఆత్మానందనాయుడు తెలిపారు.

కర్నూలులో ఎస్టీయూ వజ్రోత్సవాలు

అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రోపాధ్యాయ సంఘం వజ్రోత్సవ వేడుకలను ఈ నెల 12, 13 తేదీల్లో కర్నూలులో నిర్వహిస్తున్నట్లు ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న తెలిపారు. వేడుకల వాల్ పోస్టర్లను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ బుధవారం విజయవాడలో ఆవిష్కరించారు

నేటి నుంచి విశాఖలో కథా నాటిక పోటీలు

సీతంపేట (విశాఖపట్నం), జనవరి 3: తెలుగు సాహిత్యం, సంస్కృతిని ప్రతిబింబించేలా ఆజో-విభో-కందాళం ఫౌండేషన్, రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం నుంచి విశాఖపట్నంలో మూడు రోజుల పాటు కథానాటిక పోటీలను నిర్వహిస్తున్నట్టు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అప్పాజోశ్యుల సత్యనారాయణ, రైటర్స్ అకాడమీ అధ్యక్షుడు వీవీ రమణమూర్తి తెలిపారు. 31వ వార్షికోత్సవం సందర్భంగా మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు.



భవానీ దీక్షల విరమణ బుధవారం నుంచి ప్రారంభమైంది. ఐదు రోజులపాటు జరగనున్న ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణకు తెలుగు రాష్ట్రాల నుంచి భవానీలు పెద్దసంఖ్యలో వస్తుండటంతో బుధవారం ఉదయం నుంచే కొండ పరిసర ప్రాంతాలన్నీ కిటకిటలాడాయి.

అస్తవ్యస్త ఏర్పాట్లు

● దీక్షల విరమణలు ప్రారంభమైన కాసేపటికే పడిపోయిన కుళాయిలు ● తలలు తడుపుకునేందుకు భవానీల ఇబ్బందులు
● ఉచిత చెప్పుల స్టాండ్, క్లోక్‌రూముల వద్ద వసూళ్ల దందా ● తలనీలాలకు అదనంగా వసూలు ● అధికారులపై భవానీల ఆగ్రహం

వన్‌టౌన్, జనవరి 3: దుర్గగుడిలో బుధవారం ప్రారంభమైన భవానీదీక్షల విరమణల తొలిరోజే భక్తులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. ఏర్పాట్లపై ఉన్నతాధికారుల స్థాయిలోనూ సమీక్షలు జరిగినా, పోలీసులు, దేవస్థానం అధికారులు, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పలుమార్లు పర్యటించినా భవానీలు మాత్రం చేదు అనుభవాన్ని చవిచూశారు. కేశఖండనశాల వద్ద తలనీలాలు సమర్పించే భక్తులు తలలు తడుపుకునేందుకు ఏర్పాటు చేసిన కుళాయిలు పడిపోయాయి. పంపులు ఆన్‌చేయగానే ఒక్కసారిగా అవి తిరగబడిపోవడంతో భక్తులు నిశ్చేష్టులయ్యారు. భక్తులు, పోలీసులు, సిబ్బంది అవి పడిపోకుండా చూసేందుకు నానాయాతన పడ్డారు. దీంతో భక్తులు ఒక్కసారిగా ఒత్తిడికి గురై ఒకరినొకరు తోసుకుని వచ్చారు. ఎలాగో నిలబడ్డారు కానీ లేకుంటే ముందున్న కాలువలో పడిపోయేవారే. తరువాత ఇంజనీరింగ్ సిబ్బంది వచ్చి మరమ్మతులు చేపట్టారు. ఆ సమయంలో భక్తులు సమీపంలోని షాపుల వద్ద వాటర్‌బాటిళ్లను కొనుగోలు చేసి తలలు తడుపుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.





బాటిల్‌లోని నీటితో తల తడుపుకొంటున్న భక్తుడు, భక్తుల తలనీలాలు తీస్తున్న బార్బర్లు

క్షురకుల వసూలు దందా

కేశఖండనశాలలో క్షురకులు మొదటిరోజే వసూళ్ల దందాకు తెరలేపారు. ఒక్కో భక్తుడి నుంచి రూ.50 నుంచి రూ.100 వరకు అదనంగా వసూలు చేశారు. దేవస్థానం రూ.40 నిర్ణయించగా ఆ మొత్తాన్నీ క్షురకుడికే చెల్లిస్తారు. కానీ వారు అదనంగా వసూలు చేయడం సరికాదని భక్తులు వాపోయారు. అధికారులు ఏఈవో, పర్యవేక్షకుడు, సిబ్బంది అక్కడే ఉన్నా పట్టించుకోలేదని విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం నుంచి వచ్చినఅప్పలనాయుడు,దేవుడు, రామానాయుడు, సింహాచలం అభ్యంతరం వ్యక్తం చేశారు.



అస్వస్థతకు గురైన బాలుడిని పరిశీలిస్తున్న 108 సిబ్బంది

అంబులెన్స్ ఉంది కానీ..

కొండపైకి చేరుకున్న భక్తులు అస్వస్థతకు గురయ్యారు. చిన రాజగోపురం వద్ద మాత్రమే చిన్నపాటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అదీనూ భక్తులకు కనిపించేలా లేదు ఘాట్‌రోడ్డులో ఒక్కచోటన్నా వైద్య శిబిరం లేదు కొండపైన అంబులెన్స్ ఉన్నా, డ్రైవర్ జాడ మాత్రం తెలియలేదు. దీంతో ఇబ్బందులకు గురయ్యారు. విజయనగరానికి చెందిన బాలుడు నీలాకుమార్ (12) కడుపునొప్పితో బాధపడ్డారు. సెక్యూరిటీ, పోలీసులు అతడిని బల్లపై పడుకోబెట్టారు. 108 సిబ్బంది అతడిని పరిశీలించారు. చాలాసేపటి తరువాత అంబులెన్స్ డ్రైవర్ రావడంతో అతడిని ఆసుపత్రికి తరలించారు.

ఉచితం హుళక్కేనా..!

కార్పొరేషన్ ఆధ్వర్యంలో టెండర్లు పిలిచి ఏర్పాటు చేసిన చెప్పులస్టాండ్, క్లోక్ రూము వద్ద ఉచితమని బోర్డులు ఏర్పాటు చేయలేదు. చెప్పుల స్టాండ్, క్లోక్ రూమ్‌లోని సిబ్బంది అనధికారంగా వసూలు చేశారు. బ్యాగ్‌కు రూ.20, చెప్పుల జతకు రూ.20 చొప్పున వసూలు చేశారు. ఇలా వేలాదిగా బ్యాగులు, చెప్పుల జతలు వస్తే రోజంతా ఎంత వసూలవుతుందో అంచనా వేయవచ్చనే వ్యాఖ్యలు వినిపించాయి. దీనిపై భక్తులు విస్మయం వ్యక్తం చేశారు.



ఏర్పాట్లను అడిగి తెలుసుకుంటున్న సీపీ కాంతిరాణా

అలసత్వాన్ని సహించం: సీపీ

గుణదల: బందోబస్తు విధులు నిర్వహించేవారు అలసత్వం వహిస్తే సహించేది లేదని సీపీ కాంతిరాణా హెచ్చరించారు. ఏర్పాట్లు ఎలా ఉన్నాయి, సిబ్బంది విధులు ఎలా నిర్వహిస్తున్నారనేది పరిశీలించేందుకు సీపీ కాంతిరాణా ఇంద్రకీలాద్రికి వచ్చారు. అన్నదానం, హోమగుండాలు, క్యూలైన్లు పరిశీలించి సీతమ్మవారి పాదాలకు చేరుకున్నారు. బందోబస్తు సెక్టార్లను ట్రాఫిక్ డైవర్షన్లను స్వయంగా పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్‌జామ్ కాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సిబ్బందిని ఆదేశించారు. డీసీపీలు విశాల్ గున్ని, మేకా సత్తిబాబు, ఈవో కేవీఎస్ రామారావు, పశ్చిమ ఏసీపీ కె.హనుమంతరావు పాల్గొన్నారు.

తొలితరం మహిళా ఉద్యమకారిణి సావిత్రిభాయి పూలే: గోగుల, పోతిన

చిట్టినగర్, జనవరి 3: పీడిత ప్రజలు, స్త్రీల విద్యాభివృద్ధికి కృషిచేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి సావిత్రిభాయి పూలే అని మాజీ డిప్యూటీ మేయర్ గోగుల వెంకటరమణ, జనసేన పార్టీ నగరాధ్యక్షుడు పోతిన మహేష్ కొనియాడారు. సావిత్రి భాయి పూలే జయంతి బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డా.ఎన్వీరావు ఆధ్వర్యంలో బుధవారం చిట్టినగర్ నగరాల మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం కల్యాణమండపంలో జరిగింది. తొలుత జనసేన పార్టీ నగరాధ్యక్షుడు పోతిన మహేష్ పలువురు బీసీ నేతలతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం సావిత్రిభాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళా ఉపాధ్యాయులు జీ మల్లేశ్వరి, ఎస్‌కే షకీలాబేగం, డి.సురేఖ, బి.జోజి కుమారి, బీజ కరుణ, బీ భవానీ, కె.లలిత, వీ సోని, వీ వరలక్ష్మి, వై పద్మను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులతో సత్కరించారు. బీసీ నేతలు తట్టి అర్జునరావు, దుర్గగుడి మాజీ చైర్మన్ పైలా సోమినాయుడు, మాజీ కార్పొరేటర్ కె.మల్లిఖార్జునరావు, టీ శోభనాద్రిరావు, మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు (పీసీ), బీసీ ఐక్యవేదిక వ్యవస్థాపకుడు నాగేశ్వరరావు న్యాయవాది పిళ్లా రవి, ఐక్యవేదిక అధ్యక్షుడు బుద్దా నాగేశ్వరరావు, పోతిన బేసికంతేశ్వరుడు, బెవర సూర్యనారాయణ పాల్గొన్నారు.

వైఎస్ షర్మిలకు సాదర స్వాగతం

విమానంలో తాడేపల్లి వెళ్లి వచ్చి ఢిల్లీకి పయనం

గన్నవరం, జనవరి 3: గన్నవరం విమానాశ్రయానికి వైఎస్ షర్మిల బుధవారం కొడుకు, కాబోయే కోడలితో కలిసి ప్రత్యేక విమానంలో హైదరాబాద్ నుంచి విచ్చేశారు. కొడుకు వివాహ ఆహ్వాన పత్రికను సోదరుడు సీఎం జగన్‌కు ఇచ్చేందుకు వచ్చిన షర్మిలకు మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తదితరులు స్వాగతం పలికారు. మీడియా పలు ప్రశ్నగా అడగ్గా చిరునవ్వుతో వెళ్లిపోయారు. తిరిగి ఎయిర్‌పోర్టుకు వచ్చినపుడు మీడియాతో మాట్లాడుతూ పెళ్లి అనేది ముఖ్యమైందని అందుకే అన్న జగన్‌కు ఆహ్వాన పత్రిక ఇచ్చేందుకు వచ్చానన్నారు. అనంతరం ఎయిరిండియా విమానంలో షర్మిల, అనిల్ ఢిల్లీ వెళ్లారు.

షర్మిల బాటలోనే నేను: ఆళ్ల : షర్మిల బాటలోనే తాను నడుస్తానని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. షర్మిల బాటలోనే నడుస్తానే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి అధినాయకులతో కలిసి పనిచేయాలని నిశ్చయించుకున్నట్టు తెలిపారు.

భద్రతలో డివిజన్ రైల్వే ప్రగతి: డీఆర్ఎం

రైల్వేస్టేషన్, జనవరి 3: 2023లో రైల్వే డివిజన్ భద్రత విషయంలో మంచిప్రగతి కనిపించిందని డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ అన్నారు. రైల్వే స్టేడియంలో బుధవారం 68వ రైల్వే వారోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని 20 రైల్వేస్టేషన్‌లను అమృత భారత్ పథకం కింద అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2022-2023లో డివిజన్ రూ.5311.98 కోట్లు ఆర్జించిందన్నారు. అంతకుముందు ఏడాదితో పోలిస్తే 9.13 శాతం వృద్ధి సాధించిందన్నారు. 34.35 మిలియన్ టన్నుల సరుకు రవాణా జరిగిందన్నారు. 2022-2023లో ఆదర్శ సేవలందించిన 51 మందికి అవార్డులు అందచేసి అభినందించారు. ఏడీఆర్ఎంలు శ్రీనివాసరావు, శ్రీకాంత్ పాల్గొన్నారు. ఏపీఏ అనురుధ్ ముగింపు పలికారు.

జగన్‌రెడ్డికి తొత్తుగా మారిన ఎస్టీ కమిషన్

వన్‌టౌన్, జనవరి 3: రాష్ట్ర ఎస్టీ కమిషన్ జగన్‌రెడ్డికి తొత్తుగా మారిందని రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం ధారు నాయక్ విమర్శించారు. బందరురోడ్డులోని ఎస్టీ కమిషన్ కార్యాలయం ఎదుట టీడీపీ ఎస్టీసెల్ ఆధ్వర్యంలో ఎస్టీ కమిషన్ సభ్యుల వైఖరికి నిరసనగా బుధవారం ఆందోళనచేపట్టారు. కార్యాలయాన్ని ముట్టడించి, అక్కడ బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమిషన్ తీరు చూస్తుంటే గిరిజనులపై దాడులను ప్రభుత్వమే ప్రోత్సహించినట్లుగా ఉందన్నారు. పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. జగన్‌రెడ్డికి తొత్తులుగా మారిన ఎస్టీ కమిషన్ సభ్యులను భర్తరఫ్ చేయాలన్నారు. నేతలు మొగిలికల్లయ్య, కత్తి పద్మ, కాళియ నాయక్. ఇండ్ల శ్రీనివాస్, కళావతి, సుబ్బయ్య, మనోహర్ నాయక్, మొగిలి శ్రీనివాస్, రెడ్డన్న మల్లేశ్వరరావు, చెన్నకేశవులు, బి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఆనాటి స్కూల్ యూనిఫాం ధరించిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 3: నగరంలోని చిల్డ్రన్స్ మాంటిస్సోరి స్కూల్‌లో 1962-1974లో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం జరిగింది. 50ఏళ్ల అనంతరం పూర్వ విద్యార్థులు 40మంది కుటుంబ సమేతంగా స్థానిక ఉడ్ ల్యాండ్స్ రిసార్ట్స్‌లో సమావేశమై చిన్ననాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ ఆత్మీయ సమ్మేళనంలో తమకు భవిష్యత్తును ప్రసాదించిన ఉపాధ్యాయులను తలచుకుని, గత కాలపు చాయచిత్రాలను తనివితీరా చూసుకుని ఆటపాటలతో గడిపారు. విద్యార్థులకు విద్యతో పాటుగా క్రమశిక్షణ నేర్పించిన దివంగత ప్రిన్సిపల్ కోటేశ్వరమ్మకు ఘన నివాళులర్పించారు. నాటి స్కూల్ యూనిఫాంను ధరించి మరోసారి బాల్యంలోకి జారుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించిన కొసరాజు విజయ్‌కుమార్, కాశీనాథ్, రాజేష్, విజయలక్ష్మిని అభినందించి ముగింపు పలికారు. స్నేహ బంధాన్ని కొనసాగించాలని నిర్ణయించి మరో ఆత్మీయ సమ్మేళనంలో కలవాలని నిశ్చయించుకుని స్వస్థలాలకు పయనమయ్యారు.

మల్లాదికి సీటు ఇవ్వకపోవడం తగదు

● బ్రాహ్మణ నేతల ఫైర్

ధర్నాచౌక్, జనవరి 3: సెంట్రల్ నియోజకవర్గం అసెంబ్లీ సీటును వైసీపీ అధిష్టానం ప్రస్తుత ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు కేటాయించకపోవడంపై బ్రాహ్మణ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. పలు బ్రాహ్మణ సంఘాల నేతలు గాంధీనగర్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో తమ నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనూరు సతీష్‌శర్మ మాట్లాడుతూ 48వేలకు పైగా బ్రాహ్మణులున్న సెంట్రల్ సీటును మల్లాది విష్ణుకు కేటాయించాలని, సీఎం జగన్ పునారాలోచించుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా బ్రాహ్మణులకు 4 అసెంబ్లీ సీట్లు కేటాయించాలని కోరుతూ ఆదివారం నగరంలో అన్ని రాజకీయ పార్టీలతో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ద్రోణంరాజు రవికుమార్, శర్వాణీ మూర్తి, చల్లా సుధాకర్, కొప్పరపు బలరాం, దుమ్మలపాటి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బ్రాహ్మణులను అవమానించడమే

రెండు సార్లు ఎమ్మెల్యేగా సేవ చేసి, విశేష ప్రజాదరణ కలిగిన మల్లాది విష్ణుకు వైసీపీ సీటు విషయంలో మొండిచేయి చూపడం బాధాకరమని, వైసీపీ చర్య బ్రాహ్మణులను అవమానించడమేనని బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు, ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొప్పరపు కృష్ణమూర్తి బుధవారం ఓ ప్రకటనలో తీవ్రంగా మండిపడ్డారు.

సంక్రాంతిలోపు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



ధర్నాచౌక్, జనవరి 3: సీఎం జగన్ అగ్రిగోల్డ్ బాధితులకిచ్చిన మాటను సక్రాంతిలోపు నిలబెట్టుకోవాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మరణించిన అగ్రిగోల్డ్ బాధితుల కుటుంబాల 30 గంటల అమరణ దీక్షను గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మరణించిన బాధితుల కుటుంబాలకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా పువ్వుల్లో పెట్టి అందజేస్తామని చేస్తానని సీఎం జగన్ అన్నారని, గత ఐదేళ్లల్లో ఒక్క బాధితుడి కుటుంబా న్ని పరామర్శించి నష్ట పరిహారం ఇవ్వలేదని విమర్శించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు మాట్లాడుతూ సమర్థ అధికారి నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి అ గ్రిగోల్డ్ కంపెనీ చేసిన మోసాల నుంచి కస్టమర్లకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

అక్రమంగా తరలిస్తున్న రూ.90 లక్షల వెండి పట్టివేత

కంకిపాడు, జనవరి 3: అక్రమంగా తరలిస్తున్న రూ.92లక్షల విలువైన వెండి సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు కంకిపాడు ఎస్సై కె.సుధాకర్ చెప్పారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్సై సుధాకర్ మాట్లాడుతూ నరసాపురానికి చెందిన దిలీప్ కుమార్ జైన్ అనే వ్యక్తికి సంబంధించిన 132 కేజీల, రూ. 92 లక్షల విలువ చేసే వెండి సామగ్రి ఎటువంటి బిల్లులు లేకుండా నగరానికి తరలిస్తున్నారు. దావులూరు టోల్‌గేట్ వద్ద కంకిపాడు సీఐ శ్రీనివాసరావు, ఉయ్యూరు టౌన్ ఎస్సై వాసు తనిఖీ ఈ వెండి సామగ్రి పట్టుబడింది. వాహనం, అందులోని జగ్గంపూడి హనుమంతు, షేక్ కాలేషను అదుపులోకి తీసుకున్నామన్నారు.

నిందితుడిగా న్యాయవాది

విజయవాడ: నగరానికి చెందిన న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ నిందితుడిగా కోర్టుకు హాజరయ్యారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే వల్లభనేని వంశీ టీడీపీ తరపున పోటీ చే శారు. పోలింగ్ రోజున ప్రసాదంపాడు పోలింగ్‌బూత్‌లో అక్రమాలు జరిగాయని నాడు వైసీపీలోని యార్లగడ్డ వెంకట్రావు ఆందోళన చేశారు. అప్పుడు వంశీకి న్యాయసహాయం చేయడానికి వెళ్లిన లక్ష్మీనారాయణపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ నగరంలోని ప్రజాప్రతినిధుల కోర్టులో జరుగుతోంది. ఈ కేసులో లక్ష్మీనారాయణ నిందితుడిగా ఉన్నారు. విచారణ నిమిత్తం ఆయన కోర్టుకు బుధవారం హాజరయ్యారు. విచారణను ఈనెల 10వ తేదీకి కోర్టు వాయిదా వేసింది.

స్కేటర్లను అభినందించిన డీజీపీ

విజయవాడ స్పోర్ట్సు: 61వ జాతీయ రోలర్ స్కేటింగ్ పోటీల్లో సత్తాచాటిన నగరానికి చెందిన రోలర్ స్కేటర్లు అక్కా, తమ్ముడు మోత్రపు జస్సీరాజ్, మోత్రపు జోయల్ ఆదర్శ్‌ను రాష్ట్ర డీజీపీ కేవీ.రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం తన ఛాంబర్‌లో అభినందించారు. 11-14 ఏజ్ బాలికల కేటగిరిలో జస్సీరాజ్ కాంస్యం, అలాగే రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణం, రెండు కాంస్యాలను సాధించింది. 7-9 ఏజ్ గ్రూప్‌లో జోయల్ ఆదర్శ్ రెండు కాంస్యాలను వశం చేసుకున్నాడు. రాష్ట్ర, జాతీయ క్రీడల్లో అక్కాతమ్ముళ్లు రాణించడం అభినందనీయమని డీజీపీ అన్నారు. ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి పి.థామస్‌ను, శిక్షణ ఇచ్చిన కోచ్ సింహాద్రిని డీజీపీ అభినందించారు. జెస్సీరాజ్ నగరంలోని ఎన్ఎస్ఎం స్కూల్‌లో 8, జోయల్ ఆదర్శ్ నగరంలోని షామ్రాక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 3వ తరగతి చదువుతున్నాడు.

వేగంగా దరఖాస్తు పరిష్కారం: కలెక్టర్

కృష్ణలంక: ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024లో భాగంగా క్లయిమ్‌లు, ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్న తుది ఓటర్ల జాబితా రూపొందిస్తున్నామని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. నగరంలోని కలెక్టరేట్ ఛాంబర్‌లో బుధవారం కలెక్టర్ ఢిల్లీరావు, డీఆర్వో ఎస్.వి.నాగేశ్వరరావులతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. 2023, జనవరి 5 నుంచి నేటివరకు అందిన మొత్తం 5 లక్షల 23 వేల 777 దరఖాస్తులు నమోదు కాగా వీటిలో 4 లక్షల 85 వేల 701 దరఖాస్తులను అంగీకరించి ఇ రోల్ లో అప్‌డేట్ చేశామన్నారు. అర్హత లేని 24,082 దరఖాస్తులను తిరస్కరించగా పరిష్కరించాల్సినవి 10,290 ఉన్నాయన్నారు. యువతను ఓటర్ల నమోదుకు చైతన్యపరుస్తూ చేపట్టిన ప్రత్యేక డ్రైవ్ వివరాలను తెలిపారు. జిల్లాలో 2024 ప్రొజెక్టెడ్ పాపులేషన్ ప్రకారం 18 నుంచి 19ఏళ్ల వయస్సు కలిగిన 96,902 మందిని ఓటర్ల నమోదు చేసేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు బీజేపీ ప్రతినిధి పీవీ శ్రీహరి, బీఎస్పీ ప్రతినిధి ఎం.వినోద్‌కుమార్, సీపీఐ(ఎం) డీవీ కృష్ణ, ఐఎన్‌సీ ప్రతినిధి వై.ఏసుదాస్, టీడీపీ ప్రతినిధి ఎల్.శివరామ్‌ప్రసాద్, వైఎస్సార్‌సీపీ ప్రతినిధి వై.అంజనేయరెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ వున్నారు.

రేషన్ పంపిణీ జేసీ తనిఖీ

మధురానగర్: నిర్దేశించిన పాయింట్లలో వాహనం నిలిపి కార్డుదారులకు రేషన్ పంపిణీ చేయాలని వలంటీర్‌లకు, ఎండీయూ ఆపరేటర్‌లకు జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్ చెప్పారు. సర్కిల్ -2 పరిధిలో గులాబీతోట ప్రాంతంలో ఎండీయూ వాహనం ద్వారా రేషన్ పంపిణీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ డోర్ డెలివరీ విధానంలో ఒకేచోట వాహనం నిలపకుండా ఇటీవల ప్రభుత్వం సూచించినట్టు ప్రతి క్లస్టర్‌లో వాహనం నిలిపి కార్డుదారులకు రేషన్ ఇవ్వడానికి నిర్దేశించిన పాయింట్లలో రేషన్ పంపిణీ జరుగుతున్న తీరును పరిశీలించారు. రేషన్ బియ్యంపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం నమ్మవద్దని ప్రజల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఫోర్టిఫైడ్ బియ్యం అందిస్తుందని చెప్పారు. జిల్లా పౌరసరఫరాల అధికారి జి.మోహన్‌బాబు, ఏఎస్వో సర్కిల్-2 ధనుంజయరెడ్డి, చెకింగ్ ఇన్‌స్పెక్టర్ భగీరథ పాల్గొన్నారు.

బస్సుల దారి మళ్లింపు

భవానీపురం: నగరంలో భవానీదీక్షల విరమణ సందర్భంగా పోలీస్‌శాఖ ఆంక్షల మేరకు విద్యాధరపురం డిపో పరిధిలో ఈ నెల 3 నుంచి 8 వరకు సిటీ సర్వీసుల రూట్ మళ్లించినట్టు విద్యాధరపురం పీటీడీ మేనేజర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 11జే, 31జే రూట్‌లు వైఎస్ఆర్ కాలనీ పైపుల రోడ్డు, సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ మీదుగా చల్లపల్లి బంగ్లా, పీఎన్‌బీఎస్ ద్వారా ఆటోనగర్, 5జే వైఎస్ఆర్ కాలనీకి బదులుగా కేఆర్‌మార్కెట్ నుంచి ఆటోనగర్ వరకు, 218 పీఎన్‌బీఎస్ నుంచి చల్లపల్లి బంగ్లా, సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ మీదుగా పైపులు రోడ్డు ద్వారా జక్కంపూడి కాలనీ జంక్షన్ నుంచి షైలవరం వరకు, 3 కబేళా నుంచి భవానీపురం కనకదుర్గమ్మ ఫ్లై ఓవర్ మీదుగా పీఎన్‌బీఎస్ ద్వారా గవర్నమెంట్ ప్రెస్ వరకు నడుస్తాయన్నారు. పంజా సెంటర్ నుంచి 7టీ, 11జే, 31జే బస్సులను రెండేసి, 3 బస్సులను 3, 3 డీ బస్సు ఒకటి నడుపుతున్నట్టు తెలిపారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

హక్కుల పరిరక్షణే లక్ష్యం

కృష్ణలంక: గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధి, వారి హక్కుల పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ఎస్టీ కమిషన్ సేవలందిస్తోందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ జీవీజీ శంకరరావు అన్నారు. నగరంలోని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చాంబర్ హాలులో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ చొరవతో రాజ్యాంగబద్ధంగా ఏపీ ఎస్టీ కమిషన్ ఏర్పాటైందన్నారు. గ్రీవెన్స్ సెల్ ద్వారా 2022లో 2,751, 2023లో 2,712 ఫిర్యాదులు అందాయన్నారు. వీటిలో కేవలం 432 ఫిర్యాదులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, అవి చివరి దశలో ఉన్నట్లు తెలిపారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సెక్రటరీ శ్రీరామశేషు తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తులకు, హస్తకళలకు నాబార్డు చేయూత

కృష్ణలంక: చేతివృత్తులకు, హస్తకళలకు చేయూతనందించేందుకు నాబార్డు కృషి చేస్తోందని, చేతివృత్తిదారులు, హస్తకళాకారుల సుస్థిర జీవనోపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు ప్రోత్సాహం అందిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (చేనేత, జౌళి శాఖ) కె.సునీత అన్నారు. నాబార్డు ఏపీ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో పటమట, మెరీస్టెల్లా ఇండోర్‌స్టేడియంలో ఏర్పాటు చేసిన హస్తకళలు, చేనేత, మహిళా సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయమేళాను సునీత, రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజనల్ డైరెక్టర్ ఏవో బషీర్, ఏపీ నాబార్డు సీజీఎం ఎం.ఆర్.గోపాల్ కలిసి ప్రారంభించారు. స్టాళ్లను పరిశీలించి ఉత్పత్తులు వివరాలను తెలుసుకున్నారు.

హైకోర్టు పేరుతో కర్నూలు వాసులకు వంచన

» రాష్ట్రానికి షర్మిల సేవలు అవసరం: మస్తాన్‌వలి

కర్నూలు(అర్బన్), జనవరి 3: రాయలసీమకు హైకోర్టు పేరుతో కర్నూలు వాసులను మభ్యపెట్టారని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.మస్తాన్‌వలి జగన్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. బుధవారం కర్నూలులో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ రాష్ట్రాన్ని మోదీ కాళ్ల వద్ద తాకట్టు పెట్టాడన్నారు. రాష్ట్రానికి ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ పార్టీ సేవలు అవసరమని ప్రజలు గుర్తించారన్నారు. ఈ పరిస్థితుల్లో షర్మిల సేవలను పార్టీ అవసరమైన చోట వాడుకుంటుందన్నారు. రాష్ట్ర ప్రజలు, యువత భవిష్యత్ బాగుండాలంటే కాంగ్రెస్ పార్టీ తప్పనిసరిగా అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు.

వైసీపీ నాశనానికి కారణం జగనే: రఘురామ

న్యూఢిల్లీ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తప్పులన్నీ చేసి, ప్రజల్ని మోసం చేసిన సీఎం జగన్.. వైసీపీ సర్వనాశనానికి తానే కారణమని తెలుసుకోకుండా ఇతరులపై రంకెలు వేస్తున్నారని నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు విమర్శించారు. జగన్ అహంకారం వల్లే రానున్న ఎన్నికల్లో వైసీపీ దారుణంగా ఓడిపోబోతుందని ఆయన జోస్యం చెప్పారు. బుధవారం, రచ్చబండ కార్యక్రమంలో భాగంగా రఘురామకృష్ణరాజు మీడియాతో మాట్లాడారు. భస్మాసురుడి మాదిరిగా నెత్తిన చేయి పెట్టుకొని, వాళ్ల కుంపటి పెడుతున్నారు... వీళ్ల కుంపటి పెడుతున్నారు అంటే ప్రయోజనం ఏమిటని మండిపడ్డారు.

నేడు కేసీఆర్‌ను పరామర్శించనున్న జగన్

తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌ను సీఎం జగన్ గురువారం పరామర్శించనున్నారు. ఇటీవల కేసీఆర్‌కు తుంటి ఆపరేషన్ జరిగింది. ఆసుపత్రి నుంచి ఆయన డిశ్చార్జ్ అయ్యారు. తాడేపల్లి నివాసం నుంచి ఉదయం పది గంటలకు బయలుదేరి జగన్ హైదరాబాద్‌కు చేరుకుంటారు. బంజారాహిల్స్ రోడ్ నం.14లోని నివాసంలో కేసీఆర్‌ను కలుస్తారు. అనంతరం తాడేపల్లికి జగన్ తిరుగు ప్రయాణమవుతారు.

ఏసీఏలో నిధుల దుర్వినియోగంపై విచారణ

» ప్రతివాదులకు నోటీసులు.. విచారణ వాయిదా: హైకోర్టు

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): నిధుల దుర్వినియోగాన్ని అరికట్టడంతో పాటు ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) పరిపాలన కార్యకలాపాల నిర్వహణకు కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ (సీవోఏ)ను నియమించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం కల్చర్ శాఖ ముఖ్యకార్యదర్శి, బీసీసీఐ, ఏసీఏ కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు బుధవారం ఆదేశాలిచ్చారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది గంగయ్య నాయుడు వాదనలు వినిపించారు.

'జోనల్' అమలుపై అఫిడవిట్ వేయండి: హైకోర్టు

కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత కూడా విద్యా, ఉద్యోగాల భర్తీలో గతంలో ఉన్న జోనల్ నిబంధనలనే పాటిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. 2022 తర్వాత చేపట్టిన ఉద్యోగాల నియామకాల్లో పాత జిల్లాల ప్రాతిపదికన జోనల్ విధానం అమలు చేశామని అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ వివరించారు. న్యాయస్థానం స్పందిస్తూ వివరాలను అఫిడవిట్ రూపంలో కోర్టు ముందు ఉంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను సంక్రాంతి సెలవుల తర్వాతకి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. బుధవారం జరిగిన విచారణలో పిటిషనర్ల తరఫు న్యాయవాది అంబటి సుధాకరరావు వాదనలు వినిపించారు.

'వ్యూహం'పై సింగిల్ జడ్జి వద్దే తేల్చుకోండి: టీ హైకోర్టు

హైదరాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): వ్యూహం సినిమాకు సెన్సార్ బోర్డు ఇచ్చిన సర్టిఫికెట్‌ను సస్పెండ్ చేస్తూ ఈ నెల 11 వరకు సినిమా విడుదలను నిలిపేయాలన్న సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులపై నిర్మాత దాసరి కిరణ్‌కుమార్, రామధూత క్రియేషన్స్.. తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేశారు. ఈ అప్పీల్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. సింగిల్ జడ్జి ఇచ్చింది మధ్యంతర ఉత్తర్వులే అయినందున వాటిపై విచారణ చేపట్టలేమని ధర్మాసనం పేర్కొంది. సంబంధిత రికార్డును సింగిల్ జడ్జికే సమర్పించాలని సెన్సార్ బోర్డుకు ఆదేశించింది. ఈ నెల 11కు బదులు 8నే మెరిట్స్ ఆధారంగా విచారణ చేపట్టి నిర్ణయం తీసుకోవాలని సింగిల్ జడ్జికి విజ్ఞప్తి చేసింది.

ఏపీ సెక్రటేరియట్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి భూకేటాయింపు సబబే: టీ-హైకోర్టు

హైదరాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ఏపీ సెక్రటేరియట్ ఎంప్లాయిస్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి 155ఎకరాల భూకేటాయింపు సబబేనని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ భూకేటాయింపును సవాల్ చేస్తూ రిటైర్డ్ ఉద్యోగి ఓఎం డెబేరా 2010లో దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం కొట్టేసింది.

20, 21 తేదీల్లో చేనేత కార్మిక సంఘం మహాసభలు

మంగళగిరి సిటీ: ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర 13వ మహాసభలు ఈ నెల 20, 21 తేదీల్లో గుంటూరు జిల్లా మంగళగిరిలో జరుగుతాయని రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి నాగేశ్వరరావు తెలిపారు. మంగళగిరిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో మహాసభల కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు.

ప్రత్యేక హోదా కోసం ఢిల్లీలో ఏపీ వాసుల నిరసన

న్యూఢిల్లీ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రప్రభుత్వం ప్రత్యేక హోదా ఇవ్వాలని ఏపీకి చెందిన సామాజిక ఉద్యమకారులు డిమాండ్ చేశారు. పోలవరం నిర్మాణానికి కేంద్రం నిధులు విడుదల చేయాలన్నారు. బుధవారం జంతర్‌మంతర్ వద్ద ఏపీకి చెందిన సామాజిక ఉద్యమకారులు ముక్కాల విజయ రామకృష్ణ, గురువ బాబు, నోముల ఆశోక్‌లు రాష్ట్రానికి కేంద్రం ప్రత్యేక హోదా ఇవ్వాలని ధర్నా చేశారు.

ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

» పోరుబాట సభలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు

బాపట్ల, జనవరి 3: రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బాపట్ల జిల్లా యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పోరుబాట కార్యక్రమాన్ని బాపట్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుందని సీఎం అసెంబ్లీలో ప్రకటన చేశారని.. ఆర్థికశాఖాధికారులు మాత్రం ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందంటున్నారని వీటిలో ఏది వాస్తవమో తెలిసేందుకు శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన 18,096కోట్లు బడ్జెట్‌కు సంబంధించిన సొమ్ముకాదని ఇది ఉద్యోగ, ఉపాధ్యాయుల దాచుకున్న సొమ్ములో నుంచి పెట్టుకున్న లోన్‌లకు సంబంధించిన సొమ్ము మాత్రమేన్నారు. మా డబ్బులు మాకు చెల్లించడానికి ఇన్ని ఆంక్షలు ఎందుకో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. మా సొంత డబ్బును వాడుకునే హక్కు మీకెవ్వరిచ్చారని ప్రశ్నించారు. బకాయిలు వెంటనే చెల్లించి, ఒకటో తేదీన వేతనాలివ్వాలని.. లేదంటే 9, 10 తేదీల్లో విజయవాడలో 36 గంటల ధర్నా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఆర్జీవీతో వివాదం.. సీఐడీ ఆఫీసుకు కొలికిపూడి

గుంటూరు, జనవరి 3: సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ నమోదైన కేసులో అమరావతి జేఏసీ నేత కొలికిపూడి శ్రీనివాసరావు గుంటూరులోని సీఐడీ కార్యాలయంలో బుధవారం విచారణకు హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు జిల్లా కోర్టు నుంచి టీడీపీ, జనసేన, విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీగా సీఐడీ కార్యాలయానికి చేరుకున్నారు. ఉదయం 10 నుంచి 5.30 గంటల వరకు విచారణ సాగింది. కొలికిపూడి చేసిన వ్యాఖ్యల కంటే ఆయన వ్యక్తిగత, రాజకీయ అంశాలపైనే ఎక్కువగా సీఐడీ ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. తిరిగి ఈ నెల 8న మరోసారి విచారణకు హాజరు కావాలని సీఐడీ అధికారులు చెప్పినట్లు కొలికిపూడి తెలిపారు.



ఎస్టీలపై దాడులు జరుగుతున్నా ఎస్టీ కమిషన్ స్పందించలేదంటూ కమిషన్ కార్యాలయంలో ఆందోళన చేస్తున్న టీడీపీ గిరిజన నేతలు



'అసెంబ్లీ రౌడీ'ని మరిపించేలా..

అప్పుడెప్పుడో అసెంబ్లీ రౌడీ సినిమా వచ్చింది కదా. బాషా టిఫిన్ సెంటర్, బాషా పండ్ల దుకాణం, బాషా సెలూన్ ఇలా ఒక వీధిలో దుకాణాలన్నీ బాషా పేరుతోనే ఉంటాయి. ఆ సినిమాలోని సీన్ ఇప్పుడు ఏపీలోని చాలా ప్రాంతాల్లో వీధి వీధినా కనిపిస్తోంది. పై చిత్రంలోని బోర్డులన్నీ నెల్లూరు నగరంలోని ఒక ప్రాంతంలోనివి. అన్ని దుకాణాలపైనా మా నమ్మకం నువ్వే జగన్ అనే స్లోగన్‌తో సైన్ బోర్డులు దర్శనమిచ్చాయి. దుకాణం పేరు కింద చిన్నగా... పైన 'మా నమ్మకం నువ్వే జగన్' అనే అక్షరాలు పెద్దగా.. సీఎం జగన్ ఫొటో మరింత పెద్దగా ఉండేటా ఈ బోర్డులు డిజైన్ చేశారు. నెల్లూరులోనే కాదు, ఉదయగిరిలోనూ దుకాణాలకు ఇవే బోర్డులు ఏర్పాటు చేశారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు

నకిలీ సర్టిఫికెట్లపై విచారణ

» ఆదేశించిన 'హౌసింగ్' ఉన్నతాధికారులు

» 56 మంది ఏఈల పదోన్నతుల ఫైల్ నిలిపివేత

» అవినీతి, అక్రమార్కుల గుండెల్లో గుబులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహనిర్మాణ సంస్థలో నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం కలకలం రేపుతోంది. కనీస విద్యార్హతలు లేకపోయినా దొంగ సర్టిఫికెట్లు సమర్పించి హౌసింగ్ కార్పొరేషన్‌లో ఉద్యోగాలు సంపాదించడంతోపాటు అడ్డదారుల్లో ప్రమోషన్లు కూడా పొంది ఉన్నత హోదాలకు ఎదిగిన ఉద్యోగులు వందల్లో ఉన్నారని, అలాంటి వారివల్ల డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, డిప్లొమా కోర్సులు చేసినవారికి అన్యాయం జరుగుతోందంటూ ఇప్పటికే హౌసింగ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతోపాటు 'హౌసింగ్‌లో నకి'లీలలు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో కథనం ప్రచురితమవడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఎక్కువ మంది రెగ్యులర్ స్ట్రీమ్‌లో ఇంజనీరింగ్ చదవకపోయినా, సాంకేతిక నైపుణ్యాలు లేకపోయినా నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి పదోన్నతుల జాబితాలో చోటు దక్కించుకున్నట్లు ఫిర్యాదులు రావడంతో ఈ ప్రమోషన్ల ఫైల్‌ను పక్కనపెట్టేశారు.

లూథియానా నుంచి నకిలీ సర్టిఫికెట్లు!

తగిన విద్యార్హతలు లేకపోయినా రాజకీయ నాయకులు, ఉన్నతాధికారుల సిఫారసులతో హౌసింగ్ కార్పొరేషన్‌లో ఎన్ఎంఆర్‌లు, డేటాఎంట్రీ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితర కిందిస్థాయి ఉద్యోగాల్లో చేరినవారిలో ఎక్కువమంది నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి పదోన్నతులు పొందుతున్నట్లు ఫిర్యాదులున్నాయి. వీరంతా ఉద్యోగాలు చేసుకుంటూనే.. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఐటీఐ, సివిల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా కోర్సులు పూర్తి చేసినట్లుగా నకిలీ సర్టిఫికెట్లు సమర్పిస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. కొంతమంది ఉద్యోగులు హైదరాబాద్, తిరుపతి, ఖమ్మం తదితర ప్రాంతాలలోని విద్యాసంస్థలలో డిప్లొమా కోర్సులు చదివినట్లు నకిలీ సర్టిఫికెట్లు సమర్పించగా.. ఎక్కువ మంది లూథియానా యూనివర్సిటీలో సాంకేతిక విద్యను అభ్యసించినట్లు దొంగ సర్టిఫికెట్లు సమర్పించినట్లు హౌసింగ్ అధికారులు గుర్తించినట్లు తెలిసింది. నిర్ధారణ కోసం అధికార బృందాన్ని లూథియానాకు పంపించాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో ఇప్పటికే నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి ఉద్యోగాలు.. పదోన్నతులు పొందినవారి గుండెల్లో రైళ్లు పరుగుడెతున్నాయి. నకిలీ సర్టిఫికెట్లు పుట్టించడానికి, వాటి ఆధారంగా పదోన్నతులు, కోరుకున్నచోట పోస్టింగ్ పొందడానికి రూ.లక్షలు ధారపోశామని, ఇప్పుడు అధికారుల విచారణలో నకిలీ సర్టిఫికెట్ల గుట్టు రట్టయితే నిండా మునిగిపోతామని వారంతా ఆందోళన చెందుతున్నట్లు హౌసింగ్ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

రూ.లక్షల్లో చెల్లింపులు..

ఇటీవల హౌసింగ్ ఉద్యోగులకు దశలవారీగా పదోన్నతులు కల్పిస్తుండటంతో నకిలీ సర్టిఫికెట్లకు డిమాండ్ ఏర్పడింది. ఓ ముఠా వీరి నుంచి రూ.లక్షల్లో డిమాండ్ చేస్తున్నట్లు చెబుతున్నారు. ఐటీఐ చదివినట్లు సర్టిఫికెట్ కావాలంటే రూ.70 వేలు, సివిల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా సర్టిఫికెట్ కావాలంటే రూ.లక్షకుపైగా చెల్లిస్తే చాలు.. సదరు ఉద్యోగి కాలు కదపకుండానే నకిలీ సర్టిఫికెట్లు తీసుకొచ్చి చేతుల్లో పెడుతున్నట్లు చర్చ నడుస్తోంది. జిల్లాల్లోని హౌసింగ్ అధికారులు కూడా తమకు అనుకూలంగా ఉండే ఉద్యోగులను నకిలీ సర్టిఫికెట్లు తెచ్చుకోమని ప్రోత్సహించడంతోపాటు, వారికి పదోన్నతులు కల్పించి తమ దగ్గరే పోస్టింగ్‌లు ఇప్పించుకుంటున్నారని చెబుతున్నారు. తిరుపతి జిల్లా గూడూరు డివిజన్‌లో ఒక వర్క్ ఇన్‌స్పెక్టరుకు నకిలీ సర్టిఫికెట్లపై రెండు మండలాలను అప్పగించినట్లు సమాచారం. నెల్లూరు జిల్లా సర్వేపల్లి, ఆత్మకూరు, నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, కోవూరు నియోజకవర్గాల్లో హౌసింగ్ ఏఈలుగా పనిచేస్తున్న ఐదుగురిని గత నెలలోనే ఇన్‌చార్జి డీఈఈలుగా నియమించి అనధికారిక ప్రమోషన్లు కల్పించినట్లు ఫిర్యాదులున్నాయి. ఇతర జిల్లాల్లోనూ ఇదే తంతు నడుస్తోందని, విచారణ జరిపిస్తే వాస్తవాలు బయటకొస్తాయని హౌసింగ్ ఉద్యోగులు చెబుతున్నారు.

అ'పూర్వ' కలయిక



హైదరాబాద్ సమ్మేళనంలో విజయవాడ చిల్డ్రన్స్ మాంటిస్సోరి పూర్వ విద్యార్థులు

» 50 ఏళ్ల తర్వాత స్కూల్ యూనిఫాంతో సందడిచేసిన విజయవాడ చిల్డ్రన్స్ మాంటిస్సోరి విద్యార్థులు

హైదరాబాద్ సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వారంతా 50 ఏళ్ల తర్వాత మళ్లీ స్కూల్ యూనిఫాం వేసుకున్నారు. తాము చదివిన రోజులను గుర్తు చేసుకుని.. చిన్న పిల్లల్లా మారి సందడి చేశారు. విజయవాడ చిల్డ్రన్స్ మాంటిస్సోరి స్కూల్ 1962-1974 విద్యార్థులు తాము పాఠశాల విడిచి 50 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఇందులో కొందరు విదేశాల్లో స్థిరపడిన వారున్నా.. ఎల్లలు మరచి సమ్మేళనంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఐదేళ్లలో 10శాతమైనా

పూర్తి కాలేదు!

» కోర్టు భవనాల నిర్మాణంలో జాప్యం ఎందుకు జరుగుతోంది?

» కేంద్రం తన వాటాగా 60% నిధులిస్తోంది కదా!

» రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు



అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కోర్టు భవనాల నిర్మాణ పురోగతిపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కొన్ని భవనాల నిర్మాణ పనులు 2018లో ప్రారంభమైనా, ఇప్పటికి 10శాతం కూడా పూర్తి కాలేదని ఆందోళన వ్యక్తం చేసింది. కోర్టు భవనాల నిర్మాణ ఖర్చులో కేంద్ర ప్రభుత్వం తన వాటాగా 60శాతం నిధులు ఇస్తోందని గుర్తు చేసింది. అయినప్పటికీ నిర్మాణ పనుల్లో జాప్యం ఎందుకు జరుగుతోందని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఇప్పటికీ రాష్ట్రంలోని చాలా కోర్టులు అద్దె భవనాల్లోనే సేవలందిస్తున్నాయని పేర్కొంది. న్యాయవ్యవస్థలో మౌలికవసతుల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంత ఖర్చు చేసిందో నివేదిక సిద్ధం చేసి కేంద్రానికి పంపాలని సూచించింది. రాష్ట్రంలోని కోర్టు భవనాల నిర్మాణ పురోగతి, కేంద్రం నుంచి నిధులు రాబట్టేందుకు తీసుకుంటున్న చర్యలు తదితర వివరాలతో నివేదిక సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కోర్టు భవన నిర్మాణాల నాణ్యతను పరిశీలించేందుకు నేషనల్ బిల్డింగ్స్ కనస్ట్రక్షన్ కార్పొరేషన్(ఎన్‌బీసీసీ)వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థ కానీ, మరే ఇతర ఏజెన్సీనైనా గుర్తించాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈనెల 24వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. కృష్ణా జిల్లా, గన్నవరంలో నూతన కోర్టు భవన నిర్మాణాన్ని చేపట్టడంతో పాటు ఇప్పటికే ఉన్న పాత భవనానికి మరమ్మతులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ దేవిరెడ్డి రాజశేఖరరెడ్డి దాఖలు చేసిన పిల్ విచారణ సందర్భంగా హైకోర్టు ఈ విధంగా స్పందించింది.

జేఈఈ మెయిన్స్‌కు 'బ్రేక్స్'లోనూ తనిఖీలు, బయోమెట్రిక్

» జనవరి 21 నుంచి పరీక్షలు

న్యూఢిల్లీ, జనవరి 3: ఇంజనీరింగ్ జాతీయ ప్రవేశ పరీక్ష.. జేఈఈ మెయిన్స్ నిర్వహణలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అధికారులు తెలిపారు. పరీక్ష ప్రారంభంలో విద్యార్థులను ఆసాంతం తనిఖీ (ఫ్రిస్కింగ్) చేయడం, బయోమెట్రిక్ తీసుకోవడం ఇప్పటి వరకూ అమలులో ఉన్న ప్రక్రియ. జనవరి 21 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకూ జరిగే మెయిన్స్‌కు కాలకృత్యాల కోసం బయటకు వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు కూడా ఆసాంతం తనిఖీ చేయడం, బయోమెట్రిక్ తీసుకోవడం తప్పనిసరి చేస్తున్నట్లు ఎన్‌టీఏ పేర్కొంది. జేఈఈ మెయిన్స్ మొత్తం 13 భాషల్లో.. ఇంగ్లీషు, హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళ్, తెలుగు, ఉర్దూలో నిర్వహిస్తున్నారు. ఫలితాలు ఫిబ్రవరి 12న వెల్లడిస్తారు. ఈ సారి పరీక్షకు రికార్డు స్థాయిలో 12.3 లక్షలు మంది నమోదు చేసుకున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది.

ఆ దావాలు సివిల్ కోర్టులు తీసుకోవచ్చు

» భూయాజమాన్య చట్టంపై హైకోర్టు కీలక ఉత్తర్వులు

» చట్టం వచ్చిందంటూ స్థిరాస్తి దావాలు తిరస్కరించరాదు

» పాత దావాల విచారణ.. కొత్తవాటినీ స్వీకరించాల్సిందే

» సివిల్ కోర్టులకు ఆదేశాలు

» విచారణ ఫిబ్రవరికి వాయిదా

అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): భూయాజమాన్య హక్కు చట్టం విషయంలో హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త చట్టం అమల్లోకి వచ్చిందంటూ స్థిరాస్తి వివాదాలపై దాఖలయ్యే వ్యాజ్యాలను సివిల్ కోర్టులు విచారణ నిమిత్తం స్వీకరించకపోవడాన్ని ఆక్షేపించింది. కొత్తగా దాఖలయ్యే వ్యాజ్యాలను విచారణ నిమిత్తం స్వీకరించాల్సిందేనని ఆదేశించింది. చట్టంలోని నియమనిబంధనలు పూర్తిగా అమల్లోకి రాలేదని గుర్తుచేసింది. చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం ఆయా ప్రాంతాల్లోని స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తూ నోటిఫికేషన్ జారీచేయడంతో పాటు నియమనిబంధనలు రూపొందించేందుకు సమయం పడుతుందని ఏజీ చెప్పిన వివరాలను నమోదుచేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందులోభాగంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. విచారణను ఫిబ్రవరి మొదటి వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావు బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. ఏపీ భూయాజమాన్య హక్కు చట్టాన్ని సవాల్ చేస్తూ ఏపీ బార్ కౌన్సిల్ తరఫున సభ్యులు కె.చిదంబరం, ముప్పాళ్ల సుబ్బారావు, జి.సుదర్శనరావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. భూయాజమాన్య హక్కు చట్టాన్ని రాజ్యాంగ విరుద్ధమైనదిగా ప్రకటించాలని అభ్యర్థించారు. అలాగే భూయాజమాన్య హక్కుచట్టం తీసుకొచ్చే శాసనాధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని పేర్కొంటూ ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలు) ఏపీ అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్ పిల్ దాఖలు చేశారు.

రాజ్యాంగంలోని పలు అధికరణలను అతిక్రమించేలా ఉన్న భూయాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. అలాగే భూయాజమాన్య హక్కు చట్టాన్ని సవాల్ చేస్తూ కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎంవీ చక్రపాణి పిల్ దాఖలు చేశారు. యాక్ట్‌లోని పలు సెక్షన్లు పౌరుల ఆస్తిహక్కుకు భంగం కలిగించేలా ఉన్నాయని, వాటిని రద్దు చేయాలని అభ్యర్థించారు. ఈ వ్యాజ్యాలు బుధవారం విచారణకు రాగా పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు గంటా రామారావు, ఎన్.సుబ్బారావు, న్యాయవాది వై.బాలాజీ వాదనలు వినిపించారు. యాక్ట్‌తోపాటు అందులోని వివిధ సెక్షన్ల చట్టబద్ధతను సవాల్ చేస్తూ వ్యాజ్యాలు దాఖలు చేశామన్నారు. చట్టంలోని సెక్షన్ 38 ఆధారంగా స్థిరాస్తికి సంబంధించిన దావాలను సివిల్ కోర్టులు తిరస్కరిస్తున్నాయన్నారు. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ స్పందిస్తూ... చట్టం తీసుకొచ్చినా అది అమలుకావడం లేదన్నారు. చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం ఆయా ప్రాంతాలను నోటిఫై చేయాల్సి ఉందన్నారు. టైటిల్ రిజిస్టర్ సిద్ధం చేయాల్సి ఉందని తెలిపారు. టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారులు, ల్యాండ్ టైటిలింగ్ అప్పీలేట్ అధికారులను నియమించలేదని, నియమ నిబంధనలు రూపొందించలేదని పేర్కొన్నారు. చట్టంలోని సెక్షన్ 38ను అనుసరించి భూవివాదాలను సివిల్ కోర్టుల్లో విచారణ చేయకుండా నిరోధించే నిబంధనపై విచారణ జరపాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తగా వచ్చే స్థిరాస్తి వివాదాలను సివిల్ కోర్టులు విచారణకు స్వీకరించవచ్చు అన్నారు. దానిపై ఎలాంటి నిషేధం లేదన్నారు. స్థిరాస్తికి సంబంధించిన దావాలను తిరస్కరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కొత్త దావాలను తిరస్కరించవద్దంటూ సివిల్ కోర్టులను విజ్ఞప్తి చేయాలని ప్రభుత్వ న్యాయవాదులకు సూచన చేస్తామన్నారు. యాక్ట్ పై వాదనలు వినిపించేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం...చట్టంలోని కొన్ని నిబంధనలు నోటిఫై చేయలేదని, అందుకు సమయం పడుతుందని ప్రభుత్వం చెబుతోందని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో కొత్తగా వచ్చే స్థిరాస్తి వివాదాలపై దాఖలయ్యే వ్యాజ్యాలను విచారణ నిమిత్తం స్వీకరించవచ్చని, పాత దావాల పై విచారణను కొనసాగించవచ్చని సివిల్ కోర్టులకు హైకోర్టు స్పష్టం చేసింది. పూర్తి వివరాలతో కౌంటరు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను ఫిబ్రవరి మొదటి వారానికి వాయిదా వేసింది.

ఎస్ఐ అభ్యర్థులకు సేవా శిక్ష

» 'ఎత్తు'పై తమను తప్పుదోవ పట్టించిన వారు ఆసుపత్రిలో సేవ చేయాలన్న హైకోర్టు

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పోలీసు ఉద్యోగాలకు సంబంధించి 'ఎత్తు' విషయంలో కోర్టును తప్పుదోవ పట్టించేలా వ్యవహరించిన ఎస్ఐ అభ్యర్థులకు హైకోర్టు షాక్ ఇచ్చింది. నెల రోజుల పాటు ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు అందించాలంటూ సామాజిక సేవా శిక్షను విధించింది. సేవ చేసిన అనంతరం సంబంధిత ఆసుపత్రి హెచ్‌వోడీ ఇచ్చే సర్టిఫికెట్‌ను రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు సమర్పించాలని అభ్యర్థులను ఆదేశించింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొంది. ప్రభుత్వ అప్పీల్‌ను అనుమతించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి. నరేందర్, జస్టిస్ ఎన్. విజయ్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఎస్ఐ పోస్టుల భర్తీ కోసం 2018లో ఇచ్చిన నోటిఫికేషన్‌కి సంబంధించి నిర్వహించిన ఎత్తు పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు, 2023 నోటిఫికేషన్‌కి సంబంధించి జరిగిన పరీక్షల్లో ఎత్తు తగ్గారని ప్రకటించడాన్ని సవాల్ చేస్తూ 24 మంది హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ సందర్భంగా తామే ఎత్తు కొలుస్తామని ప్రకటించిన అనంతరం ఎత్తు విషయంలో ప్రభుత్వ డాక్టర్లు ఇచ్చిన సర్టిఫికెట్లను అభ్యర్థులు కోర్టుకు సమర్పించడాన్ని ధర్మాసనం తీవ్రంగా ఆక్షేపించింది. పిటిషనర్ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వారికి విధించే శిక్షను సామాజిక సేవగా మారుస్తున్నామని పేర్కొంది.

జగన్ పాలనలో పడకేసిన ప్రాజెక్టులు

» సీమ ప్రాజెక్టులపై శ్వేతపత్రం ఇవ్వాలి: టీడీపీ

అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తిగా పడకేశాయని టీడీపీ విమర్శించింది. రాయలసీమ ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చూపుతున్న అంతులేని నిర్లక్ష్యం సీమ పాలిట పెనుశాపంగా పరిణమించిందని మండిపడింది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు కాలువ శ్రీనివాసులు, రెడ్డప్పగారి శ్రీనివాసులురెడ్డి బుధవారం మంగళగిరిలోని పార్టీ జాతీయ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాయలసీమ ప్రాజెక్టులకు సంబంధించి జగన్ పత్రికలో ప్రచురించిందంతా అవాస్తవమని ఖండించారు. జగన్‌రెడ్డి తప్పుడు మాటలు, తప్పుడు పనులు, తప్పుడు కథనాలతో ఎల్లకాలం ప్రజల్ని మోసం చేయలేరని మండిపడ్డారు. తండ్రీకొడుకులిద్దరూ (వైఎస్ రాజశేఖరరెడ్డి, జగన్‌రెడ్డి) సీమ ప్రజల భావోద్వేగాలను తమ స్వార్థ రాజకీయాలకు వాడుకున్నారే తప్ప, సొంత ప్రాంతానికి చేసిందేమీ లేదని విమర్శించారు. రాయలసీమ దుర్భిక్ష నివారణ పథకం కింద నిర్మిస్తానన్న 23 ప్రాజెక్టుల నిర్మాణంపై పూర్తి వాస్తవాలతో శ్వేతపత్రం విడుదల చేసే దమ్ము, ధైర్యం జగన్‌రెడ్డికి ఉన్నాయా? అని ప్రశ్నించారు. సొంత చెల్లికి న్యాయం చేయలేని జగన్ ప్రజలకు ఏం చేస్తాడని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఓటమి భయంతో ఎంతమంది టికెట్లు మార్చినా, ఎన్ని నియోజకవర్గాల్లో తిరిగినా ప్రజల్లో తనపై ఉన్న అసహ్యం, ఈర్ష్యాద్వేషాలను జగన్‌రెడ్డి చల్లార్చలేడని తేల్చిచెప్పారు. కడప ఎంపీగా షర్మిల, జగన్‌రెడ్డి ఎవరు పోటీ చేసినా గెలిచేది టీడీపీనే అని స్పష్టం చేశారు.

తిరుమల 'కాలిబాట'లో రక్షణ చర్యలపై

నివేదిక అసంపూర్ణం

» ఫెన్సింగ్ నిర్మాణం, అండర్‌పాస్‌ల ఏర్పాటుపై డబ్ల్యూఐఐ స్పష్టత ఇవ్వలేదు

» ఆయా అధికారులు మరోసారి సమావేశమై ఓ నిర్ణయానికి రండి

» టీటీడీకి హైకోర్టు ఆదేశం

అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అలిపిరి నుంచి తిరుమల వరకు కాలినడక మార్గంలో భక్తుల రక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఐఐ) అందించిన నివేదిక అసంపూర్ణంగా ఉందని బుధవారం హైకోర్టు పేర్కొంది. వన్యప్రాణులు స్వేచ్ఛగా సంచరించేందుకు వీలుగా నడక మార్గంలో ఎక్కడెక్కడ అండర్ పాస్‌లు ఏర్పాటు చేయాలి? భక్తుల రక్షణ కోసం ఎంత మేర ఫెన్సింగ్ నిర్మించాలి? ఎక్కడ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలనే విషయంలో నివేదికలో స్పష్టత లేదని పేర్కొంది. టీటీడీ, అటవీ శాఖ, డబ్ల్యూఐఐ మరోసారి సమావేశమై దీనిపై ఓ నిర్ణయానికి రావాలని స్పష్టం చేసింది. సమావేశం అనంతరం నిర్ణయాలను అమలు చేసేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని టీటీడీ ఈవోను ఆదేశించింది. అంతిమంగా స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత టీటీడీదేనని గుర్తు చేసింది. డబ్ల్యూఐఐ చేసిన ఇతర సిఫార్సులను తూచ తప్పకుండా అమలు చేయాలని టీటీడీకి స్పష్టం చేసింది. భక్తుల రక్షణ విషయంలో తీసుకుంటున్న దీర్ఘకాలిక చర్యలపై వివరాలను సమర్పించాలని టీటీడీని ఆదేశిస్తూ విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఆదేశాలిచ్చింది.

అత్యంత వేడి సంవత్సరంగా 2023

» 123 ఏళ్ల తర్వాత రెండో వేడి ఏడాదిగా రికార్డు

విశాఖపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో 2023లో ప్రపంచవ్యాప్తంగా ఎండలు పెరిగాయి. కరువు, వరదలు, ఇతర విపత్తులు సంభవించాయి. పారిశ్రామిక విప్లవం తర్వాత 1850 నుంచి 1900 సంవత్సరం మధ్య సగటు కంటే 2023లో 1.4 డిగ్రీలు ఎక్కువ ఉష్ణోగ్రత నమోదైంది. ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా అసాధారణంగా ఉష్ణోగ్రతలు పెరిగాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) పేర్కొంది. ఈ క్రమంలో 1901 తర్వాత 2023వ సంవత్సరం రెండో అత్యంత వేడి ఏడాదిగా నమోదైనట్టు వెల్లడించింది. 1981 నుంచి 2010 వరకు సగటు ఉష్ణోగ్రత కంటే 2023లో 0.65 డిగ్రీలు ఎక్కువ నమోదైంది. దేశంలో 2023లో అన్నిరకాల విపత్తులపైనా ఐఎండీ ప్రాథమికంగా విశ్లేషణ చేసింది. వాతావరణ శాఖ వద్ద ఉన్న రికార్డుల ప్రకారం 1901 నుంచి ఇప్పటివరకు 2016, 2023, 2009, 2017, 2010 వేడి సంవత్సరాలుగా నమోదయ్యాయి. 1980 నుంచి 2010 వరకు సమోదైన సగటు ఉష్ణోగ్రత కంటే 2016లో 0.71, 2023లో 0.65, 2009లో 0.55, 2017లో 0.54, 2010లో 0.53 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. ఇంకా 1901 తర్వాత 2023లో ఆగస్టు నుంచి డిసెంబరు వరకు ఐదు నెలలు అత్యంత వేడి నెలలుగా (ఆ నెలల్లో ఉండాల్సిన ఉష్ణోగ్రతల కంటే అధికం), ఫిబ్రవరి రెండో అత్యంత వేడి నెలగా నమోదైంది. గతేడాది దేశంలో అన్ని రకాల విపత్తులతో 2,376 మంది మృత్యువాత పడ్డారు. ఉరుములు, పిడుగుల వల్ల అత్యధికంగా 1,276 మంది, వరదలు, భారీవర్షాలకు 862 మంది, వడగాడ్పులకు 166 మంది, తుపాన్‌ల తీవ్రతకు 29 మంది, చలి, మంచు ప్రభావానికి 21 మంది, ఇతరత్రా కారణాలతో 22 మంది చనిపోయారు.

డాక్టర్ గురవారెడ్డికి పితృవియోగం



హైదరాబాద్ సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కిమ్స్, సన్‌షైన్ ఎండీ, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ గురవారెడ్డి తండ్రి అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి (90) బుధవారం సాయంత్రం వృద్ధాప్యంతో మృతిచెందారు. 1933లో తుమ్మల చెరువు, పల్నాడు గ్రామంలో జన్మించిన ఆయనకు రాజ్యలక్ష్మితో వివాహమైంది. కీటకాల శాస్త్రవేత్తగా పేరుగాంచారు. ఆయనకు ముగ్గురు కుమారులు గురవారెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, నర్సింహారెడ్డి. చదువుకి అంకితంగా తన మరణానంతరం తన దేహాన్ని వైద్య విద్యార్థులకు ఉపయోగపడాలన్న తండ్రి కోరిక మేరకు ఉస్మానియా అస్పత్రికి మా తండ్రి దేహాన్ని ఇస్తున్నట్లు డాక్టర్ గురవారెడ్డి తెలిపారు. మా నాన్న గారే మా అందరికి ఆదర్శం. అందర్నీ తారతమ్యం లేకుండా సమానంగా గౌరవించే మానవత్వాన్ని ఆయన దగ్గరనుంచే నేర్చుకున్నాం.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● గురువారం 4 జనవరి 2024
diksuchi@andhrajyothy.com

ఎంఎస్ఈలో పీజీ డిప్లొమా

మద్రాస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ (ఎంఎస్ఈ) ఆధ్వర్యంలోని బిజినెస్ స్కూల్ - పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (పీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఫుల్ టైం ప్రోగ్రామ్. దీని వ్యవధి రెండేళ్లు. ఫైనాన్స్, రీసెర్చ్ అండ్ బిజినెస్ అనలిటిక్స్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. జాతీయ పరీక్ష స్కోర్, అనుభవం, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి నుంచి డిగ్రీ స్థాయి వరకు కనీసం 70 శాతం మార్కులు ఉండాలి. ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ చదివిన అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. క్యాట్/జీమ్యాట్/ఎక్స్‌ఏటీ/మ్యాట్/సీమ్యాట్/ఏటీఎంఏ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.




ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** రౌండ్ 1కు ఫిబ్రవరి 19; రౌండ్ 2కు మే 6; రౌండ్ 3కి జూలై 1
- **ఇండక్షన్ ప్రోగ్రామ్:** జూలై 12
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.mse.ac.in

ఇఫ్లూలో ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ కోర్సు

హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ-సెంట్రల్ యూనివర్సిటీ)కి చెందిన నాన్ ఫార్మల్ కోర్సెస్ అండ్ రిసోర్సెస్(ఎన్ఎఫ్‌సీఏఆర్) విభాగం- ప్రొఫిషియెన్సీ కోర్స్ ఇన్ ఇంగ్లీష్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సు వ్యవధి 40 గంటలు. ఇందులో ప్రధానంగా ఇంగ్లీష్‌కు సంబంధించి రిటెన్, స్పోకెన్ స్కిల్స్ నేర్పిస్తారు. ఫిబ్రవరి 5 నుంచి మార్చి 1 వరకు నాలుగు వారాలు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. రోజుకు రెండు గంటలు చొప్పున వారానికి అయిదు రోజులు తరగతులు ఉంటాయి. ఉదయం ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు; సాయంత్రం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు. కనీసం 80 శాతం అటెండెన్స్ తప్పనిసరి. నిబంధనల ప్రకారం కోర్సు పూర్తిచేసినవారికి ఎన్ఎఫ్‌సీఏఆర్ విభాగం సర్టిఫికెట్లు ఇస్తుంది. మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు.



కోర్సులోని అంశాలు

ఇంగ్లీష్ లాంగ్వేజ్‌కు సంబంధించి లిజెనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్ వంటి కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పిస్తారు. మొదటి వారంలో ఇంట్రడక్షన్స్, డిస్క్రిప్షన్, నరేషన్, ప్లానింగ్; రెండో వారంలో ఎక్స్‌ప్లయినింగ్, ఇన్‌ఫార్మింగ్, ఇన్‌స్ట్రక్టింగ్/డైరెక్టింగ్, రెస్పాండింగ్; మూడో వారంలో ఎక్స్‌ప్రెసింగ్ ఒపీనియన్, గ్రూప్ డిస్కషన్, నోట్ టేకింగ్, సమ్మరైజింగ్, ఫార్మల్ లెటర్ రైటింగ్; నాలుగో వారంలో సీవీ అండ్ అప్లికేషన్, లెటర్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, అఫీషియల్ రైటింగ్ తరగతులు ఉంటాయి. కోర్సుకు సంబంధించిన మెటీరియల్ ఇస్తారు.

అర్హత

గుర్తింపు పొందిన కాలేజీ నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. విదేశీ విద్యార్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి ఇంగ్లీష్‌లో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. వీరు దరఖాస్తుతోపాటు వీసా కాపీ, కోర్సు వ్యవధికి రెసిడెంట్ పర్మిట్ కాపీ సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **కోర్సు ఫీజు:** భారతీయ విద్యార్థులకు రూ.2,500; విదేశీ విద్యార్థులకు రూ.5,000; ఇఫ్లూలో చదువుతున్న విదేశీ విద్యార్థులకు రూ.4,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- దరఖాస్తు ఫారాలను జనవరి 19 వరకు ఇస్తారు.
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జనవరి 31
- **దరఖాస్తుకు జతచేయాల్సినవి:** రెండు ఫొటోలు, ఆధార్ కార్డ్/ఓటర్ ఐడీ/పాస్‌పోర్ట్
- **చిరునామా:** ఎన్ఎఫ్‌సీఏఆర్ కార్యాలయం, రూమ్ నెం.29, గ్రౌండ్ ఫ్లోర్, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, ఇఫ్లూ, హైదరాబాద్-500007.
- **ఫోన్ నెం.** 040 27689646
- **వెబ్‌సైట్:** efluniversity.ac.in

ఐఐఎం కాశీపూర్‌లో ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ(అనలిటిక్స్)

కాశీపూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)- వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ఉద్దేశించిన ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ(అనలిటిక్స్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఆరు టర్మ్‌లు ఉంటాయి. వ్యాపారవేత్తలు, ఆంత్రప్రెన్యూర్స్, ఇంజనీర్లు, నాన్ ఇంజనీర్లు, మిడ్ లెవెల్ ఎగ్జిక్యూటివ్‌లు అప్లయ్ చేసుకోవచ్చు. అడ్మిషన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు

ఇది ఆన్‌లైన్ బ్లెండెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్ అయినప్పటికీ కొన్ని ఆన్ క్యాంపస్ తరగతులు కూడా నిర్వహిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా ఫ్యాకల్టీ వర్చువల్ మీటింగ్స్, అసైన్‌మెంట్లు, క్విజ్‌లు, పెడగాగి క్లాసెస్, సిమ్యులేషన్స్, ఇండస్ట్రీ వర్క్‌షాప్స్, క్యాప్‌స్టోన్ ప్రాజెక్టులు, ఇతర ప్రాజెక్ట్ వర్క్‌లు, టర్మ్ ఎండ్ ఎగ్జామ్స్ ఉంటాయి. ప్రోగ్రామ్ మొత్తానికి 34.5 క్రెడిట్లు నిర్దేశించారు.

ముఖ్య సమాచారం
దరఖాస్తు ఫీజు: రూ.2,950
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 6
అడ్మిషన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూలు: జనవరి 21
ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల: జనవరి 26
అడ్మిషన్ తేదీ: ఫిబ్రవరి 16
ఓరియంటేషన్, ఇండక్షన్ ప్రోగ్రామ్‌లు: మే 13
క్యాంపస్ క్లాసెస్: మే 13 నుంచి 17 వరకు
ఆన్‌లైన్ క్లాసెస్: మే 25 నుంచి
వెబ్‌సైట్: iimkashipur.ac.in

అర్హత

గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 42 శాతం; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. దరఖాస్తు నాటికి కనీసం మూడేళ్ల ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి. పార్ట్ టైమ్, ప్రాజెక్ట్ వర్క్, ఇంటర్న్‌షిప్, ఆర్టికల్‌షిప్, అప్రెంటిస్‌షిప్, ప్రీ గ్రాడ్యుయేషన్ అనుభవాలను పరిగణనలోకి తీసుకోరు.

IIM KASHIPUR

జేఈఈ మెయిన్ ప్రిపరేషన్ టిప్స్

ప్రతిష్ఠాత్మక ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి ఉద్దేశించిన తొలి వడపోత అయిన జేఈఈ మెయిన్ మొదటి సెషన్ మరో ఇరవై రోజుల్లో ఆరంభం కానుంది. ఇంటర్ లేదంటే పన్నెండో తరగతి ఎగ్జామ్స్‌కు ముందే జరిగే ప్రవేశ పరీక్ష ఇది. ఒకరకంగా ఎంట్రెన్స్ అంటే భయం, బెరుకు ఏదైనా ఉంటే దీంతో అవి పోగొట్టుకోవచ్చు. ఇది చక్కగా రాస్తే, మంచి స్కోర్ సాధించగలిగితే ఇంటర్ పరీక్షలు తరవాత సెలవులు ఎంజాయ్ చేయవచ్చు. అలాగే ఐఐటీలో చేరేందుకు ఉద్దేశించిన జేఈఈ అడ్వాన్స్‌డ్‌పై గురిపెట్టవచ్చు. ఈ నేపథ్యంలో ఉన్న ఈ కొద్ది రోజులను సద్వినియోగం చేసుకునేందుకు నిపుణులు సూచించిన కొన్ని టిప్స్

- నేర్చుకున్నది చాలు, ఈ కొద్ది రోజులు రివిజన్‌కు సమయాన్ని ఉపయోగించాలి. ముఖ్యమైన ఫార్ములాలు, థీరమ్స్, రియాక్షన్స్ వంటివి ప్రాక్టీస్ చేయాలి. ప్రాబ్లెమ్స్ సాల్వ్ చేసేందుకు ఇవన్నీ తోడ్పడతాయి. బలంగా ఉన్న వాటిపైనే మరింత శ్రద్ధవహించాల్సిన సమయం ఇది. వచ్చిన వాటినే మరిన్ని సార్లు చదవడం లేదంటే ప్రాక్టీస్ చేయడంతో మైండ్‌లో ఆ టాపిక్ స్థిరపడుతుంది. పరీక్షలో మరింత బాగా ఆన్సర్ చేసేందుకు ఉపయోగపడుతుంది.
- రివిజన్ కోసం షార్ట్ నోట్స్‌ని ఉపయోగించుకోవాలి. అందులో ఫార్ములాలు, కాన్సెప్ట్ ఉండేలా చూసుకోవాలి. టాపిక్స్‌లోకి వెళ్ళి ఇవన్నీ ఎక్కడ ఉన్నాయన్నది సరిచూసుకోవడం కష్టం. అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఇది మంచి మార్గం. అలాగే ఫ్లాష్ కార్డులతోనూ ప్రయోజనం ఉంటుంది.
- సబ్జెక్టు లేదంటే ప్రత్యేకించి టాపిక్‌పరంగా ఏవైనా సందేహాలు ఉంటే వాటిని వెంటనే నివృత్తి చేసుకోవాలి. టీచర్ నుంచి సీనియర్ వరకు ఈ విషయంలో ఎవరితో అయినా మాట్లాడవచ్చు. సందేహం తీరడం ముఖ్యం. కాన్సెప్టులను క్షుణ్ణంగా అర్థం చేసుకోవడం కూడా కీలకం.
- సాధ్యమైనన్ని మాక్ టెస్టులు రాయాలి. ఆలిండియా స్థాయిలోవి రాస్తే మంచిది. ఇవి రాస్తే అసలు పరీక్షను ఎదుర్కోవడం సులువు అవుతుంది. ఒకటి రెండు మాక్ టెస్టులు రాసి, పాత పేపర్లను సాల్వ్ చేయడం మరో పద్ధతి. అయితే అది అంత ప్రాక్టికల్‌గా అనిపించదు. దానికి బదులు రోజుకో టెస్ట్ రాసి విశ్లేషించుకోవడం చాలా మంచిది. ఎక్కడ తప్పు చేశామో గుర్తించి, దాన్ని తిరిగి నేర్చుకుంటే కలకాలం గుర్తుంటుంది. అసలు పరీక్షలో సరిగ్గా అదే సమస్యవస్తే సులువుగా గుర్తుకొస్తుంది. అందుకే ఆలిండియా స్థాయిలో జరిగే మాక్ టెస్టులను ఎంచుకోవాలని విజ్ఞులు చెబుతూ ఉంటారు.
- అర్ధరాత్రి వరకు చదవడానికి ఎక్కువ మంది విద్యార్థులు ఆసక్తి చూపుతారు. అయితే అంత సీన్ అవసరం లేదు. రాంగ్ ప్రాక్టీస్ కూడా. పరీక్షలు ముంచుకొస్తున్న ఈ సమయంలో సరిపోను విశ్రాంతి, నిద్ర ఆరోగ్యకరమైన ఆహారం చాలా అవసరం.
- పాజిటివ్ మైండ్‌సెట్‌ను డెవలప్ చేసుకోవాలి. అర్జునుడికి పక్షి కన్నుపై గురి మాదిరిగా రాసే పరీక్షలో సక్సెస్ లక్ష్యం కావాలి. ఒత్తిడి(స్ట్రెస్) అనిపిస్తే వెంటనే మరో ఫన్నీ యాక్టివిటీతో మైండ్‌ను ఫ్రెష్ చేసుకోవాలి. కొద్దిసేపు ఇష్టమైన వాటిపై దృష్టిపెడితే చాలు, ఒత్తిడి చాలావరకు తగ్గుతుంది.
- కాన్సంట్రేషన్ లెవెల్స్ పెంచుకోవడం అన్నది కీలకమే. అందుకే గంటల కొద్దీ చదవకూడదని అంటారు. రెగ్యులర్ బ్రేక్స్ అలాగే ఆ సమయంలో యోగా తదితర కార్యకలాపాలతో మైండ్‌ని ఫ్రెష్‌గా ఉంచుకోవాలి. అదేవిధంగా ప్రిపరేషన్‌పై ఎవరితోనూ చర్చించాల్సిన అవసరం లేదు. పరీక్షకు ప్రిపేర్ కావడం అన్నది వ్యక్తిగతం. అది ఎలా ఉండాలన్నది మనమే నిర్ణయించుకోవాలి.



పరీక్ష హాలులో

- జేఈఈ మెయిన్ ప్రశ్నలను చూసుకునేందుకు మొదట కొద్ది సమయాన్ని ఉపయోగించుకోవాలి. ఆ సమయంలో అస్సలు ఆందోళన చెందవద్దు. ఏవీ తెలియనట్టు అనిపించినా బెదరవద్దు. గట్టిగా శ్వాస తీసుకుని వదలండి.
- ఎప్పుడైన కొన్ని ప్రశ్నలు కష్టంగా ఉంటాయి. సులువైన ప్రశ్న కనిపించే వరకు ముందుకు కదలండి. ఎక్కడో ఒక చోట ఈజీ ప్రశ్న తగులుతుంది. మొదట దాన్ని సాల్వ్ చేయండి. కాన్ఫిడెన్స్ లెవెల్ పెరుగుతుంది. తరవాత మరొకటి సులువైనది తీసుకోండి. అప్పటికి మీరు కుదురుకుంటారు. ఆ తరవాత ఎదురు ఉండదు. వచ్చినవన్నీ సాల్వ్ చేసుకుంటూ వెళ్లడమే పనిగా ఉండాలి.
- ఒక మాట వినే ఉంటారు. కష్టం మీ ఒక్కరికే సొంతం కాదు. అలాంటి వాళ్ళే చాలామంది ఉంటారు. వారిలో మీరు ఒకరు అంతే.
- ప్రశ్న ఏదైనా సాల్వ్ చేసేందుకు కొంత సమయం పెట్టుకోవాలి. రాకుంటే తరవాతి ప్రశ్న చూడాలి. అంతే తప్ప ఒక్క ప్రశ్న దగ్గరే ఆగిపోవద్దు. వచ్చినవి చేసుకుంటూ వెళ్ళాలి. అన్నీ అయ్యాక మళ్ళీ మొదటి నుంచి వదిలేసినవి చూసుకుంటూ వెళ్ళాలి.
- ఎక్కువ ప్రశ్నలు సాల్వ్ చేసేయాలని అనుకోవద్దు. ఎన్ని కరెక్ట్‌గా చేస్తే ఎంత స్కోర్ వస్తుందో మీకు తెలుసు. అది మదిలో పెట్టుకుని పరీక్షలు ఏవైనా రాయాలని గుర్తుంచుకోవాలి. అదే సక్సెస్ రూట్.

'సెంట్రల్ గ్లాస్ అండ్ సిరామిక్'లో సైంటిస్టులు

సెంట్రల్ గ్లాస్ అండ్ సిరామిక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 12

అర్హత: సైన్స్/ఇంజనీరింగ్, సిరామిక్ ఇంజనీరింగ్/సిరామిక్ టెక్నాలజీ/మెటీరియల్స్ ఇంజనీరింగ్/మెటీరియల్స్ సైన్స్/మెటలార్జికల్ అండ్ మెటీరియల్ ఇంజనీరింగ్/ఫిజిక్స్ విభాగాల్లో పీహెచ్‌డీ, ఎంఈ, ఎంటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
వయోపరిమితి: 32 ఏళ్లకు మించకూడదు
దరఖాస్తు ఫీజు: రూ.500
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో
దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 24
వెబ్‌సైట్: https://www.cgcri.res.in/



ఎల్ఐసీ గోల్డెన్ జూబ్లీ స్కాలర్‌షిప్ స్కీమ్

ముంబైలోని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ)- 'గోల్డెన్ జూబ్లీ స్కాలర్‌షిప్ స్కీమ్ 2023'కి దరఖాస్తులు కోరుతోంది. ప్రభుత్వ/ప్రైవేట్/ఐటీఐ కళాశాలలు సహా ఎన్‌సీవీటీ గుర్తింపు పొందిన ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ సెంటర్లలో చదువుతున్న ప్రతిభావంతులకు ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ఈ స్కీమ్‌ను ఉద్దేశించారు. ఇందులో జనరల్ స్కాలర్‌షిప్, స్పెషల్ స్కాలర్‌షిప్ ఫర్ గర్ల్ ఛైల్డ్ కేటగిరీలు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, కుటుంబ వార్షికాదాయం ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

జనరల్ స్కాలర్‌షిప్

అర్హత: గుర్తింపు పొందిన రెగ్యులర్/ఒకేషనల్ కళాశాల నుంచి ఇంటర్/డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి స్థాయి నుంచి ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో మెడిసిన్/ఇంజనీరింగ్/ఏదేని గ్రాడ్యుయేషన్/ఒకేషనల్/ఇంటిగ్రేటెడ్ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ అభ్యర్థులు; డిప్లొమా తరవాత ఇంజనీరింగ్ మొదటి సంవత్సర ప్రవేశం పొందినవారు కూడా అర్హులే.

స్కాలర్‌షిప్: మెడిసిన్ చదివేవారికి కోర్సు పూర్తయ్యే వరకూ ఏడాదికి రూ.40,000లను మూడు విడతలుగా(రూ.12,000 + రూ.12,000 + రూ.16,000) చెల్లిస్తారు. ఇంజనీరింగ్ చదివే వారికి ఏడాదికి రూ.30,000(రూ.9,000 + రూ.9,000 + రూ.12,000)లు ఇస్తారు. జనరల్ డిగ్రీ, ఇంటిగ్రేటెడ్ కోర్సులు, ఒకేషనల్ కోర్సులు చేసేవారికి ఏడాదికి రూ.20,000 (రూ.6,000 + రూ.6,000 + రూ.8,000) ఇస్తారు.

- కోర్సుకు సంబంధించి వార్షిక పరీక్షల్లో కనీసం 55 శాతం మార్కులు వస్తేనే స్కాలర్‌షిప్ రెన్యువల్‌కు అవకాశం లభిస్తుంది

స్పెషల్ స్కాలర్‌షిప్ ఫర్ గర్ల్ ఛైల్డ్

- బాలికలకు చదువుపై ఆసక్తి కలిగించేందుకు, వారిని ఉన్నత విద్యలో ప్రోత్సహించేందుకు ఈ స్కాలర్‌షిప్ స్కీమ్‌ను రూపొందించారు.
- **అర్హత:** గుర్తింపు పొందిన పాఠశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్/పన్నెండోతరగతి/డిప్లొమా/ఒకేషనల్/ఐటీఐ కోర్సులో అడ్మిషన్ పొంది ఉండాలి.
- **స్కాలర్‌షిప్:** రెండేళ్ల పాటు ఏడాదికి రూ.15,000లను మూడు విడతలుగా (రూ. 4,500 + రూ.4,500 + రూ.6,000) ఇస్తారు.
- కోర్సుకు సంబంధించి మొదటి ఏడాది కనీసం 50 శాతం మార్కులు వస్తేనే స్కాలర్‌షిప్ రెన్యువల్‌కు అనుమతిస్తారు.



ముఖ్య సమాచారం

- కుటుంబ వార్షికాదాయం రూ.2,50,000 మించకూడదు.
- కరస్పాండెన్స్, పార్ట్ టైమ్, ఈవెనింగ్, డిస్టెన్స్, ఓపెన్ యూనివర్సిటీ, సెల్ఫ్ స్టడీ కోర్సులు చేసేవారు; సీఏ/సీఎస్/ఐసీడబ్ల్యూఏఐ అభ్యర్థులు ఈ స్కీమ్‌నకు అనర్హులు.
- కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే అవకాశం కల్పిస్తారు. ఇద్దరు ఉన్న పక్షంలో ఒకరు బాలిక అయితే ఇద్దరికీ అవకాశం ఇస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 14
- **వెబ్‌సైట్:** https://licindia.in

లిటిల్స్



మీకు తెలుసా?


- సూదిమొనలా పొడవైన కొమ్ములు ఉండే ఈ జింకలను ఆరిక్స్ అని పిలుస్తారు. ముఖ్యంగా ఈ తెల్ల ఆరిక్స్‌లు మిడిల్‌ఈస్ట్‌లో ఎక్కువగా ఉంటాయి. వీటిని ఆరేబియన్ ఆరిక్స్ అని పిలుస్తారు. ఆరిక్స్ అనే పదం గ్రీక్ నుంచి వచ్చింది.
- దుబాయ్, కువైట్, ఇరాన్, ఒమన్, జోర్డాన్, ఇజ్రాయిల్, సౌదీ అరేబియా, పాలస్తీనా.. ఇలా మిడిల్ ఈస్ట్ దేశాల్లోని ఎడారుల్లో జీవిస్తాయివి. ఎడారిలోని గడ్డిని తింటాయి. అక్కడ దొరికే దుంపలు, పూలు, మొగ్గలు, పండ్లు తవ్వుకుని తింటాయి.
- ఇవి వైల్డ్ అనిమల్స్. 1970 దశకం నుంచి వీటిని జంతుప్రదర్శనశాలల్లో కూడా పెంచటం ఆరంభించారు.
- 1767లో తొలిసారి ఈ జంతువు గురించి ప్రస్తావించారు.
- 2.1 పీట్ల నుంచి 4.6 ఫీట్ల వరకూ పొడవు ఉంటాయి. ఎత్తు కూడా సుమారు 4 ఫీట్ల వరకు ఉంటాయి.
- వీటి బరువు వంద కేజీలనుంచి 209 కేజీల వరకూ ఉంటుంది.



- ఎడారుల్లోని మందమైన ఇసుకలో ఇవి వేగంగా పరిగెత్తగలవు. ముఖ్యంగా వీటి గిట్టల బలం, కొమ్ముల పదునే వీటిని శత్రువుల నుంచి రక్షిస్తాయి.
- వేల కిలోమీటర్లు ఎడారుల్లో అలుపూ సొలుపూ లేకుండా నడుస్తాయి. ఒక్కో గుంపులో మూడు నుంచి పదిహేను వరకూ ఉంటాయి. పెద్ద గుంపుల్లో మాత్రం వందలోపు ఉంటాయి.
- ఆరిక్స్ సంవత్సరానికి ఒకే పిల్లను కంటుంది. పుట్టిన నాలుగు గంటల్లో నడుస్తుందది. నాలుగు వారాలు మాత్రమే అమ్మ రక్షిస్తుంది. ఆ తర్వాత గుంపులో చేరుతుంది.
- ఇవి ఇరవై ఏళ్ల వరకూ జీవిస్తాయి.

చుక్కలు కలిపి బొమ్మ గీయండి





5 తేడాలు గుర్తించండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 195

			7		9		4	
		7		4		6		
3			1	2		5	9	
	5	8			3			
	6	2	5		4	8	7	
			6			4	2	
	4	5		1	7			2
		1		6		7		
	2		3		8			

సుడోకు - 194 సమాధానం

1	9	2	4	5	8	3	7	6
8	5	6	7	9	3	4	1	2
4	3	7	1	6	2	8	9	5
5	2	4	9	1	7	6	3	8
7	6	8	3	4	5	1	2	9
3	1	9	8	2	6	7	5	4
9	8	1	2	3	4	5	6	7
6	4	3	5	7	9	2	8	1
2	7	5	6	8	1	9	4	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.